వాడ్రేవు చినవీరభద్రుడు

ఎవరో ఒకరు ఏదో ఒక కాలంలో

ప్రపంచకవిత్వం వారికోసమే

వాడ్రేవు చినవీరభద్రుడు

ఎవరో ఒకరు
ఏదో ఒక కాలంలో

ప్రపంచకవిత్వం వారికోసమే

EVARO OKARU EDO OKA KALAMLO
(Occassional Writing on World Poetry)

VADREVU CHINAVEERABHADRUDU

October, 2025

Composing, Lay-out, Cover design &
Cover painting in watercolor
Vadrevu Ch Veerabhadrudu

Back cover photography
Amrutha Purna Vadrevu

e-book released by

VADREVU CH VEERABHADRUDU
First floor, House No. 56,
Navodaya colony,
Mehdipatnam, Hyderabad-500 028
chinaveera@gmail.com
9490957129

for more resources please visit
www.chinaveerabhadrudu.in

కొర్రపాటి అదిత్యకు

వరసగా

విస్మృత సమాజాల కవి	7
గంగాలహరి	13
రానున్న కాలం ఈ రచయిత్రులది	18
నేనెప్పటికీ మరవలేను	23
ఎక్కడి పుష్కిన్! ఎక్కడి చినవీరభద్రుడు!	27
కొత్తగా, సరికొత్తగా	29
నూరువిధాలుగా నేలని ముద్దాడవచ్చు	33
భూమ్మీద మొలకెత్తిన నక్షత్రాలు	37
ఎవరో ఒకరు ఏదో ఒక కాలంలో	41
చివరి రొమాంటిక్	47
స్కాట్లాండు పూలగుత్తి	52
గురుస్థానం	57
రిల్కే: బుద్ధుడు	61
కవిత్వంలో మంత్రశక్తి	64
వెళ్ళిపోతున్న వసంతం	67
ఒక చక్కెర బిడారు	69

ప్రేమభాషా కవి	74
ఆడినడయాడు పాపా	80
శ్రీకృష్ణలీలా తరంగిణి	84
దిగులు కలిగినదేలనో	90
పోయిన ప్రాణం లేచొచ్చినప్పుడు	92
ఒక కవి, ఇద్దరు అనువాదకులు	96
పాల్ ఎలార్డ్	102
సమాశ్వాస సౌందర్య గాథ	109
కర్ణికార పుష్పాలు: మూడు దృశ్యాలు	115
సంతోషం ఏ రంగులో ఉంటుంది	117
ఆ స్ఫూర్తి సామాన్యమైంది కాదు	121
జీవన్మృత్యువుల సరిహద్దులో	128
వేసవి ముగిసింది	133
మహాకావ్యపరిచయం	138
చిన్నారి దేవదూత	145
యుద్ధకవి	149
సంధ్యాసమస్యలు	158
ఆమె కన్నులలోన	162
ఫలప్రదమైన అనునయం	167
కడలీ, పుడమీ	173
ముందు మనం పాఠకులుగా మారాలి	178

విస్మృతసమాజాల కవి

'తల్లులూ, కవులూ పురాతన హిమయుగాల వారసులు. వారి సేవల్ని డబ్బుతో కొలవలేం' అన్నాడు లెస్ మర్రీ. 'కవిత్వం వల్ల డబ్బు రాదు, నిజమే, కాని, డబ్బు వల్ల కూడా కవిత్వం రాదు' అని రాబర్ట్ గ్రేవ్స్ అన్న మాటలు గుర్తు చేస్తూ, కవిత్వం, మనిషి తన సమస్త అస్తిత్వంతోటీ చేపట్టే సృజనాత్మక కార్యకలాపమని కూడా అన్నాడు మర్రీ.

ఇటువంటి మాటలు మానవచరిత్రలో ఏ కాంస్యయుగకాలం నాడో వ్యాసవాల్మీకులో, హీబ్రూ ప్రవక్తలో, హోమరో, వర్జిలో, హొరేసులో అనవలసిన మాటలు. ఋగ్వేదకాలం నాడు మనుషులు ఒకే గోత్రంగా, అఖండ మానవకుటుంబంగా ఉన్నప్పుడు, భూమ్యాకాశాల్ని ఏకం చేసే దివ్య పారవశ్యక్షణాల్లో మాత్రమే విశ్వసించిన మాటలు. మనుషులు తమ సమస్త అస్తిత్వంతో, చైతన్యంతో తోటి మనుషుల్తో మాత్రమే కాదు, సమస్త ప్రకృతితోటీ ఒకటికాగల అనుభూతిని పొందే క్షణాలు ఉంటాయనీ, వాటిని మాటల్లో పెట్టినప్పుడు కవిత్వమంటామనీ, కాని, మాటల్లో పెట్టనప్పుడు కూడా మనుషులు తాము లోనయ్యే ఆ పారవశ్యం కూడా కవిత్వమేననీ అన్నాడు లెస్ మర్రీ.

మనుషులు, జాతులూ, దేశాలూ విభిన్నసమూహాలుగా, శకలాలుగా, అస్తిత్వ సంఘటనలుగా విడిపోతున్న ఈ కాలంలో, ఈ పోస్టుమాడర్ను యుగంలో, ఇటువంటి విశ్వాసాలతో కవిత్వం చెప్పిన కవి ఒకడు మనకు సమకాలికుడిగా ఉండటమే నమ్మలేని విషయం. అటువంటిది, పోయిన నెల 29 న ఆ కవి, తన 80 వ ఏట ఈ లోకాన్ని వదిలి పెట్టివెళ్ళిపోయాడంటే మరింత కష్టంగా తోచే విషయం.

లెస్ మర్రీ (1938-2019) ని తమ అనధికార ఆస్థానకవిగా ఆస్ట్రేలియా గత శతాబ్దం చివరిరోజులకే అంగీకరించడం మొదలుపెట్టింది. కాని ఆయన ఆ స్థానం నుంచి కూడా

మరింత విశాలంగా జరిగి, విస్తృతప్రపంచానికి చెందిన మహాకవిగా గణనకెక్కాడు. ఒక వైపు, ప్రపంచకవిత్వ పటం మీద ఆస్ట్రేలియా కొక విశిష్టస్థానం కల్పిస్తూనే, మరొకవైపు, ఆధునిక పాశ్చాత్యదేశాల సభ్యతకి తెలియని, అనుభవంలోలేని, ఆదిమసమాజాల దివ్యపారవశ్యానుభవాన్ని కవిత్వరూపంలో పరిచయం చేస్తూ వచ్చాడు. ఆస్ట్రేలియా ఖండం అనాగరిక ఆదివాసుల భూమిగా ఉండేదనీ, అక్కడ 1788 లో తెల్లవాడు కాలు పెట్టినతర్వాతనే అభివృద్ధి మొదలయ్యిందనీ నమ్మే వాళ్ళందరికీ అతడు చెప్తూ వచ్చినదొకటే మాట: 'కవిత్వం ఆస్ట్రేలియాలో కొన్ని వేలయేళ్ళుగా వర్ధిల్లుతూ ఉంది. 1788 తర్వాత నుంచీ మనం రాసుకుంటున్నది కేవలం వచనం మాత్రమే' అని.

అతడి దృష్టిలో కవిత్వం వచనంలాగా మరొక సాహిత్యప్రక్రియ లేదా సాధారణ వ్యవహారానికి పనికొచ్చే సమాచార ప్రసారసాధనమూ కాదు. మనిషికి రెండు చైతన్యాలూ, ఒక దేహమూ ఉన్నాయనీ, ఆ రెండు చైతన్యాలూ ఒకటి జాగృదవస్థా, రెండవది స్వప్నావస్థ అనీ, ఆ మూడూ ఒక్కటైనప్పుడు మాత్రమే కవిత్వం పలుకుతుందనీ అతడు నమ్మాడు. దాన్నతడు Wholespeak అన్నాడు. మనుషులకి తమ రెండు మనస్సులూ తమ దేహంతో ఒకటయ్యే అనుభవం సాధారణజీవితంలో అనుక్షణం సిద్ధిస్తూనే ఉంటుందనీ, కాని వారు దాన్ని మాటల్లో పెట్టలేరనీ, కాని, ఆ సమగ్రక్షణాల కోసం తమ ప్రేమల్లో, పెళ్ళిళ్ళలో, పనిలో, ఇష్టాయిష్టాల్లో, మతంలో వెతుక్కుంటూ ఉంటారనీ అన్నాడతడు. మనసూ, దేహమూ ఒకటయ్యే భావావేశాన్ని అతడు కవిత్వమంటున్నప్పుడు అతడు వివరిస్తున్నదాన్ని దాదాపుగా మనమొక రెలిజియస్ ఎక్స్‌పీరియన్సుగా భావించవచ్చు. అతడు ఆ విషయాన్ని కూడా దాచలేదు. కవితలు చిన్నపాటి మతాలనీ, మతాలు సుదీర్ఘ కవితలనీ కూడా వర్ణించాడతడు.

అతడు మతవిశ్వాసాల రీత్యా రోమను కాథలిక్కు. కాని, కవిత్వాన్ని మతమని అంటున్నప్పుడు అతడు చెప్తున్న మతం మధ్యయుగాలనుంచి మనకి వారసత్వంగా లభించిన మతం కాదు. అది పురాతన హిమయుగాల కాలం నాటి మతం. ఏదో ఒక దేవుడూ, పాపపుణ్యాలూ, స్వర్గనరకాలూ లేని మతం. జీవించడమే, నీ చుట్టూ ఉన్న చరాచర అస్తిత్వ-మంతటితోటీ నువ్వు ఒకటిగా అనుభూతి చెంది జీవించడమే జీవితపరమార్థమని చెప్పే మతం. ఈ మతానుభవం అతడు రోమను కాథలిక్కు చర్చిలో కన్నా, ఆస్ట్రేలియను ఆదివాస సమాజాల్లో ఎక్కువ సజీవంగా ఉన్నట్టు కనుగొన్నాడు. అలా కనుగొని, దాన్ని మాటల్లో పెట్టడానికి ప్రయత్నించడం ద్వారా, అతడు పాశ్చాత్య నాగరికప్రపంచాని కన్నా ఆఫ్రికాలో, ఆసియాలో, ఆస్ట్రేలియాలో ఉన్న అసంఖ్యాక ఆదివాస సమాజాలకు మరింత సన్నిహితంగా జరిగాడు.

అలాగని, ఎనిమిది దశాబ్దాల లెస్ మర్రీ జీవితం మొత్తం ఒక తెంపులేని ఆధ్యాత్మిక అనుభవంగా సాగిందని అనుకోకూడదు. అతడి జీవితంలో సంతోషం కన్నా విషాదమే ఎక్కువ. అతడి తండ్రి ఆగ్నేయ ఆస్ట్రేలియాలోని నబియాక్‌కి చెందిన రైతు. అక్కడి గ్రామ సీమ బున్యాలోనే మర్రీ బాల్యం గడిచింది. ఏళ్ళ తరువాత, 1988 లో అతడు తిరిగి బున్యాకి వెళ్ళిపోయి, గత ముప్ఫైయేళ్ళుగా అక్కడే జీవిస్తూ కవిత్వం రాస్తూ గడిపాడు. 'బున్యా నా గృహం మాత్రమే కాదు, నా శరణాలయం కూడా' అన్నాడతడు. అతడి చిన్నతనంలో, పన్నెండేళ్ళ వయసులో, తల్లి మరణించింది. గర్భస్రావంతో సరైన వైద్య సదుపాయం లేక తల్లి మరణించడం మర్రీని జీవితకాలం వెంటాడింది. తల్లి మరణించగానే తండ్రి డిప్రెషనులో కూరుకుపోయాడు. తండ్రికి సహాయంగా ఉండటంకోసం మర్రీ చదువు మానేసాడు. అలా మానేసినవాడికి ముప్ఫైయేళ్ళ వయసుకిగానీ, డిగ్రీ చేతికందలేదు. చిన్నప్పుడు ఒకసారి తన తల్లి దగ్గర విన్నాడట, ప్రపంచంలో ఇంగ్లిషు ఒకటే భాష కాదని. ఆ క్షణం నుంచే అతడు ఎన్ని భాషలు నేర్చుకోవచ్చో అన్ని భాషలు నేర్చుకోవడం మీదనే దృష్టి పెట్టాడు. తర్వాతి రోజుల్లో ఆ భాషాపరిజ్ఞానమే అతడికి అనువాద వృత్తిని సమకూర్చి పెట్టింది. జీవనోపాధిగా మారింది. ముప్ఫై, ముప్ఫై అయిదేళ్ళ వయసు వచ్చేటప్పటికి అతడు పూర్తికాలపు రచయితగా జీవించడానికి నిర్ణయించుకున్నాడు. 1965 లో వెలువరించిన మొదటి కవితాసంపుటి The Ilex Tree నుంచి అతడు వెనుదిరిగి చూడలేదు. సంపుటం వెనక సంపుటం వెలువరిస్తూనే వచ్చాడు. సుమారు రెండువేల దాకా కవితలు, ఆత్మకథ-నాత్మక దీర్ఘకవితలు, వచనరచనలు కూడా వెలువరించాడు.

1988 లో తిరిగి బున్యాకి వెళ్ళిపోయినతర్వాత, అతడి పసితనపు జ్ఞాపకాలు అతణ్ణి చుట్టుముట్టి డిప్రెషనుకి లోనయ్యాడు. ఎనిమిదేళ్ళపాటు ఆ చిత్తచాంచల్యం కొనసాగింది. అటువంటి స్థితిలో కూడా అతడు కవిత్వం రాయడం మానలేదు. నెమ్మదిగా అతడి సృజన ప్రపంచం దృష్టిని ఆకర్షించడం మొదలయ్యింది. అతడి కవిత్వం ఎన్నో భాషల్లోకి అనువాదం కావడం మొదలయ్యింది. నోబెలు పురస్కారం మినహా చెప్పుకోదగ్గ పురస్కారాలెన్నో దేశవిదేశాల్లో అతణ్ణి వరించాయి.

అలాగని మర్రీని సమకాలిక ఆస్ట్రేలియా పూర్తిగా నెత్తిమీద పెట్టుకుందనుకుంటే అది పొరపాటే. అతడి మతవిశ్వాసాలవల్లా, మతాన్నీ, కవిత్వాన్నీ సమానంగా చూసినందు-వల్లా సెక్యులరిస్టుల ఆగ్రహానికి గురవతూనే వచ్చాడు. గ్రామీణ ఆస్ట్రేలియా గురించి రాసినందుకు నాగరిక-విద్యాధిక ఆస్ట్రేలియా అతణ్ణి పూర్తిగా తనవాడిగా భావించలేక పోయింది. ప్రాచీన ఆదివాసుల జీవనశైలిని ఆరాధిస్తున్నందుకు, కుడి-ఎడమ పక్షాలు రెండూ కూడా అతడికి సమకాలిక ప్రపంచంలో ప్రాసంగికత లేదని భావించాయి. కాని,

అతడు రాస్తున్నది అత్యున్నత స్థాయి కవిత్వమనీ, అనితరసాధ్యమైన శైలి అనీ, ఆస్ట్రేలియాకి గర్వకారణమనీ అనుకోవడానికి మాత్రం వారిలో ఏ ఒక్కరికీ సంకోచం లేకపోయింది.

తన కవిత్వంలో మర్రీ వెలువరించిన భావాలెటువంటివి? అవి ప్రధానంగా గ్రామీణ జీవనశైలినీ, ఆదివాసుల జీవనసమగ్రతనీ పైకెత్తేవి. నాగరిక ఆస్ట్రేలియాని అతడు పాశ్చాత్య సామ్రాజ్యవాద భావజాలానికి ప్రతినిధిగా భావించాడు. పట్టణ-గ్రామీణ ఆస్ట్రేలియాల మధ్య విలువల్లో ఏర్పడ్డ దూరాన్ని అతడు బొయేషియా-ఏథెన్సు వివాదంతో పోల్చాడు. ఒకప్పుడు ప్రాచీన గ్రీసులో బొయేషియా గ్రామీణ, ప్రాకృతిక విలువలకీ, ఏథెన్సు నాగరిక సభ్యతకీ ప్రతినిధులుగా మారాయి. ఆ వైరుధ్యం విరోధంగా మారి పెలొపొనీషియను యుద్ధానికి కూడా దారితీసింది. సాహిత్యానికి సంబంధించినంతవరకూ ఈ వివాదాన్ని ఆస్ట్రేలియను మార్గ- దేశి వివాదంగా చెప్పుకోవచ్చు. ఇందులో మర్రీ ఆస్ట్రేలియను దేశి విలువలవైపు నిలబడ్డాడు. పట్టణజీవితంలోని పరాయీకరణ, ఆదివాసుల జీవితంలోని ధ్యానశీలత, గ్రామీణ-ఆస్ట్రేలియాలోని కాయకష్టం, మేధావుల ఆత్మవంచన, విదేశీ భావజాలాల డొల్లతనం అతడి కవిత్వానికి ప్రధానవస్తువులు.

విస్మృత సమాజాలకీ, విస్మృత విలువలకీ గొంతునివ్వడమే తన జీవనధ్యేయంగా చెప్పుకున్నాడతడు. రంగురంగుల యూకలిప్టసు అడవులు, పచ్చిక బయళ్ళు, కొండలు, నదులు, ధారాళమైన సూర్యకాంతితో వెల్లివిరిసే ఆస్ట్రేలియను ఆకాశాలూ అతడి కవిత్వంలో అడుగడుగునా కనిపిస్తుంటాయి. గడ్డిపూలు, పక్షులు, ఆదివాసుల నమ్మకాలతో పాటు గ్రామీణ సాయంకాలాలు, అడవుల్లోని అపరాహ్ణాల నిశ్శబ్దం, ఆవుల్ని మేతకు తీసుకుపోయే గోపాలకుల మనోలాలిత్యం అతడి కవిత్వమంతా పరుచుకుని కనిపిస్తాయి. నాగరిక సమాజాలకు తెలియని మట్టివాసనని అతడు దోసిళ్ళతో మనమీద కుమ్మరిస్తాడు.

శైలిపరంగా అతడొక అనితరసాధ్యమైన డిక్షనుని రూపొందించుకున్నాడు. అతడి కవిత్వంలో శబ్దాలంకారాలు తక్కువేమీ కాదు. శ్లేష, అర్థోక్తి, యమకం, అనుప్రాస, పూర్వ-కావ్యస్ఫురణ, పాండిత్య ప్రస్తావన అడుగడుగునా కనిపిస్తాయి. కాని, వాటి దగ్గరే అతడు ఆగిపోడు. మరొక వైపు రూపకాలంకారాల ప్రయోగంలో అతడు ఆధునిక యూరపియను మహాకవులకి ఏ మాత్రం తీసిపోడు. యూకలిప్టసు అడవిని వర్ణిస్తూ అది 'పురాతన యుద్ధభూమి' లాగా ఉందంటాడు. కొన్నిసార్లు తన అనుభూతిని వర్ణించడానికి అలంకారాలు చాలక వక్రోక్తినీ, వ్యంగ్యోక్తినీ ఆశ్రయిస్తాడు. జెనీవా సందర్శించినప్పుడు రాసిన కవితలో 'నువ్వు మానవాళిని సూట్లుగానూ, పాంట్లుగానూ మార్చేసావు' అంటాడు. కాని, అతడి దృష్టి ఎంతసేపూ, శబ్దాలంకారాల్నీ, అర్థాలంకారాల్నీ కూడా దాటిన ఒక నిశ్శబ్దాన్ని

పట్టుకోవడం మీదనే. ఉదాహరణకి , కలపమిల్లుల పట్టణాల గుండా ప్రయాణిస్తున్నప్పుడు 'రాత్రి కాగానే అక్కడ ఇళ్ళు ఒకదాన్నొకటి కనిపెట్టుకుని ఉంటాయి/ ఇక్కడ కిటికీలోంచి కనబడే వెలుగుకి కూడా ఒక అర్థముంటుంది' అంటాడు.

మర్రీ కవిత్వం వర్ణాత్మకం, కాని ప్రతి కవితకీ అంతిమప్రయోజనం ఒక ధ్వనిని స్ఫురింపచేయడమే. మాటల కందని ప్రగాఢమైన మానవానుభూతిని మాటలకు మించి స్ఫురింపచెయ్యడమే అతడి కవిత్వం. ఉదాహరణకి తన తల్లిని తలుచుకుంటూ రాసిన రెండు పద్యాల్లో 'బరువులు' అనే ఈ కవిత చూడండి. ఇక్కడ to carry అనే ఇంగ్లిషు క్రియాపదం మీద అతడు ఊనికపెట్టాడు. అది శబ్దాలంకారం. కాని అతడి దృష్టి దానిమీద లేదు. తన తండ్రి నడుస్తున్న గడ్డికుటీరంలాగా ఉన్నాడని చెప్పడం అర్థాలంకారం. కాని ఆ రూపకాలంకారం దగ్గర కూడా మనల్ని ఆగిపోనివ్వడు.

'బరువులు' అనే మాట వస్తువుల బరువులుగా మనకి ముందు పరిచయమై, చివరికి, మోయలేని గర్భభారంగా తెలియ రావడంలో ఉన్న ధ్వని కేవలం వస్తుధ్వని కాదు. తన తల్లి తన జీవితంలో మోసిన అతిపెద్ద బరువు తనే అని కవి భావిస్తున్న ఒక కరుణారసధ్వని ఈ కవిత సారాంశం.

బరువులు

సొంతానికి ఎడ్లబండి లేకపోడంతో మా నాన్న ఎప్పుడు చూసినా
పచ్చిచొప్ప మోసుకుపోయే గుడిసెలాగా ఉండేవాడు, తిరుగుతూనే
ఉండేవాడు, వెన్న డబ్బాలు మోసిమోసి దస్సిపోతుండేవాడు, అయినా
చిన్నపాటి బరువు కూడా మా అమ్మ చేతమోయనిచ్చేవాడు కాదు.

బరువులకి బదులు ఆమె వంటగదిలోనో, పశువుల కొట్టంలోనో
ఏదో ఒక పనిచేసేది, పాటలు పాడుకుంటూ ఉండేది, ఇరుగు
పొరుగుకి నర్సులాగా సేవలు చేసేది, ఇంజెక్షన్లిచ్చేది, పోసుకోలు
మాటలు పక్కన పెట్టేది, చిన్న చిన్న సంఘాలు కూడగట్టేది.

ఉన్నదున్నట్టుగా మాటాడే గుణాన్నినిచ్చింది నాకు,
తన ముఖకవళికల్నీ, సంకల్పశుద్ధినీ అందించింది
తన సుమధురకంఠస్వరాన్నివ్వలేదుగానీ
సూటిదనాన్నీ, స్పష్టతనీ ఉగ్గుపోసింది.

అప్పట్లో నాకు తెలీదు, ఆ తర్వాత చాలా ఏళ్ళపాటు
అదేమిటో అర్థం కాలేదు, నా తర్వాత
ఆమె గర్భం మళ్ళా బరువు మొయ్యలేదు.

24-5-2019

గంగాలహరి

మునిఖండంగా స్థానికులు పిలుచుకునే ముంగండ గురించి చాలా కాలం కిందట భమిడిపాటి జగన్నాథరావుగారు ఒక మాట చెప్పారు: 'అక్కడి బ్రాహ్మణులు అటు వేదమూ, ఇటు కమ్యూనిస్టు మానిఫెస్టో కూడా సమానంగా అధ్యయనం చేసినవాళ్ళు' అని. మహీధర సోదరులు రామ్మోహనరావుగారూ, జగన్మోహనరావుగారూ కూడా ముంగండ ప్రాంతానికి చెందినవారే. 'రథచక్రాలు', 'కొల్లాయిగట్టితేనేమి' వంటి నవలల ద్వారా రామ్మోహనరావు గారు తెలుగు సాహిత్యంలో ప్రసిద్ధులు. మహీధర జగన్మోహనరావుగారు కూడా తెలుగు సాహిత్యానికి చేసిన కృషి తక్కువేమీ కాదు. 'విశ్వసాహిత్యమాల' పేరిట ఆయన ఎంతో విలువైన ప్రపంచసాహిత్యాన్ని తెలుగులోకి తీసుకువచ్చారు. టాగోరు సాహిత్యవ్యాసాల్ని 'సాహిత్యజగత్తు', 'కావ్యజగత్తు' పేరిట తెలుగులోకి తెచ్చినది ఆయనే. ఆ తర్వాత ఎంతో కాలానికిగాని సాహిత్య అకాదెమీ టాగోరు సాహిత్యవ్యాసాల్ని తెలుగులోకి తీసుకురాలేదు.

కాని ఆ రోజు నేను వెతుక్కున్నది జగన్నాథ పండితరాయల స్మారకచిహ్నాల గురించి. పండితరాయల గురించి నేను విన్నది ఎప్పుడని! నా చిన్నతనంలో, మా ఊళ్ళో, ఆ తాటాకు ఇంట్లో, ఎప్పుడో తాను సెలవులకు ఇంటికి వచ్చినప్పుడు మా అక్క చెప్పింది ఆయన గురించి. ఆయన గొప్ప పండితుడనీ, ఢిల్లీ వెళ్ళాడనీ, షాజహాను ఆస్థానంలో ఉన్నాడనీ, ఆయన కుమార్తె లవంగిని ప్రేమించాడనీ, కాని రాజు ఆ ప్రేమని అంగీకరించ లేదనీ, అప్పుడు పండితరాయలు లవంగితో గంగానది ఒడ్డున గంగానదిని ప్రార్థిస్తే ఆ నది ఒక్కొక్కమెట్టే పైకి ప్రవహించి వారిద్దరినీ తనలో లీనం చేసేసుకుందనీ. ఆ తర్వాత ఆ కథకి మరెన్నో రూపాలున్నాయని తెలుసుకున్నాను గాని, ఆ పసితనంలో నేను ఏ రూపంలో విన్నానో ఆ రూపంలోనే ఆ కథ నా మనసులో అచ్చుపడిపోయింది.

ఇన్నాళ్ళకు ముంగండ వెళ్ళగలిగాను, ఆ నా చిన్నప్పటి ఆ కథానాయకుణ్ణి, ఆ కవికుమారుణ్ణి తలుచుకుంటూ. అక్కడ పండితరాయల పేరుమీద ఒక కమ్యూనిటీ హాలు

తప్ప మరేమీ లేదు. ఆయన విగ్రహం కాని, స్మారకమందిరం గాని ఏదీ లేదు. కనీసం ఆ ఊళ్ళో గ్రంథాలయానికి కూడా ఆయన పేరు పెట్టినట్టు లేదు. కాని కనీసం ఒక భవనం మీదనైనా ఆయన పేరు ఉండటమే నాకెంతో గొప్పగా అనిపించింది. ఆ భవనం ఉన్న ప్రాంగణంలోనే జిల్లా పరిషత్తు హైస్కూలు ఉంది. అక్కడి ఉపాధ్యాయులందరికీ పండిత–రాయల పేరు తెలుసని అర్థమయింది. కాని అంతవరకే. అంతకుమించి ఆయన గురించి అక్కడ చెప్పగలిగేవాళ్ళు ఎవరూ లేరు.

పండితరాయలు అన్నిటికన్న ముందు గొప్ప ఆలంకారికుడు. 'రసగంగాధరం' ఆయన గ్రంథం. రమణీయార్థాన్ని ప్రతిపాదించే వాక్యమే కావ్యం అన్నది ఆయనే. తన ప్రతిపాదనకు లక్ష్యంగా ఆయన 'భామినీవిలాస'మనే ముక్తకసంపుటాన్ని వెలువరించాడు. ఆ పుస్తకానికి ఇంగ్లిషు, ఫ్రెంచి అనువాదాలు నా కంటపడ్డాయిగాని, తెలుగులో ఏమీ అనువాదం వచ్చినట్టు నాకు కనిపించలేదు. భామినీవిలాసంలో అన్యోక్తివిలాసం, శృంగార విలాసం, కరుణవిలాసం, శాంతవిలాసం పేరిట ముక్తకాలు ఉన్నాయి. సాధారణంగా సంస్కృత అలంకారికులు కావ్యలక్షణాల్ని వివరించడానికి ప్రాకృతం నుంచీ, సంస్కృతం నుంచీ శ్లోకాల్ని ఉదాహరిస్తారు. లేదా కొన్నిసార్లు తామే రచిస్తారు. పండితరాయలు కూడా కావ్య స్వరూపం గురించి తన అభిప్రాయాలకు ఉదాహరణగా ఈ శ్లోకాలు రచించాడనిపిస్తుంది. ఆయనకు తన కావ్యనిర్మాణ కౌశల్యం పట్ల ఉన్న నమ్మకం ఎటువంటిదో మొదటి శ్లోకంలోనే చెప్పాడు:

మాధుర్యపరమసీమా సారస్వత జలధిమథన సంభూతా
పిబతామనల్పసుఖదా వసుధాయాం మమ సుధా కవితా

(నా కవిత మాధుర్యానికి చరమసీమ. సాహిత్యమనే సముద్రాన్ని మథిస్తే పుట్టిన అమృతం. ఈ భూమ్మీద నా కవిత్వాన్ని అస్వాదించేవాళ్ళకి కలిగే సంతోషం అంతా ఇంతా కాదు.)

అంత నిర్భరంగానూ చివరి శ్లోకాల్లో కూడా తన కవిత్వం గురించి చెప్పుకున్నాడు. ద్రాక్షారసంతోనూ, చెరకురసంతోనూ తన కవిత్వాన్ని పోల్చుకున్నాడు. ఆ ముక్తకాలు అన్నీ అదే స్థాయిలో ఉన్నాయని చెప్పలేను గానీ, ఆ భాషామాధురి మాత్రం సామాన్యమైనది కాదని చెప్పవచ్చు. కొన్ని ముక్తకాల్లో ఆ మాధుర్యానికి భావనాబలం కూడా తోడయ్యింది. ఒకటి రెండు ఉదాహరణలు చూడండి:

అయి దలదరవింద స్యందమానం మరందం
తవ కిమపి లిహంతో మంజు గుంజంతు భృంగాః

దిశి దిశి నిరపేక్షస్తావకీనం వివృణ్వన్
పరిమలమయమన్యో బాంధవా గంధవాహః (1:4)

(పూర్తిగా వికసించిన ఓ అరవిందమా! భృంగం నీ మకరందాన్ని పీలుస్తూ నీ దగ్గరే ఉండిపోయింది. కాని ఆ గాలి చూడు, నీ దగ్గర ఆగలేదన్నమాటేగాని, నీనుంచి ఏమీ కోరకుండానే నీ పరిమళం గురించి నాలుగు దిక్కులా చాటుతోంది.)

స్వేదాంబు సాంద్రకణశాలి కపోలపాలీ
దోలాయితశ్రవణకుండలనందనీయా
ఆనందమంకురయతి స్మరనేన కాపి
రమ్యా దశా మనసి మే మదిరేక్షణాయా (2:3)

(ఆమె కపోలతలమ్మీది నును స్వేదబిందువుని తాకీతాకనట్టుగా అల్లల్లాడే ఆ లోలాకుల్ని తలుచుకుంటే చాలు, నా మనసు చెప్పలేని ఆనందంలో మునిగిపోతుంది.)

తీరే తరుణ్యా వదనం సహాసం
నీరే సరోజం చ మిలద్వికాసం
ఆలోక్య ధావత్యుభయత్ర ముగ్ధా
మరందలుబ్ధాలి కిశోరమాలా (2: 21)

(అటు గట్టుమీద హసిస్తున్న తరుణి వదనం, ఇటు సరసులో వికసించిన సరోజం, ఆ తుమ్మెదపిల్లలు ఎటు పోవాలో తెలీక కంగారులో రెండుదిక్కులా పరుగులు పెడు-తున్నాయి.)

The Indian Poetic Tradition లో అజ్ఞేయ చేసిన అనువాదం:

A Word of Warning

My soul, I tell you, watch out. Don't take up with that cow-herd.
Whose skin is the hue of fresh rain clouds, the one who pas-tures
His herd in Vrindavana. He's shrewd. He'll charm you first with his smile,
Then his looks. Your senses will fail, and then oblivion.

గంగాలహరి 53 శ్లోకాల కావ్యం. అది పండితరాయలే చెప్పుకున్నట్టు పీయూష లహరి కూడా. అసలు తెలుగు కవులు సంస్కృతంలో శ్లోకాలు చెప్పినప్పుడు ఆ మాధుర్యమే వేరు. లీలాశుకుడి శ్రీకృష్ణామృతం, నారాయణతీర్థుల శ్రీకృష్ణలీలా తరంగిణి చూడండి. ఆ సంస్కృతం నిర్మలప్రవాహంగానూ, ఎడతెగని ధారగానూ, సరళసుబోధకంగానూ, సుగ్రాహ్యంగానూ ఉంటుంది. గంగాలహరి కూడా, అన్నిటికన్నా ముందు, ఒక వాగ్ధార.

సమృద్ధం సౌభాగ్యం సకలవసుధాయాః కిమపి తత్
మహైశ్వర్యం లీలాజనిత జగతః ఖండపరశోః
శృతీన సర్వస్వం సుకృతమథ మూర్తం సుమనసాం
సుధాసౌందర్యం తే సలిలమశివం నః శమయతు (1)

(అమ్మా! నువ్వు ఈ లోకానికి సౌభాగ్యానివి. ఈశ్వరుడు ఒక లీలగా సృష్టించిన ఈ జగత్తుకి పట్టిన గొప్ప ఐశ్వర్యానివి. వేదాల సమస్తసారం నువ్వు. సుమనస్సులకి నువ్వు సుకృతానివి, సుధవి, సౌందర్యానివి. అమ్మా, నాలో, శివం కానిదేదన్నా ఉంటే దాన్ని నీ జలాలతో పూర్తిగా కడిగెయ్యి.)

పురో ధావం ధావం ద్రవిణమదిరాఘూర్ణితదృశాం
మహీపానాం నానాతరుణతఖేదస్య నియతం
మమైవాయం మంతుః స్వహితశతహంతుర్జడధియో
వియోగస్తే మాతః యదిహ కరుణాతః క్షణమపి. (19)

(అమ్మా! నీ నుంచి క్షణమేనా ఎడంగా ఉన్నానంటే అది నా తప్పే. సంపదలతో మత్తెక్కిన రాజులముందు తిరుగాడుతూ నేను లెక్కలేనన్ని బలహీనతలకు లోనయ్యాను. మందమతిని, నా క్షేమానికి అడ్డుపడుతున్నదెవరన్నా ఉంటే అది నేనే.)

చివరి శ్లోకం:

విభూషితానంగరిపూత్తమాంగా
సద్యః కృతానేకజనార్తిభంగా
మనోహరోత్తుంగచలత్తరంగా
గంగా మమాంగాన్యమలీకరోతు (52)

ఒక సహృదయుడు ఈ చివరిశ్లోకంలోని '-ంగ' శబ్దం వింటున్నప్పుడల్లా ఈ శ్లోకం చెప్తూ కవి గంగానదిలో బుడుంగుమంటూ మునకవేసినట్టే అనిపిస్తూంటుందన్నాడు!

తాజాకలం:

భామినీవిలాసానికి తెలుగు అనువాదాలు లేవేమో అన్నదానికి సమాధానంగా గాలి నాసరరెడ్డి పుట్టపర్తివారి అనువాదం ఉన్నదని చెప్పాడు. మళ్ళా నెట్ శోధిస్తే archive.org లో వడ్డాది సుబ్బారాయుడిగారి అనువాదంతో పాటు కనీసం ఆరు అనువాదాలున్నాయి!

1-9-2021

రానున్న కాలం ఈ రచయిత్రులది

సుప్రసిద్ధ స్పానిషు రచయిత కార్లోసు ఫ్యుయెంటిసు ఒక ఇంటర్వ్యూలో ఒక ఫ్రెంచి సాహిత్యవేత్త చెప్పిన మాటల్ని ఉటంకించాడు. ఆ ఫ్రెంచి విమర్శకుడు చెప్పిందేమంటే, నవలా రచనలో పంతొమ్మిదో శతాబ్ది పూర్వార్ధం యూరోపుది కాగా, ఉత్తరార్ధం రష్యాది అనీ, ఇరవయ్యవ శతాబ్ది పూర్వార్ధం అమెరికాది కాగా, ఉత్తరార్ధం లాటిను అమెరికాదనీ. అతడు చెప్పలేదుగానీ నేను ఆ వాక్యాన్ని మరికొంత పొడిగించి చెప్పేదేమంటే, ఇరవై ఒకటవ శతాబ్ది పూర్వార్ధం భారతీయరచయితలదని. అంటే సాల్మను రూష్ది, అరుంధతీ రాయ్, నయిపాల్, విక్రంసేత్, ఝంపాలహిరి వంటి ఇంగ్లిషులో రాసే భారతీయ రచయితలది కాదు, భారతీయభాషల్లో రచయితలది అని. ఈ మధ్య గీతాంజలిశ్రీ నవలకు బుకరు బహుమానం రావడం ఈ కొత్తధోరణిని సూచిస్తున్నదని నేను అనుకుంటున్నాను.

ఎందుకంటే, గత శతాబ్దంలో ప్రపంచప్రసిద్ధి చెందిన రచయితల నవలలు నేను కొన్ని ఈ మధ్య చదివాను. కాని అవి నాలో రేకెత్తించలేని స్పందన, ఇదిగో, అరుణాచల ప్రదేశ్‌కి చెందిన ఆదివాసీ రచయిత్రుల ఈ సంకలనం రేకెత్తించగలిగింది. మమంగ్ దాయి వెలువరించిన The Inheritance of Words (జుబాన్, 2021) అనే ఈ సంకలనం ఆద్యంతం నన్ను ముగ్ధుణ్ణి చేసింది. రానున్న కాలం ఈ రచయిత్రులదీ, ఇలా ఇంగ్లిషులోకి రాగలిగిన తక్కిన భారతీయరచయిత్రులందరిదీ కూడా అని నిస్సంకోచంగా చెప్పగలను.

మమంగ్‌దాయి పేరు నేను మొదటసారి విన్నది నాలుగేళ్ళ కిందట అస్సాం వెళ్ళినప్పుడు. అప్పుడు నా యాత్రానుభవాలు రాయడానికి కూచున్నప్పుడు, బ్రహ్మపుత్ర గురించి మమంగ్‌దాయి రాసిన వాక్యాలు ఎవరో ప్రస్తావిస్తే చదివాను. అప్పుడే ఆమె

పరిణతి నన్ను ఎంతో ఆశ్చర్యపరిచింది. ఇప్పుడు ఈ సంకలనం చూసిన తరువాత ఆమె సంస్కారానికి నమోవాకాలు సమర్పించకుండా ఉండలేకపోతున్నాను.

ఒక భాషకీ, ఒక ప్రాంతానికీ చెందిన వారు తమ భాషనీ, తమ సంస్కృతినీ, తమ సాహిత్యాన్నీ నలుగురికీ పరిచయం చేయవలసిన పద్ధతి ఇది. తెలుగు సాహిత్యం నుంచి కూడా ఇంగ్లిషులోకి కొన్ని అనువాద సంకలనాలు రాకపోలేదుగాని, అవి ఆ సంకలనకర్తల రాగద్వేషాల్ని ప్రతిబింబించినట్టుగా తెలుగు సాహిత్యాన్ని ప్రతిబింబించటం లేదని చెప్పగలను. వాళ్ల ఎంపిక కూడా చాలా lopsided. కాని ఒక ఆదివాసీ రచయిత్రి, తన ప్రాంతాన్ని పరిచయం చేయడానికి తీసుకువచ్చిన ఈ సంకలనంలో తన ప్రాంతం పట్ల, తమ సంస్కృతి పట్ల గౌరవం తప్ప మరే ప్రయోజనాలూ కనిపించడం లేదు.

అరుణాచలప్రదేశ్ కావటానికి చిన్న రాష్ట్రమే అయినప్పటికీ, ఇరవై తెగలతో, దాదాపు తొంభైకి పైగా మౌఖికభాషల్తో అపారమైన సాంస్కృతికవైవిధ్యం ఉన్న ప్రాంతం. చాలా కాలందాకా, ఆ గిరిజన తెగలు తమలో ఒకరికొకరిని కలిపే అనుసంధాన భాష ఏమీ లేకపోవడం వల్ల ఎవరికి వారుగానే ఉంటూ వచ్చారు. గత వందేళ్ళుగా అస్సామీ అటువంటి ఒక అనుసంధానభాషగా కొంత పాత్ర పోషించింది. పాఠశాలల్లో బోధన–అభ్యసన భాషగా అస్సామీ అరుణాచలప్రదేశ్‌లో వివిధ తెగల మధ్య దూరాన్ని తగ్గించకపోగా మరింత పెంచిందనే విమర్శ ఎదుర్కొంది. అందుకని 1987 లో అరుణాచలప్రదేశ్ కొత్త రాష్ట్రంగా ఏర్పడగానే ఇంగ్లిషు బడిభాషగా అవతరించింది. మరొకవైపు జనవ్యవహారంలో హిందీ కొత్త అనుసంధానభాషగా రూపొందుతూ ఉంది. 'అరుణాచల్ హిందీ' పేరిట వ్యాపిస్తున్న ఈ భాషలో ఒక గుణం, ఒక అవగుణం రెండూ ఉన్నాయి.

గుణమేమిటంటే, ఇది అరుణాచలప్రదేశ్‌ని భారతదేశ సంస్కృతిలో మరింత చేరువగా తీసుకురాగలుగుతంది. కాని అవగుణం కూడా అదే. అలా అరుణాచలప్రదేశ్‌ని ఆలింగనం చేసుకునే క్రమంలో ఆ గిరిజనగీతాల స్థానంలో, ఆ కథలూ, పొడుపుకథల స్థానంలో హిందీ రాజకీయాలు, హిందీ కమర్షియలు సినిమాలూ అరుణాచల్‌ని ముంచెత్తేసే ప్రమాదం లేకపోలేదు. అటువంటి ప్రమాదం నుంచి తమను తాము కాపాడుకోవడం కోసమా అన్నట్టుగా ఇటువంటి సంకలనం వెలువడిందని చెప్పుకోవాలి.

ఇందులో కథలున్నాయి, వ్యాసాలున్నాయి, పొడుపుకథలున్నాయి, చిత్రలేఖనా–లున్నాయి, ఫొటోలున్నాయి, చివరికి ఒక పర్వతారోహకురాలితో చేసిన ఇంటర్వ్యూ కూడా ఉంది. పట్టుమని 200 పేజీలు కూడా లేని ఈ సంకలనం చదివితే ఆ అరుణాచలప్రదేశ్ అడవుల్నీ, కొండల్నీ, ఆ ఆదివాసుల్నీ చాలా దగ్గరగా చూసిన అనుభూతి కలుగుతుంది.

ఇందులో ముఖ్యవిశేషమేమంటే, సంకలనకర్తతో సహా ఇందులో చోటుచేసుకున్న 32 మంది కూడా రచయిత్రులు. ఆదివాసులు. వారిలో కొందరు ఇంగ్లిషుసాహిత్యం చదువుకుని ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నవారు. కొందరు మానవశాస్త్రం, సాంఘికశాస్త్రాలు చదువుకున్న వాళ్ళు. కొందరు పాత్రికేయులు. చాలామంది అరుణాచలప్రదేశ్ రాష్ట్రప్రభుత్వంలో వివిధ ప్రభుత్వశాఖల్లో ఉద్యోగాలు చేస్తున్నవాళ్ళు.

అందరూ కూడా ఒక అరుణాచలప్రదేశ్‌ను అన్వేషిస్తున్నారు. అది ఎక్కడ కనబడ్డా దాన్ని గుర్తుపట్టగలుగుతున్నారు. తాము ఎక్కడికి వెళ్ళినా తమ ప్రాంతం ముద్ర ఏదో ఒక రూపంలో వదిలిపెట్టి వెళ్ళాలని కోరుకుంటున్నారు. ఇందులో ఒక పర్వతారోహకురాలి ఇంటర్వ్యూ ఉందని చెప్పాను కదా. తినె మెనా అనే ఆ అమ్మాయి అరుణాచలప్రదేశ్ నుంచి మొదటిసారిగా ఎవరెస్టు అధిరోహించిన మహిళగా చరిత్ర సృష్టించింది. ఆమెని ఇంటర్వ్యూ చేస్తున్న మమంగ్‌దాయి 'ఎవరెస్టు అధిరోహించినప్పుడు నీ మెడలో మన అరుణాచలప్రదేశ్ సాంప్రదాయిక వస్త్రమొకటి ఉండటం చూసాను, అదేమయ్యింది?' అని అడిగితే 'దాన్ని అక్కడ ఆ కొండమీద మన ప్రాంతానికి గుర్తుగా వదిలిపెట్టి వచ్చాను' అని చెప్పిందామె!

సాధారణంగా ఒక ప్రాంతానికీ, లేదా ఒక భాషకీ ప్రతినిధిగా వెలువడే ఇటువంటి సంకలనాల్లో సాహిత్యవిలువలకి ప్రాధాన్యత ఉండకపోవడం సహజం. ఈ పుస్తకంలో అన్ని రచనలూ ఒకే సాహిత్యగాఢతని కలిగిఉన్నాయని చెప్పలేనుగాని, పలచటి రచనలు లేవని మాత్రం చెప్పగలను. కొన్ని చాలా అత్యున్నతస్థాయి రచనలు కూడా. ఉదాహరణకి లెకి థుంగాన్ అనే ఆమె రాసిన Doused Flames (చల్లార్చిన మంటలు) నిస్సందేహంగా గొప్ప కథ. ఆ రచయిత్రి నేపథ్యమేమై ఉండవచ్చునా అని పరిచయం చూస్తే ఆమె మెక్‌గిల్ యూనివెర్సిటీ నుంచి యాంత్రొపాలజీలో పిఎచ్.డి చేస్తున్నదని తెలిసింది. ఇటువంటి రచయిత్రులు, ఇటువంటి కథలు కావాలి తెలుగులో కూడా.

తెలుగులో కూడా ఈ మధ్య అనువాదాల గురించి ఒక జాగృతి మొదలయినట్టు కనిపిస్తున్నది. నేను వారికిచ్చే సలహా ఏమిటంటే, ఒక వర్కుషాపులాగా కూచుని ఇలా ఒక సంకలనాన్ని రూపొందించుకుని దాన్ని ఇంగ్లిషులోకి అనువదించడానికి ప్రయత్నించండి. ప్రచురించడానికి ఎవరో ఒకరు ముందుకొస్తారు. అది పెద్ద విషయం కాదు.

ఈ రచనలు ఎలా ఉన్నాయో మచ్చుకి రెండు కవితలు తెలుగు చేస్తున్నాను మీ కోసం.

చెక్కఇల్లు

గ్యాటి .టి.ఎం. అంపి

గలగల్లాడుతున్న ఆకులు
కిర్రుమంటున్న తలుపులు
కొండగాలి వీవెన.

పరిచిత పదధ్వనులు
గొంతుతగ్గించిన గుసగుస
రగులుతున్న నెగడి సెగ.

అబ్బా, తియ్యటి సువాసన
రహస్యంగా చెప్పుకున్న పాతకథలు
తచ్చాడుతున్న ఆత్మల వెలుగు.

రాళ్ళదారిన నడక
గడిచినకాలాల్ని గుర్తుచేసే నవ్వులు
గృహం ఇల్లుగా మారిపోయింది.

నాలో ఏ భాగం

కొల్పి దాయి

నాలో ఏ భాగం వాస్తవం?
లోపల గదిలో దాక్కున్నదా?
లేక బయట మందిని ఎదుర్కుంటున్నదా?

బాధలో నేను పెట్టుకున్న కన్నీళ్ళా
లేక నేను పంచిపెట్టిన చిరునవ్వులా
ఇంట్లో నివసిస్తున్న ఆ బాలికనా
లేక బయట తలెత్తుకున్న ఆ వనితనా
భయంతో వణుకుతున్న ఆ చిన్నారినా

లేక గర్వంగా సంచరిస్తున్న ఆ మహిళనా
సిగ్గుపడుతూ తప్పుకుంటున్న ఆ పిల్లనా
లేక వ్యవహారాలు చక్కబెడుతున్న ఆ యువతినా?

కొన్నిసార్లు నేను పొద్దుతిరుగుడు పువ్వుని,
మరికొన్నిసార్లు లేత గులాబిని.

13-7-2022

నేనెప్పటికీ మరవలేను

కృష్ణుడు ఆకాశమంత అనుకుంటే కృష్ణభక్తి సాహిత్యం సముద్రమంత. ఒక జీవితకాలం సరిపోదు. అన్నిటికన్నా ముందు ఆ కృష్ణుడు ఎక్కడికక్కడ ఏ భాషకి తగ్గట్టుగా ఆ భాషలో ఒక అందంగా అమరిపోయాడు. పోతన వర్ణించిన కృష్ణుణ్ణి చూడటమంటే తెలుగు భాష తియ్యదనం నీ స్వంతం కావడం. ఒక్క సంస్కృతంలోనే ఎందరు కృష్ణకవులున్నారో అన్ని సంస్కృతాలున్నాయి.

లీలాశుకుడు, జయదేవుడు, నారాయణతీర్థులు, నారాయణీయకర్తల సంస్కృతం ఒక్కలాంటి సంస్కృతం కాదు. ఎవరి సంస్కృతం వారిది. ఒక ముకుందమాలలోని సంస్కృతమూ, ఒక చైతన్యమహాప్రభు సంస్కృతమూ ఒకటికానే కావు. కృష్ణభక్తి వాఙ్మయం లోకి ప్రయాణించడంటే ఒక్క సముద్రం కాదు, ఇక్షుసముద్రం, క్షీరసముద్రంలాంటి సప్తసముద్రాలూ చుట్టిరావడం.

నా అలమారులో ప్రతి అరలోనూ కృష్ణభక్తి కవులున్నారు. ఆ పుస్తకాల్లో ప్రతి పుటలోనూ శిరసున నెమలిపింఛం, ఉరాన పీతాంబరం, చేతుల్లో వేణుఖండం ధరించిన గోపబాలకుడు ప్రత్యక్షమవుతూనే ఉంటాడు. ఎవరి పిలుపు వినను? సూర్‌దాస్‌దా? మీరామాయిదా? సంత్ శంకరదేవ్‌దా? లేక వల్లభాచార్యులదా?

ఇంతలో గుర్తొచ్చింది, మొన్ననే నమ్మాళ్వారుకి కొత్త ఇంగ్లిషు అనువాదం వచ్చిందని, తెచ్చుకున్నానే గాని ఇంకా తెరవనేలేదని. ఆ అపురూపమైన పుస్తకం తెరిచాను. To Plunge Within (2022). వసంతసూర్య అనే పండితురాలు, భావుకురాలు దాదాపు ఇరవై ఏడేళ్ళ పాటు సాధనచేసి 'తిరువాయిమొళి' నుంచి ఇంగ్లిషులోకి అనువదించిన 110 పద్యాల సంకలనం, అనువాదం.

రాత్రంతా కూచుని చదివాను. మూలంతో పోల్చుకుని చదివాను. ఆమె కృషి మామూలు కృషి కాదనిపించింది. ఆమె మామూలు అనువాదకురాలు కూడా కాదని-పించింది. నిజంగానే కాదు. ఎందుకంటే ఆమె బ్రెహ్ట్‌నీ, రిల్కనీ జర్మను నుంచి తమిళంలోకి అనువదించారట. తమిళం నుంచి కథాసాహిత్యాన్ని ఇంగ్లిషులోకి అనువదించారట. కాని ఈ అనువాదం ప్రత్యేకం. ఇది ఆమె తన యావచ్ఛక్తి వినియోగించి చేసిన అనువాదం అని అర్థమవుతూనే ఉంది.

80 ల్లో ఎ.కె.రామానుజన్ ఒక సారి చెన్నై వచ్చినప్పుడు అక్కడి పండితులకి చెప్పాడట, ఆళ్వారుల్ని, ముఖ్యం నమ్మాళ్వారుని, ఇంగ్లిషులోకి తీసుకురావడానికి ప్రతి ఒక్కరు ప్రయత్నించండి అని. ఆ మాటలు ఆమె మనసులో నాటుకుపోయాయి. ఆ రోజునుంచీ ఆమె తిరువాయిమొళి అనే సముద్రంలో మునకలేస్తూనే ఉన్నారు. ప్రతి ఒక్క పాశురంలోని, ప్రతి ఒక్క పదబంధాన్నీ ఆమె చేతుల్లోకి తీసుకుని చూసారు. ప్రతి మాట మలుపులోనూ మునకలేసారు. భక్తుణ్ణి భగవంతుణ్ణి సంబోధించిన ప్రతి ఒక్క పిలుపునూ- పెరుమాళ్ తిరుమాళ్, మాల్, అప్పన్, అమ్మాన్, మాయోన్- ప్రతి ఒక్క పేరునూ తను కూడా బిగ్గరగా పలికి చూసారు. ఫలితం! మరే అనువాదకులూ ఇంతదాకా గమనించని ఎన్నో సూక్ష్మ సౌందర్యాల్ని ఆమె పట్టుకోగలిగారు. మనతో పంచుకోగలిగారు.

ఆ పద్యాలు చదువుకోవడమే నాకు గోకులాష్టమి. వెన్నలాంటి ఆ వాక్కుని మీక్కూడా ఎంతో కొంత పంచాలి కదా, కాబట్టి, ఈ రెండు పద్యాలు చూడండి:

ఇన్ కవి పాడుం పరమకవి గళాల్
తన్ కవితాన్ తన్నై పాడు వియాదు ఇన్రు
నంగు వన్దు ఎన్నుడన్ ఆక్కి యెన్నాల్ తన్నై
వన్ కవి పాడుమ్ ఎన్ వైగుంఠనాథనే. (7:9:6)

(చక్కటి వాక్కులో గానం చెయ్యగల ఎందరో కవీశ్వరులుండగా, తన గురించిన కవిత్వాన్ని వారితో పాడించుకోకుండా, చాలా సంతోషంతో తనంత తానే నా దగ్గరకు వచ్చిన నా పరమనాథుడు నన్ను వదిలిపెట్టకుండా తన గీతాలు నాతో పాడించు-కుంటున్నాడు.)

ఆమె ఇంగ్లిషు అనువాదం:

Great poets who sing the finest poetry
those who've been made to sing

of you, by you
this may not be.

But it's to me you've come today.

Apt upon my tongue
have you begotten
mighty poems!

Through me you sing
of your self
my lord of Vaikuntha!

ఈ అనువాదంలోని అందం ముఖ్యంగా రెండు చోట్ల ఉంది. ఒకటి 'నన్దు వన్దు' అంటే తానే వచ్చి అని మూలంలో ఒకపక్కగా, లోగొంతులో వినబడీ వినబడకుండా ఉన్న మాటని But it's to me you've come today అనే ఒక ప్రత్యేకవాక్యంగా మార్చడంలో ఉంది. నమ్మాళ్వారులో ఉన్న మహిమ అదే. ఆయనకి తన గీతాలు కదు-రమ్యాలని తెలుసు. అటువంటి గీతాల్ని తమిళ భాషలో అప్పటిదాకా ఎవరూ పాడలేదని తెలుసు. కాని అది తన ప్రతిభ కాదు, తన దేవుడు తనంత తనుగా తన దగ్గరికి వచ్చి పాడించడంలోని కృపాతిశయమని కూడా తెలుసు. మరో మాట 'వన్' అనే విశేషణం. వన్ అంటే గొప్పది. 'వన్ కవి' అనే పదబంధాన్ని ఆమె mighty poems అని అనువదించారు. నేను పాడుతున్న పాటలు గొప్పవి అని కవి అనుకోవడం స్వోత్కర్ష కాదు, అది కూడా భగవద్దివ్యలీలాగానమే!

మరొక పద్యం చూడండి. ఇది కూడా ఏడవ సర్గలోని తొమ్మిదవ పదికమే. ఆమె హృదయానికి ఈ పదికం హత్తుకుపోయిందని అర్థమవుతూనే ఉంది.

ఆముదల్వనివనెన్రు తన్ తేల్లి ఎన్
నా ముదల్ వందు పుగుందు నల్ ఇన్ కవి
తూముదల్ పత్తర్ క్కు త్తాన్ తన్నై సొన్న ఎన్
వాయి ముదలప్పనై యెన్రు మరప్పనో

(ఈ జగత్తుకి తానే కారణమన్న ఎరుక నాకు ప్రసాదించి, నా నాలుక మీద అడుగు పెట్టి, గొప్ప భక్తులకి ఆనందాన్ని కలిగించే వాక్కుని నాకు అనుగ్రహించి నాతో ఈ పద్యాలు పలికిస్తున్న నా తండ్రిని నేనెప్పటికీ మరవలేను.)

ఆమె ఇంగ్లిషు అనువాదం.

Yes, he is the First.
Of that he has himself assured me.

Entering my tongue of fine poetry
he has made me sing of him, to those pure
who stand first in his worship.

The first word on my lips is 'father'
How can I ever forget him?

ఇక్కడ అందమంతా ఆ yes అని మొదలుపెట్టడంలో ఉంది. ఆ నిర్ధారణ పదం మూలపద్యంలో లేదు. కాని ఆ పద్యం సారాశమంతా తన భాగ్యనిర్ధారణే. కాబట్టి, ముందే yes అని మొదలుపెట్టడంలో ఎంతో సున్నితమైన అందముంది. మొత్తం పద్యమంతా చదివాక మళ్ళా మొదటి వాక్యానికి వచ్చినప్పుడు, కవి కన్నా ముందే మనం yes అనుకుంటాం.

కొన్నిచోట్ల ఆమె మూలం నుంచి బాగా పక్కకు జరిగిన తావులు కూడా లేకపోలేదు. ఉదాహరణకి 5-10-7 పాశురానికి చేసిన అనువాదంలో 'ఒణ్ శుడరోడు ఇరుళుమాయ్ నిన్రావరుం ఉణ్మయోడు ఇనమై ఆయ్ వమ్మ' అనే వాక్యాన్ని ఆమె In flame you stand as darkness అని అనువదించారు. కాని మూలమే చాలా చక్కగా ఉంది. 'నిన్ను ఆశ్రయించినవారికి నువ్వు సుందరమైన కాంతితో ప్రకాశిస్తూ కనిపిస్తావు, నిన్ను ఆశ్రయించనివారికి నువ్వు చీకటిలాగా కాంతిరహితంగా కనిపిస్తావు..' అనే అర్థమే చక్కగా ఉంది.

ఇలా ప్రతి ఒక్క పాశురాన్ని పోగులు, పోగులుగా విడదీసి ప్రతి పోగునీ పైకెత్తి పరిశీలించుకోవడంలో, చర్చించుకోవడంలో ఉండే ఆనందం కోసమే ఆమె ఈ కావ్యాన్ని మనకి అందించారని భావిస్తున్నాను.

ఇలా పోతన్నని కూడా ప్రపంచమంతా చదువుకునే రోజు ఎప్పుడు రానున్నదో కదా!

19-8-2022

ఎక్కడి పుష్కిన్! ఎక్కడి చినవీరభద్రుడు!

కొన్ని చాలా ఆశ్చర్యంగా ఉంటాయి. అవును. పుష్కిన్ నాకు చాలా ఇష్టమైన కవి. ఆ మాటకొస్తే ఎవరికి ఇష్టం కాదు? రష్యాకి కవిత్వం నేర్పినవాడు. అతడు ఒకసారి తన మిత్రుల ఇంట్లో బసచేసాడు. అక్కడ కొన్నాళ్ళు ఉన్నాడు. ఆ ఇంటిముందు ఒక సైప్రసు చెట్టు ఉండేది. ఒక కోకిల రోజూ ఆ చెట్టుమీదకు వచ్చి వాలేదట. పుష్కిన్ అక్కడ ఉన్నన్నాళ్ళూ ఆ కోకిల రోజూ ఆ చెట్టు మీద వాలేది. అక్కణ్ణుంచి పుష్కిన్ వెళ్ళిపోయాక కూడా ఆ కోకిల కొన్నాళ్ళు పాటు ఆ చెట్టుమీద వచ్చి వాలుతూనే ఉండేదట. ఆ కవిని ఒక కోకిల ప్రేమించిన ఈ కథ నా మనసులో నాటుకుపోయింది.

నేను విజయవాడలో ఉండగా ఒక రోజు పొద్దున్నే బస్టాండుకి వెళ్ళినప్పుడు ఇంకా తెల్లవారకుండానే కోకిల నా వెనక గొంతెత్తి కూస్తూ ఉండటం వినిపించింది. ఇంటికి రాగానే ఈ కవిత రాసాను:

కవి, కోకిల

ఒకప్పుడు యువకవి పుష్కిన్
కొన్నాళ్ళు ఒక చోట విడిది చేసాడట
ఆ ఇంటిముందొక సైప్రస్ చెట్టు,
అక్కడున్నన్నాళ్ళూ
అతడా చెట్టుకిందనే కూచునేవాడట,
తోడుగా కొమ్మల్లో ఒక కోకిల.

కొన్నాళ్ళకు పుష్కిన్
అక్కణ్ణుంచి వెళ్ళిపోయాడు,
ఆ కోకిల మాత్రం
ఆ తర్వాత కూడా చాన్నాళ్ళ పాటు
ఆ కవికుమారుడి కోసం
ఆ చెట్టు మీద వాలేదట.

మరి ఇదేమిటీ కోకిల!
నేనెప్పుడో మా ఊరు వదిలిపెట్టేసినా
నా వెనకే వస్తుంది!
చివరికి విజయవాడ బస్టాండుకి కూడా.

కానీ, ఊహించలేదు, ఒకరోజు ఈ కవిత గురించీ, పుష్కిన్ గురించీ, నా గురించీ, కోకిల గురించీ ఒక మిత్రురాలు నేరుగా రష్యను మిత్రులముందే ముచ్చటిస్తారని!

థ్రిల్లింగుగా అనిపించింది. ఒకప్పుడు మిత్రుడు చోరగుడి ఉపేంద్రనాథ్ నా 'మోహన రాగం' ప్రసంగాలు టాంజానియోలో కిలిమంజారో పర్వతం మీద పెట్టుకు విన్నానన్నప్పుడు ఎంత పులకింతగా అనిపించిందో ఇప్పుడు కూడా అంతే పులకింత.

మిత్రులు స్వాతిగారు చెన్నైలో ఉంటారు. ఒకసారి చెన్నైలో నేను చలంగారి మీద ప్రసంగిస్తే మర్నాడు పత్రికల్లో చాలా చక్కటి సమీక్ష వచ్చింది. నా ప్రసంగసారాంశాన్ని అంత బాగా ఎవరు పట్టుకున్నారా అని చూస్తే ఆ రచయిత స్వాతి గారు. ఆ తర్వాత ఫేస్-బుక్ స్నేహితులయ్యారు. మంచి కవి. థాంక్యూ స్వాతిగారు! నా కవిత నేరుగా పుష్కిన్ విన్నట్టే అనిపించింది మీరు రష్యనుమిత్రులకి ఆ కవిత గురించి చెప్తుంటే!

10-10-2022

కొత్తగా, సరికొత్తగా

మూడు నాలుగురోజుల కిందట సురేష్ కొలిచాల మా ఇంటికి వచ్చారు. అటువంటి భాషావేత్త, పండితుడు, అనువాదకుడు, సాంకేతిక నిపుణుడు నన్ను చూడటానికి రావడమే ఒక కానుక కాగా, ఆయన మరొక కానుక కూడా తీసుకొచ్చారు. అది Song Offerings (2000) పేరిట Joe Winter అనే ఆయన గీతాంజలికి చేసిన అనువాదం.

'గీతాంజలి గీతాలు బెంగాలీలో ఎలా ఉన్నాయో అలా చేసిన అనువాదం ఇది' అన్నారు సురేష్ ఆ పుస్తకం నా చేతుల్లో పెడుతూ. William Radice చేసింది ఇదే కదా. పెంగ్విను సంస్థ ఆ పుస్తకం కూడా వేసింది' అన్నాను. టాగోరు 150 వ పుట్టినరోజు నాడు హైదరాబాదులో బెంగాలీ సమాజం వారు ఏర్పాటు చేసుకున్న ఒక సభలో రాడిస్ తన అనువాదాలు వినిపించినప్పుడు నేను కూడా ఉన్నాను. కొంతసేపు మా సంభాషణ బెంగాలీగీతాల మాధుర్యం గురించీ, వాటిని అనువాదంలోకి తేలేకపోవడం గురించీ నడిచింది.

కాని ఆయన వెళ్ళిన తరువాత ఆ పుస్తకం తీసి చూద్దును కదా, అది నిజంగానే గొప్ప కానుక అనిపించింది. ఎందుకంటే అది టాగోరు ఇంగ్లీషు గీతాంజలికి బెంగాలీ మూలం కాదు. టాగోరు బెంగాలీలో 'గీతాంజలి' అనే పేరిట ఒక గీతసంపుటి 1910 లో వెలువరించాడు. అందులో గీతాలు ఆయన 1906-10 మధ్యకాలంలో రాసినవి. అందులో అత్యధిక గీతాలు 1910 లో మూడు నెలల వ్యవధిలో రాసినవి. ఆ గీతసంపుటిలో మొత్తం 157 గీతాలు ఉన్నాయి.

1912 లో టాగోరు ఇంగ్లాండు వెళ్తున్నప్పుడు ఓడ ప్రయాణంలో తన గీతాల ఇంగ్లిషు అనువాదాల్ని సరిచూసుకున్నప్పుడు బెంగాలీ గీతాంజలిలోంచి 53 గీతాల అనువాదాలు

మాత్రమే ఇంగ్లిషు గీతాంజలిలోకి తీసుకున్నాడు. గీతాంజలిలోని మొత్తం 103 వచనకవిత ల్లోనూ 53 గీతాలు గీతాంజలినుంచే తీసుకోవడంతో ఆయన తన ఇంగ్లిషు పుస్తకానికి కూడా గీతాంజలి అనే పేరుపెట్టుకున్నాడు. దాంతో బెంగాలీ గీతాంజలి బెంగాలుకి బయట పరిచయం కావలసినంతగా పరిచయం కాకుండా ఉండిపోయింది.

బెంగాలీ గీతాంజలిలోని 157 గీతాల్లో 53 గీతాలు ఇంగ్లిషు గీతాంజలిలోకి అనువదిస్తూ, టాగోరు మరొక పన్నెండు గీతాల్ని కూడా ఇంగ్లిషులోకి అనువదించాడు. అవి The Gardener, The Fruit Gathering, Crossing, Poems అనే నాలుగు సంపుటాల్లో చేర్చాడు. అంటే మొత్తం 157 గీతాల్లో మనకి ఇప్పటిదాకా 65 మాత్రమే ఇంగ్లిషులో టాగోర్ అనువాదంలో లభ్యమవుతున్నాయన్నమాట.

ఇప్పుడు జో వింటర్ అనే ఈ అనువాదకుడు మొత్తం 157 గీతాల్నీ, బెంగాలీ గీతనిర్మాణానికి విధేయంగా ఇంగ్లిషులోకి అనువదించాడు. అంటే గీతాంజలి బెంగాలీ కావ్యం ఇప్పటికి పూర్తిగా ఇంగ్లిషులో లభ్యమవుతున్నదన్నమాట.

సురేష్ కొలిచాల నాకు టాగోరు కవిత్వం కానుకగా ఇస్తున్నప్పుడు, 'టాగోరు గీతాంజలి వాల్ట్ విట్మన్‌లాగా ఎన్ని ఎడిషన్లయినా, ఏ ప్రచురణకర్తలు ప్రచురించిందైనా ఇంట్లో పెట్టుకోవలసిందే' అన్నాను నవ్వుతూ. కాని నాకు లభించింది అపూర్వమైన కానుక అని ఇప్పుడు ఈ పుస్తకం తెరిచాకనే అర్థమయింది.

బెంగాలీలో టాగోరు వెలువరించిన గీతాంజలి నేపథ్యం చాలా విలువైనది. ఆయన 1902-07 మధ్యకాలంలో తన ఇద్దరు పిల్లల్నీ, భార్యనీ కూడా కోల్పోయాడు. 1884 లో తన వదినగారు కాదంబరీదేవి ఈ లోకం నుంచి అర్థాంతరంగా వెళ్ళిపోయిన ఆఘాతం నుంచి బయటపడకముందే తన భార్యనీ, పిల్లల్నీ పోగొట్టుకోవడం మామూలు విషాదం కాదు. ఆ శూన్యంలో ఆయన భగవంతుడి పదధ్వనిని వినడంలో ఆశ్చర్యం లేదు. కాని ఆ పాదాల్ని ఆయన గట్టిగా పట్టుకున్నాడు. 1905 లో బెంగాలు విభజన సందర్భంగా తలెత్తిన నిరసన ఉద్యమాల్లో పాల్గొన్నప్పటికీ ఆయన హృదయం అక్కడ లేదు. అది వికసిస్తున్న పద్మంలోనూ, రేవులో నవ్యపురుషుడు ఎవ్వరో వినిపిస్తున్న వీణావాదనంలోనూ, దారి మలుపు లో కమ్ముకున్న బాబ్లాపూల పరిమళంలోనూ, సముద్రతీరాన ఆడుకుంటున్న చిన్నపిల్ల ల్లోనూ, అర్థరాత్రి అకస్మాత్తుగా తన ఇంటి తలుపు తట్టిన అతిథి అడుగుల చప్పుడులోనూ లీనమై ఉంది. జీవితంలో ఒకవైపు తలుపు మూసుకోగానే మరొకవైపు భగవంతుడి మందిరం వైపు తలుపు తెరుచుకోవడంలో, టాగోరు జీవితానికీ, ఇతర భారతీయ భక్తికవుల జీవితానికీ ఏమంత తేడా లేదు.

ఇప్పుడు ఈ గీతాలు ఆ రోజుల్ని, ఆ శూన్యప్రాంగణంలో వెలుగు రేఖలు పరుచుకున్న ఆ ప్రభాతాల్ని, ఆ సాయంత్రాల్ని నాకు దగ్గరగా తీసుకువచ్చాయి. రానున్న రోజుల్లో అప్పుడూ, అప్పుడూ ఈ గీతాల్ని తెరిచిచూడబోతున్నాను. నిజమే, తన బెంగాలీ గీతాల్లోని సంగీతాన్ని ఏమి చేసీ ఇంగ్లిషులోకి తేవడం అసాధ్యం అని టాగోరుకి తెలుసు. గీతాంజలి గీతాల్ని ఆయన ఇంగ్లిషు వచనంలో కూర్చుకుంటున్నప్పుడు 'మాటలనియెడు మంత్రమహిమ' ఏదో ఆ ఇంగ్లిషు వచనానికి సిద్ధించింది. ఇక ఎందరు ఎన్ని ప్రయత్నాలు చేసినా, ఆ బెంగాలీ సంగీతాన్ని మరే భాషలోకీ తేజాలలేకపోయారు. ఆ ఇంగ్లిషుని ఎన్ని భాషల్లోకి అనువదించినా, ఎందరు ఎన్ని సార్లు అనువదించినా, ఆ మంత్రమహిమ ఆ ఇంగ్లిషుని దాటి ప్రవహించకుండా ఆపలేకపోయారు కూడా.

జో వింటర్ కి కూడా ఈ సంగతి తెలుసు. ఆయన ఇలా అంటున్నాడు :

> The voice the outside world came to know the Gitanjali by was magical, compelling. A more faithful rendering of the proms in itself offers no magic. (p.22)

ఐనా ప్రాయికంగా కవిత్వం కాబట్టి, ఎంత బలహీనమైన అనువాదంలోనైనా ఆ బెంగాలీ మూలంలోని ఆర్తి, సంగీతం శ్రోతకి కొంతేనా చేరగలవన్న ఆశతో, తానీ అనువాదానికి పూనుకున్నానని అతడు చెప్పుకున్నాడు.

అతడు చేసింది నిజంగా మంచిపని. నాలాంటి టాగోరు ఆరాధకులకి అతడు ఎంత మంచి కానుక ఇచ్చాడో అతడికి తెలియకపోవచ్చు. భగవంతుడు తన జీవితంలో కొత్తగా, సరికొత్తగా అడుగుపెట్టినట్టే, టాగోరు కూడా అడుగుపెడుతున్నాడు, నా జీవితంలో, ఎప్పటికప్పుడు కొత్తగా, సరికొత్తగా.

ఈ కవిత చూడండి (7), ఆ ఇంగ్లిషుకి నా తెలుగులో:

అడుగుపెట్టు నా జీవితంలో, కొత్తగా, సరి కొత్తగా

అడుగుపెట్టు నా జీవితంలో, కొత్తగా, సరి కొత్తగా
పరిమళంగా, రంగులుగా, గీతాలుగా.
అడుగుపెట్టు నా దేహంలో, అడుగుపెట్టు నా మనసులో.
నన్ను కంపింపచేసే ప్రతి పులకింతలోనూ అడుగుపెట్టు

సంతోషంలో, సమ్మోహపరిచే నిద్రలో, ప్రభూ
అడుగుపెట్టు నా జీవితంలో, కొత్తగా, సరికొత్తగా.

సుందరంగా, ప్రకాశభరితంగా, దయామయంగా
నిర్మలంగా, వైభవంగా, శాంతమయంగా
అపారంగా, అనంత వైవిధ్యంతో
సుఖంలో, దుఃఖంలో, హృదయాంతరంగంలో
నా దైనందిన కార్యకలాపమంతటిలోనూ
మా పనులన్నిటి సమాప్తక్షణంలోనూ
హే! అడుగుపెట్టు నా బతుకులో, కొత్తగా, సరికొత్తగా.

7-12-2022

నూరువిధాలుగా నేలని ముద్దాడవచ్చు

ఒకప్పుడు మన జీవితాలు చిన్న చిన్న ఊళ్ళల్లో పరిమితమైన సమాజాల్లో గడిచేవి. అప్పుడు మనుషుల మధ్య ప్రతిభలోకాని, వనరుల్లోగాని, సామాజిక స్థాయిలోగాని కనిపించే అంతరాలకి మనం అలవాటు పడిపోయి ఉండేవాళ్ళం. ఎక్కడో వాటిని మౌనంగా అంగీకరించడానికి కూడా అలవాటు పడిపోయి ఉండేవాళ్ళం.

కాని ఇప్పుడు మన ప్రపంచం అనూహ్యంగా విస్తరించింది. అవకాశాల్ని బాగా అందిపుచ్చుకున్నవాళ్ళూ, అందిపుచ్చుకోలేక చాలా వెనకబడిపోయినవాళ్ళూ మనకి అనునిత్యం తారసపడుతూనే ఉంటారు. అన్యాయాలకు గురయ్యేవాళ్ళూ, వాళ్ళకోసం పోరాడే వాళ్ళూ, అవేవీ పట్టించుకోనివాళ్ళూ కూడా మన భుజాల్ని రాసుకునేటంత దగ్గరగా, బిగ్గరగా, తొందరగరగా మన చుట్టూ మసలుతూనే ఉంటారు. ఈ కొత్త ప్రపంచం విశాల ప్రపంచమే కాదు, దాని వైశాల్యం మన మనసులమీద కలిగించే ఒత్తిడి వల్ల అత్యంత సంకుచితం కూడా.

ప్రతి రోజూ మనం దైత్యదేశంలో అడుగుపెట్టిన గలివరులాగా ఒక క్షణం అత్యంత గరిమతోనూ, మరుక్షణం అత్యంత లఘిమతోనూ సమాధానపడవలసి వస్తున్నది. ఒక క్షణం మనకన్నా ఎంతో ఎత్తుగా కనిపించే దీర్ఘకాయులు, మరుక్షణం మనకన్నా ఎంతో చిన్నగా కనిపించే అల్పకాయులు. వీరి మధ్య తిరుగాడుతూ, ఒకక్షణం నేను చాలా అదృష్ట-వంతుణ్ణి అనుకోవడం, మరుక్షణం నేను చాలా దురదృష్టవంతుణ్ణి, నన్ను జీవితం కరుణించలేదు అనుకోవడం.

ఇది మన మీద అత్యంత స్వల్పవ్యవధిలోనే కలిగించే అత్యంత తీవ్రమైన ఒత్తిడి మనల్ని సదా పరుగులుపెట్టిస్తూనే ఉంటుంది. మనమేదో పొందవలసింది పొందలేదనీ,

ఏదో మిస్సయ్యామనీ, ఆ మోడలు కారు కొని ఉంటే బాగుంటేది, అప్పుడే అక్కడ ఆ ప్లాటు రిజిస్టరు చేసుకుని ఉంటే ఎంతో బాగుండేది, ఈ పుస్తకం చదివి ఉంటే, ఈ సినిమా చూసి ఉంటే, ఈ స్థలానికి వెళ్ళి ఉంటే, ఇతణ్ణి నా మిత్రుడిగా చేసుకుని ఉంటే, ఆమెని ప్రేమించి ఉంటే. .. ఈ తలపులకి అంతు ఉండదు.

మనం అనుక్షణం కుంభాకార, పుటాకార కటకాల అద్దాల మందిరంలో తిరుగాడు-తున్నట్టే ఉంటుంది. ఒక క్షణం ఉబ్బిపోతూ ఉంటాం, మరుక్షణం మనల్ని మనం పలచన చేసుకుంటూ ఉంటాం. కాని కావలసింది, మన యథార్థ స్వరూపాన్ని యథార్థ పరిమాణంలో చూపించగల అద్దం. అటువంటి స్వస్వరూప దర్శనం ఎలా సాధ్యపడుతుంది?

అదేమీ బ్రహ్మవిద్య కాదు. దానికి తీవ్ర ఆధ్యాత్మిక సాధన లేదా నిష్ఠురమైన క్రమశిక్షణ కూడా అవసరం లేదు. అది చాలా సరళం, సులభం, సత్వరం. మనం చెయ్యవలసిందల్లా, ఇప్పుడు, ఇక్కడ మనం ఇలా ఉన్నందుకు అన్నిటికన్నా ముందు దేవుడికో, ప్రకృతికో, తల్లిదండ్రులకో, గురువులకో లేదా నీ చుట్టూ ఉన్న సమాజానికో ధన్యవాదాలు సమర్పించు-కోవడం.

కృతజ్ఞతాసమర్పణని మించిన ఔషధం లేదు. అది మన అన్ని వికారాల్నీ, వికృత రూపాల్నీ పరిహరించగల సర్వరోగనివారిణి. మనం చెయ్యవలసిందల్లా, పొద్దున్నే లేవగానే, ఇంకా మొబైలుఫోను చేతుల్లోకి తీసుకోకముందే, ఇంకా వాట్సపు గ్రూపుల్లోకి చూపు సారించకముందే, అసలు అన్నిటికన్నా ముందు పొద్దున్నే, నువ్వింకా జీవించి ఉన్నందుకు, ప్రశాంతంగా నిద్రలేవగలిగినందుకు, నీ కోసం మరొక రోజు ఉదయిస్తున్నందుకు మనసారా ధన్యవాదాలు చెప్పుకోవడం. నీకు నువ్వే శుభాకాంక్షలు ప్రకటించుకోవడం. తిరిగి మళ్ళా రాత్రి నీ పక్క మీదకు చేరినప్పుడు, ఇక అన్ని వార్తాప్రసార సాధనాల్నీ మూసిపెట్టి, నీ అంతరంగాన్ని తెరిచిపెట్టుకుని, ఒక రోజుకి నువ్వు ఆరోగ్యంగా, ప్రశాంతంగా, ప్రయోజన-కరంగా గడపగలిగినందుకు, ఆ రోజు కలవగలిగినవాళ్ళని కలుసుకోగలిగినందుకు, చెయ్య గలిగిన పనులు చేయగలిగినందుకు, తలుచుకోగలిగినవాళ్ళని తలుచుకోగలిగినందుకు, హృదయపూర్వకంగా నమోవాకాలు అర్పించుకోవడం.

నేను ప్రతిరోజూ ఈ రెండు పనులూ చేస్తాను. లేవగానే మంచం దిగగానే ముందు నేలమీద మోకరిల్లుతాను. రాత్రి పడుకోబోయేముందు మరొకసారి మోకరిల్లుతాను. అలా రెండు సార్లు మోకరిల్లగలిగిన ప్రతి రోజూ నాకు నా జీవితం సంపూర్ణంగా జీవించాననే అనుభూతితోనే నిద్రకి ఉపక్రమిస్తాను. పెద్దవాళ్ళు చెప్పినమాటనే నేను కూడా చెప్తున్నాను. అన్ని భాషల్లోని అన్ని డిక్షనరీల్లోనూ ఒకే ఒక్క పదం అత్యంత అమూల్య పదం. Grati-

tude. ఆ ఒక్క పదాన్ని పట్టుకుని ఈ జీవితసాగరాన్ని ఎంత దూరమేనా ఈదగలమనే నమ్మిక నాకు నానాటికీ మరింత బలపడుతున్నది.

ఇదిగో, నా ముందు ఎవ్రిమేన్ లైబ్రరీ వారి Poems of Gratitude (2017) ఉంది. ఎప్పుడు నిరాశ ఆవరిస్తుందనిపించినా ఈ పుస్తకం తెరుస్తాను. మళ్ళా మళ్ళా ఈ కవితలు మీతో ఎలానూ పంచుకుంటాను కాని, ఇప్పటికి, ఈ మూడు కవితలు, ఈ సుప్రభాతాన.

జలాలుద్దీన్ రూమీ

ఈ రోజు కూడా ప్రతిరోజు లానే

ఈ రోజు కూడా ప్రతిరోజులానే మనం శూన్యంగా,
భయభ్రాంతుల్లో మేల్కొన్నాం
తొందరపడి ఆ గది తలుపు తెరవకు,
పుస్తకపఠనం మొదలుపెట్టకు.
ముందొక సంగీత వాద్యం చేతుల్లోకి తీసుకో.
మనం ఆరాధిస్తున్న సౌందర్యం మనమే కావాలి
తెలుసుకో, మోకాళ్ళ మీద వంగి-
నూరువిధాలుగా నేలని ముద్దాడచ్చు.

ఛార్లెస్ రెజ్నికోఫ్

కృతజ్ఞతా స్తుతి

విజయాలు సాధిస్తున్నామని
నేను పాడబోవడం లేదు
నేను పాటలు పాడితే అందుకు కారణం
అందరిమీదా కురుస్తున్న సూర్యకాంతీ
మందపవనమూ
ఉదారమైన వసంతమూ తప్ప మరేమీ కాదు.

నేను పాటలు పాడితే అది విజయాల కోసం కాదు,
ఒక రోజంతా చెయ్యగలిగినంత పని చేసినందుకు.

వేదిక మీద కాదు,
నలుగురితో కలిసి బల్ల దగ్గర కూర్చున్నందుకు.

చెస్లా మీవోష్

కానుక

సంతోషకరంగా రోజు మొదలయ్యింది
పొగమంచు తొందరగా విచ్చుకుంది, తోటపని చేసాను
తేనెలూరుతున్న పూలమీద పికిలిపిట్టలు వాలుతున్నాయి
ఈ భూమ్మీద నాకేదీ సొంతం చేసుకోవాలనిలేదు
నాకు అసూయపుట్టిస్తున్నవాళ్ళంటూ ఎవరూ లేరు
నేనేదైనా కష్టాలకు లోనై ఉంటే, అవన్నీ మర్చిపోయాను.
గతంలోకూడా నేనిలానే ఉండేవాణ్ణని అనిపిస్తే
అందుకు నాకేమీ చింతలేదు.
నా ఒంట్లో ఎలాంటి నలతా లేదు
నన్ను నేను సర్దుకుని తలెత్తి చూస్తే
నీలి సముద్రమూ, తెరచాపలూనూ.

13-12-2022

భూమ్మీద మొలకెత్తిన నక్షత్రాలు

చెట్ల మీద మన దగ్గర ఏవైనా కవితా సంకనాలు వచ్చాయా? చెట్ల మీదనే ఎవరైనా కవి మొత్తం కవితలతో ఒక కవితల సంపుటి ఏదైనా వెలువరించాడా? చెట్లకు ఎవరైనా ఉత్తరాలు రాసారా? Conversations with God లాగా Conversations with Trees అంటూ ఎవరైనా చెట్లతో తన సంభాషణలు గ్రంథస్థం చేశారా? అసలు ఎవరైనా రోజూ చెట్లతో సంభాషిస్తూ ఉన్నారా?

నా జీవితంలో నేను కలుసుకున్న మనుషులు కలిసి తిరిగిన స్నేహితులు, చదివిన పుస్తకాలు, చూసిన స్థలాలు నాకు ఎంత గుర్తో, నేను చిన్నప్పటి నుంచి చూస్తూ ఉన్న చెట్లు కూడా అంతే గుర్తు. కొన్ని చెట్లు అయితే అవి నేను ఎక్కడికి వెళితే అక్కడికి నాతో వస్తూనే ఉన్నాయి. నా చిన్నప్పటి ప్రపంచం, అంటే నేను మా ఊరు దాటి బయట ప్రపంచం లోకి అడుగుపెట్టక ముందటి ప్రపంచం గురించి, కొన్ని తలపులు రాసుకుందా–మని మొదలుపెట్టాను. అందులో మా ఊరి చుట్టూ కొండల గురించి, ఏటి గురించి, చెరువుల గురించి, కప్పల బెకబెక గురించి ఎంత రాసుకుంటానో, చెట్ల గురించి, మరీ ముఖ్యంగా కొన్ని చెట్ల గురించి తప్పనిసరిగా తలుచుకుంటాను, రాసుకుంటాను.

మా ఊరి నుంచి వణకరాయి వెళ్లే దారిలో, దారి పక్క మలుపులో, పెద్ద నెమలి చెట్టు ఒకటి ఉండేది. దాన్ని నెమలి చెట్టు అని అంటారనే తెలుసు. దాని శాస్త్రీయ నామం ఏమిటో ఎప్పుడూ పరిశీలించుకోలేదు. పల్చటి కాయలు కాసి నేల మీద రాలి పడ్డప్పుడు ఆ ఎండిన కాయలు చూడటానికి నెమలి ఫించం మీద కన్నుల్లా కనిపిస్తాయి కాబట్టి దాన్ని నెమలి చెట్టు అనేవారేమో. ఆ నెమలి చెట్టు నా చిన్నప్పుడు మా ఊర్లో చూసిన ఒక గిరిజన మహిళలాగా, గ్రామీణ రైతులాగా లేదా మా కుటుంబ పెద్దల్లో ఒకరిలానో నాకు

ఎప్పటికీ గుర్తుంటుంది. ఆ చెట్టుని నేను మొదటిసారి కలుసుకున్నప్పుడు ఆ చెట్టు నాకేమి చెప్పిందో కానీ అది నేరుగా నా హృదయంలోకి ఇంకిపోయింది అనుకుంటాను. అది ఏమి చెప్పిందో నాకై నేను ఎప్పుడు విప్పి చెప్పుకునే ప్రయత్నం చేయలేదు. కానీ ఆ చెట్టు గుర్తొచ్చినప్పుడల్లా ఒక కవిత చదివినట్టుగా నాలో ఏదో ఒక తృప్తి కలుగుతుంది.

దానికి నేను ఏ పేరూ పెట్టలేదు గాని ఇదిగో ఇప్పుడు ఈ Poems about Trees పుస్తకం చదువుతుంటే దాన్ని gladness అంటారు అని తెలిసింది. చెట్లను చూస్తే మనకు కలిగేది gladness. We feel glad. కానీ ఈ gladness మన ప్రపంచంలో నుంచి వెళ్లిపోయిందని అంటున్నాడు ఈ కవిత్వ సంకలనకర్త హ్యారీ థామసు. ఈయన చెప్పేదేమంటే చరిత్రయుగం మొదలైనప్పటి ఇతిహాస కవులకు, ఒక హెూమరులాంటి వాళ్లకు, మాత్రమే ఆ gladness అంత ఫ్రెష్‌గానూ అనుభవంలోకి వచ్చిందనీ, ఇప్పుడు చెట్లను తలుచుకుంటే మనం ఆ తొలినాళ్ళ ఆనందానుభూతిని పొందలేకపోతున్నామనీ అంటాడు. అతను చెప్పలేదు కానీ బహుశా ఇప్పుడు చెట్లను చూస్తే మనకు కలిగేది sadness. మరీ ముఖ్యంగా నగరాల్లో ట్రాఫిక్కుకి అటూ ఇటూ నెత్తి నిండా దుమ్ముపోసుకుని నిలబడే చెట్లను చూసినప్పుడు, మనకీ వాటికీ మధ్య దుఃఖంలోనూ దైన్యంలోనూ ఏమీ తేడా లేదనిపిస్తుంది.

గొప్ప కావ్యాలు, గొప్ప దేవాలయాలు, మహానదులు వీటిల్లో కొన్ని తరాల్ని, యుగాల్ని దాటిన మానవానుభూతి పవిత్ర ఐశ్వర్యం లాగా పోగుపడి ఉండడం మనకు అనుభవమే. చెట్లదగ్గరా, అడవుల్లోనూ దొరికేది కూడా అటువంటి మహదైశ్వర్యమే. కాలిఫోర్నియాలో మెథుసెల అనే ఒక చెట్టు ఉందట. అది దాదాపుగా 5000 ఏళ్లుగా జీవిస్తూ ఉన్నదట. అంటే ఆ చెట్టుతో పోలిస్తే సోక్రటీసు, బుద్ధుడు, హెూమరు, కాళిదాసు వీళ్లంతా చిన్న పిల్లలు. సుమేరియను ఇతిహాసం గిల్గమేషు ఇంకా ఆవిర్భవించక ముందే ఆ చెట్టు అక్కడ ఉంది. వాల్మీకి శోకం శ్లోకం కాకముందే ఆ చెట్టు ఈ భూమ్మీద నిలబడి ఉంది. ఎన్ని నక్షత్రాల కాంతులు ఆ చెట్టు శాఖోపశాఖల్ని ఇన్ని యుగాలుగా తడుపుతూ వస్తున్నాయో కదా! ఇప్పుడు నాకు ఆ చెట్టును చూడటం కోసం ఎంత తొందరగా కాలిఫోర్నియా వెళదామా అనిపిస్తున్నది! బహుశా ఆ చెట్టు దగ్గర నిల్చున్నప్పుడు చరిత్రయుగంలో ప్రభవించిన కవులందరి కావ్యాలూ ఒక్కసారి అక్కడ వినబడతాయేమో అనిపిస్తున్నది.

నేననుకుంటాను ప్రతి ఒక్క కవీ తాను చూసిన, చూస్తూ వస్తున్న చెట్ల మీద ఒక ఆల్బము రాసి పెట్టుకోవాలి అని. ప్రతి చెట్టూ భూమ్మీద మొలకెత్తిన ఒక నక్షత్రం. నక్షత్రాల నుంచి చెట్లకు కాంతి ప్రసరించడమే కాదు, చెట్ల మీంచి కూడా నక్షత్ర లోకాల్లోకి కాంతి ప్రసరిస్తూ ఉంటుంది. నువ్వు ఒక చెట్టు కింద నిల్చుని మనసారా ఒక కవిత పలికితే నీ

తలపులు అనంత కాంతి సంవత్సరాల పాటు విశ్వాంతరాళం వైపు పయనిస్తూనే ఉంటాయని నమ్మకంగా చెప్పగలను.

ఎవ్రిమేన్ లైబ్రరీ వారు సంకల్పం చేసిన Poems about Trees (2019) నిజంగానే అత్యంత స్ఫూర్తిదాయకమైన సంకలనం. ఇందులో ఎక్కువ కవితలు ఆంగ్లో అమెరికను ప్రపంచానికి చెందిన కవులవే అయినప్పటికీ ఆ కవులూ, ఆ కవితలూ మనల్ని మన ఉద్యానవనాల వైపు, తపోవనాల వైపు, మన మహారణ్యాల వైపు నడిపిస్తాయి.

నాకు ఆశ్చర్యం కలిగించిందేమంటే ఈ సంకలనకర్త చెట్ల ఎదుట ఐరోపా మానవుడు పొందిన gladness కి మొదటి గుర్తుగా ఒడెస్యూసుని పట్టుకున్నాడు. ఒడెస్సీ ఆరవ కాండలో ఒడెస్యూసు, నౌసికాను చూసిన తొలి క్షణంలో, ఆమె సౌందర్యాన్ని ప్రశంసిస్తూ, ఆమె అందం తనకు తాను ఒకప్పుడు చూసిన ఖర్జూరవృక్షపు చిగుళ్ళని గుర్తుకు తెస్తున్నదని చెప్తాడు. Gladness అంటే అది. అపోలో దేవత అర్చావేదిక దగ్గర ఒక ఖర్జూరవృక్షం అప్పుడే లేలేత చివుర్లు తొడుగుతున్న దృశ్యం. ఆ నవపల్లవాన్ని చూసినప్పుడు తనకు కలిగిన సంతోషంలాంటి సంతోషం మళ్లా ఆ మహా సౌందర్యవతిని చూసినప్పుడు కలిగిందని ఒడెస్యూసు చెప్తాడు.

ఒక మనిషి ఒక చెట్టు తనలో రేకెత్తించగల gladness ను నమోదు చేసుకున్న తొలి క్షణం అది అని ఈ సంకలనకర్త అంటున్నాడు. ఒడెస్యూసు తిరిగి ఇథాకాకు వచ్చినప్పుడు తన తండ్రి, తన భార్య తనని గుర్తుపట్టలేక పోతున్నప్పుడు, ఆనవాళ్లుగా తాను నాటిన తోట గురించి, తాను పెంచిన చెట్టు గురించి చెప్తాడని, చెట్లు ఒక కథలో అంతగా అంతర్భాగం అవడం కూడా గొప్ప విశేషమని అంటున్నాడు. అసలు ఒడెస్సీ మహాకావ్యం లోని ఈ అంశాన్ని ఇప్పటిదాకా ఏ వ్యాఖ్యాతా ఎందుకు గుర్తించలేదో తనకు అర్థం కాలేదు అంటాడు.

ఈ సంకలనకర్త సంస్కృతం చదివి ఉంటే వాల్మీకి రాముణ్ణి 'గిరివన ప్రియుడు' అన్నందుకు బహుశా నాట్యం చేసి ఉండేవాడేమో అనిపిస్తుంది. రాముడికి చెట్లంటే ఇష్టమని వాల్మీకి నేరుగా చెప్తాడు గాని, పువ్వులు అంటే ఇష్టమని మాత్రం నేరుగా చెప్పకుండా భరతుడితో చెప్పిస్తాడు. ఇంతకీ ఆ తొలి ఖర్జూరవృక్షపు చివుళ్లని చూసినప్పుడు ఆ gladness కలిగింది ఒడెస్యూసుకా? హోమరుకా? గిరివన ప్రియుడు వాల్మీకినా? రాముడా?

ఇతిహాసకర్తలకి ఒక విషయమైతే తెలుసు: ఒక మానవుడు సముద్రానికి వంతెన కట్టినందుకో లేదా సముద్రాన్ని ఈది తిరిగి ఇంటికి చేరుకున్నందుకో ఆరాధ్యమానవుడు

కాలేదు. చిగురించిన చెట్లను చూసినప్పుడు తన హృదయం పులకిస్తుందని గుర్తుపట్ట గలిగినవాడు కాబట్టే అట్లాంటి మానవుడు ఈ భూమ్మీద విజయం సాధించాలనీ, తన రాజ్యం స్థాపించాలనీ ఇతిహాసకారులు కోరుకున్నారు.

బాగా పళ్ళు పండిన ఒక నల్ల జీడిచెట్టును చూసి రాముడు లక్ష్మణుడితో నేను ఈ చెట్టు కింద నా జీవితమంతా సంతోషంగా జీవించగలనని అనిపిస్తోందని చెప్పాడే, అది కూడా ఎప్పుడని? రాజ్యం వదులుకుని వనవాసానికి బయలుదేరిన తొలి రోజుల్లోనే! అప్పుడే మనకు రాముడు నిజంగా రాముడిగా పరిచయమవుతాడు.

14-12-2022

ఎవరో ఒకరు ఏదో ఒక కాలంలో

నాడు శాఫో విరహకంఠనాళ వేణు వాలపించిన యరుణారుణాంధగీతి యేద్పు,
నిట్టూర్పు, కోపించు నిపుడు సంధ్య యటుల, కాలవిశాల విహాయసమున !

అని కృష్ణశాస్త్రి ఊర్వశీ గీతాలు రాస్తున్నప్పుడు ఆయన వెనక పూర్వ సంస్కృతాంధ్ర కవులతో పాటు బ్రిటిషురొమాంటిసిస్టు కవులు కూడా ఉన్నారని మనకు తెలుసు. కొద్దిగా మరింత లోతుకు పోయి చూస్తే ఆ తొలితరం ఇంగ్లిషు, స్కాటిషు రొమాంటిక్ కవుల వెనక జర్మను రొమాంటిక్ కవులు గొథే, షిల్లరులు ఉన్నారని కూడా మనకి అర్థమవుతుంది. కాని మనకి మన సాహిత్య చరిత్రకారులు చెప్పనిదేమిటంటే, ఆ తొలితరం జర్మను రొమాంటిక్ కవుల వెనక, జర్మను పల్లెపాటలు ఎంత బలంగా ఉన్నాయో, ప్రాచీన గ్రీకు లిరిక్ కవులు కూడా అంతే బలంగా ఉన్నారనేది.

లేకపోతే ఊర్వశి గురించి గానం చేస్తూ కృష్ణశాస్త్రి శాఫోని ఎందుకు తలుచుకున్నాడు? ఇరవయ్యవ శతాబ్దంలో రొమాంటిక్ గీతాలు రాసిన ప్రతి భారతీయకవి వెనకా సుదూరకాలం నుంచీ ఎన్నో సరిహద్దుల్నీ, సముద్రాల్నీ దాటి ప్రాచీన గ్రీకు లిరిక్ కవులు కూడా వినిపిస్తున్నారని పోల్చుకోవడంలో గొప్ప సాహిత్యసంతోషముంది.

గ్రీకు కవిత ప్రధానంగా మూడు విధాలుగా ఉండేది. మొదటిది ఎపిక్ కవిత. అంటే హోమరూ, హెసియోదూ రాసిన కవిత. అది ఆరుగణాల పద్యపాదంతో గంభీరంగా నడిచే కవిత. రెండవది ఎలిజీ. శోకాకుల పద్యం. మూడవది లిరిక్. అంటే మన భాషలో చెప్పాలంటే లలితగీతం. మూడూ సంగీతప్రధానాలే. ఎపిక్‌ని చితార అనే ఒక పెద్ద తంత్రీవాద్యానికి అనుసంధానించి పాడేవారు. రామాయణం కూడా తంత్రీవాద్యాలకు అనుగుణంగానే వినిపించేవారని బాలకాండలో ఒక ప్రస్తావన ఉంది. ఎలిజీ సన్నాయి,

పిల్లంగోవిలాంటి గాలి వాయిద్యాలమీద వినిపించేది. లిరిక్ లైర్ అనే చిన్నతంత్రీవాద్యం మీద వినిపించేది. ఇప్పటి భాషలో చెప్పాలంటే గిటారులాంటి వాద్యమన్నమాట.

గ్రీకు కవిత్వం అనగానే బయటి దేశాలకూ, బయటి పాఠకులకూ, అంటే యూరోపుతో సహా తక్కిన ప్రపంచానికి ముందు గుర్తొచ్చేది హోమరు. ఆయన రాసిన ఇలియడు, ఒడెస్సీ మహేతిహాసాలూ, కొన్ని స్తోత్రాలూను. ఆ తర్వాత హెసియోదు అనే కవి. ఆయన రాసిన Works and Days, Theogony. ఆ తర్వాత ఎక్కువమందికి తెలిసినవాడు పిండార్. ఆయన రాసిన ఓడ్సు జగత్ప్రసిద్ధాలు. ఈ ముగ్గురివీ పూర్తిగ్రంథాలో లేదా గీతాలో పూర్తిగా లభ్యమవుతున్నాయి. కాని పూర్తికవిత్వం కాక, చిన్నచిన్న శకలాలు మాత్రమే లభ్యమవుతున్న శాఫో గ్రీకు కవులందరిలోనూ సర్వోన్నతురాలైన కవయిత్రి. ప్లేటో లాంటి వాడు ఆమెని Tenth Muse గా నుతించాడు. ఈ నలుగురూ తప్ప ప్రాచీన గ్రీకుకవుల గురించి మనలాంటి పాఠకులకు తెలిసింది చాలా స్వల్పం.

అలాగని ఆ కవిత్వం సంకలనాలుగా రాలేదని కాదు, లేదా ఇంగ్లిషులోకి అనువాదం కాలేదనీ కాదు. కాని ఆ అనువాదకులు ప్రధానంగా పండితులు. రెండువేల ఏళ్ళ కిందటి ఆ కవిత్వాన్ని ఇంగ్లిషులోకి అనువదిస్తున్నప్పుడు వాళ్ళు వీలైనంత మూలవిధేయంగా ఉండటానికే ప్రాధాన్యమిచ్చారు. తాము ఎక్కడ స్వతంత్రించినా, ఆ ప్రాచీనవాక్కు పవిత్రతను తామెక్కడ మసకబరుస్తామో అన్న భయం, జాగ్రత్త, సందేహం వారిని ఎప్పటికప్పుడు మరింత స్వేచ్ఛ తీసుకోకుండా అడ్డుపడుతూ ఉండింది. కాని వారు చేసిన సేవ నిరుపమానం.

ప్రాచీన గ్రీకుకి సంబంధించి ఏ శకలం దొరికినా, అది ఎక్కడ దొరికినా, అది పగిలిపోయిన కుండపెంకులమీద కానివ్వండి, శిథిలమైపోతున్న పేపైరీ మీద కానివ్వండి, మరేదో తత్త్వశాస్త్రగ్రంథంలోనో, చరిత్ర పుస్తకాల్లోనో, ఎవరో రచయిత చేసిన చిన్నపాటి ప్రస్తావనలోంచి కానివ్వండి, వారు ప్రతి ఒక్క శకలాన్నీ ఏరి భద్రంగా ఆధునిక ప్రపంచానికి అందచేసారు. ఆ కవితా శకలాల మీద ఉన్న దుమ్ము దులిపి, వాటి చుట్టూ ఉన్న చరిత్రను, ఇతర పాఠ్యవిశేషాలను, పాఠాంతరాలను ఎంతో శ్రద్ధగా, బాధ్యతగా నవ్యప్రపంచం చేతుల్లో పెట్టారు.

ఆ గ్రీకు కవులూ, వారి గీతాలూ ఒక్కొక్కటే బయటపడుతున్నకొద్దీ, పద్ధెనిమిది, పందొమ్మిది శతాబ్దాల యూరపియను భావుకులు, మరీ ముఖ్యంగా జర్మను భావుకులు పరవశించిపోయారు. ఆ పారవశ్యంలో హోల్డర్లిను, నీషే లాంటి వాళ్ళు ఉన్మాదులు కూడా అయిపోయారు. బైరనులాంటి వాడు మహోద్వేగభరితుడైపోయాడు. ఆ బైరనీయ

ఉద్వేగమే మన కృష్ణశాస్త్రి దాకా ప్రవహించింది. కృష్ణశాస్త్రి ఉన్మాది కాకపోవడం ఆశ్చర్యమే కాని ఆయన స్వరపేటిక మూగపోవడం యాదృచ్ఛికం అనిపించదు.

గ్రీకు లిరిక్ కవులకు తెలుగులో చెప్పుకోదగ్గ అనువాదాలేవీ నా దృష్టికి రాలేదు. శాఫో గురించి ఎవరైనా ప్రస్తావించి ఉండవచ్చునేమోగాని, చెప్పుకోదగ్గ పరిచయ వ్యాసం కూడా ఏదీ నేనిప్పటిదాకా తెలుగులో చదవలేదు. ఆ మాటకొస్తే, Sherod Santos అనువదించి సంకలనం చేసిన Greek Lyric Poetry (2005) చదివినదాకా నాకు కూడా గ్రీకు లిరిక్ గురించి ఏమీ తెలియదనే చెప్పాలి.

షెరోదు శాంటోసు పుస్తకం నా విష్‌లిస్టులో ఉండటం చూసి పదేళ్ళ కింద ఒక మిత్రురాలు ఆ పుస్తకం తెప్పించి నాకు కానుక చేసారు. అది కూడా పుట్టినరోజు కానుక. ఆ కవిత్వసంకలనం మన వైతాళికులు లాగా గ్రీకు భావకవితాసంకలనం అని చెప్పవచ్చు. అందులో ఆ సంకలన కర్త గ్రీకు కవిత్వాన్ని నాలుగు చారిత్రిక దశలనుంచి ఏరి తెచ్చాడు. మొదటిది, చరిత్రతొలికాలం, ఇతిహాస కాలం. అంటే క్రీ.పూ. ఎనిమిదో శతాబ్దం నుంచి నాలుగవశతాబ్దం దాకా. మహోన్నతులైన గ్రీకు లిరిక్ కవిత్రయం ఆర్చిలోకసు, త్యూడియసు, ఆల్క్‌మనులతో పాటు శాఫో, పిండార్‌లు ఈ కాలానికి చెందిన కవులు. ప్లేటో, సోక్రటీసు కూడా ఈ కాలానికి చెందిన వాళ్ళే. ఆ తర్వాత కాలం క్రీ.పూ 323 నుంచి 31 దాకా హెలెనీయ యుగం. ఆ తర్వాత సా. శ. ఆరవశతాబ్దిదాకా రోమను యుగం. ఆ తర్వాత మరొక శతాబ్దం పాటు తొలి బైజాంటియను యుగం.

దేశ భాషల్లో కవిత్వం మొదలయిన తర్వాత కూడా, ఆ మాటకొస్తే, ఆధునికయుగంలో కూడా సంస్కృతంలో కవిత్వం కొనసాగుతున్నట్టే, ప్రాచీన గ్రీకుకవిత్వం బైజాంటియను కాలం దాకా కొనసాగింది. ఆ తర్వాతదంతా మధ్యయుగాల, ఆధునికకాలానికి చెందిన గ్రీకు కవిత్వం. కాని ఈ సంకలనకర్త తొలి బైజాంటియను యుగం దాకా మాత్రమే కవితల్ని ఏరిపెట్టాడు.

పదేళ్ళుగానూ ఈ పుస్తకం తెరుస్తూనే ఉన్నాను, తిరగేస్తూనే ఉన్నాను. దీనికి అనువాదకుడు రాసిన విపులమైన ముందుమాట చదివిన తర్వాత గ్రీకు నేర్చుకోవాలనే కోరిక కలక్కుండా ఉండటం అసాధ్యం. ఎందుకంటే గ్రీకుని ఇంగ్లీషులో చదవడం సంస్కృతాన్ని ఇంగ్లిషులో చదివినట్టే. రెండు భాషల్లోనూ ఛందస్సులు గణబద్ధ, మాత్రాబద్ధ ఛందస్సులు. కాని ఇంగ్లిషు ఛందస్సు ఊనిక మీద ఆధారపడ్డ ఛందస్సు. కాబట్టి గ్రీకు కవిత్వంలోని నాదమాధుర్యం, ఆ సంగీతాత్మకత ఎలా ఉంటుందో మనం ఇంగ్లిషులో పోల్చుకోవడం దాదాపుగా అసాధ్యం. అయినా ఈ అనువాదకుడు పండితులచర్చలకు

మాత్రమే పరిమితమైన ప్రాచీన గ్రీకుకవిత్వాన్ని సాధారణ పాఠకుడికి సన్నిహితంగా తీసుకురావడానికి ప్రయత్నించాడు.

గ్రీకు లిరిక్ కవిత్వం ప్రపంచ సాహిత్యానికి ఇచ్చిన కానుక ఏమిటి? అనువాదకుడు తన ముందుమాటలో ఈ ప్రశ్నని ఎత్తుకుని, చెప్పేదేమంటే, అప్పటిదాకా పౌరాణిక ప్రపంచానికీ వీరోచిత సాహసకృత్యాలకూ మాత్రమే పరిమితమయిన కవిత్వాన్ని లిరిక్ కవులు రోజువారీ జీవితంలోకి తీసుకువచ్చారు అని. గ్రీకు లిరిక్‌కి ఆదికవి అని చెప్పదగ్గ ఆర్చిలోకసు కవిత్వాన్ని ఒక వ్యక్తి జీవితంలోని దైనందిన సంఘటనల్నీ, వ్యక్తిగత సంతోషాల్నీ, సల్లాపాల్నీ పంచుకోవడానికి వాడుకోవడం మొదలుపెట్టాడనీ, అనంతరకాలంలో, మరీ ముఖ్యంగా, ఆధునికకాలంలో పాశ్చాత్యకవిత్వం ఆ నమూనాలోంచే తనని తాను తీర్చిదిద్దు-కున్నదనీ చెప్తాడు. దేవతలూ, వీరాధివీరులూ, మహాసముద్రాలూ, నౌకాయుద్ధాలతో కిక్కిరిసిపోయిన హోమరికా నుంచి కవిత్వాన్ని రోజువారీ సంఘటనలవైపూ, చిన్న చిన్న ఆశలవైపూ, నిరాశల వైపూ మళ్ళించగలగడం మామూలు విషయం కాదు. అది కూడా ఎప్పుడని? కవి అంటే దైవసమానుడుగానూ, ఒక భిషక్కుగానూ, ఒక గురువుగానూ భావించే కాలంలో శాఫో తన దేహం గురించీ, ప్రేమ గురించీ రాయడంలోని విప్లవాత్మకత మన ఊహకి అందేది కాదు.

చరిత్రకీ, కవిత్వానికీ మధ్య తేడా ఉందని అరిస్టాటిలు చెప్తున్నప్పుడు, ఎలా జరిగిందో చెప్పడమే చరిత్రకి చాతనవుతుందనీ, ఎలా జరగ్గలదో చెప్పడం కవిత్వానికి మాత్రమే చాతనయ్యే విశేషమని చెప్పడం వెనక లిరిక్ కవుల ప్రభావం ఉందని స్పష్టంగా చెప్పవచ్చు. ఒక లిరిక్ కవి, మానవ ఊహాశాలీనతని గ్రహగతులనుంచీ, చారిత్రిక శక్తుల ఉధృతినుంచీ పక్కకు తప్పించి, ముందు మనుషుల మధ్య మానవసంబంధాలు ఎట్లానెలకొనాలో ఊహించే దిశగా నడిపిస్తాడు. కవులు కొత్త ప్రపంచాన్ని నిర్మిస్తారంటే దాని అర్థం వాళ్ళు యుద్ధాలు చేసి కొత్త రాజ్యాలు స్థాపిస్తారని కాదు. మనుషులు తమ తోటిమనుషులతో, పశుపక్ష్యాదులతో, మట్టితో, మనసుతో ఎలా మమేకంకావాలో నేర్పుతారు. వాళ్ళు కొత్త ఇంద్రియాలిస్తారు. దాంతో అప్పటిదాకా అలవాటుగా మారిపోయి బండబారిన ప్రపంచం మళ్ళా రెక్కలు విప్పుకుని కొత్తగా కనిపించడం మొదలుపెడుతుంది.

ఈ దృక్కోణం మనకు తెలుసు. ఇస్మాయిల్ గారి వంటి కవులూ, భావుకులూ మనకి ఈ విషయాలు ఎంతో విశదంగా చెప్పారు. కాని నాకై నేను ఇప్పుడు కొత్తగా తెలుసుకుంటున్న దేమంటే, ఒక కృష్ణశాస్త్రి వెనక, ఒక ఇస్మాయిల్ వెనక, సుదూరకాలాలకు చెందిన ప్రాచీన గ్రీకు లిరిక్ కవులు కూడా ఉన్నారని.

ఇంత రాసాకా ఆ కవితలు ఎలా ఉండి ఉంటాయో అని మీరు ఎదురు చూస్తుంటారని తెలుసు. మీ కోసం మూడు కవితలు:

ఆర్చిలోకసు

ప్రార్థన

సముద్రం మీద దారి చూపించంటూ
ఆ పొడవు జళ్ళ దేవతని
నావికులు దేంతో ప్రార్థిస్తారో తెలుసునా
ఇంత సముద్రపు నురగతో!

శాఫో

శకలం, 147

ఒక మాట చెప్తాను, గుర్తుపెట్టుకో, మనల్ని తలుచుకునేవాళ్ళు
ఎవరో ఒకరు ఏదో ఒక కాలంలో ఉండనే ఉంటారు.

ఆఫ్రొడైట్ పునరాగమనం: మూడు శకలాలు

నువ్వు క్రీటు నుంచి తిరిగి వచ్చేటప్పుడు, యాపిలు తోట దగ్గర, మన చిన్ని దేవళంలో కలుసుకుందాం. నీ కబరీభరం నుంచి వీచే ఖనిజ సుగంధాలు ఆ అర్చావేదికను పరిమళాల్తో నింపేస్తాయి.

నీలిసరోవరజలాల మీంచి తేలియాడుతూ ఒక శీతపవనం మన యాపిలు తోటమీంచి ప్రసరిస్తుంది. ఆ చెట్ల కొమ్మల్లోంచి గుసగుసలాడే ఆకుల మధ్య నుంచి యాపిలు మధువు మత్తుగా కనురెప్పల్ని బరువెక్కిస్తుంది.

గడ్డిబయళ్లలో యుద్ధాశ్వం పచ్చిక మేసేచోట, మైదానమంతా వాసంతపుష్పాలు విరజిమ్ముతాయి. నీలిరంగు కుప్పపోసిన సరస్సుని గాలితరగలు గిలిగింతలు పెడతాయి.

సైమొనిడిసు

కవిత్వం

తన కలల్ని
సుగంధంతో, మకరందంతో కలపడానికి
తేనెటీగలాగా, ఆమె,
పూలపంచన చేరుతున్నది.

15-12-2022

చివరి రొమాంటిక్

మార్క్సు కవి అని అతని రచనలు చదివినవారికి ఎవరికైనా స్ఫురిస్తుంది. మార్క్సు, ఎంగెల్సు రచనల్లో మార్క్సు శైలికీ ఎంగెల్సు శైలికీ మధ్య భేదం కూడా సాధారణ పాఠకుడికి కూడా ఇట్టే చప్పున బోధపడుతుంది. ఎంగెల్సు శైలి శాస్త్రకారుడి శైలి. నిర్దుష్టంగానూ, నిర్దిష్టంగానూ, తాను చెప్తున్నదానికి మరో అర్థమిచ్చే అవకాశమేమీ లేకుండానూ, సూటిగానూ, స్పష్టంగానూ ఉండే శైలి అది. కాని మార్క్సు శైలి అలా కాదు. అతడి భాష భావోద్వేగ-భరితంగా ఉంటుంది. కొన్నిసార్లు కవిత్వంలానూ, కొన్నిసార్లూ ఉద్విగ్నపూరితమైన సంభాషణలానూ ఉంటుంది. అందుకని కొందరి దృష్టిలో మార్క్సు ఒక రొమాంటిక్. చాలామంది దృష్టిలో ఆయన చివరి రొమాంటిక్. కమ్యూనిష్టు మానిఫెష్టో వెలువడ్డ 1848 నే రొమాంటిసిజం తాలూకు చివరి సంవత్సరంగా సాహిత్యచరిత్రకారులు లెక్కేస్తుంటారు.

మార్క్సు చిన్నప్పుడు స్కూలు విద్యార్థిగా ఉన్నప్పణ్ణుంచే సాహిత్యమంటే ప్రేమ పెంచుకున్నాడనీ, యూనివెర్సిటీలో చేరాక, కవి కావాలని అనుకున్నాడనీ తెలిసినప్పుడు, అందుకే, ఆశ్చర్యం అనిపించదు. ఒక సాహిత్యసృజనకారుడిగానే తన భవిష్యత్తుని కలగన్నాడనీ, ప్లేటో తరహా సంభాషణలు రాయాలనుకున్నాడనీ, ఒక విషాదాంత నాటకమూ, ఒక నవలా కూడా రాయడానికి పూనుకున్నాడనీ కూడా ఇప్పుడు మనకు తెలుస్తోంది. కాని కవి కావాలనుకున్న తన కోరికపట్ల అతడు చాలా తొందరగానే నిరుత్సాహానికి లోనయ్యాడనీ, 1841 నాటికే, అంటే ఇరవైమూడేళ్ళ వయసుకే తనకు సాహిత్యకారుడు కాగలిగే శక్తిలేదనే నిశ్చయానికి వచ్చేసాడని కూడా ఉత్తరాలు చెప్తున్నాయి. అయినా కూడా మరికొన్నాళ్ళు కవిత్వసాధన కొనసాగిస్తూనే వచ్చాడు, చివరగా 1839 లో జెన్నీకి ఒక కవితాసంకలనం బహూకరించినప్పుడు అందులో తన కవిత్వం తప్ప తక్కిన కవులనుంచీ, జానపదగీతాలనుంచీ తనకు నచ్చినవాటిని ఏరికూర్చి కానుక చేసాడు. ఇక ఆ తర్వాత

అతనిలోని కవి ప్రత్యేకమైన కవితలు రాసే రూపంలో, ప్రత్యేకమైన కవితల్ని ఏరి కూర్చి పెట్టుకునే కవిత్వాభిమానిరూపంలో అదృశ్యమైపోయాడు. ఆ తర్వాత మిగిలింది ఒక తత్త్వవేత్త. కాని ఆ తత్త్వవేత్త పూర్తిగా కవిత్వద్రవ్యంతో రూపొందిన తత్త్వవేత్త. షేక్ స్పియరు, ఎస్కిలసు, గొథేలు రక్తంలో ప్రవహిస్తున్న తత్త్వవేత్త. అందుకనే అతని ఆలోచనలు, పదజాలమూ, వ్యక్తీకరణ శైలి ఎంత బలమైనవిగా రూపొందాయంటే, అతడు మరణించి వందేళ్ళు తిరక్కుండానే (1883-1993) సగం ప్రపంచం అతడి భావాలకు అనుయాయిగా మారి పోయింది.

1836-37 మధ్యకాలంలో అయన రాసుకున్న కవిత్వంలో 120 ఖండికలదాకా లభ్యమవుతున్నాయంటున్నాడు ఫిలిప్ విల్సన్. వాటినుంచి పన్నెండు కవితల్ని ఎంపిక చేసి Evening Hour పేరిట జర్మను-ఇంగ్లిషు ద్విభాషా సంపుటిగా వెలువరించాడు విల్సన్. ఆ సంపుటిని పోయిన ఏడాది ఆర్క్ పబ్లికేషన్సు వారు ప్రచురించారని తెలియగానే వెంటనే తెప్పించుకుని చదివాను. ఆ పుస్తకాన్ని పరిచయం చేయాలని అనుకుంటూనే తాత్సారం చేస్తో వచ్చాను. అందుకు కారణం లేకపోలేదు. వాటిని నేరుగా వచన కవితలుగా కాక, పద్యాల్లోనో లేదా మాత్రాఛందస్సుల్లోనో అనువదించాలని అనుకోవడమే అందుకు కారణం.

జర్మను మాత్రాఛందస్సుల్లోని లయ, అంత్యప్రాసలు ఆ కవితలకు ఇచ్చిన అందాన్ని మనం కూడా తెలుగులో సమాంతరంగా పట్టుకురావాలంటే ముత్యాలసరాలో లేదా చతురశ్రగతి, ఖండగతి గేయాలుగానో మార్చవలసి ఉంటుంది. కవిత్వంలో, అదీ జర్మను కవిత్వంలో, మార్క్సుకి ఒక నమూనా ఉన్నాడు. అతడు హైన్రిఖ్ హైని. పందొమ్మిదో శతాబ్దపు జర్మను భాషని హైని అపూర్వమైన కావ్యభాషగా తీర్చిదిద్దాడు. నేను ఇంతకుముందు హైని కవిత్వాన్ని పరిచయం చేస్తూ, హైని ఎవరెవరిని ప్రేమించాడా అని అతడి జీవిత చరిత్రకారులు ఆరా తీస్తూ వచ్చారుగాని, అతడు తన జీవితంలో నిజంగా ప్రేమించింది ఒకే ఒక్కర్ని, అది జర్మనుభాషని అని రాసాను. జర్మనుభాషని హైని ప్రేమించినంతగా మార్క్సు కూడా ప్రేమించాడు. అతడి నవయవ్వనంలో తొలిసారిగా ప్రేమలో పడ్డప్పుడు ఆ ప్రేమని వ్యక్తం చెయ్యడానికి అందరిలాగా రోజువారీ జర్మనుని కాకుండా గొథే, హైని లాంటి కవులు తీర్చిదిద్దిన జర్మను కోసం వెతుక్కున్నాడు. కాబట్టి ఆ కవితల్ని ఊరికే వచనంలో అనువదించడమంటే, బహుశా, ఆ మూడ్ ని పరిచయం చెయ్యగలనేమోగాని, అతడి హృదయంలోని poetic fire ని మాత్రం కాదు.

ఉదాహరణకి-

The lantern burns so softly
And casts a mellow light
It seems to weep beside me
As if it knew my plight

అనే పద్యచరణమే తీసుకోండి:

దీపమొక్కటి వెలుగుచున్నది
పరచిపెట్టుచు పరిపక్వకాంతిని.
నాదు శోకము తాను గైకొని
ఏడ్చునట్లగుపించుచున్నది.

అని చెయ్యవచ్చు. కాని గేయఫణితిని తేగలిగాను గాని, ఆ భావస్ఫూర్తిని పూర్తిగా పట్టుకు రాలేకపోయాను కదా. Evening Hour అనే ఈ పద్యాన్ని తెలుగు చెయ్యగల కవి ఎవరున్నారా అని ఆలోచించాను, కృష్ణశాస్త్రి తప్ప మరొక కవి కనిపించడం లేదు. ప్రభవ పద్యాలు రాసిన శ్రీశ్రీ కొంతవరకూ కృతకృత్యుడు కాగలడేమో.

కాని ఏమి చెయ్యను? పుస్తకాలు సర్దినప్పుడల్లా, ఆ పుస్తకం నాకేసి చూస్తోనే ఉంది. దాన్ని అలమారులో లోపలి వరసలో పెట్టెయ్యలేను. అలాగని ఆ కవితల్నిగీతాలుగా మార్చనూ లేను.

అలాగని ఈ పుస్తకాన్ని నా బల్లమీద అట్టే రోజులు పెట్టుకోనూలేను. ఒకటి రెండు కవితలేనా మీతో పంచుకుంటే, ఈ పుస్తకాన్ని పక్కన పెట్టి, మరో కవిని తెరవగలుగుతాను.

అందుకని, ఇవిగో, ఒకటి రెండు, కవితలు మీ కోసం.

సంధ్యవేళ

ఆ లాంతరు మృదువుగా జ్వలిస్తున్నది
కాయ పండినప్పటి కాంతి ఆ చుట్టూ.
నా దుర్దశ ఏదో తెలిసినదానిమల్లే
నా చెంత నిలబడి శోకిస్తున్నట్టుంది.

నా ఒంటరితనాన్ని పసిగట్టినట్టుగా
నా వక్షస్థలమ్మీద ఆనుకుంటున్నది

తలాతోకాలేని నా ఊహల్లో దాని నీడ
భూతాకృతులు సంతరించుకుంటున్నది.

అది నికృష్టఛాయ, వికృతాకృతి
అయినా గ్రహించకపోలేదు, నా
ఎదలో రగులుతున్న అగ్ని ముందు
తాను వెలవెలబోక తప్పదని.

కాని అయ్యో ఆ అగ్ని వాడిపోతున్నది
అలాగని అది ఆరిపోవడం అసాధ్యం.
బహుశా, నీ ఆత్మసాగర ప్రకాశాన్ని నేను
బలంగా ప్రతిఫలించలేకపోతున్నట్టున్నది.

విలాపం

నాతోనేను తలపడుతున్నాను, ఓడిపోతున్నాను
ఈ సంఘర్షణ నా ఆత్మని శోధిస్తున్నది, చీలుస్తున్నది
సంకెళ్ళకు కట్టుబడ్డ ఈ పాత్ర పోషించలేక నీకు
మరింత చేరువకావాలని హృదయం పరితపిస్తున్నది.

కాని కనరాదే నువ్వు ప్రేమిస్తున్నట్టు ఏదో ఒక అభిజ్ఞ,
కనీస సంకేతం, దయాపూరితంగా కనీసం ఒక మాట.
నీ పెదాల మీద కనీస ప్రేమనామోచ్చారణ.
అయినా నా లోపల, అగ్ని, దహిస్తూనే ఉన్నది.

ఎంతోసేపు పట్టదు ఇదంతా నిష్ఫలమైపోడానికి.
కోరికలు ఫలించకుండానే శూన్యం కాకతప్పదు
నిండారా ప్రేమ పొంగిపొర్లిన నా హృదయం
కృశించి, రిక్తమై, ఇంతలోనే ఎండిపోక తప్పదు.

ఇంకా నా ఆత్మవృక్షం పైకి కొమ్మలు చాపుతున్నది
ఎంత ఎగబాకినా ఫలితం శూన్యమని తెలుస్తున్నది.
గగనసీమను దాటిన ద్యులోకాన్ని అందుకోడానికి,
ఆ శాఖోపశాఖలు, చేతులు పైకి చాపుతున్నవి.

ఏమి చెప్పు, ఈ విలాపం నిరర్థకం. స్వర్గాన్ని
భూమికి దింపాలన్న నా పరితాపం నిష్ఫలం.
నువ్వింక చూపులు అటువైపు తిప్పుకున్నాక
కడపటి ధైర్యం కూడా కనరాకపోతున్నది.

10-1-2023

స్కాట్లాండు పూలగుత్తి

మా అమృత యుకె నుంచి వస్తున్నప్పుడు ఏదైనా కవిత్వం తీసుకురమ్మంటే A Year of Scottish Poems (2018) పట్టుకొచ్చింది. గేబీ మోర్గాన్ అనే ప్రసిద్ధ సంకలనకర్త సంకలనం చేసిన కవితలకి, మరొక ప్రసిద్ధ స్కాటిషు కవయిత్రి జాకీ కే ముందుమాట రాసారు.

స్కాటిషు కవిత్వంతో నాకు ఇంతకు ముందు కొంత పరిచయం లేకపోలేదు. సర్ వాల్టర్ స్కాట్ గేయం లోకిన్వార్, ఇంటర్మీడియేటులో చదివింది, ఇంకా చెవుల్లో మోగుతూనే ఉంది. కృష్ణశాస్త్రి పదే పదే ఆరాధనా పూర్వకంగా రాస్తూ ఉండటం చూసి రాబర్టు బర్న్సుని చదవడానికి ప్రయత్నం చేయకపోలేదు. మరీ ముఖ్యంగా రాబర్టు లూయీ స్టీవెన్సను బాలగేయాలు నా హృదయానికి అతి దగ్గరగా వచ్చిన కవిత్వం కూడా. కొన్నేళ్ళ కిందట డగ్లస్ గిఫర్డ్, అలాన్ రియాచ్ అనే వారు సంకలనం చేసిన Scotlands Poets and the Nation (2004) అనే పుస్తకం కూడా కొనుక్కున్నానుగానీ, స్కాటిషు యాస వల్ల, ఆ కవిత్వ ప్రపంచంలోకి ఎన్నిసార్లు ప్రవేశించాలనుకున్నా మొదటిపేజీల్లోనే ఆగిపోతూ వచ్చాను.

కానీ ఈ సంకలనం నన్ను చేయిపట్టుకుని నడిపిస్తూ ఉంది. ముఖ్యంగా పుస్తకం చివరలో స్కాటిషు పదాల్లో కఠినమైనవాటికి ఇంగ్లిషు అర్థాలు ఇవ్వడం వల్ల కూడా ప్రవేశం మరీ అంత కష్టమనిపించలేదు. యాభై కవితలు చదివేటప్పటికి పదకోశంతో పనిలేకుండానే స్కాట్ పదజాలం చాలావరకూ బోధపడటం మొదలయ్యింది.

స్కాట్లాండు కొండలదేశం, నదుల దేశం, సరసుల దేశం. ఉత్తరసముద్రపు గాలులకి ఎప్పుడూ వణికిపోతుండే పూలరేకలాంటి దేశం. ఆశ్చర్యమేమంటే, ఈ కవితల్లో ఆ ప్రకృతి సౌందర్యం అంతే తాజాగా నవనవలాడుతూ కనిపిస్తుండటం. ఆ కవిత్వం చదువుతున్నంత

సేపూ మన కవిత్వం గుర్తొస్తూనే ఉంది. మనం అవసరానికి మించి 'మాడర్నైజు' అయి పోయామనీ, మరీ తెలివి మీరిపోయామనీ కూడా అనిపిస్తూ ఉన్నది. మన కవిత్వాన్ని ఆధునికయుగంలోకి తీసుకుపోయే క్రమంలో మనం ఇంగ్లిషు కవుల వైపు చూసినంతగా ఐరిషు, స్కాట్ కవులవైపు చూడలేదని కూడా తెలుస్తూ ఉన్నది. బహుశా కృష్ణశాస్త్రి ఒక్కడే బర్నుని గాఢంగా ప్రేమించినవాడు, కాబట్టే, ఇద్దరి కవిత్వంలోనూ ఆ కోయిలలూ, ఆ వసంతాలూ, ఆ పూలతోటలూ చెక్కుచెదరకుండా నిలిచి ఉన్నాయి.

ఈ సంకలనకర్త పూర్వకాలపు, సమకాలపు కవుల కవిత్వాల్ని వెంటవెంటనే పొందు పర్చినందువల్లా, ఆ కవుల గురించిన జీవితవిశేషాలేవీ చెప్పనందువల్లా, ఏ కవిత పూర్వ కవితనో, ఏది మన కాలం నాటి కవితనో తెలియకుండా ఉంది. అలా సంకలనం చేయడంలో ఆమె ఉద్దేశ్యం కూడా బహుశా, కాలం స్కాటిషు కవిహృదయాన్ని ఏ విధంగానూ ప్రభావితం చెయ్యలేకపోయిందని చెప్పడమే కావచ్చు. దాదాపుగా ఆ కవిత్వమంతా ఒక్కలానే ఉంది, ఆ కవితలన్నిటిలోనూ అదే అందం, అదే అమాయికత్వం.

పుస్తకానికి జాకీ కే రాసిన ముందుమాటలో Poetry, both oral and written, is the national art of Scotland అని రాసారు. ఈ మాట ఇంతకు ముందు ఒక మధ్యాసియా కవిత్వసంకలనంలో కూడా చదివాను. కవిత్వం మధ్యాసియాదేశాల సొత్తు అని. ఒక బ్రెజీలియను కవిత్వసంకలనంలో కూడా చదివాను, బ్రెజిల్లో అందరికన్నా అత్యధిక గౌరవానికి, ప్రేమకి నోచుకునేది కవులేనని. ఏ దేశానికి ఆ దేశం ఇలా అనుకోవడం చాలా బాగుంటుంది. అందులోనూ ఒక సంకలనం తెరవగానే మొదటి పేజీలోనే ఇటువంటి వాక్యం కనిపించాక ఆ పుస్తకం హృదయానికి దగ్గర కాకుండా ఎలా ఉంటుంది?

366 కవితలు. రోజుకొక్కటి చొప్పున ఏడాది పాటు చదువుకుంటూ ఉండవలసిన కవితలు. అప్పుడే మూడు నెలల కవితలు చదివేసి నాలుగో నెలలో అడుగుపెట్టాను. స్కాట్లాండు నుంచి తెచ్చిన తాజాపూలగుత్తి లాగా ఉంది. మనం పొద్దున్నే ఏటిఒడ్డుకో, తోటదాపుకో నడుచుకుంటూ వెళ్ళివచ్చినప్పుడు, ఆ పూలగాలీ, ఆ పచ్చిగాలీ ఇంకా మనల్ని అంటిపెట్టుకుని ఉండగానే, వస్తూ వస్తూ ఊరికినే రాలేక, దారిలో కనబడ్డ నాలుగు పూలు తెంచుకుని మరీ వస్తామే, అలానే ఇందులోంచి రెండు కవితలు తెలుగులోకి తెంపి మీకు అందివ్వకుండా ఎలా ఉండగలను?

హ్యూ మెక్ డెర్మిడు (1892-1978) ఇరవయ్యవ శతాబ్దపు స్కాటిషు కవిత్వ వైతాళికుల్లో ఒకడు. ప్రకృతి ప్రేమికుడు. ఆయన కవిత చూడండి:

చిన్ని తెల్లగులాబి

(జాన్ గావ్స్వర్తికి)

మొత్తం ప్రపంచపుగులాబీతో
నాకు పనిలేదు.
నేను కోరుకునేది
స్కాట్లాండ్ లోని చిన్ని తెల్లగులాబి.
అది ఘాటుగా, తీపిగా పరిమళిస్తూనే
హృదయాన్ని కోసేగలదు.

రాబర్టు లూయీ స్టీవెన్సన్ (1850-1894) పేరు వినని వారు ఎవరుంటారు? ఆయన ట్రెజర్ ఐలండ్ మన చిన్నప్పుడు ఇంగ్లిషు నాన్-డిటెయిల్డు రీడింగులో ఉండేదని మనమెలా మర్చిపోతాం? కాని అతడు గొప్ప బాలగేయాలు కూడా రాసాడు. చాలా మామూలు లోకంలోనే మార్మిక లోకాల్ని మేల్కొల్పగలకవి. ఈ కవిత చూడండి:

కొండదారుల్లో

కొండదారుల్లో, గ్రామసీమల్లో
మామూలు మనుషులు, వృద్ధులు కూడా
గులాబీరంగులో కనిపించేచోట
కన్నెపిల్లల నయనాలు
సవ్వడిచేయని చోట
గొప్ప నిశ్శబ్దమొకటి
మనల్ని పలకరిస్తూ
ఆశీర్వదిస్తుండేచోట
ఆ కొండలోయల్లో
ఆమె ప్రేమాస్పదసంగీతం
వినిపిస్తూంటుంది
అదృశ్యమవుతుంటుంది.

ఒకప్పుడు నేను తిరుగాడిన
ఆ పర్వతశ్రేణుల్ని
మళ్ళా ఎక్కాలని ఉంది
పక్షిగానాలకు
మంత్రముగ్ధలైపోయే
ఆ ఎర్రమలల్లో
పచ్చికబయళ్ళతో మిలమిల్లాడుతూ
ఎండిపోయినా కూడా
అగణితవర్ణాల్లో తళతళ్ళాడే
ఆ ఆకుపచ్చనిలోయల్లో
రాత్రి కాగానే
గ్రహతారకలు తళుకులీనుతో
లోయమొత్తం
దీపాలు వెలిగించినట్టుంటుంది.

ఓహ్! అక్కడ కలల్లో, మెలకువల్లో
ఆ నిశ్శబ్దసమ్మోహనంలో
సంతోషిస్తూ, తిరుగాడుతూ
ప్రశాంతంగా ఊపిరిపీలుస్తూ-

ఓహ్! అక్కడ ఆ పూలమధ్య
పచ్చికమీద
మహాచలత్ సౌందర్యమొకటి
వినిపిస్తూ తరలిపోతుంది
ఇంకక్కడ మిగిలేవి
నదులూ, గాలులూ
జీవితమూ, మృత్యువూ.

ఏంగస్ పీటర్ కాంప్ బెల్ (జ. 1952) సమకాలిక స్కాటిష కవుల్లో అగ్రశ్రేణి కవుల్లో ఒకడు. ఆయన కవిత చూడండి:

దేవుడు దయామయుడు

ఒద్దిగ్గా కుదురుకుని
జీవితప్రయాణం మొదలుపెడతావు.

దేవుడు దారిలో ఎక్కడో
ఈ దుమ్ములో ఇంత ప్రాణం ఊదిపెడతాడు.

అప్పుడు నీకేదో ఒక క్షణంతో, స్త్రీతో, కాగితంతో, కవితతో
లంకె కలుస్తుంది.

30-1-2023

గురుస్థానం

తుంచెన్ పండగకి వెళ్ళినప్పుడు తొంభై ఏళ్ళ వాసుదేవన్ నాయరును కలుసుకోవడం ఎంత సంతోషం కలిగించిందో, ఇరవై, ఇరవై రెండేళ్ళ సామజని కలుసుకోవడం కూడా అంతే సంతోషంగా అనిపించింది. ఇంకా చెప్పాలంటే అంతకన్నా ఎక్కువ సంతోషంగా అనిపించింది.

భారతీయసాహిత్యంలో ఎనభయ్యేళ్ళ, తొంభై ఏళ్ళ వృద్ధులు చేసిన సాహిత్య కృషి అమోఘం, నిరుపమానం. ఉదాహరణకి కేరళలో ఎం.టి వాసుదేవన్ నాయరు, తగళి శివశంకర పిళ్లై వంటి పేర్లు వినని వారుండరు. నేను మేల్పత్తూరు వెళ్లడానికి రోడ్డు కూడా సరిగా లేని కేరళ గ్రామాల్లో దారి వెతుక్కుంటూ ఉండగా కలిసిన ప్రతి ఒక్కరికీ తుంచెన్ పండగ అంటే ఏమిటో తెలుసు, ఎం.టి.వాసుదేవన్ నాయరు అంటే ఎవరో తెలుసు. కాని ఆ తర్వాతి తరం వారు అంటే నా తరానికి చెంది అరవైల్లో అడుగుపెడుతున్నవాళ్ళం మా ముందు తరం చేసినంత కృషి చెయ్యలేదనే చెప్పాలి. వాళ్ళలాగా బహుముఖీన ప్రజ్ఞతో ప్రజాజీవితాన్ని ప్రభావితం చెయ్యగల సాహిత్యసృజన మేము చెయ్యలేకపోయాం. ఇప్పుడు నా ఆశ నా తర్వాతి తరాల మీద ఉంది. ఇప్పుడు తమ నలభయ్యోల్లో ఉన్నవాళ్ళూ (అంటే 1981 నుంచి 1996 మధ్యలో పుట్టినవాళ్ళు, వీళ్ళని మిలీనియల్సు అంటున్నారు), వాళ్ళ తర్వాతి తరం, అంటే ఇప్పుడు ఇరవయ్యల్లో అడుగుపెట్టినవాళ్ళూను (1997 తర్వాత పుట్టినవాళ్ళు, వీళ్ళని జనరేషన్ జడ్ అంటున్నారు).

ఈ కొత్త తరం యువతీయువకులు, అంటే మిలీనియల్సూ, జెన్-Z ఈ రెండు తరాలూ అద్భుతమైన శక్తియుక్తులున్నవాళ్ళు. సాహిత్యం ఒక్కటే కాదు, ఏ సృజనాత్మక రంగంలోనైనా వీరు తమ ప్రతిభను చాలా సునాయాసంగా తీర్చిదిద్దుకోగల నైపుణ్యం

ఉన్నవాళ్ళు. నేను ఎంతో ఆశగా చూస్తున్నది వీళ్ల వైపే. అందుకనే ఈ తరాలకు చెందిన యువతీ యువకులు పాల్గొనే ఏ సాహిత్యసమావేశానికిగాని, లేదా ఏ వర్కుషాపుకి గాని వెళ్ళాలంటే నాకెంతో ఉత్సాహంగా ఉంటుంది. వీళ్ళల్లో చాలామంది ప్రతిభావంతుల్ని సినిమా ఇప్పటికే తన కబంధహస్తాల్తో దగ్గరకు లాక్కుంటోంది. ఆ పట్టుకి చిక్కకుండా ఎవరు మిగిలినా వారిని సాహిత్యం పేరుచెప్పి కాపాడుకోవాలనిపిస్తుంది.

సామజ అటువంటి జెన్-Z అమ్మాయి. ఆమె ఇప్పుడు త్రివేంద్రంలో లా చదువుతున్నారు. ఇప్పటికే ఒక కవితాసంపుటి వెలువరించారు. ప్రభావర్మ ఆ పుస్తకానికి ముందుమాట రాసారు. ఆమె తుంచెన్ పండగలో పాల్గోడానికి వచ్చారు. నా దగ్గరకు వచ్చి పరిచయం చేసుకున్నారు. ఆమెని మళయాళం గురించీ, ఆమెకి ఇష్టమైన కవుల గురించీ అడుగుతుంటే అన్ని ప్రశ్నలకీ ఎంతో వివరంగా జవాబులు చెప్పారు. మీకు ఇష్టమైన కవి ఎవరు అని అడిగితే, ఆమె వాయలార్ రామవర్మ పేరు చెప్పారు. ఆయన కవిత ఏదైనా వినిపిస్తారా అని అడిగితే వెంటనే ఒక పద్యం వినిపించారు. రామవర్మ సినిమా కవి అయినా కూడా అతడి సినిమా పాట వినిపించలేదు ఆమె. ఒక నవయువతి తన భాషలో ఒక కవి పద్యం వినిపించడం- ఇలా తెలుగులో ఎవరు వినిపించినా నేను జీవితకాలం వారికి అభిమానిగా మారిపోగలను.

కాని ఆమె దృష్టి మళయాళం గురించి నాకు చెప్పడం మీద లేదు. తెలుగు సాహిత్యం గురించి నా ద్వారా తెలుసుకోవడం మీద ఉంది. ఆమెకి కొంత చెప్పగలిగాను. నా చేతుల్లో కాటూరి వెంకటేశ్వరరావుగారి 'కావ్యమాల' ఉంది. 'ఈ పుస్తకం మీకు అర్థం కాకపోవచ్చు. కాని తెలుగు కవిత్వం మొత్తం మీ చేతుల్లో పెడుతున్నాను అనుకోండి' అని ఆ పుస్తకం ఆమెకి కానుక చేసాను.

నేను తిరిగి వచ్చాక, ఆమె ఆ తుంచెన్ పరంబు సందర్శించినప్పటి తన అనుభూతిని మళయాళంలో ఒక కవితగా రాసి పంపించారు. దాని అర్థం ఇంగ్లిషులో వివరిస్తూ. ఆ అర్థాన్ని పట్టుకుని ఆ కవితను ఇంగ్లిషులోకి అనువదించమని అడిగాను. అక్కడక్కడ నేను చిన్నపాటి సాయం చేసాను. ఆ కవితని మళయాళంలోనూ, ఆమె చేసిన ఇంగ్లిషు అనువాదం లోనూ ఇక్కడ పంచుకుంటున్నాను.

The Place of My Guru

This is not a goodbye. I'm letting the world know I'm
here.

I hope I will come back again and again.
The scent of each spring lasts until the next one arrives.
My Guru's yard.
My journey until now, and all my future journeys
Get to the root of this tree
Let the leaves shed in my journey turn sweet

I wonder how long my guru walked on this sand!
It was under this shade that he met his disciples,
I sit here tossed by the waves of milky nights
Longing for the song of a bird

The Bheeshma of our times is here
'Silence is not an ornament in difficult times' he said
True, he touched the soul of Bheema, the rebel

Oh! Great poetic culture!
You have expatriated the rajneethi down the ages that once expatriated the poets
Let me draw a drop of oil
From your 'chakk'

Let me light it up.
I stay here bearing the scent of the spring yearning to touch
The quill pen that was used by our first poet.

ఈ కవితకు నా తెలుగు అనువాదం:

గురుస్థానం

ఇది వీడ్కోలు కాదు, నేనిక్కడ ఉన్నానని లోకానికి చెప్పడం
మళ్ళా మళ్లా ఇక్కడకి రావాలని కోరుకుంటున్నాను
వసంతం ఒకసారి వచ్చాక ఆ సుగంధం మరువసంతందాకా
నిలిచే ఉంటుంది.

నా గురుస్థానం.
ఇప్పటి నా ప్రయాణం, రానున్న మరెన్నో ప్రయాణాలు

ఈ వృక్షమూలానికి చేరుకోటానికే.
నా ప్రయాణ ఛిన్నపత్రాలు తీపెక్కాలని కోరుకుంటున్నాను

ఎంతకాలం పాటు నా గురువు ఈ ఇసుకమీద నడిచాడో కదా
ఈ చెట్టునీడనే ఆయన తన శిష్యుల్ని కలుసుకున్నాడు
పాలపుంత కెరటాల్లో తడుస్తూ కూచున్నాను నేనిక్కడ
ఒక చిలుకపాట కోసం ఎదురుచూస్తూ.

మా కాలం నాటి భీష్ముడున్నాడిక్కడ
ఎంత ధైర్యంగా చెప్పాడాయన
కఠిన సమయాల్లో మౌనం ఒక ఆభరణం కాదని.
నిజం, ఆయన భీముడిలో విప్లవకారుణ్ణి పట్టుకోగలిగాడు.

ఓ నా మహనీయ కవితా సంస్కృతీ!
ఒకప్పుడు కవుల్ని బహిష్కరించిన రాజనీతిని నువ్వు
కాలం అంచులదాకా బయటికి నెట్టేసావు.
నీ నూనె గానుగ నుంచి
ఒకింత తైలం తీసుకోనివ్వు నన్ను.

నా దీపం వెలిగించుకోనీ.
నా ఆదికవి చేత్తో పట్టుకున్న గంటాన్ని
ఈ వాసంత సుగంధాన్నిట్లా తలదాల్చి
నన్ను కూడా పట్టుకోనివ్వు.

23-2-2023

రిల్కె: బుద్ధుడు

బైరాగి 'ఆగమగీతి' 1983 లో వచ్చింది. నలభయ్యేళ్ళయింది ఆ పుస్తకాన్ని మొదటిసారి చేతుల్లోకి తీసుకుని. అందులో ప్రతి ఒక్క కవితనీ ఎన్నిసార్లు చదివివుంటానో లెక్కలేదు. అందులో ఆయన అనువాదకవితలు కూడా ఉన్నాయి. బహుశా శ్రీశ్రీ తరువాత యూరపియను కవుల్ని అంతగా అనువదించి పరిచయం చేసిన కవి బైరాగినే అనుకుంటాను. కాని పాల్ యులార్డ్ తప్ప శ్రీశ్రీ, బైరాగీ ఇద్దరూ అనువదించిన యూరపియను కవులెవరూ లేరు. కాగా ఇలియటు, గిలాం అపొలినారు లాంటి మాడర్నిస్టు కవుల్ని శ్రీశ్రీ ఎప్పటికీ అనువదించి ఉండేవాడు కాదు. అలానే సుమిత్రానందన్ పంత్, బాల సీతారాం మర్ఢేకర్, విందా కరందీకర్, జీవనానందదాస్ లాంటి భారతీయ కవుల్ని కూడా శ్రీశ్రీ అనువదించి ఉండేవాడు కాదు. ఎలా చూసినా, శ్రీశ్రీ అనువాదాల్లో వదిలిపెట్టిన ప్రపంచాన్ని బైరాగి పూర్తిచేసాడు. నా వరకూ ఆ ఇద్దరూ ప్రపంచానికి తెరిచిపెట్టిన రెండు కిటికీల్లాగా ఉండేవారు.

ఆగమగీతిలోని అనువాద కవితల్లో రిల్కె కవితలు కూడా మూడున్నాయి. బహుశా రిల్కెని తెలుగులోకి అనువదించిన మొదటి కవి బైరాగి అనే అనుకుంటున్నాను. మరెవరైనా, శేషేంద్ర, ఇస్మాయిల్ వంటివారు అనువదించారేమో నాకు తెలియదు, కాని వాళ్ళు అనువదించినా బైరాగి తర్వాతే. ఆ మూడు కవితలూ నేనెన్ని సార్లు చదువుకుని ఉంటానో చెప్పలేను.

ఇవాళ ఒక మిత్రురాలు అడిగారు: 'నిర్వికల్ప సంగీతం'లో రిల్కె కవితలు ఎందుకు లేవు అని. అందులో జర్మనుకవిత్వానికి ప్రతినిధిగా, గొథే రాసిన 'ప్రొమీథియస్ 'కవితను అనువదించాను. రిల్కెను నేను అప్పటికి అర్థం చేసుకోగల స్థితిలో లేను. ఆశ్చర్యమే,

గొథేని అనువదించానుగాని, రిల్కను అర్థం చేసుకోలేకపోయాను అని చెప్పడం. కాని అది నిజమే. గొథే వంటి క్లాసిసిస్టు, షెల్లీ వంటి రొమాంటిసిస్టు, నెరుడా వంటి సోషలిస్టు అర్థం కావడానికి పెద్ద ప్రయత్నం అక్కర్లేదు. వారి కవిత్వం emotionally charged utterance కాబట్టి, అది నేరుగా హృదయంలోకి ప్రవేశిస్తుంది. కాని రిల్క? అతణ్ణి ఏమని పిలవాలి?

అప్పటికి నాకు తెలిసి తెలుగు కవిత్వమంటే రెండురకాల అభివ్యక్తి మాత్రమే. అనుభూతిని ప్రకటించడం లేదా అభిప్రాయాలు ప్రకటించడం. ఎవరో ఇస్మాయిల్ వంటివారు ఇమేజిస్టు ధోరణిలో పదచిత్రాల్ని పట్టుకోడానికి ప్రయత్నిస్తుండేవారు. కాని రిల్క రాసిన Buddha అనే కవితకి బైరాగి చేసిన అనువాదం చదివినప్పుడు అందులో అనుభూతికన్నా, అభిప్రాయప్రకటనకన్నా, పదచిత్రాలకన్నా భిన్నమైందేదో కనిపించింది. ఎంత ప్రయత్నించీ అదేమిటో బోధపరుచుకోలేకపోయాను. ఆ కవితను ఈ నలభయ్యేళ్ళలో వందసార్లేనా చదివి ఉంటాను. కాని ఎప్పటికప్పుడు అది నాకు అందుతూనే అందకుండా జారిపోయేది.

ఇప్పుడు ఇన్నాళ్ళకు సాహసించి ఈ కవితను నేను కూడా తెలుగు చేసాను. బైరాగిని దాటి చెయ్యగలనని కాదు, బైరాగి అనువదించిన కవితను నేను కూడా అనువదించానని నాకు నేను చెప్పుకోడానికి.

రిల్క బుద్ధుడి మీద మూడు కవితలు రాసాడు. New Poems (1907) లో Buddha పేరు మీద రెండు కవితలు, New Poems: Other Part (1908) లో Buddha in Glory పేరుమీద మరొక కవిత. ఇక్కడ Buddha అనే మొదటి కవితనే బైరాగి అనువదించాడు.

అందులో cat అనే ఇంగ్లిషు పదం జర్మన్లో 'జంతువు' (tier) అని మాత్రమే ఉంది. నా అనువాదంలో ఆ పదాన్ని పూర్తిగా వదిలేసాను. కాని బైరాగి దాన్ని 'గంభీర ధీర మృగం' అని అనువదించడం గమనించాలి.

బుద్ధుడు

అతడేదో విన్నట్టే వుంది. నిశ్చలం, సుదూరం...
మనం ఉలిక్కిపడి–దాన్ని పట్టించుకోడం మానేస్తాం.
అతడో బృహత్తార. మనం చూడలేని అసంఖ్యాక
తారాసముదాయం ఆయన చుట్టూ నిలబడి ఉంది.

అతడు సమస్తం. మనమిక్కడ ఎదురుచూస్తున్నది
ఆయన మనల్ని చూడాలనేనా? ఆయనకేం పని?
మనం కట్టకట్టుకుని ఆ పాదాలముందు పడినా,
విశ్రాంతిగా, ప్రశాంతిగా కనులరమోడ్చి ఉండగలడు.

మనల్ని ఆ పాదాలకు చెంతకు లాక్కుని వచ్చిందేదో
వేలవత్సరాలుగా ఆయనలో పరిభ్రమిస్తున్నదే.
జీవితం మనలో ఉద్రేకిస్తున్నదాన్ని మరిచినవాడుగా
మనం నోచుకోని వివేకాన్ని ఆయన నిండుగా జీవిస్తున్నాడు.

10-5-2023

కవిత్వంలో మంత్రశక్తి

కవిత్వంలో మంత్రశక్తి ఎలా వస్తుంది? మొదటిది శబ్దబలం వల్ల. ఇది మనందరికీ తెలుసు.

వలయవిచలద్విహంగాలో
విలయసాగర తరంగాలో
యుద్ధగుంజన్మృదంగాలో
కవీ! నీ పాటల్!

లాంటి మాటల్లో ఉన్నదిదే.

రెండవది, భావతీవ్రత వల్ల. కవిత్వమంటే ఒక charged utterance అని ఎవరైనా చెప్పగలరు. ఒక inspired utterance కూడా. దీన్నే ఇస్మాయిల్ గారు తీవ్రీకరణ అన్నాడు. బల్బులోని ఫిలమెంటు తీవ్రీకరణ చెందడం ద్వారా కాంతినివ్వగలిగినట్టే, అనుభవం లేదా అనుభూతి తీవ్రీకరణ చెంది, కవితా వాక్యంగా మారుతుంది అన్నాడాయన.

గతమంతా తడిసె రక్తమున
కాకుంటే కన్నీళ్ళులతో

అనే వాక్యం అలా తీవ్రీకరణ చెందిన అనుభూతినే.

మూడవది, అపూర్వమైన భావాలంకారాల వల్ల. దీన్నే మనం metaphor అంటున్నాం. ఆధునిక, సమకాలిక యూరపియను కవిత్వం ప్రధానంగా మెటఫరు మీదనే ఆధారపడి ఉంది. ఎందుకంటే, మామూలుగా కవిత్వానికి భాషవల్ల, కాలంవల్ల, దేశం

వల్ల ఏర్పడే పరిమితుల్ని మెటఫరు సునాయాసంగా దాటగలుగుతుంది. అనువాదం అయిన తర్వాత కూడా కవితని కవితగా బతికించగలుగుతుంది.

అతని దీపం..
కత్తిగంటుమీద
నెత్తుటిబొట్టులాగున్నది.

అన్నప్పుడు ఆ మెటఫరు ఏ భాషలోకి ప్రయాణించినా పాఠకుల్ని చకితుల్ని చేయగలదు.

కాని, వీటన్నిటినీ మించిన మరొక విద్య ఉంది. అది అనుభవాన్ని లేదా అనుభూతిని కేవలం శబ్దాలంకారాలతోనో లేదా అర్థాలంకారాలతోనో కాకుండా లేదా తన భావాల్ని తీవ్రీకరణ చెందించడం ద్వారా కాకుండా, ఒక అత్యున్నత సమాధిస్థితిద్వారా మనకి కమ్యూనికేటు చెయ్యడానికి ప్రయత్నించడం. హైకూ కవులు చేసిందిదే. కాని ఆ సమాధి స్థితిలో సత్యం వారికి ఒక మెరుపులాగా తటిల్లున బోధపడి పక్కకు తప్పుకుపోతుందిగాని, అక్కడే మరికొంతసేపు నిలుచుని మనతో సంభాషించదు.

సత్యాన్ని దర్శించిన తర్వాత మనతో ఒక సంభాషణ మొదలుపెట్టగల కవిత్వం ఎంతో సమర్థవంతమైందీ, శక్తిమంతమైందీ అయితే తప్ప నిలబడటం కష్టం. ఆధునిక ఇంగ్లిషు కవులు, ముఖ్యంగా ఇలియటు లాంటివాళ్ళు, ఈ రహస్యాన్ని గుర్తించారుగాని, చాలాసార్లు వాళ్ళ కవిత్వం సంభాషణగానే మిగిలిపోతుంది. భాషాతీత స్థితికి చేరుకున్నాక కూడా వాళ్ళు భాషని వదల్లేకపోవడం దానికి కారణం. అదే ఒక శిల్పం చూదండి. అది మనతో మాట్లాడుతుంది, కాని భాషతో పనిలేదు దానికి. తన పాదార్థిక అస్తిత్వం వల్లనే అది శిల్పంగా నిలబడుతున్నది కానీ, ఆ పదార్థం ఒక వాహకం మాత్రమే. మనతో మాట్లాడేది ఆ పదార్థం కాదు. అలా ఒక శిల్పంలాగా మనతో మాట్లాడగల కవితని ఊహించండి. అటువంటి కవిత్వం తెలుగులో దాదాపుగా అరుదు.

కాని రేనర్ మేరియా రిల్కె అటువంటి కవి. ఆయన కొన్నాళ్ళు ఫ్రెంచి మహాశిల్పి రోడే దగ్గర పనిచేసాడు. రోడే రిల్కె కవిత్వాన్నే ఒక శిల్పంగా మార్చేసాడని నేను చిన్నప్పుడు చదివినప్పుడు నాకు ఆ వాక్యాలు అర్థం కాలేదు. కాని గత పదిపదిహేనేళ్ళుగా రిల్కె కవిత్వం నాకొక మహాసముద్రంలాగా, నీలాకాశంలాగా కనిపిస్తూ ఉన్నది. నాలో సుళ్ళు తిరిగే భావసంచలనాన్ని కవితగా మార్చాలనుకున్నప్పుడల్లా నేను రిల్కె కేసి చూడకుండా ఉండలేను. ఒక విధంగా చెప్పాలంటే నేను రిల్కెకి శిష్యుణ్ణి, రోడేకి ప్రశిష్యుణ్ణి.

శిల్పంలాంటి కవిత ఎలా ఉంటుందో మీరు కూడా చూడాలనుకుంటున్నారు కదా. ఇదుగో, ఈ కవిత చూడండి. వేసవి కాలంలో వాన పడేముందటి వాతావరణాన్ని పట్టుకోడానికి ప్రయత్నించిన ఈ కవిత, ఎన్ని సార్లు చదివినా నాకు కొత్తగానే ఉంటుంది. ప్రక్రియ రీత్యా ఇది సానెట్టు. కాని పెట్రార్కు, షేక్స్పియరు, మిల్టను, స్పెన్సరులకన్నా భిన్నంగా, సరళంగా, సూటిగా, వచనకవితలాగా కనిపించడం రిల్కె కౌశల్యం.

వేసవిలో వాన పడే ముందు

ఉన్నట్టుండి పార్కులోని ఆకుపచ్చదనమంతట్లోంచీ
అదేదో–నువ్వు ఇతమిత్థంగా చెప్పలేనిది–అదృశ్యమైపోయింది.
ఇప్పుడు ఆ పార్కు నీ కిటికీ దగ్గరగా జరిగి
నిన్ను మౌనంగా పరికిస్తున్నట్లుంది. తోటలోంచి

నీటిపిచుక ఒకటి పాట పాడుతుంది.
ఉద్రిక్తంగా, బలంగా వినిపించే దాని స్వరం
మహనీయ పరివ్రాజకుల్ని గుర్తుకు తెస్తుంది. కురవబోయే
కుంభవృష్టి ఆ స్వరంలో వినిపించే ఆ ఏకాంతదీక్షకి

చెవొగ్గుతుంది. మనం మాటాడుకుంటూ ఉంటే తాము
వినకూడదన్నట్టు ఆ పెద్ద హాలు గోడలు దూరంగా జరిగిపోతాయి,
వాటితో పాటే వాటికి వేలాడే చిత్రాలు కూడా.

అపరాహ్ణవేళల్లో పరుచుకునే అస్పష్టమైన వెలుగు ఒకటి
ఆ వెలిసిపోయిన పరదాలమీద ప్రతిఫలిస్తూంటుంది.
దాన్ని చూసే నీ చిన్నప్పుడు నువ్వు భయపడుతుండేది.

20-5-2023

వెళ్ళిపోతున్న వసంతం

పొద్దున్నే ఇంకా తెల్లవారకుండానే కోకిల ఒకటే గీపెడుతూ ఉంది. ఆ పిలుపు భరించడం కష్టంగా అనిపించింది. ఆ పిలుపులో ఏదో దిగులు, ఆపుకోలేని ఆత్రుత ఉన్నాయి. కాని లేవబుద్ధి కాలేదు. నాకు తెలుస్తూనే ఉంది, కోకిల దేనికి అంతలా తన నెత్తీ నోరూ మొత్తుకుంటోందో.

ప్రపంచంలో గొప్ప జాలి, దిగులు కలిగించే దృశ్యాలు కొన్నుంటాయి. పండగ అయిపోయాక ఇంటిముంగిలి, నాటకం వేసి తెరలు విప్పేసిన రంగస్థలం, అప్పటిదాకా కూచుండి, ఎన్నో కబుర్లు చెప్పి, సెలవు తీసుకుని మిత్రులు వెళ్ళిపోయాక ఖాళీ అయిపోయిన గది- ఇట్లాంటి దృశ్యాలు ఎటువంటి వెలితిని, శూన్యాన్ని తోపింపచేస్తాయో, వసంతం వెళ్ళిపోయే వేళ కూడా అలాంటి బెంగనే రేకెత్తిస్తుంది.

ఒకప్పుడు తాంగ్ సామ్రాజ్యం రాజధాని చాంగాన్ ముట్టడిలో చిక్కుకుపోయినప్పుడు దు-ఫుకి కలిగిన దిగులు అలాంటిదే. ఆ రోజుల్లో అతను నది ఒడ్డున నిలబడ్డప్పుడు ముట్టడిలో చిక్కుకుపోయిన నగరమూ, ఆ నగరంలో చిక్కుకుపోయిన తన జీవితమూ- రెండూ కూడా వసంతం వెళ్ళిపోతున్నప్పటి విషాదాన్నే మదిలో రేకెత్తిస్తున్నట్టు గుర్తుపట్టాడు. కాని ఆ నది ఒడ్డున పూల గుబుర్లలో ఇంకా కదలాడుతున్న సీతాకోకచిలుకలు, నదీజలాల మీద వాలి, పైకి లేస్తున్న తూనీగలు-వాటిని చూడగానే గొప్ప సాంత్వనకు లోనయ్యాడు. వెంటనే రెండు కవితలు చెప్పాడు. వాటినే కోకిల ముక్కున కరుచుకొచ్చి తెల్లవారకుండానే నా కిటికీ దగ్గర బిగ్గరగా వినిపించింది అని మొత్తానికి గుర్తుపట్టాను. ఇదిగో, ఇప్పుడు మీతో పంచుకుంటున్నాను. మొదటికవితలో వసంతం వెళ్ళిపోతున్న దిగులు ఉంది. రెండవ కవిత గొప్ప దుఃఖంతో మొదలయ్యిందిగానీ, అపురూపమైన కాంతిసంతకంతో ముగిసింది.

దు-పు

ఒంపులు తిరుగుతున్న నది ఒడ్డున : రెండు కవితలు

1

రాలుతున్న పూలు వసంతం వెళ్ళిపోతోందని గుర్తుచేస్తున్నాయి
గాల్లో తేలివస్తున్న పూలరేకలు తీవ్ర దుఃఖాన్ని మోసుకొస్తున్నాయి.

ఎగిరిపోతున్న పూలనిట్లా చూడగలిగినంతసేపు చూద్దాం
పదివేల దుఃఖాలున్నాసరే పానపాత్రలు దూరం చేసుకోవద్దు.

నది ఒడ్డున గుళ్ళో లకుముకిపిట్టలు గూళ్ళు కట్టుకున్నాయి
మరుభూమివైపు పూలదారిన పురాణశిల్పాలు పడివున్నాయి.

విషయాలెట్లా నడుస్తున్నవో చూసాం, మన వెతుకులాట ఆపవద్దు
కీర్తిప్రతిష్ఠలకోసం పాకులాడింది చాలు, పట్టుకు వేలాడొద్దు.

2

రోజూ కొలువునుంచి వస్తూనే నా దుస్తులు కుదువపెట్టుకుంటాను
నదినుంచి వచ్చేటప్పటికి చిత్తుగా తాగి ఉంటాను, డబ్బులుండవు.

తాగడానికి చేసిన అప్పుల్తో నన్ను పలకరించని పానశాలలేదు
అలాగని డెబ్భై ఏళ్ళు దాటి బతికి ఉంటానన్న నమ్మకం లేదు.

పూలగుబుర్లలో సీతాకోకలు దాగుడుమూతలాడుతున్నాయి.
నిశ్చలజలాలమీద వాలి తూనీగలు తిరిగి పైకెగురుతున్నాయి

ఈ రెక్కలజతకత్తెల్తో నాట్యమాడమని ఋతువును వేడుకుంటాను
ఈ క్షణాలు మిగిలినంతకాలం వసంతం వెళ్ళిపోలేదనుకుంటాను.

27-5-2023

ఒక చక్కెర బిడారు

మొన్న బెంగుళూరు వెళ్ళినప్పుడు 'బుక్‌వార్మ్'లో కొన్న పుస్తకాల్లో The Pocket Rumi (శంభల, 2018) కూడా ఒకటి. గత ఇరవయ్యేళ్ళుగా ఇంగ్లిషులో వచ్చిన ప్రతి ఒక్క రూమీ అనువాదం నాదగ్గర ఉంది. ఇది 2001 లో కబీర్ హెల్మిన్‌స్కి చేసిన అనువాదం, సంకలనం. ఇన్నాళ్ళు ఇది నా కంటపడకుండా ఎలా ఉందో అర్థం కాలేదు.

కబీర్ హెల్మిన్‌స్కి సంకలనం చేసిన The Rumi Collection (శంభల, 2000) రూమీ పట్ల నాకు తృష్ణ కలిగించిన మొదటి పుస్తకం. ఆ సంకలనం గురించి అప్పట్లోనే ఒక వ్యాసం కూడా రాసాను. ఆ తర్వాత ఎన్ని పుస్తకాలు. ముఖ్యంగా ఎ.జె.ఆర్బెర్రీ, కోలమన్ బార్క్స్, ఆంద్రూ హార్వే, రాబర్ట్ బ్లై-ఒకరా, ఇద్దరా! రూమీ అనువాదకులు రూమీ సామ్రాజ్యాన్ని ప్రపంచమంతా విస్తరింపచేస్తూనే ఉన్నారు.

ఈ అనువాదకులు రూమీలో మరేదన్నా కలిపి ఒక మత్తుమందు తయారు చేస్తున్నారా అని అనుమానమొచ్చి నికల్సనునీ, కోలమన్ బార్క్సునీ దగ్గరపెట్టుకుని కొన్ని పేజీలకు పేజీలు పోల్చి చూసుకున్నానొకసారి.

ఉహుం. రూమీ ఒక చక్కెర బిడారు.

ఇప్పుడు మళ్ళా ఈ పుస్తకం తిరగేస్తున్నా కూడా మళ్ళా అదే మాదకత్వం. భగవత్సమ్మోహకత్వం.

> We are drinking the water of Khidr
> from the river of the speech of the saints

అంటున్నాడు రూమీ మత్నవీలో. ఖిదర్ అంటే దేవదూత. సాధుసత్పురుషులకు పెద్దదిక్కు. భగవంతుణ్ణి కనుక్కోగల విద్యనేర్పే సద్గురువు. సాధువచనమనే నదీజలాలనుండి ఆ దేవదూత అందించే జీవజలాల్ని గ్రోలుతున్నామని చెప్తున్నాడు రూమీ. రూమీలో ఈ రెండూ జలాలూ ఉన్నాయి. ఆయన కవిత్వం సాధుసత్పురుషుల వచనప్రవాహంలోంచి ఏరితెచ్చుకున్న అనుగ్రహ జలం. అందుకనే ఆ జలాన్ని మనమీద ఈ అనువాదకులు ఇంత చిలకరించినా కూడా మనకొక పుణ్యాహవాచనం పూర్తయినట్టే ఉంటుంది.

ఈ పుస్తకంలో మూడు భాగాలున్నాయి. మొదటి భాగం రుబాయీలనుండి ఏరితెచ్చిన కొన్ని అనువాదాలు. రెండవభాగం రూమీ గజళ్ళనుండి ఎంపికచేసిన కొన్ని కవితలు. కానీ పుస్తకం మొత్తంలో మూడింట రెండువంతులు మస్నవీ నుంచి చేసిన అనువాదాలు. అవన్నీ దాదాపుగా కబీరు హెల్మింస్కి చేసినవే. మస్నవీ ఒక సముద్రం అనుకుంటే, అందులోంచి ఏరి తెచ్చిన ప్రతి ఒక్క కవితా ఒక ముత్యం లాగా ఉంది. ప్రతి పుటలోనూ నిన్ను ఆపేసే వాక్యం- ప్రతి ఒక్క వాక్యాన్నీ మీతో పంచుకోవాలనిపిస్తున్నది. అన్నీ ఎత్తి రాయలేనుగానీ, కొన్ని చూడండి:

ప్రేమోద్యానవనంలో ఎల్లల్లేని పచ్చదనం
బాధానందాలు తప్ప తక్కినపండ్లన్నీ దొరికేచోటు
ప్రేమ ఆనందవిచారాలకి అతీతమైంది
వసంత హేమంతాలతో పనిలేని పచ్చదనం.

ప్రేమ అంటే సంతోషాలు పూచే తావు అనో, ఆనందామృతఫలాలు దక్కే చోటు అనో చెప్పవచ్చు. కానీ అలా చెప్పినవాడింకా మానవలోకపు పొలిమేర దాటనివాడే. బాధానందాలు తప్ప తక్కిన పండ్లన్నీ దొరికే తోటగా ప్రేమని గుర్తుపట్టగలిగేవాణ్ణి మాత్రమే మనం రూమీ అని గుర్తుపట్టగలుగుతాం.

ఈ వాక్యం చూడండి:

తెలిసినవాళ్ళంతా ఈ మాటే చెప్పారు:
ఒకడు భగవంతుణ్ణి తెలుసుకున్నాడంటే అర్థం
దేవుడు మనమీద ప్రేమ చూపించడానికొక దారిదొరికిందని..

నేను ఈ వాక్యాన్ని సరిగ్గా అనువదించలేకపోయాను. దీని అర్థమేమిటంటే, ఈ ప్రపంచంలో ఒక్క మనిషికి భగవంతుడు ఎరుకపడ్డా కూడా అతని ద్వారా భగవంతుడు తక్కినవారందరికీ దయగనూ, కరుణగానూ అనుభవానికొస్తాడని.

ఈ మూడు వాక్యాలు చూడండి:

> నేను జ్వలిస్తున్నాను
> మీరూ జ్వలించాలనుకుంటే, నిప్పుచాలకపోతే
> రండి, నాతో కలిసి రగిలిపొండి.

ఇది అన్ని అవస్థలకూ సరిపడా వాక్యం. టాగోరు ఒకచోట అంటాడు: 'హృదయం గడ్డకట్టిపోయినప్పుడు, నీ కరుణావర్షంతో నన్ను తడిపెయ్యి' అని. ఇది అటువంటి మాటే, వర్షానికి బదులు అగ్ని అంతే. కాని మనం గడ్డకట్టిపోయినప్పుడో లేదా రగలవలసినట్టుగా రగిలిపోలేకపోతున్నప్పుడో, ఒక టాగోరునీ, ఒక రూమీని ఆశ్రయిస్తే చాలన్నది, నాకే ఎన్నో సార్లు అనుభవానికొచ్చిన వాస్తవం.

కొన్ని వాక్యాలు చదువుతుండగానే మనం చేష్టలుడిగిపోతాం. అవి బుద్ధితోనో, చివరికి మనసుతోనో కూడా చెప్పగలిగే మాటలు కాదు. యథార్థమైన భగవత్ప్రేమోన్మత్తతలోంచి మాత్రమే అటువంటి మాటలు పుడతాయి. ఈ వాక్యం చూడండి:

He that is drowned in God wishes to be more drowned.

ఆళ్వారులకి ఈ సంగతి బాగా తెలుసు. అసలు ఆళ్వారు అంటేనే అర్థం మునిగిపోయిన వాడు అని కదా. నమ్మాళ్వారు కవిత్వం చదువుతూ ఉంటే, అప్పటికే మునిగిపోయినవాడు, మరింత మునిగిపోతున్న ప్రేమానుభవం ఎలా ఉంటుందో మనకి తెలుస్తూంటుంది.

ఈ పద్యం చూడండి. The Soul Garden అట.

> Just as the heart becomes carefree
> in a place of green, growing plants
> goodwill and kindness are born
> when our souls enter happiness.

ఒక మనిషి తన ఆత్మసన్నిధిలో ఉన్నాడనడానికి గుర్తు మనం అతడి సన్నిధికి వెళ్లగానే మనలో ఒక ప్రశాంతి, ఎంతో కొంత ప్రపంచోపశమనం అనుభవానికొస్తాయని పెద్దవాళ్ళు చెప్తారు. ఈ చిన్న కవితలో నాకు చాలా సంతోషం కలిగించింది ఆ పోలిక. మొక్కలూ, చెట్లూ పెరిగే చోట మనకి కలిగే సంతోషంలాగా మన ఆత్మలు వికసిస్తున్నప్పుడు దయ, మంచితనం వెల్లివిరుస్తాయనడం. అంటే ఒక మనిషి దయ చూపించగలుగుతున్నాడు అంటే అతడిలో ఆత్మ వికసిస్తోందన్నమాట. అతడి ఆత్మ ఉద్యానం పచ్చగా ఉందన్నమాట.

కొన్ని మాటలు రూమీ మాత్రమే చెప్పగలిగిన మాటలు. మనని చాలా ఇష్టపడేవాళ్ల దగ్గరికి వెళ్ళినప్పుడు వాళ్ళు మనకో విందు ఏర్పాటుచేసారనుకోండి. అప్పుడు మన మీద వాళ్ల ప్రేమ ఎలా ఉంటుందంటే, మనం వాళ్ళు పెట్టినవన్నీ తినాలనుకుంటారు, ఇంకా అడిగి మరీ తినాలనుకుంటారు, వాళ్ళు ఏడాదికి సరిపడా దాచుకున్నవన్నీ మనం ఆ ఒక్కరాత్రి ఆరగిస్తే చాలనుకుంటారు. తన కవిత్వపు బల్లమీద భగవత్ప్రేమను వడ్డించేటప్పుడు రూమీ చూపించే ఆత్రుత ఇటువంటిదే.

ఈ వాక్యం చూడండి:

So, quickly, increase your need, needy one,
that the sea of abundance
may surge up in loving kindness.

అంటే నువ్వు ఎంత అధికంగా తపిస్తే, ఆ దయాసముద్రం అంతగా పొంగి పొర్లుతుందట. ఎంత మంచివాళ్లయినా, మన మిత్రులు, బహుశా మనమీద ఒక రాత్రి విందులో మాత్రమే చూపించగల ప్రేమ భగవంతుడి విషయంలో జీవితకాల ప్రేమ, మరణానంతరం కూడా మనకు హామీగా నిలబడగల ప్రేమ. ఈ మాటలే మరో చోట ఇలా అంటున్నాడు:

Don't seek water, increase your thirst,
so water may gush forth from above and below.

మనం నీళ్ళ కోసం దప్పిపడ్డప్పుడు నీళ్ళు కూడా మనకోసం వెతుక్కుంటాయని రూమీ చెప్పిన మాట గతంలో మీతో పంచుకున్నాను. కానీ ఈ వాక్యం అంతకన్నా నాలుగడుగులు ఎక్కువ నడిచిన వాక్యం.

ఇదేమంటే, నువ్వు దప్పిపడ్డప్పుడు, నీళ్ళకోసం వెతుక్కోవద్దంట, నువ్వు చెయ్యవలసిందల్లా, మరింత దప్పిపడటమేనట. అప్పుడు, ఆకాశగంగా, పాతాళగంగా కూడా నువ్వున్న చోటికి పొంగిపొర్లుతాయట. ఈ మాటలు ఏదో అదాటుగా అన్నమాటలు కావు. ఆయన కవిత్వంలో పదే పదే వినబడే హామీలివి.

ఈ వాక్యాలు చూడండి:

దాహార్తుడు అరుస్తున్నాడు
నీళ్ళెక్కడ?

జలాలు పిలుస్తున్నాయి
దాహార్తుడెక్కడ?
నీళ్ళని అయస్కాంతంగా మారుస్తున్నది
మన దప్పికనే.

ప్రతి భక్తికవీ భగవత్ప్రేమకు సాక్షినే. కాని ఆ ప్రేమను తన సొంత ఆస్తి పంచినట్టు వెదజల్లడంలో మాత్రం రూమీని మించినవాళ్లు లేరు. పంచేకొద్దీ ఆ ఆస్తి తరిగిపోదనే ఆ నమ్మకం మామూలు నమ్మకం కాదు. ఒకచోట అంటాడు కదా:

Trust in God is the best livelihood.

జీవనోపాధి గురించిన ఈ నిజమైన ప్రేమవిద్య మరెక్కడా దొరికేది కాదు. మరి రూమీకి ఎలా దొరికిందంటే, ఆయనే ఒకచోట చెప్పుకున్నట్టుగా, ఆయన జీవితమంతా వెతుక్కున్నది ఆ ఒక్కదానిగురించే. అందుకని–

By speech and by silence and by fragrance
catch the scent of the king everywhere.

ఆ రాజాధిరాజపాదధూళిని ప్రతి అణువులోనూ పట్టుకోగలిగాడు కాబట్టే ఆయన పలికిన ప్రతి ఒక్క మాటా అంత పరిమళభరితమయ్యింది.

31-5-2023

ప్రేమభాషా కవి

ఏదైనా ఒక సంక్లిష్టమైన అనుభవాన్ని కవితగా మార్చాలనుకున్నప్పుడు నాకు దారి చూపించే కవుల్లో రిల్కె తర్వాత యెహుదా అమిహాయిని కూడా చెప్పుకోవాలి.

యెహుదా అమిహాయి (1924-2000) ఇరవయ్యవ శతాబ్దపు అత్యంత శక్తిమంతులైన కవుల్లో ఒకడు. జర్మనీలో పుట్టాడు. 1936 లో అతని తల్లిదండ్రులు పాలస్తీనాకు వచ్చేసారు. ఆ తర్వాత కొన్నాళ్ళు యుద్ధాల్లో, కొన్నాళ్ళు కళాశాలల్లో పనిచేసాడు.

ఒక యూదుగా అతడు పాతనిబంధన ప్రవక్తలకీ, సామగీతాలకీ, పరమోన్నతగీతానికీ వారసుడు. కానీ మన తెలుగు కవుల్లాగా గంభీరమైన పదజాలంతో వక్తృత్వశైలిలో కవిత్వం చెప్పకుండా ఉండటానికే జీవితమంతా సాధనచేసాడు. సాధారణమైన రోజువారీ వాడుక భాషలో, మామూలు పదాలతో కవితలు నిర్మించే ప్రయత్నం చేసాడు.

భాషలోని గంభీరమైన లయమీదా, సంగీతం మీదా కాకుండా, మానవానుభవాన్ని సూటిగా చెప్పడానికి ప్రయత్నించి నందువల్ల అతడి కవిత్వం అనువాదకుల స్వర్గం. ఎంత మామూలు అనువాదకుడు అనువదించినా కూడా ఆ కవితలు సులభంగా, సరళంగా మరొక భాషలోకి ప్రవహించగలుగుతాయి. అందువల్లనే పాశ్చాత్యప్రపంచంలోనే కాదు, చీనాలోనూ, జపానులోనూ కూడా యెహుదా అమిహాయి కవిత్వానికి అభిమానులు కొల్లలు.

అమిహాయి మామూలు రోజువారీ పదాల్తో కవిత చెప్పినంతమాత్రాన ఆ కవితలో భాషావిన్యాసం తక్కువేమీ కాదని హీబ్రూ పండితులు చెప్తున్నారు. ప్రతి ఒక్క పదాన్ని ఆయన ఎంతో ఆచితూచి ప్రయోగిస్తాడనీ, దానివెనక మూడువేల ఏళ్ళ యూదీయ సంఘర్షణ మొత్తం ఉంటుందని మర్చిపోకూడదని కూడా వాళ్ళు చెప్తున్నారు.

కాని బయటి పాఠకుణ్ణి చప్పున ఆకట్టుకునేవి అతడి రూపకాలంకారాలు. ఇంకా చెప్పాలంటే భావాలంకారాలు. ఒక్కో కవితలో ఒక మెటఫరు కన్నా ఎక్కువ ప్రయోగించడు. ఆ కీలకమైన భావాలంకారం చుట్టూ కవితని చాలా బిగువుగా నిర్మిస్తాడు. అలవోకగా రాసాడనిపించే ఆ తక్కినవాక్యాల్లో అనితరసాధ్యంగా ఉండే ఆ బిగువు వల్ల, ఆ మెటఫరు దగ్గరకు వచ్చేటప్పటికి ఆ కవిత సంతోషంతో మోగడమో, లేదా చెప్పలేనంత దుఃఖంతో సోలిపోవడమో జరుగుతుంది.

ఉదాహరణకి ఇక్కడ అనువదించిన 'వదిలిపెట్టేసిన ఇల్లు' అనే కవిత చూడండి. ఆ కవితలో హోటలు రూము ఒక మెటఫరు. 'అంతములేని ఈ భువనమంత పురాతన పాంథశాల' అనే మెటఫరు లాంటిదే ఇదీ అని అనిపించవచ్చు. కాని ఒక పాంథశాలకీ, హోటలు రూముకీ మధ్య సముద్రమంత తేడా ఉంది. హోటలు రూములో, డబ్బిస్తే తప్ప, నువ్వు నివసించలేవు. అందులో వ్యాపారం తప్ప మరేమీ లేదు. ఇవాళ నీది, రేపు మరొకడిది. ఎల్లకాలం నువ్వక్కడ ఉండలేవు. ఎనిమిది వాక్యాల ఈ కవితలో బిగింపు ఆ రూపకాలంకారం దగ్గరకి వచ్చేటప్పటికి పాఠకుడిలో చెప్పలేని స్ఫురణని రేకెత్తిస్తుంది. ఆ తర్వాత ఈ కవిత పుస్తకంలోంచి అదృశ్యమై పాఠకుడి మదిలో తిష్ఠవేసుకుంటుంది.

అతడి గొప్ప కవితలు ఏవీ కూడా ఒక పేజీకి మించి ఉండవు. ఏ భావంలోనూ, పదప్రయోగంలోనూ కూడా పునరుక్తి ఉండదు. ఒక భావాన్ని వ్యక్తం చేసాక తెలుగు కవులు మళ్ళా నాలుగైదు సార్లు ఆ భావాన్నే మార్చి మార్చి తిప్పి తిప్పి చెప్తుంటారు. అది పూర్వకాలపు గ్రామీణ శ్రోతలకి అవసరమేమోకాని, సునిశితమైన గ్రహణసామర్థ్యాలుండే ఆధునిక శ్రోతకి వాగాడంబరం అనిపిస్తుంది. అది కవిత్వం కాదు, ప్రసంగం అనిపిస్తుంది. పూర్వకాలపు సీసపద్యాల్లో అటువంటి పద్ధతి వాడేవారు. అది శ్రోతకి reinforcement గా పనిచేసేది. కాని యెహుదా అమిహాయి లాంటి కవులు మెటఫరు ద్వారానే ఆ reinforcement సాధిస్తారు. అందువల్ల ఎంత సుదీర్ఘంగా చెప్పావన్నదాన్నిబట్టి కాక, ఎంత సూటిగా, ఎంత శక్తిమంతంగా చెప్పావన్నదానిమీద కవిత బతకడం మొదలుపెడుతుంది.

సాధారణంగా తెలుగుకవి, తనకొక స్ఫురణ కలగ్గానే దాన్ని వెంటనే కవితగా మార్చడానికి ఉత్సాహపడతాడు. ఇందులో spontaneity అనే సుగుణం ఉన్నప్పటికీ, ఆ స్ఫురణ కవి హృదయంలో ధ్యానంగా మారనందువల్ల ఆ కవితలో సాంద్రత కొరవడుతుంది. గొప్ప కళాకారుడికి ఇదెప్పటికీ ఒక సమస్య. Spontaneity ని వదులు–కోకుండానే చిక్కదనాన్ని, నీ అభివ్యక్తిలో, తీసుకురావడమెలా అన్నది. ఉదాహరణకి రిల్కె కవిత్వం చదివితే మనకి అందులో సద్యఃస్పందన కనిపించదు. అపారమైన ధ్యానం తాలూకు

సాంద్రత కనిపిస్తుంది. కాని యెహుదా అమిహాయి కవితల్లో చిక్కదనం కనిపిస్తూనే అవి అప్పటికప్పుడు నేరుగా తను చూసినదాన్ని చూసినట్టు చెప్తున్నాడా అనిపించేలా ఉంటాయి. ఈ ఇంద్రజాలం వెనక ఒక జీవితకాలపు కఠోరమైన సాధన, తపస్సు ఉన్నాయని వేరే చెప్పనక్కరలేదు కదా.

యెహుదా అమిహాయి పేరు నేను మొదటిసారి ఇస్మాయిల్ గారి ద్వారా విన్నప్పటికీ, The Selected Poetry of Yehuda Amichai (2013) చదివినతర్వాతనే ఆ కవి వ్యక్తిత్వం, ప్రతిభ, శక్తి నాకు బోధపడ్డాయి. Chana Bloch, Stephen Mitchell చేసిన ఆ అనువాదం నాకు చాలారోజులపాటు నిత్యపారాయణ గ్రంథాల్లో ఒకటిగా ఉండింది. అయితే నాలుగైదేళ్ళ కిందట Robert Alter సంకలనం చేసిన The Poetry of Yehuda Amichai (2015) దొరికిన తర్వాత నాకొక పెద్ద పండ్ల గంప దొరికినట్టయింది. ఇందులో 1955 నుంచి 1998 దాకా మొత్తం అమిహాయి కవిత్వం పన్నెండు సంపుటాల నుంచి వివిధ అనువాదకులు అనువాదం చేసిన కవితలు ఉన్నాయి. Robert Alter సుప్రసిద్ధ హీబ్రూ పండితుడు, అనువాదకుడు. నేను ఇంతకుముందు Psalms అనువదించినప్పుడు ఆయన అనువాదాలగురించి మీకు పరిచయం చేసాను కూడా.

ఈ సంకలనంలో అమిహాయి కవితలు ఆయన మొత్తం కవిత్వంలో మూడవవంతు అని సంకలనకర్త పేర్కొన్నాడు. కాబట్టి, యెహుదా అమిహాయి కవిత్వం ఇంగ్లిషులో లభ్యమవుతున్నదానిలో ఇదే అత్యంత విస్తృతమైందని చెప్పవచ్చు.

అమిహాయి మొత్తం నాలుగు యుద్ధాల్లో పాల్గొన్నాడు. కాని అందరికన్నా ముందు, యుద్ధం చెయ్యవలసివచ్చినవాళ్ళే యుద్ధాన్ని ఎక్కువ ద్వేషిస్తారనేది, అమిహాయి మనకి అనేకవిధాలుగా పదే పదే చెప్పే విషయం. ఇటు యూదులవైపునుంచి కవిత్వం రాసిన అమిహాయి, అటు అరబ్బుల వైపు నుంచి కవిత్వం చెప్పిన మహ్మద్ దర్వేషు– ఇద్దరూ కూడా– కవులు నిజంగా కోరుకునేది యుద్ధాన్ని కాదు, శాంతిని అనే చెప్తున్నారు. ఇద్దరు కవులూ రాసింది హీబ్రూలోనే. హీబ్రూని దర్వేషు 'ప్రేమభాష' అని అభివర్ణించాడంటే నాకు కళ్ళమ్మట నీళ్ళొచ్చినంత పనయింది.

యుద్ధమధ్యంలో, 'మండే ఇసుకలో నెత్తురోడుతో దేక్కుంటూ ఫస్ట్ఎయిడ్ స్టేషనుకి వెళ్ళవలసిన జీవితం మధ్య' వాళ్ళు ప్రేమకోసం, శాంతికోసం తపించారు. కాని సుఖంగా, సౌకర్యంగా జీవిస్తూ మనం మన భాషని 'ద్వేష భాష' గా మార్చుకుంటున్నామని తెలియవలసి రావడంలో ఉన్న విషాదం చెప్పలేనిది. ఇంత చెప్పాక అమిహాయి కవితలు ఒకటి రెండేనా మీతో పంచుకోకుండా ఎలా ఉంటాను!

దేవుడు కిండరుగార్డెను పిల్లలమీద జాలి చూపిస్తాడు

దేవుడు కిండరుగార్డెను పిల్లలమీద జాలి చూపిస్తాడు
స్కూలు పిల్లలమీద మరీ అంత చూపించడు
పెద్దపిల్లలమీద మాత్రం అస్సలు చూపించడు
వాళ్ళమానానికి వాళ్లని వదిలేస్తాడు

దగ్గరలో ఉండే ఫస్ట్ ఎయిడ్ స్టేషనుకి
మండిపోతున్న ఇసుకలో
నెత్తురోడుతూ
వాళ్ళు నాలుగుకాళ్ళమీదా దేక్కుంటూ పోవాలి.

నిజంగా ప్రేమించేవాళ్ళమీద
బహుశా ఆయన జాలిపడి ఇంత నీడపరుస్తాడేమో
దారిపక్క బెంచీ మీద పడుకున్నవాడికి
నీడనిచ్చే చెట్టులా.

అమ్మ కొంగునదాచుకున్న చిల్లరంతా మన చేతుల్లో పెట్టేసినట్టు
మనం కూడా మన ప్రేమని వాళ్ళకి ధారపోస్తామేమో
కాబట్టే ఇవాళా రేపూ
వాళ్ళ అనుగ్రహం మనల్ని కాపాడుతున్నది.

యెరుషలేం

ఓల్డుసిటీలో డాబామీద
అపరాహ్ణపు సూర్యకాంతిలో ఆరేసిన వస్త్రాలు
ఒక ఆడమనిషి చీర, ఆమె నా శత్రువు
ఒక మగమనిషి తువ్వాలు, అతడు కూడా నా శత్రువే
అతడికి చెమటపట్టినప్పుడు దాంతోనే తుడుచుకుంటాడు.

పాతనగరపు ఆకాశం మీద
గాలిపటం.
ఆ దారం కొస చివరన
ఒక పిల్లవాడు.

మధ్యలో గోడ అడ్డుకాబట్టి
పిల్లగాడు నాకు కనిపించడం లేదు.

మనం చాలా జెండాలు ఎగరేసాం
వాళ్ళూ చాలా జెండాలు ఎగరేసారు
వాళ్ళు సంతోషంగా ఉన్నారని మనం అనుకోడానికి
మనం సంతోషంగా ఉన్నామని వాళ్ళనుకోడానికీ.

భగవంతుడి పరిస్థితి

ప్రస్తుతం భగవంతుడి పరిస్థితి
చెట్లూ, శిలలూ, సూర్యచంద్రుల పరిస్థితి లాంటిదే
మనుషులు వాటిని నమ్మడం మానేసి
ఆయన్ని నమ్మడం మొదలుపెట్టడం లాంటిదే.

అయినా ఆయన మనతోనే ఉండక తప్పదు
కనీసం చెట్లలాగా, రాళ్ళల్లాగా
సూర్యచంద్రతారకాసముదాయంలాగా.

వదిలిపెట్టేసిన ఇల్లు

ఆ కిటికీ నిండా రాళ్ళు
శవాల్ని మోసుకుపోయినట్టు ఆ తలుపుల్ని పట్టుకుపోయారు
ఇంట్లోంచి ఊడబెరికి మరీ.

గుమ్మానికి అడ్డంగా దూలాలూ, ఇనపతీగలూ
కుక్కలకీ, గోడలకీ అందకుండా వేలాడే తాళంకప్ప.

ఒకళ్ళ గతం ఇంక
మరొకరికి భవిష్యత్తు-
అచ్చం హొటలు రూములాగా.

సీయోను పర్వతం మీద ఒక అరబ్బు గొర్రెల కాపరి తన మేకకోసం వెతుక్కుంటున్నాడు

సీయోను పర్వతం మీద ఒక అరబ్బు గొర్రెల కాపరి
తన మేకకోసం వెతుక్కుంటున్నాడు
కొండకి ఇవతలి పక్క
నేను నా పిల్లవాణ్ణి వెతుక్కుంటున్నాను
అరబ్బు గొర్రెలకాపరీ, యూదు తండ్రీ
ఇద్దరూ ప్రస్తుతానికి నిస్సహాయులే.
మా ఇద్దరి అరుపులూ లోయలో
కొలనులో ప్రతిధ్వనిస్తున్నాయి
నేనూ, అతడూ కూడా
మా మేకా, పిల్లాడూ
కర్రా పోయి కత్తీ వచ్చే పాటలోలాగా
తప్పిపోకుండా ఉండాలని కోరుకుంటున్నాం.

మొత్తానికి వాళ్ళక్కడ పొదల్లో దొరికారు
సంతోషంతో, కన్నీళ్ళతో మేము అరిచిన అరుపులు
మాకే ప్రతిధ్వనించాయి.

తప్పిపోయిన మేకకోసమో, బిడ్డకోసమో
వెతుక్కున్నప్పుడల్లా
ఈ కొండల్లో ఒక కొత్త మతం పుడుతుంటుంది.

7-6-2023

ఆడినడయాడు పాపా

అయిదారేళ్ళకిందట కోయంబత్తూరుదగ్గర ఒక స్కూల్లో పిల్లల్ని ఏదైనా తమిళగీతం వినిపించమని అడిగితే, ఒక పిల్లవాడు 'ఓడి విలయాడు పాపా' అనే పాట పాడాడు. అది సుబ్రహ్మణ్యభారతి గీతమని అప్పుడే తెలిసింది, అదే మొదటిసారి వినడం కూడా. ఆ తర్వాత ఆ గీతాన్ని పూర్తిగా ఇంగ్లిషు అనువాదంలో చదివినప్పుడు నా మనసంతా ఆర్ద్రమై పోయింది. ఒక పసిపిల్లవాడు మరొక పసిపిల్లవాడితో మాట్లాడినట్టుగా భారతియారు ఈ పాట రాసారనిపించింది. అప్పణ్ణుంచీ ఈ గీతాన్ని తెలుగుచేద్దామని అనుకుంటూనే ఉన్నాను. మొత్తం పదహారు చరణాల గీతంలో మూడేళ్ళ కిందట మొదటిచరణం మాత్రమే అనువదించగలిగాను. ఇన్నాళ్ళకు పూర్తిగీతాన్ని.

ఆడినడయాడు పాపా

ఆడినడయాడు పాపా
కూడి తిరుగాడు పాపా
చిన్నారిపిట్టలా ఎగురాడు, చెడ్డ
పలుకాడకెన్నడును పాపా

పిట్టవలె నీవు పాపా
పిచుకవలె నీవు పాపా
రంగురంగుల పక్షులందొకరివై
నింగిపై తారాడు పాపా

మేతకొరకై వెతుకాడు
కోడినెచ్చెలి మనకురా
దొంగిలించుబుద్ధి కాకిది, దానిపై
దయచూపురవ్వంత పాపా

పాలధారలు ప్రసరించు
గోవు మనబంధుమిత్రము
చూడు తోకాడుచును కేరింతలాడు
కుక్కపిల్లలుతోడు పాపా

రథములను లాగు గుర్రము
పొలములను దున్ను వృషభము
కలసి మెలసి బతుకు మనచెంత మేకలు
మనసార లాలించు పాపా

పొద్దున్న చదువుసంధ్యలు
ఆపైన తుళ్లిపడుతూ
పాడి, పొద్దుగుంకేదాక ఆడుకుని
నీనడత దిద్దుకో పాపా

కల్లలాడకు మెన్నడూ
ఒరుల వెనకను వారిపై
కొండెములు చెప్పకుము, దేవుడెల్లపుడు
తోడునిలుచును మనకు పాపా

చెడ్డవారెదురైనచో
ఖండించు, భీతి చెందకు
కనికరించకేమాత్రమును, ఊసిపో
కసిదీర వారిపై పాపా

కష్టములు తరుమాడినా
కలత చెందకు, నిబ్బరము

కోల్పోక నిలబడుము మనకు బాసటగ
దైవమున్నాడులే పాపా

బద్ధకము పరమశత్రువు
పాటించు తల్లిమాటలు
ఊరికే విలపించువారు దుర్బలులు,
ధీరవై పోరాడు పాపా

జన్మనిచ్చిన దేశమును
సేవించు సంతసముతో.
తండ్రితాతలిటు తరలివెళ్ళిన నేల
సుధకన్న మధురమే పాపా

సాటిలేనిది, ప్రేమించు
మాతృభాషను, ఏదేశ
మేగినా ఎవ్వరెదురైన పొగడరా
నీ భరతదేశమును పాపా

ఉత్తరాన హిమాలయము
దక్షిణము కన్యకుమారి
తూర్పుపడమర లావరించెమహోదధి
దిక్కులై నలుగడల పాపా

వేదములుపలికిన తావు
శౌర్యవంతులనివాసము
భువినివెలయు సురలోకమిదియనితలచి
శిరసొగ్గి ప్రణమిల్లు పాపా

నమ్మకుము కులమనుమాట
చూపకు తరతమభేదము.
ప్రేమపంచెడిశీలవంతులొక్కరే
సజ్జనులు ఘనులురా పాపా

జీవులన్నిటిపట్ల దయ,
దైవమొక్కడె సత్యమని
నమ్మి, ఉక్కుతీగనుపోలు గుండెతో
వర్ధిల్లు వందేళ్లు పాపా

13-6-2023

శ్రీకృష్ణలీలాతరంగిణి

ఉయ్యూరులో శ్రీవిద్యానిలయం వారు ప్రతి ఏటా మహాశివరాత్రి, శ్రీకృష్ణాష్టమి వేడుకలు చేస్తుంటారు. కృష్ణాష్టమికి కృష్ణసంబంధమైన ప్రసంగాలు, సంకీర్తన కూడా ఏర్పాటు చేస్తుంటారు. ఆ నిలయాన్ని స్థాపించిన శ్రీరామ్‌గారు పరమాచార్య శిషులు. పరిత్యాగి. నేను వారి దృష్టిలో ఎలా పడ్డానోగాని, ఇరవయ్యేళ్ళ కిందట నన్ను ఒక ప్రసంగం చేయమని పిలిస్తే వెళ్ళాను. ఆ రోజు మధురభక్తి గురించి మాట్లాడేను. మళ్లా పదేళ్లకిందట మరొకసారి పిలిచారు. చాలా కాలం తర్వాత మళ్లా ఈ కృష్ణాష్టమికి కూడా అహ్వానిస్తే నిన్న వెళ్ళాను. శ్రీకృష్ణలీలాతరంగిణి కావ్యం గురించి మాట్లాడేను.

ఇలాంటి ఆహ్వానాలు, అవకాశాలు అన్నిటికన్నా ముందు నా మనః ప్రపంచాన్ని మరింత ప్రక్షాళనం చేసుకోడానికీ, మరింత రసమయమొనర్చుకోడానికీ పనికొస్తాయి. ఎందుకంటే, నారాయణతీర్థులు తన కావ్యం గురించి 'కలికల్మషనాశనం, కామిత ఫల నిదానం, నారాయణీయచరితం, నారాయణతీర్థగీతం' అని రాసుకున్నారు. ఒకప్పుడు జయదేవుడు కూడా తన గీతగోవింద కావ్యం గురించి 'శ్రీ జయదేవ భణిత హరిరమితం, కలి కలుషం జనయతు పరిశమితం' అని అన్నాడు. ఇద్దరు వాగ్గేయకారులూ కలి కల్మషం అణచేవిగా తమ కావ్యాల్ని పేర్కోవడంలో అణుమాత్రం కూడా అతిశయోక్తి లేదని, ఆ గీతపఠనం చేసిన ప్రతిసారీ నాకు మళ్ళీ మళ్ళీ స్ఫురిస్తూనే ఉంటుంది.

ఇంతకీ కలి అంటే ఏమిటి? మసక. నీ ఆలోచనల మీద, నీ అనుభూతి మీద, నీ సంకల్పాల మీద పరుచుకునే నల్లని నీడ. పొద్దున్న లేచినప్పటినుంచి మన అనుభవం ఏమిటి? ముక్కలు ముక్కలు అవుతూ ఉండటం. ఎవడో ఏదో అంటాడు, ఎవరో ఏదో రాస్తారు, నీ ప్రమేయం లేకుండానే నిన్నెవరో ఏదో గ్రూపులో చేరుస్తారు. అక్కడేదో

ద్వేషపర్వం నడుస్తూ ఉంటుంది. అసలు మీడియాకీ, సోషలుమీడియాకీ ఉన్న లక్షణమేమింటే అవి నిన్ను provoke చేస్తాయి. నువ్వు ఏదో ఒకటి అనేలాగా చేస్తాయి. ప్రశాంతంగా ఉన్న సరసులోకి ఎవరో ఒక రాయి విసిరినట్టుగా నువ్వు చెల్లాచెదురైపోతావు. సరిగ్గా ఇలాంటి కావ్యాల సాన్నిధ్యం మనకి ఇలాంటప్పుడే అవసరం. అవి శకలాలుగా చిట్లిపోయిన మనల్ని ఒద్దిగా, ఓపిగ్గా తిరిగి దగ్గరకు చేరుస్తాయి. మసకబారుతున్న మన మనసునీ, హృదయాన్నీ ఒక గుడ్డపెట్టి తుడిచి మనల్ని మళ్లా చక్కదిద్ది మనకి మనల్ని అప్పగిస్తాయి.

ఇదే చెప్పాను, నిన్న. ఎందుకంటే, ఈ noise ని దాటిన music ఒకటి విన్నారు వాళ్ళు, శ్రీమద్భాగవతకర్త, జయదేవుడు, లీలాశుకుడు, ముకుందమాల, నారాయణీయాలు రాసిన కవులు, అలాగే నారాయణతీర్థులు కూడా. నిజంగానే బృందావనంలో రెల్లుపొదల మధ్యనుంచి వినవచ్చే ఆ వేణుగానాన్ని విని గోపికలెట్లా సమస్తం విడిచిపెట్టి, ఆ నవనీత చోరుడి వెనక పడ్డారో, ఈ కవులు కూడా అట్లానే ఒక మురళీసంగీతం వెనక పడ్డారు. అది వాళ్ళ జీవితాల్ని వెలిగించింది. ఇప్పుడు, ఇన్ని శతాబ్దాల తర్వాత కూడా, ఆ కావ్యాల్ని ఎవరు తమ చేతుల్లోకి తీసుకున్నా వాళ్ళ జీవితాల్ని కూడా వెలిగిస్తుంది. తన కావ్యం ముగిస్తూ నారాయణ తీర్థులు ఇలా అన్నారు:

కామదా కామినామేషా ముముక్షూణాం చ మోక్షదా
శృణ్వతాం గాయతాం భక్త్యా కృష్ణలీలా తరంగిణీ

(ఈ కృష్ణలీలా తరంగిణి కావ్యాన్ని విన్నా, పాడుకున్నా కూడా కోరికలున్నవాళ్ళకి కోరికలు తీరతాయి, కోరికలనుంచి బయటపడాలనుకున్నవాళ్ళకి విడుదల దొరుకుతుంది.)

నిజమే. ఈ గీతాలు నీకు జీవితం పట్ల ఇష్టాన్నేనా పెంపొందిస్తాయి లేదా ఈ ఇష్టా-యిష్టాల్ని దాటిన స్థితికేనా ప్రయాణిస్తాం. గొప్ప కవిత్వానికంతటికీ ఈ మాటలు వర్తిస్తాయి. 'ఈ ప్రపంచానికి దగ్గర కావడానికేనా లేదా ఈ ప్రపంచం నుంచి విముక్తం కావడానికేనా కవిత్వమే శరణ్యం' అని గొథే అన్నాడని డి.జె. ఎన్‌రైట్ రాసిన వాక్యాలు, నలభయ్యేళ్ళకిందట చదివినవి, నేనెప్పటికీ మరవలేను.

నిన్న మళ్ళా కృష్ణలీలాతరంగిణి మీద మాట్లాడటానికి కూచున్నప్పుడు గీతగోవింద కావ్యంలో కన్నా కూడా ఈ కావ్యంలో విస్తృతీ, వైవిధ్యం మరింత ఉన్నాయనిపించింది. ఆ మాటే చెప్పాను అక్కడ. గీతగోవింద కావ్యానికి జీవితకాల ఆరాధకుడిగా నేనా మాటలు చెప్పడం నాకే ఆశ్చర్యమనిపించింది. కానీ ఏం చెయ్యను? కృష్ణలీలాతరంగిణి మహిమను నేనిన్నాళ్ళూ గుర్తించవలసినట్టుగా గుర్తించలేదేమో అనిపించింది.

గీతగోవిందం రాధాకృష్ణ ప్రణయగీతం. మధురభక్తి శాస్త్రం. అందులో మొత్తం పన్నెండు సర్గలు, ఇరవై రెండు గీతాలు, డెబ్బై రెండు శ్లోకాలు ఉన్నాయి. రాగాలు మొత్తం ఇరవైకి మించి లేవు. ఆ కావ్యమంతా కేశవకేళి రహస్యం. కృష్ణాకర్ణామృతం బాలకృష్ణ లీల. కానీ కృష్ణలీలాతరంగిణి కృష్ణజననంతో మొదలై రుక్మిణీ కల్యాణందాకా మొత్తం దశమస్కంధ-మంతటినీ కావ్యంగా మార్చిన రచన. అంటే కృష్ణకర్ణామృతం, గీతగోవిందాలు కలిపినా కూడా ఇంకా గానం చేసిన చరిత్ర చాలానే ఉందన్నట్టు. అందుకనే ఆ కావ్యంలో మొత్తం 156 కీర్తనలు, 267 శ్లోకాలు (కొందరి లెక్కలో 348), ఇవి కాక, 30 దరువులు, 30 గద్యలు, సంభాషణలు, సంవాదాలు. దాదాపు 39 రాగాలు. బహుశా శ్రీకృష్ణలీలా సర్వస్వం అని చెప్పవచ్చు. ఇంత విస్తృతమైన, ఇంత వైవిధ్యంతో కూడిన సంగీతకావ్యం భారతీయ సాహిత్యాల్లోనే మరొకటి లేదని చెప్పవచ్చు.

అంతేనా? అదొక యక్షగానం. ఆ కావ్యం మీద ఉన్న తెలుగుముద్ర అది. ఆయన తెలుగు వాడు. కృష్ణాతీరవాసి. కాజ ఆయన పుట్టిన ఊరు. మరాఠాల ఏలుబడిలో ఉన్న తంజావూరు ఆయన్ని ఆహ్వానించింది. తిరువయ్యారు దగ్గర వరాహూరు వేంకటేశ్వరుడు ఆయన్ని తన దగ్గరకు రప్పించుకున్నాడు. ఈ కల్యాణకావ్యాన్ని ఆయన కావేరి ఒడ్డున రాసాడు. కాని ఆ గీతాల్లో ప్రవహిస్తున్నవి కృష్ణాజలాలే.

అసలు అన్నిటికన్నా ముందు నన్ను ఆశ్చర్యపరిచేది వ్యాసుడు, జయదేవుడు, లీలా-శుకుడు వంటి సంస్కృత కవులు గానం చేసాక, ఎర్రన, సోమన, పోతన, రామకృష్ణకవి, అన్నమయ్యలాంటి కవులు తెలుగులో అపారకావ్య, గీతసాహిత్యం సృష్టించి ఉన్నాక, మళ్ళా ఎంత ఆత్మవిశ్వాసం లేకపోతే, తన పారవశ్యానికి ఎంత అవధిలేకపోతే, ఆయన అటువంటి కావ్యరచనకు పూనుకుని ఉంటాడు!

త్యాగరాజ స్వామికి దారి చూపిన కవి అని సంగీతకారులు కొనియాడుతున్నారు గాని, సాహిత్యకారులు, రసజ్ఞులు కృష్ణలీలాతరంగిణిని ఒక కావ్యంగా చర్చించడం నేను చూడలేదు. ఈ 'నవనీత చోరబాలకచరిత' లో సంగీతం ఉంది, సాహిత్యం ఉంది, నాట్యం ఉంది, నాటకం ఉంది, నామజపం ఉంది, నివ్వెరపరిచే ప్రయోగాలు ఉన్నాయి. కాని లేనిదల్లా, దానికి సాహిత్యవారసులు.

గీతగోవింద కావ్యం గురించి రాస్తూ బార్బరా స్టోలరుమిల్లరు ఒక మాట అన్నారు. అప్పటికి దాదాపుగా కొనప్రాణానికి చేరుకున్న వైష్ణవానికి గీతగోవిందం ప్రాణం పోసి నవ్యవైష్ణవంగా మార్చేసిందని. ఆ తర్వాత చైతన్యమహాప్రభువునుంచి రామకృష్ణ పరమహంస దాకా ఒక భావుకపరంపర ఆ కావ్యారాధనలో మునిగితేలారు. అటు బృందావనంలో,

ఇటు పూరీలో, దక్షిణాదిన గురువాయురప్ప దేవాలయంలో, అష్టపదులు వినిపించని-దెక్కడని? కాని కృష్ణలీలాతరంగిణిని కూచిపూడి భాగవతులు తప్ప మరెవ్వరూ నెత్తిన పెట్టుకున్నవాళ్ళు లేరు. ఇప్పుడు దక్షిణాదిన వరహూరులోనూ, తిరుపుందుర్తిలోనూ నారాయణతీర్థట్రస్టులు ఏర్పాటయ్యాక యేసుదాసు లాంటివారు ఆ గీతగానం మొదలుపెట్టక పోలేదు. కాని ఆ గీతాలు పాడుకోవలసింది ముందు మనం కదా!

సంగీతం సరే, అందులో సాహిత్యం గురించి మాట్లాడుకోవాలి కదా. నారాయణ తీర్థులు ఆ గీతాల్లో తనని తాను 'వరనారాయణతీర్థ' శివనారాయణతీర్థ', 'యతి నారాయణతీర్థ', 'ముని నారాయణతీర్థ', 'భక్త నారాయణతీర్థ', 'శివనారాయణతీర్థ', 'సరస నారాయణతీర్థ', 'నందిత నారాయణతీర్థ' –ఇలా పలువిధాలుగా వర్ణించుకున్నాడు. కాని ఎక్కడా కవి నారాయణతీర్థ అని చెప్పుకోలేదు.

కవి అంటే ఏముంది? ఒక శ్లోకం రాస్తే చాలు, కవి. కాని నిజమైన కవి లోనుకాగల సకలావస్థలకీ ఆయన లోనయ్యాడు కాబట్టే, అన్ని విశేషణాలు చెప్పుకున్నాడు. కావ్యాంతానికి వచ్చేటప్పటికి ఎంత స్పష్టంగా చెప్పుకుంటున్నాడో చూడండి:

శ్రీ గోపాల ఘనాదపార కరుణాపీయూషధారా సృతా
యా నారాయణతీర్థ భూధర పరిక్షిప్తా సమస్తా తదా
సంభూయాచ్యుత భక్తభూమిషు వహంత్యానందయంతీ జగత్
పావిత్ర్యం విధునోతు కృష్ణవిలసల్లీలా తరంగిణ్యసౌ.

(శ్రీకృష్ణుడనే మేఘం వర్షించిన దయామృతధార నారాయణతీర్థుడనే పర్వతం మీద పడింది. అక్కణ్ణుంచి అది కృష్ణలీలావర్ణనమనే నదిగా మారి లోకాన్ని ఆనందింపచేస్తూ విష్ణుభక్తులనే పొలాలమీద ప్రవహిస్తున్నది. ఆ నదిని ఎవరు చేరుకుంటే వారి మలినాలు తొలగిపోవు గాక!)

ఆ కావ్యంలోని సాహిత్యమాధుర్యాన్ని నిన్న నా ఎదట ఉన్న శ్రోతలకి ఎలా వివరించాలో తెలియలేదు. నేనొక గాయకుణ్ణి కానందుకు ఎంతో చింతించాను. కాని పదే పదే ఒక్కమాట చెప్పాను – కృష్ణలీలాతరంగిణి సంస్కృతంలో రాసినట్టుండే తెలుగు కావ్యం అని. అది పోతన్నపద్యాల్ని కీర్తనలుగా చదువుతున్నట్టుంటుంది. అదే సునాద మాధురి, అదే యమకాలంకారం– నేను చెప్తున్నది సుబోధకంగా ఉండటానికి, ఈ కీర్తన చదివి వినిపించాను. చూడండి:

కృష్ణం కలయసఖి, సుందరం
బాలకృష్ణం కలయ సఖి సుందరం

కృష్ణం గతవిషయ తృష్ణం జగత్ప్రభ
విష్ణుం సురారిగణ జిష్ణుం సదా
బాలకృష్ణం కలయసఖి సుందరం

నృత్యంత మిహముహు రత్యంత మపరిమిత
భృత్యానుకూల మఖిల సత్యం సదా
బాలకృష్ణం కలయసఖి సుందరం

ధరం భవజలధి పారం సకలవేద
సారం సమస్తయోగి తారం సదా
బాలకృష్ణం కలయసఖి సుందరం

శృంగారరసభర సంగీత సాహిత్య
గంగాలహరీ ఖేల సంగం సదా
బాలకృష్ణం కలయసఖి సుందరం

రామేణ జగదభిరామేణ బలభద్ర
రామేణ సహావాప్తకామేన సదా
బాలకృష్ణం కలయసఖి సుందరం

రాధారుణాధర సుధాపం సచ్చిదానంద
రూపం జగత్త్రయ భూపం సదా
బాలకృష్ణం కలయసఖి సుందరం

దామోదర మఖిల కామాకరం ఘన
శ్యామాకృతిమసుర భీమం సదా
బాలకృష్ణం కలయసఖి సుందరం

అర్థం శిథిలీకృతానర్థం శ్రీనారాయణ
తీర్థపరమపురుషార్థం సదా
బాలకృష్ణం కలయసఖి సుందరం

మనం గాయకులం, నర్తకులం కాకపోయినా పర్వాలేదు. సంస్కృతపదాలకి అర్థం తెలియకపోయినా పర్వాలేదు. ఆ గీతాలు గట్టిగా చదువుకుంటే చాలు. తన గీతాల గురించి చెప్తూ జయదేవుడు–

శ్రీ జయదేవ భణితమిదమధికం యది మనసా నటనీయం
హరి విరహాకుల పల్లవ యువతి సఖీ వచనం పఠనీయం

అని అన్నాడు. ఆ మాట కృష్ణలీలాతరంగిణికి కూడా వర్తింపచెయ్యవచ్చు. ఆ గీతాల్ని గొంతెత్తి చదువుకున్నా చాలు, మన మనోవేదిక పైన ఒక యక్షగానం మొదలైనట్టే ఉంటుంది.

8-9-2023

దిగులు కలిగినదేలనొ

ఎందుకో ఉన్నట్టుండి మనసు వర్డ్సువర్తు మీదకి పోయింది. ఒకప్పుడు ఈ కవిత్వంలో అంత గాఢత లేదనీ, పునరుక్తితో పాటు అనుభూతి కూడా పలచన అనీ అనుకునేవాణ్ణి. కాని శరత్కాలపు నదిలాగా ఆ కవిత్వంలో ఆ తేటదనం గొప్ప తపస్సు వల్ల మాత్రమే సాధ్యపడుతుందని ఇప్పుడనిపిస్తోంది.

కొన్ని కవితలు మీతో పంచుకోవాలని ఉంది. కాని ఆ 'లిరికల్ బాలడ్స్'ని ముత్యాల-సరంలోనో లేదా చతురశ్రగతి గేయాలుగానో తప్ప వచన కవితలుగా తెలుగుచెయ్యలేం కదా! అందుకని ఆ కవితల్లో ఒక సుప్రసిద్ధ గీతాన్ని ఇలా ముత్యాలసరంగా మలిచి మీకు కానుక చేస్తున్నాను.

దిగులు కలిగినదేలనొ

తోట లోపల వింటి నేనొక
మధుర మంజుల మంత్రగానము
తీపి తలపులు గుప్పిగొన్నను
దిగులు కలిగినదేలనొ

లలిత సుందర లాస్య ప్రకృతి
కలిపె నాతో సకలజగతిని
మనిషి మనిషికి ఏమి చేసెనొ
తలచి మనమున కలగితిన్

తేనె వాకలు తెప్పకట్టుకు
పూలదారులు పరచె ముంగిట
విరులబాలలు మురిసిపోవుట
నాకు నిశ్చయమయ్యెడిన్

పక్షి గణములు పాట పాడెను
కూజితమ్ముల కలకలమ్ముల
సుంత రెక్కలు చాచినంతన
హర్షవర్షముకురిసెడిన్

ఫుల్ల సూచీ పల్లవమ్ములు
వీచె వింజామరములవిగో
పంచుకొంటిని పసిడి కాంతుల
చేయగలిగినదింతయే.

రమ్య విస్తరరాగ మధురిమ
దిక్కులంతట సుక్కిపోవగ
మనిషి మనిషికి ఏమి చేసెనొ
తలచి కుంగక తప్పునా?

9-11-2023

పోయిన ప్రాణం లేచొచ్చినప్పుడు

ఈ కొత్త సంవత్సరం వచ్చిన ముందు రోజు రాత్రి అంటే డిసెంబరు 31 న నేను చాలా చీకటిలో చిక్కుకుపోయి ఉన్నాను. ఇంటిముందు బాల్కనీలో వెలిగించిన క్రిస్మసు తార, విద్యుద్దీపాల మాల మెరుస్తూనే ఉన్నాయి, కాని హృదయంలో చిగురించవలసిన కాంతిరేఖ ఇంకా పొడచూపడం లేదు.

అట్లాంటి వేళ రామకృష్ణారావుగారినుంచి నూతనసంవత్సర శుభాకాంక్షలతో ఒక కవిత వాట్సపులో వచ్చింది. కె. రామకృష్ణారావు తెలంగాణ ప్రభుత్వంలో స్పెషల్ చీఫ్‌సెక్రటరీగా పనిచేస్తున్నారు. ఆయన చదివే పుస్తకాల్నీ రచయితల్నీ చూస్తే నాకన్నా ఎప్పుడూ యోజనం ముందుంటారనిపిస్తుంది.

ఆయన పంపిన కవిత For Calling the Spirit Back from Wandering the Earth in Its Human Feet. ఆ కవిత రాసిన Joy Harzo అమెరికను కవయిత్రి. ఒక్లహొామాకు చెందిన హర్జో యు.ఎస్ చరిత్రలో పొయెటు-లారేటు కాగలిగిన మొదటి నేటివు అమెరికను కవయిత్రి. ఆమె కవితాసంపుటి Conflict Resolution for Holy Beings (2015) లోది ఈ కవిత. ఈ కవిత చదవగానే నాకు పోయిన ప్రాణం లేచొచ్చినట్టు అనిపించింది. అందుకని మీతో పంచుకోకుండా ఉండలేకపోతున్నాను.

పోయిన ప్రాణం లేచొచ్చినప్పుడు

ఆ పొటాటో చిప్స్ పాకెట్టూ, ఆ వైట్ బ్రెడ్డూ, ఆ కోక్ బాటిలూ పక్కన పెట్టెయ్యి.

ఆ సెల్ ఫోనూ, కంప్యూటరూ, రిమోట్ కంట్రోలూ ఆపెయ్యి.

తలుపు తెరు, ఆ మీదట దాన్ని నెమ్మదిగా మూసుకోనివ్వు.

ప్రేమగా పలకరించే గాలులు గుండెనిండా పీల్చుకో, అవి ఈ పుడమిమీద ఓషధుల సారాన్ని నింపుకుని మరీ ప్రసరిస్తాయి.

ఆ గాలుల్ని మళ్ళా ధన్యవాదాలతో పునఃప్రదానం చెయ్యి.

ఆ క్షణాన నువ్వు పాట పాడితే ఆ పాట నిన్ను తారాగగనానికి తీసుకుపోయి తిరిగి వెనక్కి తీసుకురాగలదు.

నీ తల్లిదండ్రుల కోరికలో నువ్వొక స్వప్నంగా ప్రాణంపోసుకున్నప్పణ్ణుంచి నిన్ను సంరక్షించుకుంటూ వస్తున్న భూమికి నువ్వు కృతజ్ఞతతో కైమోడ్చు.

నీ పాదరక్షలు నిన్ను నీ రక్షకదేవతలశిబిరానికి తీసుకుపోనివ్వు. ఆ దేవతలకి నువ్వు పుట్టకముందు నుంచీ తెలుసు, ఆ దేవతలు అక్కడ అనంతర కాలంలో కూడా నిలిచే ఉంటారు, వాళ్ళు వెలిగించుకున్న నెగడి కాలాతీతంగా మండుతూనేఉంటుంది.

నీ వలసలు ముగించేక నీలో తలెత్తే అభద్రతాసంకేతాల్ని పృథ్వి చక్కదిద్దనీ.

నీతో కలిసి నడిచే చిన్నచిన్న పిపీలికాలపట్ల, పక్షులపట్ల, జంతువుల పట్ల గౌరవం చూపించు.

వాటిపట్ల మనం మనుషులం చేస్తున్న హానికి మనఃపూర్వకంగా క్షమాభిక్ష యాచించు.

దిగులు పడకు.

ఉత్పాతాలు, సరిహద్దులు, తనిఖీలు, సైనికపటాలాలు, ఊచకోతలు, యుద్ధాలు– అన్నిటిమధ్యా, తమని తాము ద్వేషించుకుంటారు కాబట్టి నిన్ను కూడా ద్వేషించేవాళ్ళ మధ్య, దారి చేసుకొంటో పోవడమెట్లానో నీ హృదయానికి తెలుసు.

నీ ప్రయాణం బహుశా కొన్నిగంటలపాటు, ఒకరోజు, ఏడాది, కొన్నేళ్ళు, ఒక శతాబ్దం, ఒక సహస్రాబ్దం లేదా ఇంకా చాలాకాలమే పట్టవచ్చు.

నీ మనసుని కనిపెట్టుకో. సరైన శిక్షణలేకపోతే అది అటూ ఇటూ పారిపోవచ్చు, కాలాన్ని దొంగిలించేవాళ్ళకి, అది నీ హృదయాన్ని విందుగా, ఎరగా వేసి తప్పించుకుపోవచ్చు.

ఊరికినే పశ్చాత్తాపపడకు.

నువ్వు నడిమధ్యానికి దారి వెతుక్కోగలిగినప్పుడు, నీ ఆత్మ కాపలాదారులు వెలిగించిన అగ్ని చెంతకు చేరుకోగలిగనప్పుడు నీకు తప్పకుండా స్వాగతం లభిస్తుంది.

నిన్ను నువ్వు దేవదారు, నీలాంబరం, సంజీవిని మూలికల్తో పరిశుద్ధపరుచుకో.

అపజయాలతో, అవమానాలతో నీకు మిగిలివున్న లంకెల్ని తుంచెయ్యి.

నీ మనసులో, నీ భుజాలమీద, నీ హృదయంలో, నీ పాదాలదాకా పరుచుకుని ఉన్న బాధ తొలగిపోనివ్వు. నీ పూర్వీకుల వేదనతొలగిపోయి నీ ముందు రానున్న ఆగామితరాలకు దారిచెయ్యి.

క్షమాభిక్ష యాచించు.

నిన్ను ప్రేమించే వాళ్ళ చేయూతకోసం ఎలుగెత్తి ఆహ్వానించు. నీకు సహాయ పడటానికి సిద్ధంగా ఉన్నవాళ్ళకి ఎన్నోరూపాలు: వాళ్ళు జంతువులు కావచ్చు, పంచభూతాలు, పక్షులు, దేవదూతలు, సాధువులు, శిలలు, నీ పితృదేవతలు కావచ్చు.

నీ ఆత్మని వెనక్కి పిలు. నీ ప్రాణం ఎక్కడో అవమానాల, మూలల్లోనో, ముడత ల్లోనో, నీమీద తీర్చిన తీర్పుల్లోనో, నీమీద పడ్డ నిందల్లోనో ఇరుక్కు పోయి ఉండవచ్చు.

నువ్వు నీ ప్రాణాన్ని, నీ జీవాన్ని, నీ ఆత్మని ఎలా పిలవాలంటే, అది వెను వెంటనే వెనక్కి ఎగిరొచ్చేయాలి.

ఎంతో ఇష్టంగా, పసిపాపతో మాట్లాడినట్టుగా నువ్వు దాన్ని పలకరించాలి.

దారితప్పి సంచరిస్తున్న నీ ఆత్మని మళ్ళా చేరపిలుచుకో. బహుశా అది పీలికలు పీలికలుగా, ముక్కలుచెక్కలై వెనక్కి రావచ్చు. ఆ శకలాల్ని పోగుచేసుకో. ఎంతో కాలం తర్వాత తిరిగి నువ్వు వాటిని చేరదీసుకున్నందుకు అవి మహదానందానికి లోనవుతూ ఉండవచ్చు.

నీ ప్రాణాన్ని, నీ ఆత్మని నువ్వు చేరబిలుచుకుని దానికి స్నానం చేయించి, శుభ్రవస్త్రాలిచ్చిన తరువాత దానికొకింత విశ్రాంతి కావాలి.

అప్పుడు నీకొక విందుగోష్ఠి అవసరమవుతుంది. నువ్వు ఎవరెవరిని ప్రేమిస్తు-న్నావో, ఎవరెవరు నీకు బాసటగా నిలబడుతున్నారో వారందరినీ ఆ విందుకి ఆహ్వానించు. వెళ్ళడానికి మరొక చోటంటూ లేనివారికి ఒకింత చోటు చూపించు.

అప్పుడు ధన్యవాదసమర్పణ మొదలు పెట్టు. కాని గుర్తుపెట్టుకో, ప్రసంగాలు మరీ సుదీర్ఘం కాకుండా చూసుకో.

అప్పుడు, నువ్వు తప్పకుండా చెయ్యవలసిన పని ఒకటుంది. అదేమిటంటే, నీ తర్వాత వస్తున్న మనిషి కూడా చీకట్లో దారి తప్పకుండా దారి చూపించు.

2-1-2024

ఒక కవి, ఇద్దరు అనువాదకులు

మనం ఎప్పుడో ఒక కవినో, కవిత్వాన్నో రుచి చూసి ఉంటాం. ఆ తర్వాత వేరే పనుల్లోనో, ధ్యాసల్లోనో పడిపోతాం. కాని మనలోపల్లోపల హృదయంలో ఆ కవి కవిత్వం మరింత చదవాలనే వెతుకులాట ఒకటి కొనసాగుతూనే ఉంటుంది. అదొక చిత్రమైన దాహం. పైకి కనిపించని మంట. తీర్చే కొద్దీ పెరిగే వేదన. నా వరకూ తుకారాం కవిత్వం కూడా ఆ కోవలోకి వస్తుంది.

తుకారాం కవిత్వానికి దిలీప్ చిత్రే అనువాదం Says Tuka (1991) చదివిన తర్వాత ఎవరేనా తుకారాంకీ, చిత్రేకీ కూడా జీవితకాల అభిమానులు కాకుండా ఎలా ఉంటారు? చిత్రేని చదివినతర్వాత తుకారాం కవిత్వమంతా ఇంగ్లిషులో దొరికితే చదవాలని ఉవ్విళ్ళూరేను. మోతీలాల్ బనారసీదాస్ వారు ప్రచురించిన The Poems of Tukarama దొరికింది గాని, ఆ అనువాదం దిలీప్ చిత్రేలాగా అనుసృజన కాదు. ఆ అనువాదకులు నెల్సన్ ఫ్రేజర్, కె.బి.మరాఠే మూలవిధేయంగా ఆ కవిత్వాన్ని ఇంగ్లిషులో అందించడం మీదనే దృష్టిపెట్టారు. కాని దిలీప్ చిత్రే మూలవిధేయంగా ఉంటూనే తుకారాం ఆత్మనీ, ఆవేదననీ కూడా మనకి అనితరసాధ్యంగా అందించాడు.

అరుణ్ కొలాట్కర్ కూడా తుకాని అనువదించాడని విన్నానుగాని, ఆ పుస్తకం నాకింకా దొరకలేదు. ఇటువంటి పరిస్థితిలో తుకారాం కవిత్వానికి కొత్త అనువాదం పుస్తకాల షాపులో కనబడగానే నాకు ప్రాణం లేచివచ్చినట్టనిపించింది.

శాంతాగోఖలే, జెర్రీ పింటో వెలువరించిన Behold! The Word is God, Hymns of Tukarama (2023) నన్ను నిరాశపర్చలేదు సరికదా, తుకారాం పట్ల నా దాహాన్ని ద్విగుణీకృతం చేసింది.

శాంతాగోఖలే Playwright at the Centre: Marathi Drama from 1843 to the Presenta రచయితగా నాకు తెలుసు. చాలాకాలం కిందట ఆ పుస్తకం గురించి రాసాను కూడా. కాని ఆమె అనువాదకురాలనీ, కవిత్వాన్ని ఇంత బాగా అనువదించగలరనీ ఈ పుస్తకం చూసాకనే అర్థమయింది. జెర్రీ పింటో కవీ, రచయితా, అనువాదకుడూ కూడా.

వాళ్ళిద్దరూ తుకారాంని అనువదించాలనుకున్నారు. దిలీప్ చిత్రే అనువదించిన తర్వాత కూడా మరొక అనువాదం కావాలనుకున్నారు. అసలు అటువంటి అనువాదం అవసరమా అనుకున్నారు. అంతకన్నా బాగా చెయ్యాలి అనుకున్నారు, చెయ్యగలమా అని సందేహంలో పడ్డారు. ఏమైతేనేం, చివరికి తుకారాం అభంగాల్లోంచి 51 గీతాల్ని ఇంగ్లిషులోకి అనువదించారు. కాని ఆ కీర్తనల్ని ఇద్దరూ కలిసి అనువదించలేదు. వేరువేరుగా అనువదించారు. అంటే ప్రతి కీర్తనకీ రెండేసి అనువాదాలన్నమాట. ఒక కవిత్వ జుగల్ బందీ. ఇది కూడా ఆసక్తికరమైన ప్రయోగమే. వాళ్ళు అనువదించిన ప్రతి కవితనీ రెండు అనువాదాల్లో చదవడం ఒకే కీర్తనని రెండు రాగాల్లో విన్నట్టుంది. ఒక గళంలో వినిపించని సౌకుమార్యం మరో గళంలో సుస్పష్టంగా వినిపిస్తూ, ఒక వ్యాఖ్యానంలో కనిపించని లోతు, మరో వ్యాఖ్యానంలో కొత్త అర్థాల మీద మన దృష్టిని పరుస్తో ఉంది. ఒక కవీ, ఇద్దరు అనువాదకులూ కలిసి చదుతున్నంతసేపూ నన్ను విభ్రాంతికి గురిచేస్తూనే ఉన్నారు.

భారతీయ భక్తికవుల్లో ఎవరి జీవితకథ వారిది, ఎవరి జీవితవిషాదం వారిది, ఎవరు చూసిన భగవత్ సౌందర్యం వారు మాత్రమే చూడగలిగింది. కాని తన జీవితంలో సంతోషమూ నిర్భాగ్యమూ సమంగా చూసిన వ్యక్తి అంటూ ఉంటే అది తుకారాముడు మాత్రమే.

భారతదేశంలో భక్తికవులకీ, సాధు, సంతులకీ మనం నమ్మదగ్గ జీవితకథ అంటూ ఉండదు. ఈ సంగతులు నమ్మలేమని పక్కన పెట్టడానికీ కుదరదు. వాళ్ళ గురించి మాట్లాడు-కునేటప్పుడు ఏవి ఎంచుకోవాలో, ఏవి వదిలిపెట్టాలో తేల్చడం ఎవరికీ సాధ్యం కాదు.

కానీ కనీస జీవితరేఖల్ని ఏరి కూర్చుకుని ఆ జీవితాల్ని ఒక చారిత్రిక క్రమంలో పెట్టి చూడాలని ప్రయత్నించకుండా ఉండం. అలాచూసినప్పుడు తుకారాము మహారాష్ట్రలో ఇంద్రాయణి నది ఒడ్డున ఉన్న దేహూ అనే చిన్న గ్రామంలో 1608 లో పుట్టాడు. అతడి తండ్రి ఆ గ్రామానికి మహాజన్. దాంతోపాటు చిన్నపాటి వర్తకుడు కూడా. గ్రామంలో స్థితిమంతుడు కాబట్టి వడ్డీవ్యాపారం కూడా చేసేవాడు. తుకారాము అతడికి రెండో కొడుకు. విఠలుడు వాళ్ళ ఇలవేలుపు. తుకారాముది అల్లారుముద్దుగా గడిచిన బాల్యం. పెరిగి

పెద్దవుతున్నప్పుడు భాగవతం, భగవద్భక్తుల కథలు కూడా చదువుకున్నాడు. ఇంకా కౌమారం వీడకుండానే ఇద్దరు భార్యలు కూడా అతడి జీవితంలోకి ప్రవేశించారు. మొదటి భార్యకు ఒకరు, రెండో భార్యకు ఆరుగురు సంతానం. కాని సంతోషంతో గడుస్తున్న జీవితంలో వరసగా మూడు విషాదాలు సంభవించేయి. ముందు తన తల్లిదండ్రులు ఇద్దరూ, ఆ తర్వాత తన వదినా మరణించారు. అన్న విరక్తుడు. దాంతో పదిహేడేళ్ళు నిండకుండానే తుకారాం నెత్తిన ఇంటి యజమాని బాధ్యతలు పడ్డాయి. గ్రామపెద్దగానూ, రైతుగానూ బాధ్యతలు ఎలానో నెరవేర్చగలిగాడుగాని, వర్తకమూ, వడ్డీ వ్యాపారమూ అతడికి చాతకాలేదు. నెమ్మదిగా అతడు నిర్భాగ్యుడు కావడం మొదలుపెట్టాడు.

1629 భయంకరమైన సంవత్సరం. వరసగా మూడో ఏడాది కరువు ఆ గ్రామాల్ని చుట్టబెట్టింది. మనిషిని మనిషి పీక్కుతిన్న కరువు అది అని కళ్లారా చూసినవాళ్లు రాశారు. ఇరవై ఒక్కేళ్ళ తుకారాము అప్పులవెనక అప్పులు చేసాడు. అయినా నిభాయించుకోలేక పోయాడు. దివాలా తీసాడు. చుట్టూ కనిపిస్తున్న దుఃఖం చూసి తట్టుకోలేక ఆయన దగ్గరలో ఉన్న భండారా పర్వతం దగ్గరకి పోయేవాడు. రోజుల తరబడి ఆ కొండమీదనే ఏకాంతంలో గడిపేవాడు. ప్రాపంచిక జీవితంలో అతణ్ణి పూర్తిగా దివాలా తీయించాక, అప్పుడాయన ఆత్మిక జీవితాన్ని, విఠలుడు సుసంపన్నం చేయడం మొదలుపెట్టాడు. ఆ కొండకి వెళ్ళే-టప్పుడూ, వచ్చేటప్పుడూ, ఆ కొండమీద కూచున్నప్పుడూ తుకారాం పాటలు కట్టడం మొదలుపెట్టాడు. ఆయనకు ముందు జ్ఞానదేవుడు, నామదేవుడు, ఏకనాథుడు వంటి కవుల్ని ఎలా అనుగ్రహించాడో పాండురంగడు తుకారాముని కూడా అలానే అనుగ్రహించడం మొదలుపెట్టాడు. ఇంకా చెప్పాలంటే వారందరి కవిత్వాన్నీ మరిపించేలాంటి కవిత్వం తుకారాముడితో పాడించుకుని విన్నాడాయన.

తన గ్రామంలో పాడుపడ్డ విఠలుడి గుడిని తుకారాం నెమ్మదిగా బాగుచేయించాడు. ప్రతి ఏకాదశికి అక్కడ సంకీర్తనలు నిర్వహించడం మొదలుపెట్టాడు. అనతికాలంలోనే మొత్తం మహారాష్ట్ర అంతా అక్కడికి చేరుకోడం మొదలుపెట్టింది. అప్పటికి చాలాకాలంగా సన్నగిల్లిన వార్కరి యాత్రని ఆయన మళ్లా పునరుద్ధరించాడు. వార్కరి అంటే ప్రతి ఆషాఢ-మాసంలోనూ మహారాష్ట్ర గ్రామాల నుంచి కీర్తనలు పాడుకుంటూ దేవుడి పల్లకీలు మోసుకుంటూ ప్రజలు పండరిపురం చేసే యాత్ర.

కులం రీత్యా శూద్రుడైన తుకారాం విఠలుడి అర్చకుడిగా, ఆరాధకుడిగా మారడం సనాతన సమాజానికి కంటగింపైంది. వారు ఆయన్ని ఒకరోజు పరీక్షకు పిలిచారు. తాను రాసిన అభంగాల తాళపత్రాల్ని ఇంద్రాయణి నదిలో విడిచిపెట్టమన్నారు. అవి మునిగి

పోకపోతే పాండురంగడు తుకారాము వైపున్నట్టుగా తాము నమ్ముతామన్నారు. 1645 లో ఆయన ముప్పై ఏడవ ఏట ఈ జలపరీక్ష జరిగింది. తుకారాము తాను రాసిన కీర్తనలన్నీ తీసుకొచ్చి ఊరంతా చూస్తూండగా నదిలో వదిలిపెట్టాడు. ఆ కీర్తనలు తేలాయా? మునిగి పోయాయా? తుకారాం తన కవితలో ఏమీ చెప్పలేదు. జీవితచరిత్రకారులు ఆ కవితలు నదిలో మునిగిపోకుండా తేలాయన్నారు. అది కట్టుకథ అని మనం కొట్టిపారెయ్యవచ్చు. కాని ఆ కవితలు మునిగిపోలేదనీ వాటికి పాదాలొచ్చి లేచి మొత్తం మహారాష్ట్ర గ్రామ గ్రామానా సంచరిస్తున్నాయన్న సత్యం కాదనగలమా? అంతదాకా ఎందుకు? ఆ గీతాలు ఇంద్రాయణి నదిలోంచి తేలిబయటికి వచ్చి ఉండకపోతే, ఇక్కడ నా ఇంట్లో ఈ పొద్దుటివేళ నేను వాటి గురించి మీతో మాట్లాడి ఉండేవాణ్ణా?

1650 నాటికి తుకారాముడికి నలభై రెండేళ్ళు. అదే ఆయన తన గ్రామంలో కనబడ్డ చివరి సంవత్సరం. ఆ తరువాత ఆయన ఏమైపోయాడో ఎవరికీ తెలియదు. అతడెందుకు అదృశ్యమయ్యాడో ఎలా అదృశ్యమయ్యాడో ఒక రహస్యంగానే ఉండిపోయింది. ఇన్ని వివరాల్ని నమోదు చేసిన సమకాలిక సమాజం ఆ వివరాల్ని మాత్రం ఎందుకు వదిలి పెట్టింది? తెలియదు. ఆ రహస్యం రహస్యంగానే ఉండిపోవాలనుకున్నదేమో. కాని మాహాత్మ్య కారులు మాత్రం స్వర్గం నుంచి ఒక రథం వచ్చి తుకారాము జీవించిఉండగానే స్వర్గానికి తీసుకుపోయిందని రాసారు. నిజమే, తుకారాము జీవితకాలంలోనే ఆకాశమంత ఎత్తు ఎదిగాడని మనం నమ్మవచ్చు.

తుకారాము జీవితం మహారాష్ట్ర గ్రామాల్లోని అసంఖ్యాకులైన గ్రామీణుల జీవితం. కరువు పీల్చిపిప్పిచేసినప్పుడు మొత్తం కుటుంబాలకు కుటుంబాలే గ్రామాలకు గ్రామాలే తల్లకిందులైన అనేక వేల కథల్లో తుకారాము కథ కూడా ఒకటి. కాని అసంఖ్యాకులైన ఆ రైతులకీ, కూలీలకీ, చిల్లరవర్తకులకీ తమ బాధల్ని చెప్పుకోగల గొంతులేదు. వాళ్లకి మాటలు చాతకావు. వాళ్ళంతా తుకారాముడి గొంతుతో తమ దుఃఖాన్నీ, తమ నమ్మకాన్నీ పాటలు పాడుకున్నారు. కాబట్టే ఆ అభంగాల్లో ఒక దేవుడూ, ఒక భక్తుడూ కాదు, మొత్తం మహారాష్ట్ర సమాజమంతా కనిపిస్తుంది. ఆ సమాజమంతా చివరికి ఒక భక్తుడిగా మారి ఒక దేవుడి దగ్గర మోకరిల్లింది.

ఏ ఒక్క అభంగమూ అయిదారు ద్విపదల్ని మించని కీర్తన. కాని ఒక్క వాక్యం కూడా తీసెయ్యలేని, ఒక్క పొల్లు కూడా మార్చలేనంత బిగువుగా కూర్చిన కవిత్వం అది. అది గ్రామీణ రైతుల, స్త్రీల గుండెచప్పుడు లాంటి ఛందస్సు. ఆ గీతాల్ని అనువదించినప్పుడు దిలీప్ చిత్రే ఆ హృదయావేదనని మనకి అందివ్వడం మీద దృష్టిపెట్టాడు. కాని ఈ ఇద్దరు

కొత్త అనువాదకులూ ఆ బిగువునీ, ఆ బరువునీ, ఆ తేలికదనాన్నీ కూడా మనకి అందివ్వడానికి ప్రయత్నించారు. వారి అనువాదాలు ఎలా ఉన్నాయో చూపడానికి మూడు కవితలు ఇక్కడ పంచుకుంటున్నాను.

నా పాటలు సాధుసంతులు వదిలిపెట్టిన ఎంగిలి

నా పాటలు సాధుసంతులు వదిలిపెట్టిన ఎంగిలి

లేకపోతే నేను పాడగలిగే పాటలే నా ఇవి!
ఆయన పేరు కూడా సరిగ్గా పలకలేను.
నాకేమి చాతనవుతుంది?
నా పాటలు చిన్నపిల్లల తొక్కుపలుకులు.
నీకు మొత్తం తెలుసు, నా పుట్టుక, నా సత్తువ.
ఇంక చెప్పడానికేమీ లేదు.

తుకా అంటున్నాడు:
అతడే భావం, అతడే అర్థం.

(జెర్రీ పింటో)

సరైన తీరున సరిగ్గా కూర్చిన మాటలా?

సరైన తీరున సరిగ్గా కూర్చిన మాటలా?
అవొక్కటే చాలదు కవిత్వానికి.

కవిత్వానిది భాషకు అవతలి సీమ
సత్యం కోసం వెతుకులాట.

కేవలం అనుభవం, నిజమైన అనుభవం
కవిత్వానికి పరిమళం, పరిపుష్టి

నకలు మిగలదు, నిప్పు కాల్చేస్తుంది.
నిజమైన బంగారం బయటపడుతుంది.

తుకా అంటున్నాడు:
నీకేదికావాలో అదే నువ్వు.
తక్కువ వద్దు, ఎక్కువ మాటాడకు.

(జెర్రీ పింటో)

ఈ దుఃఖితులు, తాడితులు

ఈ దుఃఖితులు, తాడితులు
వీళ్ళంతా నావాళ్ళేనని ఎవరంటారో

గుర్తుపట్టు, అతడే నిజమైన సాధువు.
భగవంతుడు ఉండేదక్కడే, పోల్చుకో.

సజ్జనుడు నిలువెల్లా వెన్న,
అంగాంగం మెత్తని మనిషి.

తిరస్కృతుల్ని, బహిష్కృతుల్ని
హృదయానికి పొదువుకుంటాడు

ప్రేమించేటప్పుడు అతడికి తన కొడుక్కీ
తన దాసుడికీ మధ్య తేడా తెలియదు.

తుకా అంటున్నాడు:
ఇంకా ఏం చెప్పాలి?
అతడు సాక్షాత్తూ భగవన్మూర్తి.

(శాంతాగోఖలే)

10-2-2024

పాల్ ఎలార్డ్

శ్రీశ్రీ 'ఖడ్గసృష్టి' మొదటిసారి చదివినప్పుడు అందులో నన్ను ఆకర్షించిన చాలా వాటిల్లో పాల్ ఎలార్డ్ పేరూ, ఆయన కవితలూ కూడా ఉన్నాయి. అప్పటికి పాల్ ఎలార్డ్ కవిత్వం శ్రీశ్రీ తప్ప మరెవ్వరూ తెలుగు చేసినట్టు నాకు తెలియదు.

శ్రీ శ్రీ పాల్ ఎలార్డ్‌వి మొత్తం తొమ్మిది కవితలు అనువదించాడు. అవి 'ద్వేషగీతం' (1943), 'వాడిదే ఇంకో గీతం' (1943), 'నౌకాయానాల తర్వాత' (1945), 'పబ్లిక్ రోజా' (1945), 'స్వాతంత్ర్యం' (1947), 'ఒకరో, పలువురో' (1948), 'విషాదనగరం' (1949), 'గీతం' (1955), 'చిరుతిండి' (1974). అంటే ఒకవైపు దేశం క్విట్ ఇండియా పోరాటం ముగించి స్వాతంత్ర్యం పొందడానికి సమాయత్తం అవుతున్న కాలం నుంచి మళ్ళా ఎమర్జెన్సీ విధించే రోజులదాకా దాదాపు ముప్పైఏళ్ళ పాటు ఆయన చదువుతున్న, అనువదిస్తున్న కవుల్లో పాల్ ఎలార్డ్ కూడా ఉన్నాడన్నమాట.

ఆ తర్వాత బైరాగి 'ఆగమగీతి' నా చేతికి అందినప్పుడు మళ్ళా పాల్ ఎలార్డ్ ప్రత్యక్షమయ్యాడు. అందులో అతడివి మూడు కవితలున్నాయి. 'ప్రేయసి', 'చీకటిని సొంతం చేసుకున్నాం', 'హెచ్చరిక'. బైరాగి ఆ కవితల్ని ఇంగ్లిషునుంచి అనువదించినట్టు రాసుకున్నాడు. శ్రీశ్రీ లాగా ఎలార్డ్ అని రాయకుండా యూలార్డ్ అని రాసాడు. వీళ్ళిద్దరూ కాక, ఇస్మాయిల్ గారు కూడా పాల్ ఎలార్డ్‌వి ఒకటో రెండో కవితలు అనువదించినట్టు గుర్తు.

ఆ పదిపదిహేను అనువాద కవితలూ చదివినప్పటినుంచీ పాల్ ఎలార్డ్ పేరూ, అతడి కవిత్వమూ కొంత కొత్తగా, ఆకర్షకంగా అనిపిస్తూ ఉండేదిగాని, అతడి కవిత్వం తత్త్వం, దాని లోతు, గాంభీర్యం నేను అంచనా వేసుకోకలేకపోయాను. ఇదుగో, ఇప్పుడు

Gilbert Bowen అనువదించి సంకలనం చేసిన Selected Poems (2023) చదివినదాకా.

బోవెను అనువాద సంకలనంలో మొత్తం 44 కవితలున్నాయి. వాటితో పాటు Max Adereth అనే ఆయన రాసిన అద్భుతమైన పరిచయవ్యాసం కూడా ఉంది. కవితలూ, ముందుమాటా కలిపి నూట యాభై పేజీలు కూడా మించని ఈ పుస్తకం పూర్తి చేయగానే నాకు పాల్ ఎలార్డ్ అంటే ఏమిటో అర్థమయింది. ఒక మహాకవిని మాత్రమే కాదు, ఒక ప్రేమాస్పద మానవుణ్ణి కూడా ఎంతో దగ్గరగా చూసానన్న తృప్తి కలిగింది.

పాల్ ఎలార్డ్ కవిత్వంలో అన్నిటికన్నా మొదటగా నన్ను కట్టిపడేసిన అంశం ఆ కవిత్వంలో ఎక్కడా కావ్యభాషలేకపోవడం. ఆయన తన కవిత్వంలో ఫ్రెంచిభాష సహజగుణాలమీదా, నాదాత్మకతమీదా ఎంతవరకూ ఆధారపడ్డాడో తెలియదుగాని, అర్థాలంకారాల కోసం ఎక్కడా ప్రయత్నించలేదని మటుకు స్పష్టంగా తెలుస్తోంది. కవిత్వం ఎల్లలు దాటి ప్రసరించడానికి మెటఫరు చాలావరకూ సాయపడుతుందని మనకు తెలుసు. కాని ఎలార్డ్ కవిత్వంలో ఎక్కడా రూపకాలంకారాలకోసం వెతుకులాట కనిపించదు.

అది మామూలు భాష, మామూలు మాటలు, అత్యంత స్వభావోక్తి. కాని ఒక మాట నేరుగా హృదయం నుంచి వెలువడినప్పుడు దానికదే గొప్ప కవిత్వం కాగలదని ఈ సంపుటంలోని కవితలన్నీ ఋజువుచేస్తున్నాయి.

పాల్ ఎలార్డ్ సర్రియలిజం ప్రవక్తల్లో ఒకడు. కొన్నాళ్ళు కమ్యూనిస్టుగా తన భావాల్ని ప్రచారం చేసి మధ్యలో పార్టీ నుంచి బయటపడి, మళ్లా కమ్యూనిస్టుగా కొనసాగినవాడు. కాని సర్రియలిజం, కమ్యూనిజం రెండింటినుంచీ అతడు తన కవిత్వాన్ని కాపాడుకున్నాడు. అతడు జీవితకాలం పాటు, వర్డ్సువర్తు మాటల్లో చెప్పాలంటే, the real language of men లో తన కవిత్వం చెప్పడం సాధన చేసాడు. ఈ ప్రభావం శ్రీ శ్రీ 'ఖడ్గసృష్టి' కవితల్లోనూ, ఆ తర్వాత 'మరోప్రస్థానం' కవితల్లోనూ కనిపిస్తుంది. మరీ ముఖ్యంగా ఇస్మాయిల్ గారిది ఈ తరహా శైలి అని చెప్పవచ్చు. ఉదాహరణకి ఈ వాక్యాలు చూడండి:

పరిపూర్ణ న్యాయం

జీవితం పట్ల మనుషుల నమ్మకం
ద్రాక్షల్ని పానీయంగా మార్చడం లాంటిది

వాళ్ళు బొగ్గునుంచి నిప్పు సృష్టిస్తారు
ముద్దుల్లోంచి మనుషుల్ని రూపొందిస్తారు.

జీవితం పట్ల మనుషుల నమ్మకం
తీవ్రాతితీవ్రం. అది సకల యుద్ధాల
నడుమ, దైన్యం నడుమ, మృత్యువు ఎదట
కూలిపోకుండా ప్రాణాల్తో నిలబడటం.

జీవితం పట్ల మనుషుల నమ్మకం
కడు ఉదాత్తం, అది నీళ్ళని విద్యుత్తుగా
మార్చడం, కలల్ని వాస్తవంగా, శత్రువుల్ని
సోదరులుగా మార్చుకోడం లాంటిది.

చాలా పురాతనమైన నమ్మకం, సరికొత్తది
కూడా. ఎప్పటికప్పుడు తనని తాను మరింత
బలపర్చుకుంటూనే ఉంటుంది, పసిపాప మనసు
మొదలుకుని పరమోన్నత తత్త్వం దాకా.

కవిత్వానికి ప్రధాన శత్రువు వాగ్ధాటి. దీన్ని మనం రెటారిక్ అనవచ్చు లేదా affectation అనవచ్చు, sentimentality అని కూడా అనవచ్చు. కవి వక్తగా మారినా, ప్రవక్తగా మారినా కూడా కవి కాకుండా పోతాడు.

తన కాలం నాటి రాజకీయ అవసరాలు దృష్టిలో పెట్టుకుని కవిత్వం చెప్పే కవులకి వక్తృత్వ ప్రమాదం ఉంటుంది. తన కాలంలో తన కళ్ళముందు కనిపిస్తున్న సామాజిక, రాజకీయ అవసరాల్ని పట్టించుకోకుండా కాలాతీతమైన విషయాల గురించి మాట్లాడాలనుకునే కవి ప్రవచనకారుడిగా మారిపోతాడు. ఈ రెండు వైరుధ్యాల మధ్యా, తూకం తప్పిపోకుండా కవిత చెప్పడమే కవికి నిజమైన పరీక్ష. ఒక విధంగా కత్తిమీద సాము అది.

ముఖ్యంగా తెలుగు వచనకవిత్వంతో నాకున్న ఇబ్బంది ఇదే. పద్యం ఛందస్సు మీద ఆధారపడింది కాబట్టి వచనకవితని లయమీద ఆధారపడ్డదిగా చూడటం తెలుగు కవులు చేస్తూ వచ్చిన పొరపాటు. లయాత్మక వచనం నిజానికి వక్తృత్వం తప్ప మరేమీ కాదు. లయ చాలావరకూ శబ్దాలంకారాల మీద ఆధారపడుతుంది కాబట్టి ఛందస్సునుంచీ,

లయనుంచీ కవిత్వాన్ని బయటపడెయ్యాలనుకుంటే, అర్థాలంకారాలు మాత్రమే శరణ్య-మవుతాయి అనిపిస్తుంది, మొదట్లో.

కాని తన అనుభూతిని, ఆవేదనని గాఢమైన చింతనగా మార్చుకోగలిగిన కవికి, అసలు ఏ అలంకారాల్తో పనిలేని కావ్యోక్తి సాధ్యం కావడం అసాధ్యం కాదు. అటువంటి సాధన చేసిన కవుల్లో ఎలార్డ్ ఉన్నాడని, ముందు వరసలో ఉన్నాడనీ ఈ కవితలు చదువుతున్నంతసేపూ స్ఫురిస్తూనే ఉంది. ఉదాహరణకి ఈ కవిత చూడండి.

ఇది గాబ్రియెల్ పెరి (1902-41) అనే అతడి మీద రాసిన కవిత. పెరి ఒక పాత్రికేయుడు, రాజకీయవాది. కమ్యూనిస్టు. ఫ్రాన్సుని నాజీలు ఆక్రమించుకోడానికి వ్యతిరేకంగా అతడు రాసిన రాతలకి గాను అతణ్ణి 1941 మే లో అరెస్టు చేసారు, ఆ ఏడాది డిసెంబరులో కాల్చేసారు. తన అభిప్రాయాల్ని ప్రకటించినందుకు మరణించవలసి వచ్చిన ఒక రచయిత మీద రాసిన ఈ కవిత చూడండి:

గాబ్రియేల్ పెరి

జీవితం వైపు విశాలంగా చాచిన
బాహువులు తప్ప మరే రక్షణ కవచంలేని
ఒక మనిషి మరణించాడు.
తుపాకుల్ని ద్వేషించే దారి తప్ప
మరో దారి తెలియనందుకు
ఒక మనిషి మరణించాడు.
చరిత్రవిస్మృతిలోకి నెట్టేసే మృత్యువుతో
ఇంకా పోరాడుతూనే ఉన్నందుకు
ఒక మనిషి మరణించాడు.

అతడేవేవి కోరుకున్నాడో
అవన్నీ మనమూ కోరుకున్నాము
అవన్నీ ఇవాళే కావాలని కోరుకున్నాం
కళ్ళల్లో నెలకొన్న హృదయంలో
వెలిగే సంతోషపు వెలుతురూ
ఈ భూమ్మీద ఒకింత న్యాయమూ.

మనకి బతకడానికి సాయం చేసే పదాలుంటాయి
చాలా మామూలు పదాలు
వెచ్చదనం అలాంటి పదం నమ్మకం అలాంటి పదం
ప్రేమ న్యాయం స్వేచ్ఛ అలాంటి ఒక పదం
శిశువు అలాంటి ఒక పదం, దయ ఒక పదం
కొన్ని పూలపేర్లు కొన్ని పండ్ల పేర్లు
ధైర్యం అనే పదం కనుగొనడం ఒక పదం
అన్నదమ్ముడు అనే పదం కామ్రేడ్ అటువంటి పదం
కొన్ని నేలల పల్లెల పేర్లు
స్త్రీల స్నేహితుల పేర్లు
ఇప్పుడు వాటికి మనం పెరి అనే పదం కూడా చేరుద్దాం
మనకి ప్రాణంపోసే ప్రతిఒక్కదానికోసం
పెరి మరణించాడు
అతణ్ణి మనం స్నేహితుడా అనిపిలుద్దాం
అతడి వక్షం తుపాకిగుళ్ళకు ఛిద్రమైంది
కాని అతడికి నిజంగా మనం కృతజ్ఞులమై ఉండాలి
ఎందుకంటే అతడివల్లనే
మనం ఒకరినొకరం మరింత బాగా అర్థం చేసుకున్నాం
మనం ఒకరినొకరం స్నేహితుడా అని పిలుచుకున్నంతకాలం
అతడి ఆశ సదా బతుకుతూనే ఉంటుంది.

ఇలాంటి కవుల్ని చదివాకనే మహాప్రస్థాన గీతాల తర్వాత శ్రీశ్రీ తన శబ్ద-సార్వభౌమత్వం మీద తనే తిరుగుబాటు చేసుకున్నాడు. అంటే తన భాషాసామ్రాజ్యం మీద తనే తిరుగుబాటు చేసి మామూలు మాటల్లో హృదయావేదన మొత్తం కుమ్మరించగల విద్యకోసం సాధనచేసాడు. తిక్కన్న లాగా, వేమన్నలాగా, గురజాడలాగా. 'మరో ప్రస్థానం' నాటికి ఆ స్థాయికి చేరగలిగాడు.

ఎలార్డ్ కవిత్వం చదువుతుంటే మన ప్రగల్భాలు, పటాటోపాలు స్పష్టంగా తెలుస్తూ ఉంటాయి. కవిత్వం ఒకప్పుడు సత్యాన్ని అన్వేషించింది. ఆ తర్వాత సౌందర్యాన్ని అన్వేషించింది. కాని ఆధునిక యుగంలో దయనీ, ప్రేమనీ, హితాన్నీ అన్వేషిస్తున్నది. దాన్ని ఎలార్డ్ the milk of human kindness అన్నాడు. ఆ దయాక్షీరంలో మరేది పడ్డా

ఆ పాలు విరిగిపోతాయని అతడికి తెలుసు. అందుకనే అతడి కవిత్వంలో ఉపమ, రూపకం, ప్రతీక, పదచిత్రం ఏవీ కనిపించవు. ముందుమాటలో రాసినట్టుగా, అతడికి 'సంతోషం ఒక వెలుతురులాంటిది కాదు, దానికదే ఒక వెలుతురు.' కాబట్టే, ఈ వాక్యాలు అతడి కవిత్వానికి మోటో అని చెప్పుకోవచ్చు:

> మనం బతకడానికి సాయం చేసే పదాలుంటాయి
> చాలా మామూలు పదాలు.

సాధారణ రాజకీయ కవితలు రాసినప్పుడు కూడా అతడు ఇటువండి మామూలు పదాల్తోనే అసాధారణమైన ప్రభావాన్ని కన్పరుస్తుంటాడు. ఉదాహరణకి, ఈ కవిత చూడండి:

స్పెయినులో

> స్పెయినులో నెత్తురోడుతున్న ఒక వృక్షముంది
> అది స్వేచ్ఛావృక్షం.
>
> స్పెయినులో ఒకటే మాట్లాడుతుండే ఒక నోరుంది
> అది స్వేచ్ఛాకంఠం.
>
> స్పెయినులో పరిశుద్ధద్రాక్షారసపాత్ర ఒకటుంది
> అది దాన్నిసేవించే జనగళం.

ఇదే భావాన్ని తెలుగు రాజకీయ వచనకవి దాదాపుగా ఒక ఉపన్యాసమంత సుదీర్ఘంగా రాసుకుపోతాడని వేరేచెప్పనక్కర్లేదు కదా. తెలుగు కమ్యూనిస్టు కవులు ప్రేమనీ, పోరాటాన్నీ విడివిడిగా చూసారు. వాటిమధ్య బలంగా బిగించి పెట్టిన పరదాని శివసాగర్ కొంత వరకూ చింపెయ్యగలిగాడు. కాని ఎవరో ఒకరిని ప్రేమించకుండా, ఒక మనిషినో, ఒక వర్గాన్నో, ఒక జాతినో, ఒక దేశాన్నో, ఒక సత్యాన్నో, ఒక సూత్రాన్నో ప్రేమించకుండా నువ్వు దేనికోసం పోరాడతావు?

అందుకనే మాక్స్ అడెరెత్ ఇలా రాస్తున్నాడు:

> The theme of brotherhood is an extension of love. Loving a woman and loving his fellow human beings were to Eluard part of the same process of overcoming solitude.

ఎలార్డ్‌కి ఈ విషయంలో ఇంత స్పష్టత ఉందని నాకు తెలియడం ఇదేగాని, నేను గత ఇరవై ముప్పై ఏళ్ళుగా చెప్తున్నది ఇదే. ప్రాచీన చీనాకవులూ, తమిళసంగం కవులూ చేసింది ఇదే. వాళ్ళు చెప్పిందే ఎలార్డ్ మళ్లా ఎంత మామూలు మాటల్లో చెప్తున్నాడో చూడండి:

We shall not reach the goal one by one but in twos
Knowing each other in twos we shall all know one another
We shall all love one another and our children will laugh
At the somber legend in which a lonely man is weeping

ఆ క్షణం, కవి చెప్పినట్లుగా 'బాధలన్నీ పాతగాథలై' పోయే క్షణం ఒక్కరూ తనలో తాను కుములుతుంటే వచ్చేదికాదు, మరొకరితో కలవాలి. కలిసి నడవాలి, నమ్మాలి, నమ్మకాల్ని నిజంచేసుకోడానికి కలిసి పోరాడాలి.

19-02-2024

సమాశ్వాస సౌందర్య గాథ

మొన్న ఒక రోజు కూచుని మొత్తం సుందరకాండ మరోసారి చదివేను. మనశ్శాంతి కోరుకునేవారూ, తాము తలపెట్టిన పనుల్లో విజయం సిద్ధించాలనుకునేవాళ్ళూ, తమ మనసుని నిర్మలం చేసుకోవాలనుకునేవాళ్ళూ, తమ ఆత్మని ఒక ఔన్నత్యం వైపుగా తీసుకుపోవాలనుకునేవాళ్ళూ, సుందరకాండ పారాయణం చెయ్యడం ఈ దేశంలో తరతరాలుగా ఒక సంప్రదాయంగా కొనసాగుతూ వస్తున్నది. 68 సర్గల ఆ కాండ దానికదే ఒక కావ్యంగా, పవిత్రగ్రంథంగా, రామాయణసారంగా పరిగణనకు నోచుకుంది. మహాభారతం నుంచి విడివడి భగవద్గీత ఎలా ఒక ఆధ్యాత్మిక, యోగవిద్యాగ్రంథంగా గుర్తింపు పొందిందో, సుందరకాండ కూడా రామాయణంతో సమానంగా గౌరవం పొందిందని నేను కొత్తగా చెప్పనక్కర్లేదు.

కాని ఆ కాండ చదివిన ప్రతి ఒక్క పాఠకుడికీ ఒకే రకమైన అనుభూతి సిద్ధిస్తుందని చెప్పలేం. గుంటూరు శేషేంద్రశర్మకి ఆ కాండ మొత్తం శ్రీవిద్యాసారంగా కనిపించింది. సీతమ్మవారు శ్రీవిద్యగానూ, హనుమంతుడు ఒక శ్రీవిద్యోపాసకుడిగానూ ఆయనకు కనబడ్డారు. తనకి కలిగిన దర్శనాన్ని ఆయన 'షోడశి, రామాయణ రహస్యాలు' అనే పుస్తకంగా రాసారు కూడా. ఆ పుస్తకానికి ముందుమాట రాస్తూ విశ్వనాథ సత్యనారాయణ సుందరకాండను శేషేంద్ర చదివినపద్ధతి చూసి నిలువెల్లా చకితుడైపోయాడు కూడా. షోడశిలో గొప్ప విషయమేమిటంటే, శేషేంద్ర తన దర్శనం మొత్తాన్ని వాల్మీకి శ్లోకాల ఆధారంగానే వివరించడం. ఎక్కడా ఒక్క మాట, ఒక్క భావన శేషేంద్ర అదనంగా చెప్తున్నట్టు ఉండదు. చూడబోతే షోడశి చదివాకనే వాల్మీకి సుందరకాండ రాసాడా అనిపిస్తుంది మనకి!

కాని నాకెందుకనో సుందరకాండని అటువంటి ఏదో ఒక దృక్పథానికో, వ్యాఖ్యానానికో కట్టిపడెయ్యలేం అనిపిస్తుంది. అలా చెయ్యడం కృతకంగా కూడా అనిపిస్తుంది.

చదివిన ప్రతి సారీ కొత్త సౌందర్యమయ ప్రపంచంలోకి మేల్కొల్పే ఆ కావ్యాన్ని ఏదో ఒక ఆధ్యాత్మిక విద్యాగ్రంథంగా వివరించడం సముద్రాన్ని ఒక చెరువుగా మార్చడానికి ప్రయత్నించడమే అవుతుంది.

అసలు సుందరకాండకి ఆ పేరు ఎందుకొచ్చింది? ఈ ప్రశ్న ఎవరికేనా కలగడం సహజం. దీనికి శ్రీభాష్యం అప్పలాచార్యులు ఇచ్చిన అత్యంత రసమయ వివరణ విన్నాక ఒళ్ళంతా పులకించకుండా ఉండదు. కాని ఆ మహాభావుకుడు అంత మనోహరంగా ఇచ్చిన వివరణ అంతా విన్నాక కూడా, ఒకసారి కాదు, చాలాసార్లు విన్నాక కూడా, సుందరకాండలోని సౌందర్యాన్ని మనం పూర్తిగా పట్టుకోగలిగామని ఎప్పటికీ నిశ్చయంగా చెప్పుకోలేమనిపిస్తుంది. ఉదాహరణకి, ఆ కాండ ఆద్యంతం ఎన్ని పూలు! ఎన్ని పూలు!

సుందరకాండ ఒక పూల కడలి. ఆ కాండ మొత్తాన్ని వాల్మీకి ఎందుకని అంతలా పూలవరదతో ముంచెత్తాడు? సుందరకాండ మీద నేను చదివిన వ్యాఖ్యానాల్లో, విన్న ప్రసంగాల్లో ఒక్కరు కూడా ఈ పూల ఉప్పెన గురించి ప్రస్తావించగా చూడలేదు. శేషేంద్ర వంటి రసజ్ఞుడు కూడా సుందరకాండ అనే మంత్రమహోదధిలో ఈదులాడాలని చూసాడే గాని, ఆ పూలసముద్రం గురించి కనీసం ఒక్కమాట కూడా మాట్లాడలేదు.

కొన్ని చాలా ఆశ్చర్యంగా ఉంటాయి. రామాయణంలోని ఋతువర్ణనల్లో రాముడు అయోధ్యని వదిలిపెట్టాక మొదటిసారి కనిపించిన వసంతం సుందరకాండలో గట్లు తెంచుకుని మరీ కనిపిస్తుంది. కిష్కింధకాండలో రాముడి విరహాన్ని వర్ణించడానికి హేమంత ఋతువునీ, వర్షాకాలాన్నీ వాడుకున్న కవి, అశోకవనంలో సీత వేదనని చిత్రించే సమయంలో అంత వాసంతసంతోషాన్ని ఎందుకు వర్ణించాడు? అసలు సుందరకాండ మొదలవుతూనే వైడూర్యపు రంగుల్తో మెరిసిపోతున్న పచ్చికబయళ్ళు కనిపిస్తాయి. ఇక హనుమంతుడు సీతను చూసి వెనక్కి రాగానే ఆ సంతోషంలో వానరులంతా చేసిన పని నందనవనంలాంటి ఒక మధువనాన్ని పూర్తిగా కొల్లగొట్టడం. ఈ మధ్యలో కావ్యమంతా పూలు, పూలు, పూలు. ఆ పూలమధ్య హనుమంతుణ్ణి ఎంత వర్ణించినా వాల్మీకికి తనివితీరలేదని చెప్పడానికి మొత్తం పధ్నాలుగవ సర్గ సాక్ష్యమిస్తుంది.

మరీ ముఖ్యంగా ఈ శ్లోకం:

> పుష్పావకీర్ణశ్శుశుభే హనుమాన్ మారుతాత్మజః
> అశోకవనికా మధ్యే యథా పుష్పమయో గిరిః (14-11)

(మారుతాత్మజుడైన ఆ హనుమంతుడిమీద పూలన్నీ జలజలరాలాయి. అప్పుడు ఆయన అశోకవనమధ్యంలో ఒక పూలకొండలాగా కనిపించాడు.)

ఒక్క పూలేనా! సంస్కృత కావ్యసాహిత్యంలో వెన్నెల వర్ణనల్లో తలమానికం అని చెప్పదగ్గ వర్ణన కూడా మనకి సుందరకాండలోనే కనిపిస్తుంది. ఇక ఆ కావ్యం పొడుగునా సముద్రాన్ని, నగరాన్ని, రాత్రిని, అంతఃపురాన్ని, అశోకవనాన్ని, రావణుణ్ణి, రాక్షసుల్ని, సీతని వర్ణించడానికి వాల్మీకి వాడిన ఉపమానాలు వాటికవే ఒక వరద. ఆ ఉపమానాలు కాలాన్ని దాటి నిలబడటమే కాదు, ఇప్పటికి కూడా సరికొత్తగా కనిపిస్తుండటం ఆశ్చర్యం. సుందరకాండ తెరిచిన ప్రతిసారీ, ఆ ఉపమానాలు ఎప్పటికప్పుడు సరికొత్తగా తోచి నన్ను నిశ్చేష్టుణ్ణి చేస్తుంటాయి. ఉదాహరణకి, హనుమంతుడి ద్వారా రాముడి మాటలు వినగానే కలిగిన సంతోషాన్ని చెప్పడానికి సీతమ్మ ఇలా అంటున్నది:

త్వాం దృష్ట్వా ప్రియవక్తారం సంప్రహృష్యామి వానర
అర్థసంజాతస్యేవ వృష్టిం ప్రాప్య వసుంధరా (40-2)

(హనుమా! నిన్ను చూసి నీ మాటలు వినగానే నాకు చాలా సంతోషం కలిగింది. సగం పెరిగిన పైరుమీద వానపడ్డ నేలలాగా ఉన్నాన్నేను.)

ఏమి ఉపమానం ఇది! సగం పెరిగిన పైరుమీద వాన పడ్డ నేల! 'అర్థసంజాత్యసేవ వృష్టిం ప్రాప్య వసుంధరా!' దాదాపుగా ప్రతి సర్గలోనూ ఇటువంటి ఉపమానాలు, చదివిన ప్రతిసారీ కొత్తగా సాక్షాత్కరించేవి ఎన్నో కనిపిస్తాయి.

అలాగే లంకలో ప్రవేశించాక సీతాదేవి ఇంకా కనబడక ముందు హనుమంతుడు దుఃఖానికి లోనై మళ్ళా తనకు తాను ధైర్యం చెప్పుకుంటూ చెప్పుకున్న మాటల్లో రెండు ఉపమానాలు చూడండి:

అథవైనం సముత్ క్షిప్య హ్యుపరిసాగరమ్
రామయోపహరిష్యామి పశుం పశుపతేరివ (13-50)

(లేదంటే, పశువుని యజమానికి అప్పగించినట్టు ఈ రావణుణ్ణి సముద్రం మీదుగా ఎత్తుకుపోయి రాముడి ముందు సమర్పిస్తాను.)

అలాగే మరొక శ్లోకం చూడండి:

జిత్వా తు రాక్షసాన్ సర్వాన్ ఇక్ష్వాకు కులనందినీమ్
సంప్రదాస్యామి రామాయ యథాసిద్ధిం తపస్వినే (13-57)

(రాక్షసులందరినీ జయించి, ఇక్ష్వాకు కులానికి సంతోషకారకురాలైన సీతాసాధ్విని, ఒక తపస్వికి తపస్సిద్ధిలాగా రాముడికి సమర్పిస్తాను.)

చిన్న ఉపమానాలు. కానీ సముద్రమంత స్ఫూర్తి. రెండూ రామార్పణలే. కానీ మొదటిది పశువుని పశుపతికి అర్పించినట్టు. రెండవది తపస్వికి తపస్సిద్ధిని సమర్పించినట్టు.

కాని ఈ కావ్యశయ్యాసౌందర్యాన్ని దాటి కవి దర్శనంలోని లోతును సంభావించడం మరింత సంతోషకరంగా ఉంటుంది. ఉదాహరణకి ఎంతో పారవశ్యంతో వర్ణించిన ఆ అశోకవనాన్ని చివరికి హనుమంతుడు ధ్వంసం చేసిగాని లంకవదిలి బయటకు రాలేదే! ఎంత రమణీయమైనప్పటికీ ఆ అశోకవనం అసురవనం, దనుజవనం అనే స్ఫురణ హనుమంతుణ్ణి వదిలిపెట్టలేదనే మనకి అర్థమవుతూ ఉన్నది. కాని తిరిగి ఇవతలి ఒడ్డుకు చేరాక తోటి వానరుడి తాళవనాన్ని కూడా అలానే ధ్వంసం చేసారని కవి చెప్పకుండా ఉండటం లేదే!

సుందరకాండ ఒక జీవితకాల పఠనీయకావ్యం. సంస్కృతంలో ఒక నానుడి ఉంది. 'మాఘే మేఘే గతం వయః' అని. అంటే మాఘుడు రాసిన శిశుపాలవధ కావ్యాన్నీ, కాళిదాసు మేఘసందేశాన్నీ చదువుకుంటూ, మళ్ళీ మళ్ళీ చదువుకుంటూ, చదివిన దాని గురించి మిత్రుల్తో మాట్లాడుకుంటూ ఉండగానే కాలం గడిచిపోయిందని ఆ మాటకి అర్థం. కాని నిజానికి ఒక కావ్యపాఠకుడు తన జీవితకాలాన్ని రసమయం చేసుకోడానికి సుందరకాండ చదవడం కన్నా మేలిమి వ్యాపకం మరొకటి ఉంటుందనుకోను. నిజానికి నాలాంటి అల్పజ్ఞుడికే ఈ కావ్యంలోని ప్రతి పుటలోంచి కనీసం ఒక శ్లోకం గురించి, ఒక పదప్రయోగం గురించి, ఒక ఉపమాలంకారం గురించి ఏదేదో చెప్పుకోవాలన్న ప్రలోభమే ఇంత బలంగా ఉంటే, నిజంగా రసజ్ఞుడైనవాడి సంతోషం ఎలా ఉంటుందో కదా!

ఇదంతా మరొకసారి రాయవచ్చు, ఇంతకన్నా మరింత వివరంగా, మరింత లోతుగా రాసుకోవచ్చుగాని, ఈ సారి సుందరకాండ చదివినప్పుడు నన్ను కట్టిపడేసిన ఒక శ్లోకం, నాకు కళ్ళనీళ్ళు తెప్పించిన ఒకఘట్టం– వాటి గురించి మీతో పంచుకోవాలనే ఈ మాటలు రాయడం మొదలుపెట్టాను.

నిజానికి సుందరకాండ ఇద్దరు వేదనాతప్తమానవుల కథ. అత్యంత వేదనాభరితంగా చిత్రించవలసిన ఘట్టాలు అడుగడుగునా ఉన్నాయి. కాని మహర్షి ఈ కావ్యాన్ని వేదనని

పైకెత్తడంకోసం రాయలేదు. వేదన శాశ్వతం కాదని చెప్పడమే సుందరకాండ ప్రయోజనం. ఆ సందేశాన్ని ఈ శ్లోకం, ఈ రెండు పంక్తుల ఈ చిన్ని శ్లోకం ఎంత మహిమాన్వితంగా పట్టుకుందో చూడండి:

> అనిర్వేద శ్రియోమూలమ్ అనిర్వేదః పరం సుఖమ్
> అనిర్వేదో హి సతతమ్ సర్వార్ధేషు ప్రవర్తకః (12-10)

(అనిర్వేదమే శ్రేయస్సుకి మూలం. అనిర్వేదమే అన్నిటినీ మించిన సుఖం. అనిర్వేదమే సకల కార్యాల్నీ సఫలం చేసేది.)

రెండు పదాలు. 'అనృశంస'. భారతం మొత్తం సారాంశం 'అనృశంస' అన్నపదంలో ఉంది. అనృశంస అంటే దయ. తోటిప్రాణిని బాధపెట్టకపోవడం. అది తన జీవలక్షణమని ధర్మరాజు యక్షప్రశ్నలకి జవాబిస్తూ యక్షుడితో చెప్తాడు. అలాగే 'అనిర్వేదం' అనే పదం రామాయణ సారాంశంగా చెప్పవచ్చు. రామాయణ కావ్యమంతా వేదన పరుచుకుని ఉంటుంది. కాని ప్రతి ఒక్కసారీ రాముడు ఆ వేదనని అనిర్వేదంతో దాటుతుండటం మనకి అర్థమవుతూ ఉంటుంది కూడా.

ఇక ఈ సారి సుందరకాండ చదివినప్పుడు నా కళ్ళని సజలాలు చేసిన ఘట్టం సీతాదేవి హనుమంతుడితో చెప్పిన కాకాసుర వృత్తాంతం. 'అమ్మా, నేను నిన్ను చూసినట్టు రాముడికి చెప్పడానికి నాకేదైనా ఒక గుర్తు అందించమం'టే సీతాదేవి అతడికి అందించిన గుర్తు కాకాసుర కథ. ఆ తర్వాతనే ఆమె తన చూడామణి అతడి చేతుల్లో పెట్టింది. ఇద్దరు ప్రేమికుల మధ్య వారి ప్రేమకి నిజమైన గుర్తు వస్తువులు కాదు, నగలు కాదు, కానుకలు కాదు, ఒకరినొకరు అత్యంత గాఢంగా ప్రేమించుకున్నప్పటి ఒక జ్ఞాపకమే అని చెప్పడంలో మహర్షి చూపించిన ఈ మెలకువ నన్ను చకితుణ్ణి చేసింది. ఇక ఆ కథ మొత్తం చెప్తూ, సీతమ్మ ఇలా అంటున్నది:

> మత్కృతే కాకమాత్రే తు బ్రహ్మాస్త్రం సముదీరితం
> కస్మాద్యో మాహరత్ త్వత్తః క్షమసే తం మహీపతే (38-38)

(నా కోసం ఒక కాకిమీదనే బ్రహ్మాస్త్రాన్నే ప్రయోగించిన ఓ రాజా! అటువంటిది నన్ను అపహరించిన వాణ్ణి ఎందుకు ఉపేక్షిస్తున్నావు?)

ఈ వాక్యాలు చదవగానే నాకు పట్టలేనంత దుఃఖం వచ్చింది. మన జీవితాల్లో కూడా మనల్ని లోకులు కాకులై పొడుస్తున్నప్పుడు భగవంతుడు బ్రహ్మాస్త్రం ప్రయోగించడం

ఎన్నో సార్లు మనకి అనుభవంలోకి వచ్చిన విషయమే. కాని అంతకు మించిన కష్టం కలిగినప్పుడు, ఆ కష్టాన్ని భరించలేకపోతున్నప్పుడు, ఆ కష్టాన్ని, ఆ వేదనని నువ్వు త్వరలోనే దాటగలవని దేవుడి తరఫున ఒక దూత సముద్రాన్ని ఈది మరీ మనదగ్గరకు వచ్చి చెప్తాడే, ఆ సమాశ్వాస సౌందర్యగాథనే సుందరకాండ.

1-3-2024

కర్ణికార పుష్పాలు: మూడు దృశ్యాలు

ఈ రోజు 'కల్కి' ఆన్‌లైన్ పత్రికలో ఒకామె రేలపూల గురించి రాసింది. ఇండియన్ లాబర్నమ్‌గా పిలిచే రేలచెట్టు తమిళ సంగంసాహిత్యంలో, తేవారంలో కొన్రై పూలచెట్టుగానూ, రామాయణమహాభారతాల్లో కర్ణికారవృక్షంగానూ వర్ణనకు నోచుకున్న సంగతిని గుర్తుచేసిందామె.

వాల్మీకిని చూస్తే ఆశ్చర్యమేస్తుంది. రామాయణగాథ పొడుగునా ఆయన ఎన్ని పూలనీ, ఎన్ని చెట్లనీ ఎక్కడికక్కడ ఎలా నాటుకుంటూ వచ్చాడో! మళ్ళా కొన్ని పూలు మరీ ప్రత్యేకం. వాటిని చూస్తే ఆయనకి ఒక్క అవస్థకాదు, మానవజీవితంలోని సంతోషం, వియోగం, విలాపం– పరస్పరవిరుద్ధావస్థలు కూడా గుర్తొస్తాయి.

అలాంటి పూలల్లో కర్ణికారపుష్పాలు మరీను. అలాంటి మూడు తావులు చూడండి:

కర్ణికార పుష్పాలు: మూడు దృశ్యాలు

1

(భరద్వాజ ఆశ్రమానికి భరతుడితో వెళ్ళినప్పుడు, అక్కడ కౌసల్య భుజాన్ని ఆనుకుని నిలబడ్డ సుమిత్రను వర్ణిస్తున్న దృశ్యం)

అస్య వామా భుజం శ్లిష్టా యా ఏషా తిష్ఠతి దుర్మనాః
కర్ణికారస్య శాఖా ఇవ శీర్ణపుష్పా వనాంతరే

(అయోధ్య : 92-22)

ఆమె ఎడమ భుజాన్ని పట్టుకుని
వేలాడుతున్న ఆ దుఃఖితురాలు
అడవిలోపల వాడిపోయిన
రేలపూల కొమ్మలాగా ఉంది

2

(పర్ణశాలలో సీత కనిపించనప్పుడు రాముడు శోకిస్తూ ప్రతి చెట్టునీ, ప్రతి పువ్వునీ, ప్రతి పక్షినీ సీత జాడ గురించి అడుగుతో కర్ణికారవృక్షాన్ని కూడా అడుగుతున్నాడు.)

అహో త్వమ్ కర్ణికార అద్య పుష్పితః శోభసే భృశమ్
కర్ణికార ప్రియాం సాధ్వీమ్ శంస దృష్ట్వా యది ప్రియా

(అరణ్య, 60-20)

ఓహో! విరబూసిన కర్ణికారమా!
నీ పూలంటే ఆమెకి ఎంత ఇష్టమని!
అంతమంచి మనిషి, నా ప్రాణం-
ఆమెని చూసి ఉంటే చెప్పవూ!

3

(పంపా సరోవర తీరంలో అడుగుపెట్టిన రామలక్ష్మణులకి అడవి అంతా ఆవరిస్తున్న వసంతశోభ కనిపించింది. ఆ వసంతఋతు వైభవంలో కర్ణికారపుష్పాల పసిడివెలుగు కనిపించకుండా ఎలా ఉంటుంది!)

సుపుష్పితాంసు పశ్య ఏతాన్ కర్ణికారాన్ సమన్తతః
హాటక ప్రతి సంఛన్నాన్ నరాన్ పీతాంబరాన్ ఇవ.

(కిష్కింధ: 1-21)

అంతటా నిండుగా విరబూసిన
ఈ కర్ణికారవృక్షాల్ని చూస్తుంటే
పచ్చటి ఉడుపులు కట్టుకుని మరీ
అవి పసిడినగలు తొడుక్కున్నట్టుంది

26-4-2024

సంతోషం ఏ రంగులో ఉంటుంది

మిత్రురాలు పంపించిన పుస్తకాల్లో అన్నిటికన్నా ముందు ఏ పుస్తకం చేతుల్లోకి తీసుకుని ఉంటానో మీరు ఊహించగలరు. చీనా కవిత్వానికీ నాకూ ఏదో జన్మాంతర సంబంధం ఉందనుకుంటాను. ఆ కొండలూ, ఆ లోయలూ, ఆ సుదీర్ఘమైన మట్టిబాటలూ, ఆ ఎర్రపూల చెట్లూ, ఆ పిల్లంగోవి పాటలూ– నేను ప్రాచీన చీనాకవిత్వం చదివినప్పుడల్లా, ఆ పాటలు నా చిన్నప్పుడు మా ఊళ్ళో విన్నవే అని అనిపిస్తూంటుంది. కాని ఆ మాట ఆధునిక చీనా కవిత్వం గురించి అనుకోలేనేమో అనే సంకోచంతో ఇన్నాళ్ళూ ఆధునిక చీనాకవితకి ఒకింత ఎడంగానే గడిపాను. కాని ఇదుగో, Michelle M Yeh సంకలనం చేసిన A Century of Modern Chinese Poetry (2023) తెరవగానే నాకొక విశాలమైన ఆకాశం దొరికినట్టు అనిపించింది.

మిషెల్లి యూనివెర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియాలో తూర్పు ఆసియా భాషావిభాగంలో ఆచార్యులు. ఆమె 1992 లో మొదటిసారిగా వెలువరించిన ఈ సంకలనాన్ని ఇప్పుడు మరింత సమగ్రపరిచి మళ్ళా వెలువరించారు. చైనా, తైవాను, హాంక్ కాంగ్, మలేషియా, సింగపూలకు చెందిన దాదాపు 85 మంది కవులు రాసిన 280 కవితల సంకలనం ఇది. ఇందులో ఆరు విభాగాల్లో ఆమె ఒక శతాబ్ది పొడుగునా వికసించిన చీనా కవిత్వాన్ని, ముఖ్యమైన కవుల్నీ మనకు పరిచయం చేస్తూ వారి కవితలు కొన్ని అనువాదం చేసి అందించారు.

అందులో మొదటిభాగం 1910-20 మధ్యకాలంలో Formative period. రెండవ భాగం 1930-40 మధ్య The First Flowering of Modern Poetry. నేను ఇప్పటికీ ఇంకా ఆ రెండవభాగం దగ్గరే ఆగిపోయాను. దాదాపుగా మన భావకవుల్లాంటి ఆ రెండవ

తరం చీనా కవుల్ని చదువుతుంటే నాకెప్పణ్ణుంచో బాగా తెలిసిన ఒక మనోహర ప్రపంచంలో మళ్ళా అడుగుపెట్టినట్టుంది. ఆ కవుల కవిత్వం మరింత చదవాలనే దాహంతో The Flowering of Modern Chinese Poetry (2016) పుస్తకం మొత్తం ఆవురావురుమంటూ చదివేసాను. ఆ పుస్తకం గురించి రేపో మర్నాడో మీతో ఎలానూ పంచుకోకుండా ఉండలేను. ఇప్పటికి మాత్రం, ఈ Modern Chinese Poetry నుంచి He Qifang (1912-77) రాసిన రెండు కవితలు మీకోసం.

సంతోషం

సంతోషం ఏ రంగులో ఉంటుందో చెప్పవా
పావురాల రెక్కల్లాగా తెలుపా లేక చిలకముక్కులాగా ఎరుపా
సంతోషం సవ్వడి ఎలా ఉంటుంది?
పిల్లంగోవి పాటలానా? పైన్ చెట్ల గలగల్లానా
లేక ప్రవహిస్తున్న జలాల మర్మరధ్వనిలానా?

ఒక వెచ్చని చేతిని తాకినట్టు
దాన్ని చేతుల్లోకి తీసుకోగలమా?
దాని చూపు
ప్రేమతో ప్రకాశిస్తుందా?
హృదయాన్ని సున్నితంగా వణికిస్తుందా?
మౌనవిషాదాశ్రువులు ఒలికిస్తుందా?

సంతోషం ఎలా అడుగుపెడుతుంది చెప్పు?
ఎక్కణ్ణుంచొస్తుంది?
సంధ్యవేళ మినుకుమనే మిణుగురులానా
గులాబీరేకల సుగంధంలానా?
తన పాదాలకు మువ్వలు కట్టుకు మరీ
మన ఇంట్లో అడుగుపెడుతుందా?

సంతోషం గురించి తలుచుకోగానే
నా గుండె కలవరపడుతున్నది
ఒక్కమాట చెప్పు, ఆనందం కూడా
నా విచారంలానే అందంగా ఉంటుందా?

హేమంతం

మంచుపట్టిన ప్రభాతవేళ
కొండకిందలోయలోంచి
కట్టెలు కొట్టేవాడి గొడ్డలి చప్పుడు
ప్రతిధ్వనిస్తున్నది.
పండిన వరిపొలాల సుగంధానికి
మత్తెక్కి కొడవలి కునుకు తీస్తున్నది
కుప్పబోసిన గుమ్మడిపండ్ల
గంపలమధ్య
ఒక రైతు ఇంట్లో నివాసానికి
నేడు హేమంతం అడుగుపెట్టింది

పొగమంచు కమ్ముకున్న కొండవాగుమీద
పరిచిపెట్టిన వలలో
నీలం రంగు చేపలు
ఉసిరిచెట్టు ఆకుల్లాగా ముసురుకున్నాయి
రాత్రంతా మంచుకు తడిసిన
చెక్కపడవని మెల్లగా తెడ్లు
ఇంటివైపు లాక్కుపోతున్నాయి
చేపలు పట్టేవాడి పడవలో చేరి
ఇప్పుడు హేమంతం మురిసిపోతున్నది.

చిమ్మటల సంగీతంతో
మైదానం మరింత విశాలమవుతున్నది
వానలు వెనకబట్టిన కాలంలో
ఇసుకతిన్నెలు మరింత బయటపడ్డాయి
పసులు కాచుకునేవాడి ఆ పిల్లంగోవి
రాగమెక్కడ?
దానిలోంచి పొంగిప్రవహించే
ఆ నడివేసవి నునువెచ్చని పరిమళమెక్కడ?

ఇప్పుడు హేమంతం
ఒక గొల్లపిల్ల కళ్ళల్లో
తీరిగ్గా కలలు గంటున్నది.

17-5-2024

ఆ స్ఫూర్తి సామాన్యమైంది కాదు

ఆధునిక చీనాకవిత్వం చదువుతున్నప్పుడు ఆ కవుల మీద ప్రభావం చూపించినవాళ్ళల్లో లియొనడ్ కోవెన్ కూడా ప్రముఖంగా కనిపిస్తున్నాడు. కెనెడియను కవి గాయకుడు లియొనడ్ కోవెన్ (1934-2016) ఇరవయ్యవ శతాబ్దపు వాగ్గేయకారుల్లో మొదటివరసలో ఉండే కవి. బాబ్ డిలాన్ కూడా ఆ తర్వాతే లెక్కలోకి వస్తాడు.

తెలుగులో లియొనడ్ కోవెన్, బాబ్ డిలాన్, బీట్ కవుల్లాంటి వాళ్ళ ప్రభావంతో పాటలు రాసిన కవులెవరూ కనిపించరు. ఎందుకా అని ఆలోచించాను.

మన గీతకారులు మూడు రకాలుగా కనిపిస్తారు. మొదటితరహా వాళ్ళు సినిమా కవులు. ఆధునికజీవితానికి తగ్గట్టుగా పాట రాయడానికి సినిమా కవులకి మొదట్లో నమూనాల్లేవు. మనకి ఉన్నవి కీర్తనలూ, జావళీలూను. వాటిని సినిమా పాటలుగా మార్చడమెలానో తెలియని రోజుల్లో బాలాంత్రపు రజనీకాంతరావు ఒక దారి చూపించాడు. కృష్ణశాస్త్రి, శ్రీశ్రీ మొదలుకుని, సినారె, దాశరథి నుంచి సిరివెన్నెల దాకా దాదాపుగా గీతకారులందరిదీ అదే దారి. కాని తెలుగు సినిమాసంగీతంలో మెలొడీ స్థానంలో బీట్ ప్రధానం కాగానే ఆ వేగానికీ, లయకీ, ఆ ఉధృతికీ పూర్వకాలపు సినిమా పాటల తెలుగు పాతబడిపోయింది. అందుకని ఇప్పటి సినిమాకవులు ఇంగ్లిషు పదజాలాన్ని ఆశ్రయిస్తున్నారు. నిజానికి గ్రామీణ, జానపద, వృత్తికార తెలుగుగీతాలు ప్రధానంగా లయమీదనే ఆధార–పడతాయి. తెలుగు యక్షగానాలు దరువుల మీదనే ఆధారపడి ప్రజల్లోకి పోగలిగాయి. తెలుగు దరువుని, వెస్టరన్ బీట్‌తో మేళవించుకుని పాటలు రాయడానికి ఇప్పటి సినిమా కవికి ఓపికా లేదు, తీరికా లేదు. కాబట్టి ఇలాంటి సినిమాకవుల్ని లియొనడ్ కోవెన్, బాబ్ డిలాన్‌లాంటి వాళ్ళు ప్రభావితం చెయ్యడం అసాధ్యం.

రెండో తరహా గీతకారులు ప్రజాకవులు. గద్దరు, వంగపండు లాంటివాళ్ళు. గ్రామీణ తెలుగు జీవితాల గుండెచప్పుణ్ణి వాళ్ళు అద్భుతంగా పట్టుకున్నారు. ఒకవైపు మెలొడీ, మరొక వైపు బీట్ రెండూ కూడా వాళ్ళు జనజీవితంలోంచే తెచ్చుకోగలిగారు. కాబట్టే వాళ్ళు వట్టి గీతరచయితలుగా మిగిలిపోక, రాజకీయ ప్రభంజనాల్ని సృష్టించగలిగారు. కాని వాళ్ళ పాటల్లో వ్యక్తిగత విషాదాలకో, సంశయ, సంకోచాలకో, ఆశనిరాశల ఊగులాటకో చోటు దొరకడం కష్టం. ఆ పాటలు ఎప్పటికీ తారస్థాయిలో వినిపించవలసినవే తప్ప, మంద్ర, అనుమంద్ర స్థాయిల్లో, కవుల ఏకాంతక్షణాల్లో కమ్ముకునే దిగులుని పలికించడానికి పుట్టినవి కావు. కాబట్టి అటువంటి ప్రజాకవులు కూడా పాప్‌గాయకుల ప్రభావానికి లోను కాగలరని ఊహించలేం.

ఇక మూడవ తరహా కవులు టెలివిజను కోసమో, రేడియో కోసమో లేదా తమ తమ చిన్న బృందాల్లో వినిపించడం కోసమో గీతాలు రాసుకునే ఔత్సాహిక గీతకర్తలు. తెలుగు గజళ్ళూ, గీతాలూ రాసుకునే కవులు. బహుశా ఇటువంటి కవుల్ని కోవెన్, డిలాన్ వంటి కవులు ప్రభావితం చెయ్యగలరు. కావలసిందల్లా, ఈ కవులు, మెలొడీ పరిధికే పరిమితం కాకుండా, ఒక్క అడుగు బయటకొచ్చి, తమ ఆనందవిచారాల్ని తాము అనుభవిస్తున్నవాటిని, అనుభవిస్తున్నట్టుగా పాటలు కట్టగలగడం. కొద్దిగా సాధన చేస్తే ఇటువంటి కవులు ఏకకాలంలో వ్యక్తినీ, సంఘాన్నీ కూడా తమ హృదయస్పందనతో కట్టిపడేయగల పాటలు కట్టగలరు.

కోవెన్ కవిత్వమే చూడండి. ఆయన దాదాపుగా యాభై, అరవయ్యేళ్ళ పాటు గీతకారుడిగా, గాయకుడిగా నిర్విరామ సాధన కొనసాగించాడు. తన సాధన గురించి చెప్పుకుంటూ

I'm just paying my rent everyday
Oh in the Tower of Song

అంటాడు. తనకి స్ఫూర్తిగా నిలిచిన Hank Williams అనే కవిని తలుచుకుంటూ–

But I hear him coughing all night long
A hundred floors above me
In the Tower of Song

అని అంటాడు.

ప్రతి ఒక్క కవీ కూడా గీతగోపురంలో ఏ రోజుకి అద్దె ఆ రోజుకి చెల్లించుకుంటూ బసచేసేవాడే. ఆ హర్మ్యం ఏ ఒక్కరి సొంతం కాదు. నీకన్నా గొప్ప కవి అంటూ మరొకరుంటే, అతడు బహుశా ఆ భవనంలో నీకన్న మహా అయితే ఓ వంద అంతస్తుల పైన బసచేస్తుంటాడంతే. కాని ప్రతి ఒక్కరూ తమ పాటల్తో ప్రతి రోజునీ అక్కడ కొనుక్కుంటున్న వాళ్ళే.

కోవెన్ గీతాల్లో ఆ స్పృహ– ఆ రక్తీ, ఆ విరక్తీ రెండూ బలంగా కనిపిస్తాయి. అతడు ప్రేమ గురించి రాస్తున్నప్పుడు, ఆ వంకన దైవంతో తన ప్రణయం గురించి రాస్తాడు. దైవం గురించి రాస్తున్నప్పుడు, ఆయన పేరెత్తకుండా, ఆ నెపాన్న, తాను ప్రేమించిన, వదిలిపెట్టిన, వదులుకోలేకపోతున్న స్త్రీల గురించి రాస్తాడు. యుద్ధం గురించి రాస్తున్నట్టు రాస్తూనే శాంతి గురించి విలపిస్తాడు. శాంతిసమయాల్లో తనని నిలవనివ్వని రాగోన్మత్తత గురించి ఆక్రందిస్తాడు. కానీ అన్నీ చిన్న చిన్న మాటల్లో, ఊహించని అంత్యప్రాసల్లో, ఊహాతీతమైన మెటఫర్లతో రాసుకుంటూ పోతాడు. ఆ పాటలు శ్రోతల్ని సంగీతపరంగా ఎంత ఉద్రేకించగలవో, సాహిత్యపరంగా, పాఠకుల్నీ అంతే సమ్మోహితుల్ని చేయగలవు.

ఉదాహరణకి ఆయన సుప్రసిద్ధ గీతం Hallelujah (1984) చూడండి. ముందు ఆ పాట వినండి, ఆయన గొంతులో, ఆ మినిమలిస్టు మ్యూజిక్కుతో. అప్పుడు ఆ కవిత చదవండి.

ఈ కవితలో ఆయన దేవిడు గురించి రాస్తున్నట్టుగా తన గురించే తాను రాసుకున్నాడు. ఈ కవిత అర్థం కావాలంటే పాతనిబంధనలో సామ్యుయేలు మొదటి, రెండవ భాగాల్లో ఉన్న దేవిడు కథ తెలిసి ఉండాలి. దేవిడు రాజైన తరువాత, ఒకరోజు, ఒక ఇంటిమిద్దె మీద బత్సెబా అనే ఆమె స్నానం చేస్తుండగా చూసాడు. ఆమె పట్ల మోహితుడయ్యాడు. ఆమెతో కూడుకున్నాడు. కాని వెంటనే ఆమె భర్తకి కబురంపించి అతణ్ణి పోయి ఆమెని కలవమన్నాడు. అలాగైతే ఆమెకి పుట్టబోయే బిడ్డకి ఆమె భర్తనే తండ్రి అని లోకం భావిస్తుందనుకున్నాడు. కాని ఆ భర్త బెత్సబాని కలుసుకోలేదు. దేవిడుకి ఆ సంగతి తెలిసి ఆమె భర్తని యుద్ధరంగంలో చంపించాడు.

ఆ తర్వాత ఆ కథ అలా ఉంచి ఇక్కడ మనం గమనించవలసిందేమంటే దేవిడు భగవద్భక్తుడు కూడా అని. అతడు భక్తికవీ, గాయకుడూ కూడా. అపూర్వమైన తంత్రీవాద్యకారుడంటుంది పవిత్రగ్రంథం అతడి గురించి. కానీ దేవిడు మరొకరి భార్యతో కూడుకోవడం ద్వారా దైవాజ్ఞని ధిక్కరించినవాడు కూడా అయ్యాడు. ఒక వీరుడి జీవితంలో సంభవించిన పగులు అది. ఒకవైపు దైవం, మరొకవైపు దేహం.

లియొనడ్ కోవెన్ తన యూదురక్తంలో ప్రవహిస్తున్న ఈ అనాదిద్వైదీభావాన్నీ ఈ పాటలో పట్టుకున్నాడు. చిన్న చిన్న మాటలు, కాని ప్రతి ఒక్క మాటా శరాఘాతంలాగా మనల్ని గుచ్చుకునే మాటనే. చాలా పేలవమైన నా తెలుగులో, చూడండి ఈ కవిత:

హల్లెలూయ

ఇప్పుడు తెలుస్తున్నది నాకు
దావీదు మీటిన రహస్తంత్రి
ఒకటుందని, అది ప్రభువుని
సంతోషపెట్టిందని.
నీకు సంగీతమంటే
ఇష్టమేనా? నిజంగా?
ఆ స్వరప్రస్తారం సాగుతుందిట్లా
ముందు మధ్యమం, ఆ పైన పంచమం
ఇంతలో అవరోహం, ఇంతలో ఆరోహం
పట్టలేని విభ్రాంతిలో ఆ చక్రవర్తి
పలకడం మొదలుపెట్టాడు హల్లెలూయ
హల్లెలుయ, హల్లెలూయ, హల్లెలూయ, హల్లెలూయ

నీ విశ్వాసం గట్టిదే, కాని
నీకు నిరూపణ కావాలి
ఆమె మిద్దె మీద స్నానం చేస్తున్నది
ఆ వెన్నెల రాత్రి ఆమె అందం
నిన్ను మత్తెక్కించింది
ఆమెనిన్ను వంటింట్లో కుర్చీకి
కట్టిపడేసింది
నీ సింహాసనం పక్కకు నెట్టేసింది
నీ శిరోజాలు కత్తిరించింది
అప్పుడు పలికించిందామె
నీ పెదాలమీంచి హల్లెలూయ
హల్లెలూయ, హల్లెలూయ, హల్లెలూయ, హల్లెలూయ

ఒట్టుతీసి గట్టునపెట్టాననంటావు
నాకు ఒట్టుపెట్టుకోవడమే తెలీదు
పెట్టుకున్నానే అనుకో, దాంతో నీకేం పని?
పలికిన ప్రతి ఒక్క మాటలోనూ
మిరుమిట్లు గొలిపే విద్యుత్కాంతి
అది పవిత్ర శబ్దమో, భగ్నగీతమో
కాని నువ్వు వింటున్నది హల్లెలూయ
హల్లెలూయ, హల్లెలూయ, హల్లెలూయ, హల్లెలూయ

నేను చెయ్యగలిగినంత చేసాను
అయినా అది సరిపోలేదు
నాలో స్పందన కొరవడింది కాబట్టే
నీ స్పర్శకోసం వెంపర్లాడేను
ఉన్నమాట చెప్తున్నాను
నిన్ను మోసగించడం నా ఉద్దేశ్యం కాదు
ఒకవేళ అదంతా తప్పే అనుకో
అనుకున్నట్టు జరగలేదే అనుకో
అయినా నేను నా ప్రభువుముందు
నిలబడగలను, నా పెదాల మీద
నేను నిలుపుకునేదొక్కటే, హల్లెలూయ
హల్లెలూయ, హల్లెలూయ, హల్లెలూయ, హల్లెలూయ

లియొనడ్ కోవెన్ రాసిన ఎన్నో కవితలు ఇలా వాటి సంగీతంతో నిమిత్తం లేకుండానే గొప్ప సాహిత్యంగా మన తలుపు తట్టగలవు. ఉదాహరణకి Heart with No Companion (1984) అనే ఈ కవిత చూడండి:

తోడు దొరకని హృదయం

నిరాశానిస్పృహలకి అవతలి
ఒడ్డునుంచి విశాలభగ్నప్రేమతో
పిలుస్తున్నాను, నువ్వెక్కడున్నా
అది నిన్ను చేరుకుంటుంది.

ఇంకా ఓడ తయారుకాని సరంగుకోసం
పాడుతున్న పాట ఇది.
ఎటూ తేల్చుకోలేని తల్లికోసం,
ఇంకా నిండని ఊయెలతొట్టి కోసం.
తోడు దొరకని హృదయంకోసం,
నాథుడు దొరకని ఆత్మకోసం
ఏ పాటకీ ఇంకా పదనర్తనం
మొదలుపెట్టని నర్తకి కోసం.
సిగ్గుతో కుంగిపోతున్న రోజుల్లోంచి,
దుఃఖంతో బరువెక్కిన రాత్రుల్లోంచి
ఎందుకూ కొరగాని వాగ్దానాలే, అయినా
వాటిని నువ్వు నిలబెట్టుకోక తప్పదు.
వాటిని నువ్వు నిలబెట్టుకోక
తప్పదు, ఇంకా పడవ పూర్తికాని
నావికుడికోసం, ఎటూ తేల్చుకోలేక
ఇంకా తల్లి కాలేని తల్లికోసం.

Here It Is (2001) అనే ఒక కవిత ఉంది.

Here is your crowns
And your seal and rings
And here is your love
For all things . ..
Here is your wine
And your drunken fall
Here is your love
Your love for it all. ..

ఇలా సాగే ఈ గీతం చదవగానే మనకీ ఇటువంటి కవులుండేవారని చప్పున గుర్తొచ్చింది. దాదాపు నూరేళ్ళ కిందట బసవరాజు అప్పారావు రాసిన ఈ పాట:

ఇది సంపెంగపూ
విది మల్లెపూవు
ఎది కావలెనే

చెలియా. ..
ఇది కృష్ణప్రేమ
మిది మిత్రుప్రణయ
మెది కావలెనే
చెలియా

కోవెన్ రాసిన సుప్రసిద్ధ గీతాలు Suzanne (1967), Famous Blue Raincoat (1971) లాంటి వాటిని తెలుగులోకి అనువదించడం కష్టం. కాని అటువంటి కవితలు చదివినప్పుడు, తన హృదయాన్ని దాచుకోలేని ఏ తెలుగు భావుకుడైనా అంత శక్తిమంతమైన గీతాలు తెలుగులో కూడా రాయగలడని చెప్పగలను.

ఆ గీతాల్లో కనిపించే సారళ్యం మనల్ని నివ్వెరపరుస్తుంది. కొన్ని సార్లు, ముఖ్యంగా ఇలాంటి మాటలు చెప్తున్నప్పుడు, అతడు మన కాలపు సూఫీ కవినా అనిపిస్తాడు.

There is a crack in everything
That's how the light gets in

మరీ ముఖ్యంగా మన సామాజిక అసమ్మతి కవులు పేలవమైన వచనకవితలు రాసే బదులు శిల్పపరంగా మరింత నిర్భయత్వాన్ని అలవరుచుకుంటే, ఇదుగో, ఇలాంటి వాక్యాలు అవలీలగా రాయగలరు:

They sentenced me to twenty years of boredom
For trying to change the system from within

దీనర్థం తెలుగు కవులు ఇప్పుడు కోవెన్‌లానో, డిలాన్‌లానో రాయాలని కాదు. కాని గీతకారులుగా మారాలనుకున్నవారికి మాత్రం కోవెన్ లాంటి కవుల్ని చదువుతుంటే కలిగే స్ఫూర్తి సామాన్యమైంది కాదని మాత్రం చెప్పగలను.

24-5-2024

జీవన్మృత్యువుల సరిహద్దులో

మొన్న ఏడో తేదీనాడు టాగోరు పరమపదించిన రోజు కదా, మీరాయన్ని తలుచుకుంటూ ఏమీ రాయలేదేం అనడిగారు బులుసు సరోజిని గారు. నాకు మే ఏడో తేదీనే గుర్తు తప్ప, ఆగస్టు ఏడో తేదీ టాగోరుకి సంబంధించిన తేదీగా ఎప్పటికీ గుర్తుండదు. ఎందుకంటే అది మా ప్రమోద్ పుట్టినరోజు కాబట్టి. జోళదరాశి చంద్రశేఖరరెడ్డిగారు ఉన్నంతకాలం అది శ్రీకృష్ణదేవరాయల పట్టాభిషేక దినోత్సవం అని పదే పదే గుర్తుచేసేవారు. ఆ రోజు ఏదో ఒక సభ పెట్టేవారు. కృష్ణరాయల్ని తలుచుకుంటూ నేనేమి మాట్లాడినా వినడానికి తాను సిద్ధమే అని అంటూండేవారు.

కాని ఇన్నాళ్ళకి ఒక మిత్రురాలు ఆగస్టు ఏడోతేదీన టాగోరుని కూడా తలుచు–కోవలసిన అవసరముందని గుర్తుచేసారు. కాని ఏమని గుర్తుచేసుకోవాలి? టాగోరు చివరి దినాలు, ఇంకా చెప్పాలంటే చివరి సంవత్సరాలు, ఏమంత సంతోషభరితమైనవి కావు. ఉల్లాసభరితమైనవి అసలే కావు. ఆయన గీతాంజలి గీతాల్లో మృత్యువు తన ఇంటితలుపు తట్టినప్పుడు ఎంతో హుందాగా, మర్యాదగా స్వాగతిస్తానని చెప్పుకున్నాడుగాని, ఆయన్ని మృత్యువు ఊహించని విధంగా సమీపించింది. ఒక కవి, ఒక గాయకుడు మృత్యువుకు ఎదురేగే పద్ధతి అది కాదు. బహుశా ఒక యోగిని, ఒక ఉపాసకుణ్ణి మృత్యువు ఒక్కసారిగా చంకనపెట్టుకుపోలేదేమో. ఈ ప్రపంచంతో పూర్తిగా ముడివడ్డ ఒక జీవితప్రేమికుడి బంధాలు తెంచడం మృత్యువుకి ఒకపట్టాన చాతకాలేదేమో!

టాగోరు తన జీవితమంతా ఒక్కక్షణం కూడా విశ్రాంతిగా లేడు. నోబెలు పురస్కారం ఆయనకి యాభై అయిదవ ఏట లభించింది. మరొకరెవరేనా తమ సాహిత్యసృజనని అక్కడితో ఆపేసి ఉండేవారు. కాని ఆయనలోని సృజనకారుడు సాహిత్యకృషితో తృప్తి చెందలేదు. సంగీతం, చిత్రలేఖనం, రంగస్థలం– ప్రతి ఒక్కరంగంలోనూ ఆయన మరింత

నిర్విరామంగా కృషి సాగిస్తూనే ఉన్నాడు. ఒక టాగోరు పండితురాలు లెక్కగట్టినదాని ప్రకారం ఆయన తన డెబ్భైల్లో, అంటే తన చివరి పదేళ్లల్లో, పదహారు కవితాసంపుటాలు, ఎనిమిది నాటకాలు, ఒక నవల, రెండు నవలికలు, ఏడు వ్యాససంపుటాలు, నాలుగు సంపుటాల ఉత్తరాలు, యాత్రా కథనాలు, రెండు కథాసంపుటాలు, రెండు సంపుటాల బాలసాహిత్యంతో పాటు తన ఆత్మకథకూడా వెలువరించాడు. ఎంతోమంది సాహిత్యవేత్తలు వారి జీవితకాలం మొత్తంలో కూడా ఇంత సాహిత్యకృషి చేపట్టి ఉండరని మనం చెప్పుకోవచ్చు.

ఆ కోకిలది నిత్యవసంతం. ఆ భృంగానికి పగలూ, రాత్రీ తేడా లేదు. ఆ ఇంద్రచాపం ఎప్పటికీ చెరిగిపోనిది.

అటువంటిది 1937 సెప్టెంబరు పదో తేదీన టాగోరు శాంతినికేతనంలో తన కుర్చీలో కూచుని ఉండగా హటాత్తుగా స్పృహతప్పిపోయాడు. టెలిఫోను సౌకర్యంలేని ఆ రోజుల్లో కలకత్తా నుంచి వైద్యులు వచ్చేదాకా ఆయన అపస్మారకంలోనే ఉన్నాడు. వైద్యులు వచ్చి ఆయనకు చికిత్స చేసి స్పృహలోకి తెప్పించిన వెంటనే ఆయనొక కాన్వాసూ, రంగులూ కావాలని అడిగాడు. వెంటనే లేచి కూర్చొని ఒక బొమ్మ గీసాడు. ఆ బొమ్మ ఆయన కవిత్వంలో కనవచ్చే కాంతిమయ లోకంకన్నా భిన్నమైంది. ముదురురంగుల్తోనూ, పొగలాంటి ఆకృతుల్తోనూ, అంధకారంతోనూ కూడుకున్న ఆ బొమ్మ ఆయన అస్వస్థతకు చిహ్నంగా ఉండింది.

ఆ తర్వాత ఆయన కొన్ని కవితలు రాసాడు. మొత్తం పద్ధెనిమిది కవితలు. వాటిని 'ప్రాంతిక్' (1937) అనే పేరుతో ప్రచురించారు. ప్రాంతిక్ అంటే సీమాంతం. సరిహద్దు ప్రాంతం అనవచ్చు. వ్యక్తావ్యక్తాల, జీవన్మరణాల సరిహద్దుని తాకి వచ్చిన అనుభవంలోంచి ఆయన ఆ కవితలు రాసాడు. అవి పూర్వంలాగా పాటలు కావు. పద్యగంధి వచనం లాంటివి. ఆ విధంగా కూడా అవి గీతానికీ, వచనానికీ మధ్య సరిహద్దులో తచ్చాడిన స్మరణలే.

ఆ తర్వాత మూడేళ్ళ పాటు ఆయన మామూలుగానే ఉన్నప్పటికీ పూర్వపు స్వస్థత ఆయనకి చేకూరలేదు. కాని ఆయనలోని కవీ, చిత్రకారుడూ, విద్యావేత్తా విశ్రమించింది లేదు. 1940 ఏప్రిల్లో మహాత్ముడు కస్తూర్బాతో కలిసి శాంతినికేతనానికి వచ్చి ఒక వారం రోజులున్నారు. ఆ ఏడాది సెప్టెంబరులో కాలింపాంగ్‌లో ఉండగా టాగోరు మళ్ళా అపస్మారక స్థితిలోకి పోయాడు. అక్కడ తగిన వైద్య సదుపాయం లేకపోవడంతో కలకత్తా తీసుకొచ్చారు.

చికిత్స అందాక శాంతినికేతనానికి తీసుకొచ్చారు. దాదాపు ఎనిమిది నెలల తీవ్ర అస్వస్థతలో గడుపుతున్న కాలంలో కూడా ఆయన కవితలు రాయడం ఆపలేదు. వాటిని 'రోగశయ్య' (1940), 'ఆరోగ్య' (1941) అనే సంపుటాలుగా వెలువరించారు.

తన ఎనభయ్యవ జన్మదినోత్సవానికి కొద్దిగా ముందుగా ఆయన మళ్ళా జీవితంవైపు ఆశగా చూస్తో కొన్ని కవితలు రాసాడు. వాటిని 'జన్మదినె' (1941) అనే పేరుతో వెలువరించారు. ఆ ఏడాదే వసంతఋతువులో మళ్ళా 'శేష్ లేఖ' (1941) పేరిట మరికొన్ని కవితలు రాసాడు. ఆ ఏడాది జూలై 25 న మృతుముఖంలో మరొక కవితా, జూలై 29 న మృత్యుశయ్యమీద మరొక కవితా రాసాడు. ఆ రోజే ఆయనకు సర్జరీ జరిగింది. ఆయన మళ్లా అపస్మారకంలోకి పోయాడు. ఇక మళ్ళా స్పృహలోకి రాలేదు. ఆ తర్వాత పది రోజులకే అంటే ఆగస్టు ఏడున ఆయన ఈ లోకాన్ని విడిచిపెట్టివెళ్ళిపోయాడు.

టాగోరు జీవితకాలం పాటు రాసిన కవిత్వం ఒక ఎత్తూ, ఈ చివరి నాలుగేళ్ళలో రాసిన 'ప్రాంతిక్', 'రోగశయ్య', 'ఆరోగ్య', 'శేష్ లేఖ' కవితా సంపుటులు ఒక ఎత్తూ. ఈ కవితల్లోనూ, చిత్రలేఖనాల్లోనూ కనిపించే టాగోరు గీతాంజలి టాగోరు కాడు. గీతాంజలి కవిత్వానికి లభించినన్ని అనువాదాలు ఈ కవితలకి లభించలేదు. వీటిలోంచి కొన్ని కవితల్ని మొదటిసారిగా ఇంగ్లిషులోకి అనువదించి అరవింద బోస్ అనే ఆయన The Wings of Death, The Last Poems of Tagore (1959) పేరిట వెలువరించాడు. సుప్రసిద్ధ గ్రీకు పండితుడు,అనువాదకుడు గిల్బర్ట్ ముర్రే ఆ సంపుటానికి ముందుమాట రాసాడు.

తిరిగి మళ్ళా దీపక్ మజుందారు అనే ఆయన ఈ నాలుగు సంపుటాలనుంచీ 38 కవితల్ని ఇంగ్లిషులోకి అనువదించి A Poet's Death, Late Poems of Rabindranath Tagore (2004) పేరిట వెలువరించాడు. టాగోరు రచనలపైన పరిశోధన చేసిన Kathleen M O'Connell అనే కెనడియను పండితురాలు ఈ సంపుటానికి ముందుమాట రాసారు. అందులో ఆమె ఈ కవితల్లో టాగోరు జ్ఞాతప్రపంచం సరిహద్దులుదాటి అజ్ఞాతప్రపంచంలోకి ప్రవేశిస్తున్న అనుభవం కనిపిస్తున్నదనీ, ఆ సమయంలో తాను దర్శిస్తున్నదాన్ని మనతో పంచుకోడానికి ఆయనకి భాష చాల్లేదనీ రాసారామె.

తన యవ్వనంలోనూ, నడివయసులోనూ కవిగా టాగోరు చూసిన, మనకు చూపించిన కాంతిమయలోకానికీ, ఆయన వృద్ధాప్యంలోకి అడుగుపెట్టాక గీసిన బొమ్మల్లోనూ, ఈ చివరి కవితల్లోనూ కనిపించే అంధకారబంధుర జగత్తుకీ సంబంధం లేదనిపిస్తుంది, చూడటానికి. కానీ మొదటిది దృశ్యజగత్తు అనీ, రెండోది అదృశ్యజగత్తు అనీ మనం గమనించగలిగితే, ఆయన తన జీవితకాలంలో రెండు లోకాల్నీ కూడా అంతే సత్యనిష్టతో,

అంతే తదేకంగా పరికించాడనీ, ఆ రెండు జగత్తుల్లోనూ కూడా తాను త్రికరణశుద్ధితో పాల్గొన్నాడనీ మనం గ్రహించగలుగుతాం. అంతేకాదు, 1939-45 మధ్యకాలంలో ప్రపంచాన్ని చుట్టబెట్టిన రెండవప్రపంచయుద్ధకాలంలో ఆయన చివరి సంవత్సరాలు గడిచాయని మనం గుర్తుచేసుకుంటే ఆ కవితల్లోనూ, ఆ చిత్రాల్లోనూ ఆ భీకర పార్శ్వం ఎందుకు కనిపిస్తున్నదో మనకు అర్థమవుతుంది. అందుకన్ ముల్క్ రాజ్ ఆనంద్ అన్నాడట: 'టాగోరులోని కవి ప్రపంచంలోని సామరస్యాన్ని చిత్రిస్తే, ఆయనలోని చిత్రకారుడు ప్రపంచంలోని వైమనస్యాన్ని చిత్రించేడు' అని.

A Poet's Death పేరిట తన అనువాదాల్ని వెలువరించిన దీపక్ మజుందార్, Poet's Death అనే పదాన్ని కీట్సు నుంచి తెచ్చుకున్నాడు. After Dark Vapors have Oppressed our Plains (1817) సానెటులో కీట్సు వాడిన పదప్రయోగం అది. కవి మరణం కూడా నిద్రిస్తున్న ఒక శిశువుశ్వాసతో సమానమైందిగా కీట్సు ఆ కవితలో రాసాడు.

రమణమహర్షిని ఒకరు అడిగారట: 'నాకు కలలో కనిపిస్తున్నవారితో నడుస్తున్న సంభాషణల్ని మెలకువలో కనిపిస్తున్నవారితో కొనసాగించాలంటే వీలు కావడం లేదు. కాబట్టి కల నిజమని ఎలా అనగలను?' అని. రమణులు చెప్పారట: 'కలలో కనిపిస్తున్న వారితో సంభాషణలు కలలోనే కొనసాగించు. అలాగని ఈ మెలకువ కూడా శాశ్వతమైన మెలకువ అనుకోకు. ఈ మెలకువని దాటిన స్థితి మరొకటి ఉంది. అందులోకి మేల్కొన్నప్పుడు ఈ మెలకువ కూడా కలలాంటిదే అని గ్రహిస్తావు' అని.

టాగోరు తన జీవితకాలంపాటు తన కలల్నీ, మెలకువల్నీ మనతో పంచుకున్నాడు. కాని తన చివరి నాలుగు సంపుటాల కవితల్లోనూ, మెలకువకీ, ఆ మెలకువను దాటిన మరొక మెలకువకీ మధ్య సీమాంతరేఖ దగ్గరి తన కలవరాన్ని మనతో పంచుకున్నాడు. కాని ఆయనలోని విశిష్టాద్వైతి అప్పుడు కూడా బలంగానే ఉన్నాడు. ఎందుకంటే, 'రూపసాగరంలో దూకి అరూప రత్నాన్ని కనుగొన్నాను' అంటాడు గీతాంజలిలో. తన చివరికవితల్లో కూడా మళ్ళా రూపనారాయణుడి గురించే ప్రస్తావిస్తాడు.

రూపనారాయణుడు! ఎంత గొప్ప పేరు! ఎంత గొప్ప దర్శనం! వివేకానందుడు దరిద్రనారాయణుడి గురించి మాట్లాడేడు. మహాత్ముడు సత్యనారాయణుడి గురించి మాట్లాడేడు. టాగోరు తన జీవితమంతా, చివరికి మృత్యుసన్నిధిలో కూడా రూపనారాయణుడి గురించే మాట్లాడేడు.

జీవితాన్ని ప్రేమించడమంటే అది. సత్యాన్ని సౌందర్యంగా చిత్రించడమంటే అది. సాహసమంటే అది. సాఫల్యమంటే అది.

శేష్‌లేఖ–11

రూపనారాయణ తీరం దగ్గర మేల్కొన్నప్పుడు
ఈ జగత్తు ఒక కల కాదని గ్రహించాను.
వేదనాపరంపరమధ్య
దుఃఖం వెనక దుఃఖంలో
రక్తలిపిలో రాసిన అక్షరాల్లో
నా ప్రతిబింబాన్నే దర్శించాను.
సత్యం చాలా కటువు.
ఆ కాఠిన్యాన్ని ఇష్టపడటం నేర్చుకున్నాను.
ఆయన ఎప్పటికీ మోసకారి కాడు.
అంతమూ, మరణమూ లేని దుఃఖాన్ని
ఆరాధిస్తూండటమే ఈ జీవితం.
సత్యం నానుంచి దాచిపెట్టిన విలువల్ని
అందుకోడానికి చేయి చాపుతూ
వాటికి నా మరణంతో మూల్యం చెల్లించగలగని
ఆశపడుతున్నాను.

(ఉదయన్, శాతినికేతన్, 13 మే 1941, తెల్లవారు జాము 3.15)

14-8-2024

వేసవి ముగిసింది

ఒక్కొక్క కాలంలో ఒక్కొక్క కవి నన్ను పట్టుకుంటూ ఉంటాడు. అతడు నాకు కొత్త ప్రపంచాన్ని పరిచయం చేస్తాడు. నాకు కొత్త చూపునిస్తాడు. నాలోపలకీ నన్ను చూసుకునేలాగా చేస్తాడు. మరీ ముఖ్యంగా, నా చుట్టూ ఉండే సాహిత్యవాతావరణం నాలో కల్పించే అనిశ్చితి నుంచీ, సంశయాత్మకతనుంచీ తనే నా చెయ్యి పట్టుకుని దాటిస్తాడు.

అటువంటి ఒక కొత్త కవి, అతడెప్పటివాడైనప్పటికీ, నాకు పరిచయమైన కాలం కొన్నేళ్ళు పోయేక వెనక్కి తిరిగి చూసుకుంటే అప్పుడు నా చుట్టూ పరుచుకున్న పరిమళాల్తో పాటే అతడు కూడా నా స్మృతుల్లో భాగమైపోతాడు. మచాడో అటువంటి కవి. అతడి కవిత ఒకటి పరిచయం చేస్తూ చెస్లామీవోష్ 'అతడు స్పానిషుకవుల్లో మరీ చీనా తరహా కవి' అన్న ఒక్క వాక్యం పట్టుకుని నేనతణ్ణి వెతుక్కుంటూ పోయేను. నా అన్వేషణ వృథా కాలేదు. మచాడో రాసిన The Border of a Dream నన్నెంత ఆవహించిందంటే, నా నుంచి ఆ మత్తు మంత్రాల నరసింహశర్మగారికి కూడా ప్రసరించింది. ఈ మధ్య ఆయన తన కవితల్ని 'సెలయేరు' (2024) అనే పేరిట సంపుటిగా వెలువరించారు. మచాడోని తనకు పరిచయం చేసినందుకుగాను ఆ కవిత్వసంపుటి నాకు అంకితమిస్తున్నట్లుగా రాసారాయన ఆ పుస్తకంలో!

రేనర్ మేరియా రిల్కె అటువంటి కవి. యూజీనియో మొంటాలె అటువంటి కవి. ఇషికవ తకుబొకు అటువంటి కవి. ఒకప్పుడు నా నవయవ్వన దినాల్లో కమలాదాస్ నాలో కలిగించిన కల్లోలాన్ని నేనిప్పటికీ మర్చిపోలేను. నా జీవితం నడివయసు దాటేవేళల్లో నాకు పరిచయమైన సాల్వటార్ క్వాసిమొడొ, లాంగ్‌స్టన్ హ్యూస్, జార్జ్ ట్రాకల్ నన్నట్లానే లోబరచుకున్నారు. ఇక హేరీ మార్టిన్‌సన్ గురించి చెప్పనక్కరలేదు.

ఇది యూరపియను కవులకీ, ఆధునిక కవులకీ మాత్రమే వర్తించే మాట అనుకుంటే పొరపాటే. దిలీప్ చిత్రే పరిచయం చేసిన తుకారాం, రామానుజన్ పరిచయం చేసిన బసవన్న, మా మాష్టారు అనువాదం చేసిన లల్ల వచనాలు, మూడేళ్ళ కిందట నాకు మొదటిసారిగా పూర్తిగా తెలుగు అనువాదంలో లభ్యమైన నమ్మాళ్వారు కూడా నన్నట్లా వదిలిపెట్టనివాళ్ళే. కొందరు కవులు ముప్ఫైయేళ్ళుగా, నలభయ్యేళ్ళుగా నాతోనే జీవిస్తున్నారు. ప్రతి రాత్రీ నేను నిద్రలోకి జారుకునేముందు నా మంచం పక్కన కూచుని తమ కవితల్ని గుర్తు చేస్తూనే ఉంటారు. ఎమిలీ డికిన్సన్, దు-ఫు, కబీరు, కృష్ణశాస్త్రి- వీళ్ళని స్మరించని రోజు ఒక్కటేనా ఉందా నా జీవితంలో?

ఇప్పుడు అలా నన్ను పట్టుకున్న కవి జోసెఫ్ స్టాన్లీ కునిజ్ (1905-2006). అమెరికను కవి. నిండు నూరేళ్లకు అదనంగా మరొక్క ఏడాది జీవించిన కునిజ్ జీవితం మొత్తం, కవిత్వం చదువుకుంటూ, తోటపనిచేసుకుంటూ గడిపేడు. అపారమైన పఠనానుభవం, విస్తృత అధ్యయనం, సుదీర్ఘ జీవితంలో అతడు రాసిన కవితలు కొన్ని మాత్రమే. ఒక్కో కవిత పూర్తికావడానికి అతడికి ఏళ్ళు పట్టేది. అంటే కనీసం ఇరవయ్యేళ్ళు. నాకు తెలిసి తెలుగులో అజంతా గురించి ఈ మాట చెప్తారుగాని, కవిత్వ సాంద్రతలో, బిగింపులో, గాఢార్థస్ఫురణలో, పొరలుపొరలుగా అనుభూతిని పూతచుట్ట చుట్టడంలో అజంతాకీ, అతడికీ పోలికలేనేలేదు.

అతడు మొదట్లో కవిత్వం ఛందోబద్ధంగా రాసేడు. తర్వాత తర్వాత ఆ కవితల నిర్మాణాన్ని కొంత సడలించి పాఠకుడు సంచరించడానికి కొంత జాగా వదిలిపెట్టేడుగానీ, అప్పటికీ, అతడి కవిత్వం ఒక విమర్శకుడు అన్నట్టుగా, clear and cryptic గానే ఉంటుంది. ఆ కవితల్లోకి ఒకపట్టాన చొరబడలేం. అలాగని అవి మనల్ని దాటివెళ్ళిపోవు కూడా. మనం అప్పుడప్పుడు కలుసుకునే కొందరు మిత్రులుంటారు. వాళ్ళని చూడగానే మనకొక స్నేహస్పర్శ లభిస్తుంది, కాని వారి అంతరంగం ఒక పట్టాన అంతుబట్టదు. కునిజ్ కవిత్వం అటువంటిది. ఆ కవిత్వంతో నేనిప్పుడే నా స్నేహం మొదలుపెట్టానుకాబట్టి, దాని గురించి ఇదీ అని చెప్పుకోడానికి మరికొంత కాలం ఎలానూ పడుతుంది.

ఆయన కవిత్వం కన్నా ఆయన ఇంటర్వ్యూలు మనల్ని మరింత ప్రకాశంగా పలకరిస్తాయి. అక్కడ మనం కూర్చోవచ్చు. ఒక కృష్ణమూర్తి లాంటి తత్త్వవేత్త మాట్లాడుతుంటే వినడమెలా ఉంటుందో కవిత్వం మీద కునిజ్ మాట్లాడుతుంటే వినడం కూడా అలా ఉంటుంది. అతడి మాటలు వింటున్నప్పుడు మనకి కవిత్వం గురించి, కవిత్వప్రయాణం గురించీ, ప్రయోజనం గురించీ ఎంత తెలుస్తుందో, జీవితం గురించీ, జీవితం నుంచి

మనం ఎంత పొందగలమో, పొందినదాన్ని ఎలా గుర్తుపట్టగలమో కూడా తెలుస్తుంది. కృష్ణమూర్తి సంభాషణల్లానే కునిజ్ సంభాషణలు కూడా commentaries on living.

ఉదాహరణకి 1982 లో అయ్యప్ప పణిక్కర్ చేసిన ఇంటర్వ్యూలో ఒక ప్రశ్నకి జవాబిస్తూ ఆయనంటాడు కదా:

> I like a poem to end not with the slamming of a door, but with the opening of a window, so that we are moving out into space.

ఈ వాక్యం దగ్గర నేను చాలా సేపు ఆగిపోయేను. ఒక కవిత ముగించినప్పుడు అది ధడాలున తలుపు మూసినట్టుగా కాక, సున్నితంగా ఒక కిటికీ తెరిచినట్టుగా ఉండాలట! ఇది కవిత్వానికి మాత్రమే వర్తించే వాక్యమా? మన ప్రతి ఒక్క కలయికకీ, ఆ కలయిక ముగించి మనం సెలవు తీసుకునే ప్రతి ఒక్క క్షణానికీ కూడా వర్తించే వాక్యమే కదా.

ఆరేడేళ్ల కిందట ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో మేమొక ట్రయినింగులో పాల్గొన్నప్పుడు మాకు పాఠాలు చెప్పిన ఒక ప్రొఫెసరు పదే పదే residue అనే మాట వాడేవాడు. మనమెవరినైనా కలుసుకుని, కొంతసేపు మాట్లాడుకుని వచ్చేసాక మనం అక్కడ ఎటువంటి residue వదిలిపెడుతున్నామో చూసుకోవాలని చెప్పాడాయన. కొందరు మనల్ని కలిసివెళ్ళినతరువాత కూడా ఎంతోకాలం పాటు చెదిరిపోని ఒక పరిమళాన్ని మనదగ్గర వదిలిపెట్టి వెళతారు. అలానే చాలామంది మనం గుర్తుచేసుకోడానికి ఇష్టపడని అయిష్టాన్ని కూడా వదిలిపెడతారు.

ఒక కవితకి ఎత్తుగడ సరే, నిర్వహణ సరే, ముగింపు కూడా అంతే ముఖ్యం. సాధారణంగా కవులకి ఎక్కడ ఆగాలో తెలియదు, ఎక్కడ ఆపాలో తెలియదు. ఈ అశక్తత కవులది మాత్రమే కాదని చాలాకాలం తర్వాత తెలిసింది. మరీ ముఖ్యంగా నీటిరంగుల చిత్రకారుల విషయంలో. చాలాసార్లు వాళ్ళు గియ్యాలనుకున్న బొమ్మ పూర్తయిపోయి ఉంటుంది. వాళ్ళకి ఆ విషయం తెలియదు. ఇంకా పూర్తి కాలేదనుకుని ఆ బొమ్మ మీద మళ్ళా మళ్ళా పూతలు పూస్తూనే ఉంటారు. మన కలయికలకి కూడా ఈ రహస్యం తెలియాలి. నువ్వొకర్ని కలుస్తావు. కొంతసేపు మాట్లాడుకుంటారు. కాని ఒక క్షణం వస్తుంది. ఇంక పంచుకోడానికేమీ ఉండదు. మనం అక్కణ్ణుంచి సెలవు తీసుకుని వచ్చేస్తే, అప్పటిదాకా మనం గడిపిన సంతోషాన్ని నెమరువేసుకునే అవకాశం మిగుల్చుకుంటాం, వాళ్ళూ, మనమూ. కానీ ఆ క్షణాలు కూడా ఆవిరైపోయేదాకా, మనకు తెలీకుండానే ఆ కలయిక మొహం మొత్తేదాకా మనమక్కడే తచ్చాడుతుంటాం.

కాబట్టి ఒక కవితని ముగించే మెలకువ తెలియడమంటే, అది ఒక నిర్మాణవ్యూహం మాత్రమే కాదు. జీవనరచనారహస్యం కూడా.

కునిజ్ ఇంటర్వ్యూల్లో చాలా చాలా విషయాలు ప్రస్తావించేడు. చాలా సంగతులు మనం మాట్లాడుకోదగ్గవి. మళ్ళీ మళ్ళీ మననం చేసుకోదగ్గవి. వాటి గురించి మళ్ళా మళ్ళా ఎలానూ మీతో పంచుకోబోతున్నాను. ఇప్పటికైతే, ఆయన కవితల్లో సుప్రసిద్ధమైన ఒక కవిత End of Summer (1953) ని ఇక్కడ తెలుగులో అందిస్తున్నాను. 'నీకై మేలుకొనిన సకలేంద్రియములతో ఏది రచిస్తున్నానో చూస్తున్నానో' అని మహాకవి అన్నట్లుగా, కునిజ్ రాసే ప్రతి కవితలోనూ సకలేంద్రియాలూ పాలుపంచుకుంటాయి. కాబట్టే ఆ కవిత, ఒకసారి చదివేక, మనల్ని వదిలిపెట్టదు.

ఈ కవిత తనకి కళ్ళమ్మట నీళ్ళు తెప్పించిందని ఒక భావుకుడు రాసుకున్నాడు. Poems that make Grown Men Cry (2014) అనే సంకలనంలో Nicholson Baker అనే రచయిత ఈ కవిత గురించి రాస్తూ 'మనల్ని ఒక కవిత ఏడిపించిందని ఎప్పుడు చెప్పగలం? ఒక కవిత మనల్ని ఏడిపించిందని మనం చెప్తున్నప్పుడు నిజంగా మనం చెప్తున్నదేమిటి? దాని అర్థమేమిటంటే, ఆ కవితకీ మనకీ మధ్య మన అంతరంగంలో ఒక ఏకీభావం కుదరడం మనల్ని నిశ్చేష్టుల్ని చేస్తున్నదని చెప్పడం' అని అన్నాడు.

అవును, ఇలా మనల్ని ఏడిపించగల కవితలూ, వాక్యాలూ మనకి కూడా ఎదురయ్యే ఉంటాయి. టాగోరు గురించి రాసిన కవితలో 'అక్కడితో బాల్యం అంతమైంది' అని ఇస్మాయిల్ గారు రాసిన ఒక వాక్యం నాకు తెలిసిన మహావిషాదభరితవాక్యాల్లో ఒకటి. ఈ 'వేసవి ముగిసింది' కూడా అటువంటి వాక్యమే. అయితే కునిజ్ ఈ కవితరాసినప్పటి కనెక్టికట్ వేసవికీ, మన ఉష్ణమండల దేశాల వేసవికీ పోలికలేని మాట నిజమే. కాని చిన్నప్పుడు మన వేసవి సెలవులు ముగిసినప్పటి మన అనుభూతికీ, ఈ అనుభూతికీ మాత్రం ప్రాయికంగా ఏమీ తేడా లేదు.

వేసవి ముగిసింది

గాల్లో సన్నగా మొదలైన ఆందోళన
కాంతిలో కనవస్తున్న తొట్రుపాటు
ధుమధుమలాడుతూనే ఈ సంవత్సరం
ఈ రాత్రికి పక్కకి తిరగనున్నది.

నిరాసక్తంగా నిలబడి ఉన్నాను పొలంలో
చుట్టూ గడ్డిదుబ్బులు, గులకరాళ్ళు.
నా ఎముకల్లోంచి వినబడే సంగీతం
ఆశ్చర్యం! ఆ కీటకం నోట ముద్దుముద్దుగా.

వేసవి నీలంలోకి కురుస్తున్న నీలం.
మేఘరహిత గగనంపైన ఒక డేగ ప్రత్యక్షం
ధాన్యపుగాదె పైకప్పు తళతళ్లాడుతున్నది
నా జీవితంలో ఈ భాగం ముగిసిపోయింది.

కిర్రుమంటూ తెరుచుకుంటున్న ఉత్తరద్వారపు
ఇనపతలుపులు : విస్తరించడం మొదలింక–
పక్షులూ, పారుటాకులూ, హిమపాతాలూ
అవి చాలవన్నట్టు క్రూరంగా వీస్తున్న గాలి.

9-12-2024

మహాకావ్యపరిచయం

మొన్న సాయంకాలం నేనేవో పాత హిందీపాటలు వింటూ ఉండగా యెర్రాప్రగడ రామకృష్ణ నుంచి వాట్సపు మెసేజి. తెరిచి చూద్దును కదా– విశ్వనాథ సత్యనారాయణగారి శతజయంతి సందర్భంగా, మా మాష్టారు శరభయ్యగారు 1995 లో చేసిన, ప్రసంగం.

అటువంటి ఒక ప్రసంగం లభ్యంగా ఉందని నాకిప్పటిదాకా తెలీదు. వెంటనే ఆన్ చేసి విన్నాను. ప్రసంగం మొదలై ఆయన ఏమి చెప్తున్నారో అవగాహన చేసుకునేలోపు ఈ పద్యం దగ్గరికి వచ్చేటప్పటికి నా హృదయం ఆర్ద్రమైపోయింది. కళ్ళు చెమ్మగిల్లాయి. కొంత సేపటికి మనసు మొద్దుబారిపోయింది. ఆ తర్వాత ప్రసంగం వినబడుతూ ఉందిగాని, నా మనసు ఆ పద్యం దగ్గరే ఆగిపోయింది.

నా ప్రాణమ్ములకు నీ పొగమబ్బుల
కేమి సంబంధమో! యేను గూడ
పొగమబ్బునై కొండ చిగురు కోనల పైన
బురుజులపైని కొమ్ములకు పైని
వ్రాలిపోనో మధ్య వ్రీలిపోనో నేల
రాలిపోనో గాలి తేలిపోనో
నా యూహ చక్రసుందరపరిభ్రమణమై
యీ పొగమబ్బులనే వరించె

ఎన్ని పొగమబ్బులెరిగిలే నేను మున్ను?
తూర్పుకనుమలు విడుచు నిట్టూర్పులట్టి

విచటి ఈ పొగమబ్బులే యెడదలోని
లలితము మదీయగీతి నేలా వెలార్చు!!??

విశ్వనాథ ఒక స్కూల్లో పనిచేస్తున్నప్పుడు పిల్లల్ని ఎక్స్‌కర్షనుకి కొండవీడు తీసుకువెళ్ళినప్పుడు దూరంగా రైల్లోంచే కొండవీడుమీద మబ్బుల్ని చూసాడట. వెంటనే ఈ పద్యాలు ఆయనలోంచి పొంగుకొచ్చాయి అని మాష్టారు చెప్తున్నారు. నాలుగేళ్ళ కిందట నేను మొదటిసారి కొండవీడు వెళ్ళినప్పుడు, ఆ కోట శిథిలాలపైకి ఆకాశం వచ్చి వాలడమూ, దూదిపింజల్లాంటి మేఘాలు ఆ సీమచుట్టూ హంసల్లాగా తేలియాడటమూ చూసినప్పుడు ఈ పద్యాల్నే తలుచుకున్నాను. అంతేకాదు, నెరూదా రాసిన The Heights of Machu Pichu కూడా తలుచుకున్నాను. అంత ఎత్తున ఆ కొండవీడు గిరిదుర్గం మీద వాలిన మేఘాలమందల్ని చూసినప్పుడు ఎవరికేనా ఒక loftiness అనుభవంలోకి రాక తప్పదనీ, బహుశా విశ్వనాథ ఏ తొలకరివేళలోనో ఆ మబ్బుల్ని చూసి ఉంటాడని అనుకున్నానని కూడా రాసాను. కాని ఆయన ఎక్కడో దూరంగా రైల్లోంచే ఆ మబ్బుల్ని చూసి ఆ మేఘ విహాయస విహారాన్నిట్లా వర్ణించాడంటే చాలా ఆశ్చర్యం వేసింది. మాష్టారు దాన్నే తన్మయీభావం అన్నారు. ఆయన ప్రసంగంలో కల్పవృక్షసౌందర్యం గురించి వివరించడానికి దీన్నే ప్రాతిపదికగా తీసుకున్నారని తర్వాత అర్థమయింది.

కానీ మొదటిసారి విన్నప్పుడు నా మనసుకి ఇవేవీ ఎక్కలేదు. ఆయన ఆ పద్యాలు శతజయంతి సభలో చదివి వినిపిస్తున్నప్పటికీ, అవి గుంటూరుసీమలో కొండవీడు మీద రాసినవైనప్పటికీ, నాకు మాత్రం ఆ పద్యాలు విన్నంతసేపూ మేఘాలు కాదు, గోదావరి కనిపిస్తూ ఉంది. ఆయన సదనంలో తన 'వాల్మీకి నిలయం' లో కూచుని ఆ పద్యాలు వినిపిస్తూ ఉంటే మేము వింటున్నట్టూ, అక్కడికి ఇరవై ముప్పై అడుగుల దూరంలోనే కొవ్వూరులాంచీల రేవూ, ఆ పైన సముద్రపుపాయలాగా ప్రవహించే గోదావరీ నా కళ్ళముందు కనిపిస్తూ ఉన్నాయి. వంతెన మీంచి పాతకాలపు బొగ్గు రైళ్ళు పొగలు చిమ్ముతూ ప్రయాణిస్తున్నాయి. మార్కండేయుడూ, వేణుగోపాలుడూ తప్ప తక్కిన కొవ్వూరూ, రాజమండ్రీ ఎప్పట్లానే నిద్రపోతూ ఉన్నాయి. ఆ ఆకాశమంతా మాష్టారి కంఠస్వరం ఒక్కటే మేఘ-నిర్ఘోషంలాగా ప్రతిధనిస్తూ ఉంది. గుల్లని మోసుకుంటూ నత్త తిరిగినట్టు నా సంసారాన్ని వెంటబెట్టుకుని ఊరినుంచి ఊరికి తిరుగుతూనే ఉన్నానుగాని, నా హృదయాన్ని మాత్రం అక్కడి రావిచెట్టుకే వేలాడగట్టి అక్కడే వదిలిపెట్టేసాననిపించింది.

ఆ పద్యం నా హృదయాన్ని రాపాడి రాపాడి వదిలిపెట్టాక, మళ్ళా నన్ను నేను కూడ దీసుకుని, ఆ ప్రసంగం మరోసారి విన్నాను. అది చాలా ముఖ్యమైన ప్రసంగమని నాకు

తెలుసు. ఎందుకంటే మాష్టారికి విశ్వనాథ 'గురువు గారు.' ఆయన కాటూరి వెంకటేశ్వరరావుగారిని 'మాష్టారు' అనే వారు. ఇదొక సున్నితమైన ఆచార్యభేదం. (చలంగారికి భగవాన్ అంటే రమణ మహర్షి, ఈశ్వరుడంటే సౌరిసు ద్వారా పలికే దివ్యవాణీ అన్నట్టు.) ఈ ప్రసంగం మొదలుపెట్టడమే కాటూరి వారి పద్యంతో మొదలుపెట్టారు. వెంకటేశ్వరరావు గారు 'మంత్రమయవాణీ సత్యనారాయణా' అని అన్నారట. మంత్రమయవాణి అనే ఆ పదబంధాన్ని మాష్టారు మరొకసందర్భంలో శ్రీనాథుడి కవిత్వానికి వర్తింపచెయ్యడం విన్నాను.

మా మాష్టారు విశ్వనాథతో సమానంగా ప్రతిభావంతుడైనప్పటికీ, విశ్వనాథని చదివి ఆనదించడమే జీవితవ్యాపకంగా గడిపేసారనీ, తాను స్వయంగా ఒక మహాకావ్యం రాయగలిగి ఉండీ, కల్పవృక్ష ఛాయలో ఉండిపోడానికే ఇష్టపడ్డారనీ ఆయన పట్ల మాటల్లో పెట్టలేని ఒక నిరసన నాలో చాలాకాలంగా ఉంది. అందుకనే మా మాష్టారు ఎవరిమీద ప్రసంగించినా వినడానికి చెవికోసుకునే నేను ఆయన విశ్వనాథ మీద మాట్లాడినప్పుడు వినడానికి అంత సుముఖత చూపించేవాణ్ణి కాదు.

కాని ఈ ప్రసంగం, ఇందులో విషయాలు నేనింతకుముందే ఆయన్నుంచి, మరెన్నో సందర్భాల్లో విన్నవే అయినప్పటికీ, మళ్ళీ ఇలా వింటున్నప్పుడు నన్ను ఆలోచనలో పడేసాయి. ముఖ్యంగా కవిగా విశ్వనాథ ప్రతిభ కల్పవృక్షంలోకన్నా, 'భ్రష్టయోగి' ఖండ కావ్యాల్లోనూ, నవలాకారుడిగా ఆయన ప్రతిభ వేయిపడగల కన్నా 'ఏకవీర' లోనూ కనిపిస్తుందని నా నమ్మకం. ఇందులో రెండో పరిశీలన నాది కాదు, సుదర్శనంగారిది. కాని ఆ వాక్యంతో నాకు పూర్తి ఏకీభావముంది.

కల్పవృక్షంలో విశ్వనాథ పూర్వాంధ్రకవుల కావ్యప్రతిభనీ, సంస్కృత నాటకకర్తల శిల్పనైపుణ్యాన్నీ ఒకచోట ప్రోది చేసాడని మా మాష్టారు ఈ ప్రసంగంలో చెప్తూ ఉన్నారు. పూర్వాంధ్రకవులదృష్టిలో కవిత్వమంటే వర్ణన రామణీయకత. వర్ణన ద్వారా శ్రోతలో రససిద్ధి కలిగించడం. సంస్కృత నాటకకర్తల నాటకశిల్పమంటే తాను ఏ పాత్రల్ని వర్ణిస్తుంటే, ఏ పాత్రతో మాట్లాడిస్తుంటే ఆ పాత్రతో తన్మయీభావం చెందడం.

అప్పుడు మాత్రమే ఏ రెండు పాత్రల సంభాషణలోనైనా ఒక నాటకీయత సిద్ధిస్తుంది. రెండింటిద్వారానూ కవి తానే స్వయంగా మాట్లాడుతుంటాడు కాబట్టి అది మనలోకూడా ఎటువైపు మొగ్గాలో తెలీని ఒక నాటకీయ ఉత్కంఠని కలగచేస్తుంది. మనం కూడా కవితో పాటు ఆ పాత్రల్లోకి ప్రవేశించి, ఆ నాటకాన్ని మన హృదయంలోకి తీసుకుపోతాం. తెలుగు కవుల్లో తిక్కన చేసింది ఇదే అని మాష్టారు ఈ ప్రసంగంలో ఒకటి రెండు సార్లు గుర్తుచేస్తూ ఉన్నారుకూడా.

వీటిలో మొదటిదాన్ని lyrical అనీ, రెండోదాన్ని dramatic అనీ, epic ఈ రెండింటినీ మేళవించుకుంటుందనీ అరిస్టాటిలు అన్నాడని మనకు తెలుసు. ఆధునిక కాలంలో నవల modern popular epic గా మారిందని హెగెలు అన్నాడని కూడా మనకు తెలుసు.

వర్ణనా, నాటకీయతా అనే ఈ రెండు కౌశల్యాల్నీ స్వంతం చేసుకుని, ఆధునిక కాలంలో నవల ముందుకొచ్చి ప్రాచీన కావ్యాన్ని పక్కకు నెట్టేసింది. కాబట్టి ఆధునిక కవి ఎంత అద్భుతమైన శిల్పప్రతిభను చూపించినా మహాకావ్యనిర్మాణం ఆధునికజీవితానికీ, ఆధునిక శ్రోతకీ అనువైంది కాదు. కాని ఇవే నైపుణ్యాల్ని సమర్థవంతంగా ఉపయోగించుకుని ఒక నవల రాసినట్లయితే ఒక మహాకవి కన్నా ఎక్కువగా అతడు విస్తృతపాఠకలోకాన్ని చేరగలడు. కల్పవృక్షం మీద నా అభియోగం ఏమిటంటే అది నవలగా రావలసింది మహాకావ్యంగా వచ్చిందని. ఈ పరిశీలన నిజానికి శ్రీశ్రీది. కల్పవృక్షం విశ్వనాథ రాసిన పెద్ద నవల అని అన్నాడాయన.

ఆధునిక పాఠకుడికి ఒక మహాకావ్యాన్ని చదివే తీరికా, దానిలోని రహస్యాల్ని ఆకళింపు చేసుకుంటూ ప్రయాణించే ఓపికా ఉండవు. ఆధునిక జీవితం దానికి అనుకూలించదు. సౌందర్యాన్ని శకలాల్లోనే చూడగలడు, స్వీకరించగలడతడు. ఈ రహస్యం ఆధునికశిల్పులకి తెలుసు. అందుకనే వారొక చిన్న దారుశిల్పాన్నో, కాంస్యశిల్పాన్నో తీరుస్తారుగాని, ఒక మహాబలిపురం రాతిదేవాలయాన్ని తిరిగికట్టాలనుకోరు.

విశ్వనాథ ఖండకావ్యాలు, 'భ్రష్టయోగి', 'గిరికుమారుని ప్రేమగీతాలు' వంటివాటిల్లో ఆధునిక జీవితానికి సరిపోయే కవిత్వముంది. ఆ కవితలు ఇంగ్లిషులోకి సమర్థవంతంగా అనువాదమైతే విశ్వనాథని అత్యంత ప్రతిభావంతుడైన కవిగా ప్రపంచం గుర్తించగలదని నా నమ్మిక.

ఇవీ–ఇప్పటిదాకా నా అభిప్రాయాలు.

కాని ఈ ప్రసంగం మళ్ళా రెండోసారి విన్నాక, ముఖ్యంగా మాష్టారి గొంతులో ఈ కల్పవృక్ష పద్యాలు విన్నాక, నేను కొత్త ఆలోచనల్లో పడ్డాను. ఉదాహరణకి, ఈ పద్యం చూడండి. సుమంత్రుడు రాముణ్ణి అడవిలో వదిలిపెట్టి అయోధ్యకు తిరిగి వచ్చాక దశరథుడితో చెప్తున్న ఈ మాటలు మాష్టారి గొంతులో వినండి:

ఓ మహారాజ! నీ యూళ్ళలో, నీళ్ళలో
జెరువులందున నొక్క చేపలేదు

భూలోకమఘవ! నీ నేలలో, బూలలో
దోటలందున నొక్క తేటిలేదు
పృథ్వీశ! నీ రాజ్య వీథిలో వీథిలో
బురములందున నొక్క పురుగులేదు
ప్రభు! మీరు చను నసివాళ్ళలో బీళ్ళలో
పసిమి మేసెడు నొక్క పశువు లేదు

చిన్నికోడలితోడ రామన్నవదలి
వచ్చుచున్నట్టి నాదు దౌర్భాగ్యముఖము
పరిహరించిరొ నాదు సేవకతపొంటె
బృథ్విపతి! యెంతగా బ్రతారించినావు? (అయో.మునిశాప. 95)

కల్పవృక్షం చదువుకుంటూపోతున్నప్పుడు నేనైతే ఈ పద్యం దగ్గర ఆగి ఉండేవాణ్ణి కాను. ఎవరేనా ఈ పద్యాన్ని ఎత్తిచూపి ఉంటే, నాకు వెంటనే వాల్మీకి రామాయణంలో భరతుడు అయోధ్యకు తిరిగి వస్తున్నప్పుడు చూసిన అయోధ్య (2:114:1-27) గుర్తొచ్చి ఉ ఒండేది. ఆ దృశ్యాన్ని విశ్వనాథ కూడా వర్ణించకపోలేదు (అయో.మునిశాప, 364-370). కాని ఆ వర్ణన వాల్మీకి ఎదట నిలబడగలిగేదికాదు. నిలబడలేదని విశ్వనాథకి కూడా తెలుసు. అందుకనే ఆయన రాముడిలేని అయోధ్యను భరతుడి కళ్ళతో కాక సుమంత్రుడి కళ్ళతో వర్ణించడానికి పూనుకున్నాడని అనుకోవచ్చు. కాని మా మాష్టారి గొంతులో పై పద్యం విన్నప్పుడు నాలో కలిగిన భావసంచలనం మాటల్లో పెట్టలేనిది. ఈ మామూలు తెలుగుమాటలు, ఈ predictable description మాష్టారి గొంతులో వినగానే అపూర్వ–రామణీయకతను, ఒక అలౌకిక శోకసమ్ముగ్ధతను సంతరించుకుంది.

అలానే రాముడి అందాన్ని వర్ణించాలంటే కవి సీత కళ్ళతో కాదు, శూర్పణఖ కళ్ళతో చూడమంటున్నాడు అని వినిపించిన ఈ రెండు పద్యాలూ చూడండి:

తొలకరిన్ మొయిలు తూగుచున్నదో
యలసతన్ నెమలి యాడుచున్నదో
సొలయకన్ జివురు చూచుచున్నదో
యలరువింటిదొర వౌదువా మునీ! (అరణ్య, పంచవటి. 95)

నేరేటి పండ్లెరుపు నీలిపగుళ్ళ రంగై
యౌరర నీ తనువునందము చిందిపోవున్

రారా మనోభవశరప్రమితాకృతీ ప్రా
వారాంతదేశమున బట్టెద జిందకుండన్ (96)

మొదటి పద్యం ప్రియంవద వృత్తమట, రెండోది వసంతతిలక వృత్తమట. సరే. ఆ ఛందస్సులే ఎంచుకోడంలోని అందం అలా ఉంచి, ఆ రెండు చిన్న పద్యాల్నీ మాష్టారు చదువుతుంటే, కవి శూర్పణఖతో పొందిన తన్మయీభావాన్ని తిరిగి సహృదయుడు తాను కూడా పొంది ఆ తన్మయీభావప్రపంచంలోకి మనల్ని కూడా లాక్కుపోతున్నాడని తెలుస్తోంది.

నేను ఎంత reluctant గానైనా ఆ పద్యాలు వింటూ ఉండవచ్చుగాక, కాని 'నేరేడు పండులాంటి నీ దేహం అడవుల్లో నడిచినప్పుడు కందినచోట, ఆ పండ్ల నీలిపగుళ్ళ లోంచి ఎర్రని రంగు ఒలికిపోతోంది, అది నేలపాలు కాకుండా నా పైట పరిచి పట్టుకోనివ్వు' అని శూర్పణఖ చెప్తోందని మా మాష్టారు చెప్తున్నప్పుడు, ఆ మాటలనే మత్తులో పడిపోకుండా ఎలా ఉండగలను?

దీన్ని ఆయన రసధ్వని అంటున్నారు. అంటే కేవలం వర్ణన రసాన్ని మాత్రమే ఉద్దీపింపచేయగలుగుతుంది. కాని ఒకటి వర్ణిస్తున్నప్పుడు ఆ వర్ణన ఏకకాలంలో రసోద్దీప్తినీ, దాన్ని దాటిన ఒక సూక్ష్మ అనుభూతినీ మనలో మేల్కొల్పినప్పుడు దాన్ని రసధ్వని అంటాం. ఉదాహరణకి ఆయనే వినిపించిన ఈ పద్యం వినండి:

ఏదీ రావణుడన్న రాక్షసధరాభృత్స్వామి విన్నావటో
యా దైత్యేశ్వరు పట్టపేన్గువలె నీయాకారమేపారు గా
దా దైత్యద్విపరాజు హెుంజిలుగు హౌదా వోలెనున్నాను నే
నీ దాంపత్యపు హౌసు చూడగదవోయీ! మౌనిరాణ్మన్మథా! (97)

మాష్టారు ఈ పద్యానికి అర్థం వివరించలేదుగాని, మనం ఊహించవచ్చును, రాముడు రావణుడి పట్టపుటేనుగలాగా ఉన్నాడనీ, తాను ఆ పట్టపుటేనుగ పైన నిలబెట్టిన బంగారు అంబారీలా ఉన్నాననీ, తామిద్దరి దాంపత్యం ఎంత శోభించగలదో చూడమనీ శూర్పణఖ చెప్తున్నప్పుడు, ఆ వర్ణనలోని చమత్కారాన్ని దాటి, అటువంటి grotesque ఊహ ఒక తామసి మాత్రమే చెయ్యగలదని మనకి కవి చెప్పకుండానే తెలుస్తూ ఉన్నదికదా, ఇది ధ్వని.

ఇలానే ఈ ప్రసంగంలో ఆయన వినిపించిన ఎన్నో పద్యాలు, ముఖ్యంగా జటాయువు మాట్లాడిన మాటలు, రావణుడి మాటలు–కొంతసేపు పోయేటప్పటికి, ఆ ప్రసంగం పున్నమి

నాటి సముద్రంలాగా కెరటాల హెూరుతప్ప మరేమీ వినిపించని స్థితికి చేరుకుందని మనకు తెలుస్తూనే ఉంటుంది.

సాధారణంగా మనుషులు స్త్రీపట్లా, కవిత్వం పట్లా తొందరగా మాట తూలతారని భవభూతి అన్నాడని గుర్తు చేస్తూ, తన ప్రసంగసారాంశంగా ఆయన చెప్తున్నదేమిటంటే, గొప్ప కవిత్వాన్ని సమీపించడానికి, అనుభవమూ, మననమూ కావాలి తప్ప bookish knowledge కాదని. ఈ ప్రసంగమంతా విన్నాక నాకేమి అర్థమయిందంటే ఒక మహాకావ్యానికి కాలనియంత్రణ లేదని. ఒక సహృదయుడెవరేనా ఆ కావ్యానుభవాన్ని పొంది, ఆ అనుభూతినే పదే పదే మననం చేసుకుంటూ ఉన్నప్పుడు, మనం అతడి ద్వారా ఆ కావ్యం గురించి వింటున్నప్పుడు, దేదీప్యమానమైన హారతివెలుగులో మూలవిరాట్టు దర్శనం లభించినట్టు ఆ మహాకావ్యసౌందర్యదర్శనానికి క్షణమేనా నోచుకుంటామని!

మహాకావ్యమంటే మనం ప్రతిసారీ మొత్తం కావ్యం చదవాలి అని అనుకోనక్కరలేదు. ఆ కావ్యంలో ప్రతి ఖండమూ, ప్రతి సర్గా, ప్రతి పద్యమూ దానికదే ఒక సంపూర్ణ-సౌందర్యంతో వికసించి ఉంటుందని చెప్పడానికి ఆయన ఈ వాల్మీకి శ్లోకాన్ని ఉదాహరించడం నిరుపమానమైన రసజ్ఞత.

మహీకృతా పర్వతరాజి పూర్ణా
శైలాః కృతా వృక్షవితానపూర్ణాః
వృక్షాః కృతాః పుష్పవితానపూర్ణాః
పుష్పం కృతం కేసరపత్రపూర్ణమ్ (సుందరకాండ, 7-9)

ఈ శ్లోకాన్ని ఇంతకు ముందు ఆయన ఒకసారి రామాయణ సౌందర్యాన్ని అర్థం చేసుకోడానికి ఉపయోగించినట్టు గుర్తు. ఇప్పుడు అదే శ్లోకంతో కల్పవృక్షం గురించి చెప్తున్నారు. నిజానికి ఏ మహాకావ్యాన్ని సమీపించడానికేనా ఉపకరించగల ఫోకసులైటు ఇది.

వినండి ఈ ప్రసంగాన్ని. ప్రసంగం వినడం పూర్తయ్యేటప్పటికి మీరు కూడా నాకులానే కెరటాలు మీ ఇంటిదాకా వచ్చిన చప్పుడు వింటారు.

4-3-2025

చిన్నారి దేవదూత

ప్రతి శుక్రవారం ఫేస్‌బుక్ లైవ్లో పుస్తకపరిచయం ప్రసంగాలు చేస్తున్నాను. వాటిలో ఈ రెండుమూడువారాలుగా టాగోరు సాహిత్యం మీద మాట్లాడుతూ ఉన్నాను. మే ఏడో తేదీ టాగోరు పుట్టినరోజు దాకా చేయాలనుకుంటున్న ఈ ప్రసంగాల్లో గీతాంజలి కాక, టాగోరు రచనల్లో తెలుగుపాఠకులకి అంతగా పరిచయం లేని పుస్తకాల మీదా, వాటికిప్పటికే తెలుగు అనువాదాలు వచ్చి ఉంటే వాటిమీదా మాట్లాడాలని ప్రణాళిక. అందులో భాగంగా మొన్న శుక్రవారం టాగోరు 'పోస్టాఫీసు' నాటకం, 'శిథిలకుటీరం' పేరిట తెలుగులోకి అనువాదమైన 'నష్టనీడ్' నవలికల్తో పాటు, The Crescent Moon గురించి కూడా మాట్లాడేను.

ముప్పైఏళ్ళ కిందటి మాట. ఢిల్లీలో విద్యాసంబంధమైన ఒక ట్రైయినింగులో పాల్గోటానికి వెళ్ళినప్పుడు, కేరళనుంచి వచ్చిన ఒక డైటు ప్రిన్సిపాలు నా రూమ్మేటుగా ఉన్నారు. ఆయన దాదాపు పదవీవిరమణకు దగ్గరలో ఉన్నారు. మేమొక సాయంకాలం శిక్షణ ముగిసేక, మా హాస్టలు బాల్కనీలో కూచుని మాట్లాడుకుంటూ ఉండగా, ఆయన నా కుటుంబవివరాలు అడిగేరు. నాకు ఏణ్ణర్ధం వయసు కలిగిన చిన్నపిల్లవాడు ఉన్నాడని చెప్పినప్పుడు, 'మీరు టాగోరు క్రిసెంటు మూను' చదివారా అనడిగారు. లేదన్నాను. ఆయన నొచ్చుకుంటున్నట్టుగా ముఖం పెట్టి, 'ఎంతమాట! ఇంట్లో ఒక పసికూన ఉన్నప్పుడేనా క్రిసెంటుమూను చదవకపోతే మరెప్పుడు చదువుతారు?' అనడిగారు. నేను చాలా సిగ్గుపడ్డాను. తిరిగి హైదరాబాదు రాగానే చేసిన పని క్రిసెంటు మూను చదవడమూ, ఆ చదివిన ఉత్సాహంలో మా పిల్లవాడిమీద ఒక పెద్ద కవిత రాయడమూ కూడా!

1902 లో టాగోరు తన భార్యనీ, ఒక బిడ్డనీ పోగొట్టుకున్నాడు. తల్లిలేని తక్కిన పిల్లలిద్దర్నీ తీసుకుని ఆయన ఆల్మోరాలో కొంతకాలం గడిపేడు. అప్పుడే 'శిశు' గీతాలు రాసేడు. తల్లి లేని తన ఇద్దరు పిల్లలకీ రోజూ ఆ గీతాలు పాడి వినిపించేవాడట. 1913

లో 'శిశు' గీతాల్లోంచి 35 గీతాల్ని తీసుకుని, అదనంగా మరొక 5 కవితలు వివిధ సంపుటాల్లోంచి ఎంచి, మొత్తం 40 గీతాల్ని ఇంగ్లిషులోకి వచనకవితలుగా అనువదించి The Crescent Moon వెలువరించాడు. వాటికి శీర్షికలు కూడా పెట్టాడు. మొత్తం టాగోరు ఇంగ్లిషు కవిత్వసంపుటాల్లో శీర్షికలున్న ఏకైక సంపుటం ఇది.

కాని, టాగోరు ఏ పరిస్థితిలో ఈ గీతాలు రాసేడో, ఏ దేశంలో, ఏ నిష్ఠుర, భాగ్యహీన సమాజనేపథ్యంలో నిలబడి పిల్లల్ని ఉద్దేశించి ఈ అపూర్వమంత్రగానం చేసాడో, ఆ వివరాలు తెలియకుండా, వట్టి కవితలు మాత్రమే పుస్తకంగా వేస్తే, వాటిని చదవగానే ప్రపంచం వాటిలోని మహిమాన్వితను పోల్చుకోగలదని ఆశించడం కష్టమే. కాబట్టే, ఈ అనువాదం వెలువడగానే ప్రపంచస్పందన మిశ్రమంగా ఉండింది. ఒక పత్రిక వీటిని more childish than childlike అని తీసిపారేసింది. కానీ మరొక పత్రిక, ఆ కవితల్లో కనవచ్చే శైశవచిత్రణ విలియం బ్లేక్ కవిత్వంతో పోల్చదగ్గది అని ప్రశంసించింది. ఇంకొక పత్రిక ఇంకొంచెం ముందుకు పోయి ఈ కవిత్వం 'గీతాంజలి కన్నా కూడా గొప్ప దివ్యవార్త' అని కొనియాడింది.

ఈ సంపుటం వెలువడి, ఒక శతాబ్దికి పైగా కాలం గడిచిపోయేక, ఇప్పుడు మనం ఈ కవితప్రాశస్త్యాన్ని మరింత స్పష్టంగా స్తుతించగలిగే స్థితిలో ఉన్నాం. ఎందుకంటే, మన సాహిత్యంలో, పిల్లలకోసం రాసే కవులూ, రచయితలూ చాలా అరుదు. ముఖ్యంగా కథలూ, నవలలూ, వ్యాసాలూ రాసే 'ప్రధానస్రవంతి' రచయితలెవరూ, బాలసాహిత్యంలో చెప్పుకోదగ్గ కృషి చేసినవారు, కనబడరు. ఇవన్నీ నేనెప్పుడూ చెప్పే మాటలే. గతంలో, రెడ్డి రాఘవయ్యగారిని తలుచుకుంటూ, ఇదంతా వివరంగా రాసాను కూడా. ఎంత వెతికినా, తెలుగులో, బి.వి.నరసింహారావు తప్ప చెప్పుకోదగ్గ బాలగీతకారుడు మరొకరు కనిపించడం లేదు. తెలుగులో సినిమాకవులు కావాలనికలగనేవారే తప్ప బాలగీతకారులు కావాలని తపించేవారెవరూ లేరు. భారతీయ భాషల్లో ఎవరేనా ఉండి ఉండవచ్చునేమోగాని, తక్కిన భారతదేశానికి తెలిసిన పేర్లు టాగోరూ, సుబ్రహ్మణ్య భారతి మాత్రమే.

ఒక కవి పిల్లలకోసం పాటలు రాయడమంటే అతడిలో ఒక శిశువు ఇంకా పదిలంగా, ఇంకా సజీవుడిగా, ఇంకా నిత్యాశ్చర్యచకితుడిగా ఉండాలి. ఇప్పుడు మళ్ళా ఈ నెలకూన గీతాలు చదువుతుంటే, ఇంత శిశుసన్నిహితుడైన మరొక కవి, నాకైతే, రాబర్టు లూయీ స్టీవెన్సను తప్ప దాదాపు ఈ రెండువందల ఏళ్ళ కాలంలో మరొక కవి కనిపించడం లేదు.

ఇలా ఈ కవిత్వ ప్రాసంగికత అలా ఉంచి, అసలు ఈ కవిత్వం గురించే మాట్లాడు-కోవలసింది మరెంతో ఉందని నిన్న చెప్పాను. చాలా విషయాలే చెప్తూ, ఈ సంపుటిలోంచి

రెండు కవితలు కూడా అనువదించి వినిపించాను. కన్నీళ్ళ మధ్య, గొంతు పూడుకుపోతూ ఉండగా, అతి కష్టమ్మీద నన్ను నేను అదుపు చేసుకుంటూ మాట్లాడేను. ఆ కవితలిక్కడ మీతో పంచుకోకుండా ఎలా ఉండగలను! చూడండి:

చిన్నారి దేవదూత

వాళ్ళు రంకెలు పెడుతుంటారు, కొట్లాడుకుంటూ ఉంటారు. ఒకరిపట్ల ఒకరికి చెప్పలేనంత అపనమ్మకం, నిస్పృహ, వాళ్ళ వాదవివాదాలకు అంతే లేదు.

వాళ్ళ మధ్య నీ జీవితం ఒక వెలుగురేఖలాగా సాగనివ్వు. నా తండ్రీ, ఆ వెలుగు నిర్మలంగా, నిశ్చలంగా, వాళ్ళని నిశ్శబ్దం వైపుగా నడిపించనివ్వు.

వాళ్ళ అసూయతో, వాళ్ళ దురాశతో వాళ్ళు చాలా క్రూరులు. వాళ్ళ మాటలు రక్తంకోసం దాహంగొన్న రహస్యఛురికలు.

వెళ్ళు నాన్నా, వెళ్ళి రుసరుసలాడుతున్న ఆ హృదయాల మధ్య నిలబడు. నీ చల్లని చూపులు వాళ్ళమీద పడగానే కల్లోలభరితమైన ఒక దినం గడిచేటప్పటి సాయంకాలంలాగా ఒక క్షమ, ఒక శాంతి దొరకాలి వాళ్ళకి.

నా తండ్రీ, వాళ్ళు నిన్ను చూడగానే సమస్త విషయాల సారాంశమూ వాళ్ళకి తేటతెల్లం కావాలి. వాళ్ళు నిన్ను ప్రేమించాలి, తమలో తాము ఒకరి నొకరు ప్రేమించుకోవాలి.

నా కన్నా, రా, వచ్చి అక్కున చేరు. సూర్యోదయవేళ నీ హృదయం ఒక పువ్వు లాగా విప్పారాలి. సూర్యాస్తమయ వేళ మౌనంగా నీ శిరసు వాల్చి నీ పూజ ముగింపుకు చేరుకోవాలి.

(The Child-Angel, The Crescent Moon, 39)

దీవెన

ఈ చిన్నారి హృదయాన్ని ఆశీర్వదించండి. నింగి నుంచి నేలకు ముద్దులు మూటగట్టిన ఈ చిట్టి తండ్రిని దీవించండి.

వీడికి సూర్యుడి కాంతి అంటే ఇష్టం. వాళ్ళమ్మనే చూస్తూ ఉండటం ఇష్టం.

దుమ్ముని ఈసడించుకోడం చాతకాదు వీడికి, పసిడిమెరుగుల వెంట పడటం తెలీదు వీడికి.

వీణ్ణి మనసారా మీ గుండెకు హత్తుకుని దీవించండి.

నూటొక్కదారులు ఒకదానికొకటి అడ్డం పడే ఈ లోకంలోకి వచ్చాడు వీడు.

ఈ గుంపులో మిమ్మల్నెట్లా పోల్చుకున్నాడో తెలీదు. కాని మీ ఇంటిదగ్గరకొచ్చి నిలబడ్డాడు. మీ చేయి పట్టుకుని తనకి దారి చూపించమని అడుగు–తున్నాడు.

నవ్వుతో, తుళ్ళుతో, కబుర్లు చెప్తూ మీరెక్కడికి రమ్మంటే అక్కడికొస్తాడు. వాడి మనసులో మీ పట్ల రవ్వంతైనా సందేహం లేదు.

వాడి నమ్మకం నిలబెట్టుకోండి. తిన్నగా నడిపించండి. మనసారా దీవించండి.

వాడి చేతిలో మీ చేయి వేయండి. మీ దారికింద కెరటాలు ఘూర్ణిల్లుతున్నా, పైనుంచి గాలులు వీచాలని ప్రార్థించండి. ఎత్తిన వాడి తెరచాపల్ని ఆ గాలులు శాంతిస్వర్గం వైపు తీసుకుపోనివ్వండి.

మీ తొందరలో పడి వాణ్ణి మర్చిపోకండి. వాడికి మీ హృదయంలో చోటివ్వండి, మనసారా దీవించండి.

(Benediction, The Crescent Moon, 36)

13-4-2025

యుద్ధకవి

ప్రపంచ మహాకవుల్లో హోమరు, డాంటే, షేక్స్పియరు, వ్యాసవాల్మీకులతో పాటు దు-ఫుని కూడా తలుచుకోవాలి. కాని తక్కిన మహాకవులకీ, ఈయనకీ తేడా ఏమిటంటే, కెన్నెత్ రెక్స్‌రోత్ అన్నట్లుగా, ఈయన తన జీవితకాలంలో ఒక్క ఇతిహాసం కూడా రాయలేదు. ఒక్క నాటకం కూడా రాయలేదు. కేవలం ఖండకావ్యాల్లాంటి చిన్న కవితలు మాత్రమే రాస్తూ వచ్చాడు. ఆయన జీవించిఉన్నప్పుడు దాదాపు అరవై చాపచుట్టల నిడివి కవితలవి. ఇప్పుడు వాటిల్లో మనకి లభ్యమవుతున్నవి దాదాపు ఇరవై స్రోళ్ళు మాత్రమే. అంటే సుమారు పదిహేనువందల కవితలు. కాని అవి చాలు, ఆయన్ని ఒక poet-historian గా గుర్తుపెట్టుకోడానికి.

ఈ మాట అరిస్టాటిలు వింటే ఈ పదప్రయోగాన్ని ఏమాత్రం అంగీకరించడు. ఆయన దృష్టిలో కవిత్వం వేరు, చరిత్ర వేరు. హెరొడటసు రచనల్ని పద్యాలుగా మార్చినంతమాత్రాన అవి కవిత్వం కాలేవనీ, అప్పుడు కూడా వాటిని చరిత్ర అనే అంటామనీ అన్నాడు అరిస్టాటిలు. ఎందుకంటే చరిత్ర ఎప్పుడూ ఇదిలా జరిగింది అనే చెప్తుంది తప్ప, ఇదెలా జరిగి ఉండవచ్చో ఊహాగానం చేసే అవకాశం దానికి లేదంటాడు ఆయన. కవిత్వం దానికదే చరిత్రగా మారిపోదు. అలా మారాలంటే, ముందు ఆ చరిత్రని నువ్వు తేదీలుగా, సంఘటనలుగా, చారిత్రిక విశ్లేషణలుగా కాక, ఒక క్షోభగా, ఒక సంఘర్షణగా, ఒక trauma గా అనుభవించి ఉండాలి. బైబిల్లో పాతనిబంధన ప్రవక్తల అధ్యాయాలు చూడండి. చరిత్ర, సాహిత్యం ఒక్కటైపోయిన తావులవి.

యుద్ధం అంటే అన్నిటికన్నా ముందు మన దైనందిన జీవితం మొత్తం విచ్ఛిన్నమై పోవడం. అదెలా ఉంటుందో ఒక గాజాలో, ఒక యుక్రెయినులో, ఒక జాఫ్నాలో

ఉన్నవాళ్ళకి తెలుస్తుంది. మన నిత్యజీవితంలోని ఏ చిన్ని సౌకర్యాన్నీ కూడా వదులు-కోకుండా, సాయంకాలం బాంకు నుంచో, కాలేజీ నుంచో, ఆఫీసునుంచో, ఇంటికి రాగానే ఓ.టి.టి ముందు కూర్చుని, అందులో యుద్ధాల గురించిన సినిమాలు చూస్తూ, యుద్ధమంటే ఎలా ఉంటుందో ఊహించుకుంటూ ఉంటే, అది యుద్ధానుభవం కానేరదని వేరే చెప్పాలా!

యుద్ధం గురించి ఊహించుకునేవాళ్ళకి యుద్ధం గురించి రాయడంలో ఒక రొమాంటిసిజం ఉంటుంది. కాని నిజంగా యుద్ధం చేసేవాళ్ళకి అందులో రొమాంటిసిజం ఏమీ ఉండదు. ఎంత తొందరగా యుద్ధం ముగుస్తుందా అన్న చింత ఒక్కటే వాళ్ళని అశాంతి పెడుతూ ఉంటుంది. యుద్ధమధ్యంలోకి దూకక తప్పని ప్రతి ఒక్క సైనికుడూ కూడా వీలైతే ఈ విషపాత్ర తన నుంచి తప్పించాలనే కోరుకుంటూ ఉంటాడు. యుద్ధమంటే ఎలా ఉంటుందో చూడని వాడు, యుద్ధం తన జీవితాన్నీ, తన వాళ్ళ జీవితాన్నీ అతలాకుతలం చెయ్యడమెలా ఉంటుందో తెలియనివాడు మాత్రమే తుపాకుల్నీ, బేయొనెట్లనీ, బుల్లెట్లనీ కీర్తిస్తూ కవిత్వం చెప్తాడు. కాని నిజంగా యుద్ధంలో మునిగిపోయినవాడు రాసే కవిత్వమలా ఉండదు. అదెలా ఉంటుందో చూడాలంటే దు-ఫు లాంటివాడి కవిత్వం చదవాలి.

ఎవరేనా అడగవచ్చు: దు-ఫు పాల్గొన్న యుద్ధం నిర్బంధయుద్ధమనీ, అతడు తనకేమీ సంబంధంలేని రాజు కోసం యుద్ధం చేయాల్సి వచ్చిందనీ, కాబట్టి, అతడి యుద్ధంలో ఆ నిస్పృహ తప్పనిసరిగానే ఉంటుందనీ, అలాకాక, తన దేశం గురించో, తన ప్రజల విముక్తి గురించో తనంతతనే యుద్ధంలో పాల్గొన్నవాడి కవిత్వంలో మనకి యుద్ధోత్సాహం తప్పని-సరిగా కనిపిస్తుందనీ అనవచ్చు. కావచ్చు. ఇరవయ్యేళ్ళ వయసులో, జీవితవాస్తవాలు తనకి తెలియనప్పుడు, తాను చేపట్టిన యుద్ధం గురించి తను స్వయంగా అంచనా వేసుకోగల పరిజ్ఞానం, వివేకం కొరవడినప్పుడు, కేవలం ఒక త్యాగశీలత తప్ప, మనుషుల కోసం తన ప్రాణాల్ని ఆహుతి చెయ్యాలన్న నిలవనియ్యని ఆరాటం తప్ప మరేమీ తెలియని వయసులో యుద్ధోత్సాహాన్ని కీర్తిస్తూ కవిత్వం చెప్పడం అరుదు కాకపోవచ్చు. కాని పదిహేనేళ్ళకో, ఇరవయ్యేళ్ళకో యుద్ధంలోకి దూకి, నలభయ్యేళ్ళపాటు లేదా యాభై ఏళ్ళ పాటు యుద్ధరంగంలోనే జీవిస్తూ, తాము చేస్తున్న పోరాటం ఎటు దారితీస్తున్నదో, దాని ఫలితాలేమిటో, పర్యవసానాలేమిటో తెలియక, అంతుపట్టక, ఈలోపు తనవాళ్ళకి ఎలాగూ దూరమయ్యారు సరే, ఇప్పుడు తమ యుద్ధ సహచరులు కూడా ఒకరొకరే తమ కళ్ళముందు నేలకొరుగుతూ ఉండగా కూడా ఎవరేనా ఆ తొలిరోజుల యుద్ధోత్సాహంతో కవిత్వం చెప్పినవాళ్ళున్నారా? ఉంటే, ఆ కవిత్వం చదవాలని ఉంది నాకు. కాని అప్పటిదాకా, దీర్ఘకాలిక యుద్ధంలో పాల్గొన్న వాళ్ళ కవిత్వానికి దు-ఫు కవిత్వమే ఉదాహరణగా కనిపిస్తుంది నాకు.

ఎనిమిదవ శతాబ్ది చైనాలో రాజకీయ అస్థిరత, క్షామం, అగ్నిప్రమాదాలు, తుపాన్లు, ఆకలి, అకాలమరణాల మధ్య, ఎడతెగని యుద్ధాలమధ్య సంచరించిన దు-ఫు తన జీవితకాలమంతా తిరిగి తన స్వగ్రామానికి వెళ్ళిపోవాలనీ, అక్కడ తన భార్యాబిడ్డల్తో ఒక చిన్న ఇంట్లో, ఒక సాధారణ రైతు జీవితం జీవించాలనీ కలలుగంటూనే ఉన్నాడు. ఆ ఆకాంక్ష ఒక్క దు-ఫుది మాత్రమే కాదు. ఎనిమిదవ శతాబ్దిలో అతడి సమకాలికుడైన ప్రతి ఒక్క చీనీయుడిదీ కూడా. కాబట్టే ఆ కవిత్వాన్ని ప్రజలు రెండుచేతులా ఆహ్వానించేరు. అతణ్ణి తమ హృదయాల్లో సుప్రతిష్టితుణ్ణి చేసుకున్నారు. ఇప్పటికీ! ఇప్పుడు పీపుల్సు రిపబ్లిక్ ఆఫ్ చైనాలో కూడా అతడే సర్వోన్నత చీనాకవి!

దు-ఫు కవిత్వం కావ్యమయ చరిత్రకావడానికి కారణం అతడు తాను చరిత్రని నిర్మిస్తున్నాడనుకోకపోవడం. అరిస్టాటిలు చెప్పినట్టు చరిత్ర ఎంతసేపూ ఏదెలా జరిగిందో చెప్తే, కవిత్వం ఏదెలా జరిగి ఉండవచ్చో చెప్తుందని అనుకుంటే, దు-ఫు కవిత్వం చేసింది ఆ పనే. అతడు తన కళ్ళముందు సంభవిస్తున్న చరిత్రను చిత్రిస్తున్నప్పుడు, ఆ దృశ్యాల్ని దాటి, అతడు కోరుకుంటున్న, కలగంటున్న సాధారణ దైనందిన జీవితదృశ్యాల్ని మనతో పంచుకుంటూనే ఉంటాడు. నిజానికి ఒక మనిషి అంతిమంగా కలగనే దివ్యజీవితం, భవ్యజీవితం చాలా సాధారణమైన దైనందిన జీవితం మాత్రమే. నిజమైన మానవప్రేమికుడు కోరుకునే మరోప్రపంచంలో ఉండేదల్లా ప్రశాంతవాతావరణంలో రోజంతా పని, రాత్రికి విశ్రాంతి మాత్రమే. నేను మాట్లాడుతున్నది కవిత్వం గురించి. చరిత్రకారుల విశ్లేషణల గురించి కాదు. నాకు తెలిసి యుద్ధంలో స్వయంగా పాల్గొన్న చరిత్రకారులెవరూ లేరు.

అందుకని, ఇదుగో, Sam Hamill అనువాదం చేసిన దు-ఫు కవిత్వం Facing the Snow, Visions of Tu Fu (1988) చదువుతున్నంతసేపూ నాకు ఒక ఎడతెగని యుద్ధంతో పాటు, ఒక శాంతికాముకుడైన మానవుడు కూడా కనిపిస్తూ ఉన్నారు. ఇందులో ఆయన అనువాదం చేసిన తొంభై పైచిలుకు కవితల్లో ఒక సంక్షుభిత కాలాన్నీ, ఒక రక్తసిక్త దేశాన్నీ మాత్రమే కాదు, చిన్నిచిన్ని సంతోషాల కోసం కలలుగనడాన్ని కూడా చూసాను. ఎక్కడ చూసినా తెల్లని మనిషి ఎముకలు, నీలిరంగు యుద్ధధూమమూ ఆవరించిన ఆ కాలంలోకి ప్రయాణించాను, కాని, అదేసమయంలో ఒక కీచురాయి పాట కూడా విన్నాను, రాలిపడుతున్న పూలరేకల్ని చూసాను. వసంతకాలపు వానల్తో పాటు, అడవి బాతుల క్రేంకారాలు కూడా విన్నాను. తాను రాసిన కవితల్లో కవికి ఒకటి epic అనీ, మరొకటి lyric అనీ భేదం లేదు. ప్రతి ఒక్కటీ అతడి నిట్టూర్పునే. కాబట్టే, నేనెప్పుడూ చూసి ఉండని ఆ లాండ్ స్కేప్‌లో, నా ఊహకి కూడా అందని ఆ ప్రాచీన కాలంలో, నేను

అంచనాకూడా వెయ్యలేని ఆ సంఘర్షణలో సంచరిస్తున్న ఆ మానవుడు చెప్పిన కవిత్వం మాత్రం నాకెంతో సన్నిహితంగా, ఇదుగో, ఇక్కడ ఈ గుడిమల్కాపూరు కాలనీలో, నా రోజువారీ జీవితాన్ని చిత్రిస్తున్నదిగానే నాకు అనుభవానికొస్తూ ఉంది. అటువంటి పది కవితలు మీకోసం:

యుద్ధశకటాల గీతం

ఖణేల్మంటున్న శకటాలు, అరుస్తున్న గుర్రాలు
విల్లమ్ములతో ముందుకు నడుస్తున్న సైనికులు.

వాళ్ళని చూస్తూ నిలబడ్డ కుటుంబాలు.
కంపిస్తున్న వంతెనని కప్పేసిన ధూళిమేఘం.

వాళ్ళ అంగీలు పట్టుకు వేలాడుతూ అడ్డుపడుతున్న
రోదనల ప్రతిధ్వనులు ఆకాశమంతా.

నువ్వు వాళ్ళని అడగాలేగాని చెప్పుకొస్తారు
'పదిహేనేళ్ళప్పుడే నిర్బంధసైనికులమై ఉత్తరాన పోరాడేం

ఇప్పుడు నలభయ్యో ఏట పడమటివైపు ప్రయాణం
ఒకప్పుడు గ్రామాల్లో మమ్మల్ని కీర్తించేవారు

ఇప్పుడు తలనెరిసి సరిహద్దులకు పయనిస్తున్నాం.
సముద్రమంత రక్తం చిందించాం.
అయినా ఇంకా కావాలంటాడు చక్రవర్తి.

కొండలకు తూర్పుదిక్కున వెయ్యిన్నొక్క గ్రామాలు
పదివేల పైచిలుకు గ్రామాలు బీళ్ళయిపోయాయి.

ఎక్కడ చూడు పొలాల్లో కష్టిస్తున్న మహిళలు
అయినా కాలవల్లో నీళ్ళు లేవు, కంకుల్లో తాలు.

కుక్కల్లాగా, పశువుల్లాగా చీనా సైనికులు
పోరాడుతూనే ఉన్నారు నిర్విరామంగా.

నువ్వెంత అడిగినా మేం ఫిర్యాదు చెయ్యలేం
ఈ శీతాకాలం కొత్త దళాలు రావలసి ఉంది

అధికారులు కొత్త పన్నులు వసూలు చేస్తున్నారు.
కాని ఎక్కణ్ణుంచి తేవాలి సొమ్ము?

మగపిల్లలు పుట్టడంలో దుఃఖమేమిటో తెలుసుకున్నాం
అదే ఆడపిల్లలయ్యుంటే మా పొరుగింట్లోనే ఉండేవారు.

ఇప్పుడు మా మగపిల్లలు దుమ్ములో పడివున్నారు.
సరిహద్దుల్లో చెదిరిపడ్డ వాళ్ళ ఎముకల్ని
ఏరి తెచ్చుకోడానికి ఎవరూ లేరు.

పాత ప్రేతాలు, కొత్త వేదనలు: ఎక్కడ విన్నా అవే
రాత్రంతా ఎడతెరిపిలేని మంచూ, వానా.

వెన్నెల రాత్రి

తీరపట్టణమ్మీద మళ్ళా అదే చంద్రుడు
ఆమె తన కిటికీలోంచి చూస్తూంటుంది.

మా పిల్లలు మరీ పసివాళ్ళు
రాజధాని వాళ్ళకి గుర్తుండదు.

ఆమె సుగంధతైలకేశరాశిపైన మంచు
నిర్మలచంద్రకాంతి ఆమె బాహువులమీద.

ఎప్పటికేనా కలిసి కూచోగలమా ఆ కిటికీ పక్క,
కన్నీళ్ళు తొలగిపోతాయా మా వదనాల మీంచి?

నది ఒడ్డున చింతన

రాలిపడుతున్న ప్రతిపూలరేకా వసంతనిష్క్రమణనే
పదివేల పూలరేకలు నన్ను ఖిన్నుణ్ణి చేస్తాయి.

వెలిసిపోతున్న వసంతపుష్పాలు, దుఃఖమాగదు.
ఒకింత మధువుతో నన్ను సముదాయించుకుంటాను.

దైవమందిరాల చూరులో లకుముకిపిట్టల గూళ్ళు
రాజసమాధులదగ్గర ఒక రాతి విగ్రహం.

కనిపిస్తున్న వాటినుంచే సంతోషం స్వీకరిస్తూ
నా పానపాత్ర మళ్ళా నింపుకుంటాను.

ఆకాశ గంగ

ఏడాదిపొడుగునా ఆకాశగంగ మడ్డిపట్టి ఉంటుంది
ఒక్క నిర్మల శరద్రాత్రుల్లో తప్ప.

నాలుగైదు మేఘాలు కూడా నీడగా మారేచోట
రాత్రి పూట మాత్రం ప్రకాశవంతం.

ఆ నదిలో ఈదుతున్న తారలు నగరసౌధం మీద.
ఆ వడిలో కొట్టుకుపోతున్న చంద్రుడు.

ప్రతి శరత్తులోనూ ఆ నదిని దాటే పురాణపాత్రలు
ఏ గాలీ, ఏ కడలీ వాళ్ళని ఆపలేవు.

లి-బాయిని తలుచుకుంటూ

అడవులమీంచి వీస్తున్న శీతగాలి
నువ్విప్పుడేం తలుచుకుంటావు?

నదీసరోవరాల లోకం నుంచి
అడవిబాతులు ప్రేమలేఖలు తెచ్చేదెప్పుడు?

కవులు బతక్క తప్పదు, గుర్తింపు
లేకుండానే, తమ అంతరాత్మల్ని నమ్ముకుని.

మన ప్రాచీన కవిశ్రేష్ఠుడు గుర్తున్నాడా-
అతడికోసం ఈ నదిలో ఒక పద్యం వదిలిపెట్టు.

స్వగ్రామం

పడమటి మేఘాలు, కొండలమీద కొండలు
సూర్యాస్తమయం మీద కుమ్మరించిన సిందూరం.
సూర్యుడు భూమిలోకి నడిచివెళ్ళిపోతున్నాడు.

అలసిపోయి వృద్ధాప్యంలో నా ఇంటికి రాగానే
నా కుటీరం చుట్టూ పాటపాడుతూ పక్షులు.

నేనింకా బతికి ఉన్నానంటే ఆశ్చర్యం
నన్ను చూస్తూనే ఏడుస్తున్న భార్యాబిడ్డలు.

గాలులు నన్నెక్కడికో నెట్టుకుపోయాయి
కెరటాలు మళ్ళా వెనక్కి పట్టుకొచ్చాయి.

ఇంకా బతికి ఉండటం నా భాగ్యం.
ఇరుగుపొరుగూ కంచెచుట్టూ గుమికూడారు

నిట్టూర్పులు, ఏడుపులు, కుశలప్రశ్నలు.
కన్నీళ్ళతో ఎర్రబడ్డ కళ్ళతో–

సాయంకాలదీపం వెలిగించుకుని
కలిసి కట్టుగా ఒక కలలో అడుగుపెట్టాం.

కీచురాయి

కీచురాయి ఎంత అల్పప్రాణి! అయినా
సున్నితంగానే మనల్ని వేధించగలదు.

పొదల్లో ఉన్నంతసేపూ అణిగిఉండి
ఇప్పుడు మా మంచం కింద చేరింది.

ఒక దిమ్మరితో అది కన్నీళ్ళు పెట్టించగలదు
ఒక ఒంటరి గృహిణికి నిద్రదూరంచెయ్యగలదు.

ఒక వీణగాని ఒక వేణువుగాని
పలికించలేవు సంగీతం దానికిమల్లే.

వాన వెలిసిన సాయంకాలం

దాహంతో గొంతుపిడచగట్టిన నా తోటకి
ఈ అపరాహ్ణపవనం వాన తీసుకొచ్చింది.

అస్తమయసంధ్య ఆవిరిగక్కుతున్నట్టు పచ్చిక
మెత్తగా తళుకులీనుతూ ప్రవహిస్తున్నది నది.

ఇప్పుడు నా పుస్తకాలెవరు సర్దిపెడతారు?
ఈ రాత్రికి నేను గడిపేది పానపాత్రలమధ్యనే.

వాళ్ళకి నా గురించి మాట్లాడుకోడమొక సరదా
కాని నా ఒంటరిజీవితాన్నెవరూ తప్పుబట్టలేరు.

వానా, చంద్రుడూ, నదీతీరమూ

గర్జించినంతసేపు గర్జించి వానవెలిసిపోయాక
ఇప్పుడు నిర్మల శరద్రాత్రి.

నీళ్ళమీద పలచని బంగారుపొర
ప్రవాహంలో తేలుతున్న శరత్తార.

తేటగా, పరిశుద్ధంగా ప్రవహిస్తున్నది
ఆకాశ గంగ మునుపటిలానే.

అస్తమయసంధ్య కొండల్ని నీడతో కప్పేసింది
ఆకుపచ్చని శూన్యంలో తేలుతున్నదొక అద్దం

సార్ద్ర, శీతల సంధ్య దానిలో ప్రతిఫలిస్తున్నది
పూలమీద పేరుకుంటూ
మెరుస్తున్నవి మంచుతునకలు.

వానని స్తుతిస్తూ

కరువు చవిచూసాం, దీర్ఘకాల వర్షాభావం తర్వాత
ఈ పొద్దున్నే నదిమీంచి దిగి వచ్చాయి మబ్బులు.

పొగమంచులాంటి వాన
ప్రతి దిక్కునా ఒక జల్లు.

గూళ్ళకి చేరుకున్నవి పక్షులు
అడవిపూల రంగులు తేటపడ్డవి.

ఇప్పుడు చీకటిపడ్డా ఆగని వానపాట
ఈ రాత్రంతా మేలుకు మరీ వినబోతున్నాను.

1-6-2025

సంధ్యాసమస్యలు

మహాప్రస్థానంలో ఈ 'సంధ్యాసమస్యలు' (1939) చదవని వారుండరు. అయినా మరోసారి.

సంధ్యాసమస్యలు

ఆ సాయంత్రం
రాక్సీలో నార్మా షేరర్,
బ్రాడ్వేలో కాంచనమాల!
ఎట కేగుటో సమస్య తగిలిందొక విద్యార్థికి!

ఉడిపీ శ్రీకృష్ణవిలాస్‌లో–
అటు చూస్తే బాదం హల్వా,
ఇటు చూస్తే సేమ్యా ఇడ్లీ!
ఎంచుకొనే సమస్య కలిగిందొక ఉద్యోగికి!

ఆ సాయంత్రం– ఇటు చూస్తే అప్పులవాళ్లూ
అటు చూస్తే బిడ్డల ఆకలి!
ఉరిపోసుకు చనిపోవడమో,
సముద్రమున పడిపోవడమో
సమస్యగా ఘనీభవించిందొక సంసారికి!

ఈ కవిత నేను మొదటిసారి చదివి యాభై ఏళ్ళకు పై మాటే. మహాప్రస్థానంలో చదివిన వెంటనే నన్ను ఆకట్టుకున్న మొదటి కవితల్లో ఇది కూడా ఒకటి. కవికీ, పాఠకుడికీ మధ్య ఎటువంటి అడ్డుగోడలూ లేని కవిత ఇది. చదవగానే కవిత చిన్నపిల్లవాణ్ణి కూడా చలింపచేస్తుందనడానికి నా అనుభవమే నిరూపణ.

కానీ ఈ రోజు ఎందుకనో, ఏవో ఆలోచనల మధ్య, ఈ కవిత గుర్తొచ్చి, ఇంతకాలం గానూ ఈ కవితను అర్థం చేసుకోవలసినట్టే అర్థం చేసుకున్నానా అని అనుమానమొచ్చింది.

మొదటిసారి చదివినప్పుడు నాకు కలిగిన భావం ఏమిటంటే, ఒక సాయంకాలం, ఒక విద్యార్థికీ, ఒక ఉద్యోగికీ, ఒక సంసారికీ కలిగిన సమస్య దేన్నెంచుకోవాలని. మొదటి ఇద్దరి సమస్యా వినడానికి చాలా తేలిగ్గా అనిపించే సమస్య. నిజానికి సమస్య కానే కాదు. బతకడానికి సంబంధించిన రోజువారీ ఎంపికల గురించిన సమస్యలవి. కాని మూడవది నిజమైన సమస్య. బతకలేకపోవడానికి సంబంధించిన సమస్య. చావటానికి సంబంధించిన సమస్య. ఎలా చనిపోవాలో ఆ మార్గాన్ని ఎంచుకోడానికి సంబంధించిన సమస్య.

మొదటి రెండు సమస్యలూ మనం కూడా ఏదోలాగా ఎప్పుడో ఒకప్పుడు ఎదుర్కొనేవే కాబట్టి ఆ రెండు సమస్యల గురించీ చదవగానే మనకి తెలీకుండానే నవ్వొస్తుంది. ఇవి నిజంగానే సమస్యలేనా అనిపిస్తుంది. వీటినిలాగ కవితలాగా రాయవలసినంత సమస్యలా అని అనుకుంటూనే మూడో సమస్య చదివేటప్పటికి బిత్తరపోతాం. అది మనల్ని మనం ఊహించని షాకుకి గురిచేస్తుంది. నిజానికి ఆ మాటల్ని అర్థం చేసుకునేలోపే మన మనసుకి తిమ్మిరెక్కుతుంది. మనం నిరుత్తరులమైపోతాం.

గొప్ప కవి తానొక గంభీరమైన విషయాన్ని ప్రతిపాదించేముందు, దానికన్నా తక్కువ గంభీరమైన విషయాల్ని ముందుచెప్పడం ద్వారా, తాను తర్వాత చెప్పబోయే విషయాన్ని మరింత గంభీరం చెయ్యడం ఒక రచనాపద్ధతి. మహాప్రస్థానంలో ఇటువంటి తావులు మరికొన్ని ఉన్నాయి. ఉదాహరణకి,

> గతమంతా తడిసె రక్తమున
> కాకుంటే కన్నీళులతో–

అని అంటున్నప్పుడు రక్తం కన్నా కన్నీళ్ళు మరింత వేదనాకరమని చెప్పడం ఇలాంటిదే. కాని రక్తమూ, కన్నీళ్ళూ ఒక గాంభీర్యాన్ని ద్యోతకం చేయడంలో ఒకదానికొకటి తీసిపోనివే. అంతేకాదు, మామూలుగా మనం కన్నీళ్ళకన్న రక్తం ఎక్కువ భయకారకమని భావిస్తుంటాం.

కవి ఆ వరసని తల్లకిందులు చేసి కన్నీళ్ళను రక్తంకన్నా మరింత విలువైన జీవనస్రావంగా మార్చేసాడు.

కాని ఈ కవితలో విద్యార్థి, ఉద్యోగి, సంసారి ఎదుర్కొన్న సమస్యలు సమానగంభీరాలు కావు. ఆ రెండింటిలోనూ మొదటి రెండూ ఆ విద్యార్థినీ, ఉద్యోగినీ బాధించేది క్షణకాలంపాటు మాత్రమే. అవి నిజానికి బాధించేంత పెద్ద సమస్యలు కూడా కావు. చాలా అల్పమైనవేనని మనకి తెలుసు. కాని అంత అల్పవిషయాల్లో కూడా ఏదో ఒకటి ఎంచుకోవలసి రావడానికి మనం ఒకక్షణం ఆలోచించవలసి రావడమే అక్కడ విషాదం. కానీ మూడవ సమస్య అటువంటిది కాదు. అది నిజమైన సమస్య. అది ఏ దారిన చనిపోవాలన్న ఎంపికకి సంబంధించిన సమస్య కాదు. అసలు బతకడమా, మరణించడమా అన్న సమస్య. చనిపోవడం నిశ్చయమని తేల్చుకున్నాక ఆ సంసారి ఏ దారిన చనిపోవాలి అని ఆలోచిస్తున్నట్టుగా కనిపిస్తున్నప్పటికీ, ఆ తటపటాయింపులోనే, అతడికింకా జీవితం మీద ఆశపోనేలేదనే ధ్వని ఉందందులో.

ఇదీ, ఈ కవితను ఇన్నాళ్ళూ నేను అర్థం చేసుకున్న తీరు. కానీ ఇప్పుడు ఎందుకనో, హటాత్తుగా, ఈ కవిత నాకు కొత్త విషయాలు చెప్తున్నది.

అదేమంటే, ఆ ముగ్గురి సమస్యలూ ఆ ముగ్గురికీ సమస్యలేననీ. వాటిల్లో ఎక్కువ తక్కువలు పాఠకుడిగా మనం ఏర్పరచుకుంటున్నాం తప్ప, వాళ్ళు అలా అనుకోవడం లేదని! ఆ సమస్యలు ఎదుర్కొంటున్నవాళ్ళకి వాటి తీవ్రతలో, మూడూ ఎవరికి వారికి ఒక్కలాగే తీవ్రమైనవేనని! అంటే అటు అప్పులవాళ్ళనీ, ఇటు బిడ్డల ఆకలినీ ఎలా ఎదుర్కోవాలో తెలియక ఉరిపోసుకు చనిపోదామా, సముద్రంలో పడిచనిపోదామా అని ఆ సంసారి క్షోభకు గురవుతున్న సమయంలోనే ఒక విద్యార్థి రాక్సీకి వెళ్ళాలా, బ్రాడ్వేకి వెళ్ళాలా తేల్చుకోలేకుండా ఉన్నాడు. ఒక ఉద్యోగి హొటల్లో బాదం హల్వా ఆర్డరు చేయాలా, సేమ్యా ఇడ్లీ ఆర్డరు చేయాలా తేల్చుకోలేకుండా ఉన్నాడు. ఒక సంసారికి ఎలా చావాలన్నది ఎంత జీవన్మరణ సమస్యనో, ఆ మొదటి ఇద్దరికీ ఆ క్షణాల్లో వాళ్ళు ఎదుర్కొంటున్న సమస్యలు కూడా అంతే జీవన్మరణ సమస్యలన్నమాట!

ఇదీ ఈ కవితలో విషాదధ్వని. అంటే నీ తోటిమనిషి, జీవించడానికి చిన్నపాటి ఆశ కూడా చిక్కక, ఉరేసుకుని చనిపోతున్నప్పుడో లేదా సముద్రంలో దూకి చచ్చిపోతున్నప్పుడో, నీకు అతడి గురించి ఆలోచించే వ్యవధి లేదు. అసలు అటువంటి వాడొకడు ఉన్నాడనీ, వాణ్ణి జీవితం కాటువెయ్యడానికి పొంచి ఉందనీ నీకు ఊహకూడా రాదు. నీ సమస్య ఎంతసేపూ, ఈ సినిమాకి వెళ్లాలా, ఆ సినిమాకి వెళ్ళాలా, ఒటీటీలో ఈ ఛానలు చూడాలా,

ఆ ఛానలు చూడాలా, స్నేహితుల్ని పార్టీకి పిలవాలంటే ఈ హొటలుకి వెళ్ళాలా, ఆ హొటలుకి వెళ్ళాలా, సాయంకాలం మీటింగుకి ఈ చొక్కా వేసుకు వెళ్ళాలా, ఆ చీర కట్టుకు వెళ్ళాలా– ఎవరి సమస్యలు వాళ్ళవి, ఎవరి ఎంపికలు వాళ్ళవి, ఎవరి ఎంపికల తీవ్రత వాళ్ళది.

మనమిలాంటి సమస్యల్లో అతలాకుతలమవుతున్నప్పుడు– మరొకరెవరో, మనకి బొత్తిగా తెలీనివాళ్ళు కాదు, బాగా తెలిసినవాళ్ళే, మన మిత్రులే, మనతో కలిసి తిరిగినవాళ్ళే, ఎన్నోసార్లు కలిసి కబుర్లు చెప్పుకున్నవాళ్ళే, కలిసి నవ్వుకున్నవాళ్ళే, ఇప్పుడు, ఉరిపోసుకు చనిపోవాలా, సముద్రంలో పడిమరణించాలా తేల్చుకోలేకపోతున్నారు అని– ఎవరేనా ఒక దివ్యదృష్టితో తెలుసుకుని, మనకి చెప్పారే అనుకుందాం. అప్పుడేనా మనం మన సమస్యల్ని పక్కన పెట్టేస్తామా? లేదనుకుంటాను. పైగా అప్పుడు ఆ వార్త మనకొక కొత్త సంధ్యాసమస్యని సృష్టిస్తుంది. అతడు అలా చనిపోడం సముచితమా లేక చనిపోకుండా ఉండటం సముచితమా అని ఆలోచనలో పడతాం. అలా చనిపోకుండా ఉండటానికి అతడలా చేసి ఉంటే బావుండేదా లేక ఇలా చేసి ఉండే బావుండేదా అని మనతో మనమే వాదించుకుంటాం.

ఇన్నాళ్ళూ ఈ సంధ్యాసమస్యలు కవిత చదివినప్పుడల్లా నా హృదయం ఆ సంసారి కోసం మూలిగేది. కాని ఇప్పుడు ఆ సంసారికన్నా కూడా ఆ విద్యార్థీ, ఆ ఉద్యోగీ మరింత పెద్ద విషాదంలో కూరుకుపోయేరనీ, ఆ సంసారి ఒకవేళ మరణిస్తే, మరణించి కూడా బతికిపోతాడేమోగానీ, ఆ విద్యార్థీ, ఆ ఉద్యోగీ మాత్రం జీవిస్తున్నట్టు కనబడుతున్నారేగాని, ఎప్పుడో మరణించేరనీ, మరణించినట్టు వాళ్ళకెప్పటికీ తెలీనేతెలీదనీ ఈ కవిత నాకు చెప్తూ నన్ను ఉలిక్కిపడేలా చేస్తున్నది.

5-7-2025

ఆమె కన్నులలోన

కవులు తమ కవితలకి స్ఫూర్తి ఎక్కణ్ణుంచి తెచ్చుకుంటారో చెప్పడం కష్టం. కొన్నిసార్లు ఒక్క మాట, ఒక్క పదబంధం, ఒక్క నుడికారం దొరికినా కూడా తమదైన ఊహాశాలిత్వంతో తమవైన గొప్ప కవితలు సృజిస్తూ ఉంటారు. ఆ కవితలు చదివినప్పుడు వాటి మూలాలెక్కడున్నాయో అని వెతకడంలో అర్థం లేదు. టాగోరు గీతాంజలిలో మొదటి గీతంలోని మొదటి పంక్తి ఒక్కటీ తీసుకుని వేదుల అపూర్వమైన ఖండకావ్యమొకటి రాసాడు. అలాగని ఆయన పద్యాల మీద గీతాంజలి ప్రభావం ఉందనవచ్చునా! అనకూడదు. చివరికి ఆ పద్యాలు స్ఫూర్తినిచ్చాయని కూడా అనకూడదు. ఆ రెండూ చదువుకోవాలి. మాటల్లో పెట్టలేని, పెట్టకూడని కించిత్ విస్మయంతో మరోసారి ఆ రెండు పద్యాలూ కలిపి చదువుకోవాలి. అంతే.

ఇదుగో, బైరను రాసిన ఈ సుప్రసిద్ధమైన గీతం She Walks in Beauty (1814) చూడండి.

She Walks in Beauty

She walks in beauty, like the night
Of cloudless climes and starry skies;
And all that's best of dark and bright
Meet in her aspect and her eyes
Thus mellow'd to that tender light
Which heaven to gaudy day denies.

One shade the more, one ray the less,
Had half impair'd the nameless grace

Which waves in every raven tress,
Or softly lightens o'er her face;
Where thoughts serenely sweet express
How pure, how dear their dwelling-place.

And on that cheek, and o'er that brow,
So soft, so calm, yet eloquent,
The smiles that win, the tints that glow,
But tell of days in goodness spent,
A mind at peace with all below,
A heart whose love is innocent!y

(ఆమె అడుగుతీసి అడుగు వేస్తే సౌందర్యం. చిరుమబ్బుకూడా లేకుండా సమస్త తారకలతో నిండిన ఆకాశాల రాత్రిలాంటిది ఆమె. చీకటిలోనూ, వెలుగులోనూ కూడా అత్యున్నతమైందంతా ఆమె కళ్ళల్లోనూ, ఆమె చూపుల్లోనూ ఒక్కటవుతాయి. పట్టపగటికి కూడా అందని సుకుమారమైన వెలుతురేదో అక్కడ కనిపిస్తుంది.

అంతకన్నా ఒక్క ఛాయ ఎక్కువైనా, అంతకన్నా ఒక్క కిరణం తక్కువైనా కూడా ఆ అనిర్వచనీయ విలాసాన్ని భంగపరుస్తాయేమో అనిపిస్తుంది. మాటల్లో పెట్టలేని ఆ అందం ఆ నల్లని కురుల్లో ఎగిసిపడుతుంటుంది, లేదా ఆమె వదనం పైన పరుచుకున్న మెత్తని వెలుగుల్లో ప్రసరిస్తుంటుంది. ఆ వదనంపైన కదలాడే భావాలు శాంతమాధుర్యంతో ఆమె ఎంత అపురూపమైందో, ఎంత నిర్మలమైందో వెల్లడిస్తుంటాయి.

ఆ కపోలాలమీద, ఆ కనుబొమల మీద వికసించే ఆ మందహాసాలు, మెరుస్తుండే ఆ ముఖలాస్యరేఖలు ఆమె సంతోషంగా గడిపిన రోజుల గురించి, నెమ్మదించిన ఆమె మనసు గురించి, అమాయికమైన ఆమె ప్రేమ గురించి, ఎంతో మృదువుగా, ఎంతో నెమ్మదిగా, కానీ ఎంతో ధారాళంగా ప్రసంగిస్తుంటాయి.)

వందేళ్ళ తరువాత కృష్ణశాస్త్రి 'ఊర్వశి' (1925) పద్యాల్లో రాసిన ఈ సుప్రసిద్ధమైన పద్యాలు చూడండి.

ఊర్వశి

ఆమె కన్నులలో ననంతాంబరంపు
నీలినీడలు కలవు;

వినిర్మలాంబు
పూరగంభీరశాంతకాసారచిత్ర
హృదయములలోని గాటంపు నిదురచాయ
లందు నెడనెడఁ గ్రమ్ము;

సంధ్యావసాన
సమయమున నీపపాదపశాఖికాగ్ర
పత్ర కుటిలమార్గములలోవల వసించు
ఇరులగుసగుసల్ వానిలో నిపుడు నపుడు
వినఁబడుచునుండు;

మఱికొన్ని వేళలందు
వానకారుమబ్బులమెయివన్నె వెనుక
దాగుబాష్పమ్ము లామెనేత్రములలోనఁ
బొంచుచుండును;

ఎదియొ అపూర్వమధుర
రక్తి స్ఫురియించుఁగాని అర్థమ్ము కాని
భావగీతమ్ములవి.

(ఆమె కళ్ళల్లో అంతులేని ఆకాశపు నీలినీడలున్నాయి. నిర్మలమైన జలాలతో కూడుకుని నిండుగా, గంభీరంగా ఉండే సరోవరాల చిత్రమైన హృదయాల్లోని దట్టమైన నిదురనీడలు ఉండీ ఉండీ అక్కడ కమ్ముకుంటూ ఉంటాయి.

సాయంకాలం సంధ్య వాలేటప్పుడు కడిమిచెట్ల గుబుర్లలోని ఇరుకిరుకు దారుల్లో కమ్ముకునే చీకట్ల గుసగుస అప్పుడూ అప్పుడూ ఆ కళ్ళల్లో వినబడుతూ ఉంటుంది.

మరికొన్ని సార్లు, వానకారు మబ్బుల వెలుగు వెనక దాగిన కన్నీటిచుక్కలు ఆ కళ్ళల్లో కనిపించీ కనిపించకుండా ఉంటాయి.

ఇంతకుముందు పరిచయంలేని ఏదో మాధుర్య సంతోషాన్ని స్ఫురింపచేస్తూనే, అర్థమయ్యీ కాకుండా వినబడే భావగీతాలు ఆ నేత్రాలు.)

ఈ పద్యాల మీద బైరను కవిత ప్రభావం ఉన్నట్టా? కనీసం స్ఫూర్తి అయినా ఉందనవచ్చునా? ఏమీ అనకూడదు. రెండూ ఒకసారి కలిపి చదువుకోవాలి. అంతే!

కాని బైరను ఆమె కళ్ళల్లో all that's best of dark and brighty ఉందంటే, ఆమె కళ్ళల్లో 'అనంతాంబరపు నీలినీడలు కలవ'ని కృష్ణశాస్త్రి అంటే, ఆ ఊహని విశ్వనాథ మరింత విస్తరించి, ఆ నీడలు ఆమె స్వభావానివీ, ఆ వెలుగు ఆమె హృదయానిదీ అంటూ రాసిన ఈ పద్యాలు చూడండి:

ఓ చెలీ!

ఓ చెలీ! నీ స్వభావమందొక్కకపుడు
గాఢఝుంఝామరుత్తరంగములు కలవు
నీ యెద చలించు మలయాద్రినిభృతవాయు
శీకరార్థము వాని నోర్చెదను నేను

ఓ చెలీ! నీ స్వభావమందొక్కకపుడు
ఘనతరాంభశ్చలావర్తకములు కలవు
నీ ఎడద నూగు చిన్నరినీటికాల్వ
చిఱు తరగలెంచి వానినోర్చెదను నేను

ఓ చెలీ! నీ స్వభావమందొక్కకపుడు
ప్రళయమార్తాండతీక్ష్ణాతపములు కలవు
నీ యెదంద లేమావులనీడలొలయు
శీతలత్వార్థి వాని నోర్చెదను నేను.

ఓ చెలీ! నీ స్వభావమందొక్కకపుడు
నాల్కతడియార్చు క్షారవార్నిధులు కలవు
నీ యెడద నాన్యతోదర్శనీయమాధు
సింధువుల నెంచి వానినోర్చెదను నేను.

(ఓ ప్రియురాలా! నీ స్వభావంలో ఒక్కొక్కప్పుడు చాలా తీవ్రమైన పెనుగాలులు వీస్తుంటాయి. కాని నీ హృదయంలో కదలాడే మలయానిలాల సన్నని నీటితుంపరల కోసం నేను వాటిని సహిస్తాను.

ఓ ప్రియురాలా! నీ స్వభావంలో ఒక్కొక్కప్పుడు గంభీరమైన తుపానుమేఘాల్లాంటివి కనిపిస్తుంటాయి. కాని నీ హృదయంలో కదలాడే చిన్నసీటికాల్వల చిరు తరగల్ని తలుచుకుని నేను వాటిని సహిస్తాను.

ఓ ప్రియురాలా! నీ స్వభావంలో ఒక్కొక్కప్పుడు ప్రళయకాలంలో సూర్యుడు కురిపించే భయంకరమైన ఎండలు కనిపిస్తాయి. కాని నీ హృదయంలో లేతమామిడి చెట్ల నీడల్లో పరుచుకునే చల్లదనం కోసం నేను వాటిని సహిస్తాను.

ఓ ప్రియురాలా! నీ స్వభావంలో ఒక్కొక్కప్పుడు నాలుక పిడచకట్టుకుపోయే క్షారసముద్రాలున్నాయి. కాని మరెక్కడా కనిపించని మాధుర్యసముద్రాల్ని నీ హృదయంలో గమనించి నేను వాటిని సహిస్తాను.)

కావ్యానందంలో ఇది కూడా భాగమే. దేశకాలాల పరిమితుల్ని దాటి ప్రపంచమంతా కవుల హృదయాలు ఎక్కడెక్కడ ఒక్కలాగా స్పందించాయో ఆ తావుల్ని పట్టుకోవడం. ఏమీ తోచనప్పుడల్లా మళ్ళీ మళ్ళీ అక్కడికి పోయి కొంతసేపు గడిపి వస్తూండటం.

7-7-2025

ఫలప్రదమైన అనునయం

ఈమాట సంపాదకులు బైరాగి శతజయంతి ప్రత్యేక సంచిక వెలువరిస్తూ అందులో ఆయన గీతాలు, గేయాలు, పద్యాల్లోంచి పదింటిని ఎంపికచేసి, వాటిని ప్రశాంతి చోప్రాగారితో పాడించారు. ఆ పత్రికల్లో ఆ వ్యాసాలన్నీ ఒక ఎత్తూ, ఈ గానమొకటీ ఒక ఎత్తూ. ఎందుకంటే, గానం కూడా ఒక విధమైన interpretation నే. ముఖ్యంగా కవి శబ్దార్థాల ద్వారా మనకి పూర్తిగా వివరించలేని తన నిగూఢ అంతరంగాన్ని, ఆ శబ్ద-సంయోజనంలో పొదిగిపెట్టిన సంగీతం ద్వారా, వెల్లడి చేసే అవకాశం ఉంటుంది. ఆ సంగీతాన్ని ఆ గాయిక పట్టుకున్నారు. ఆమె పాడిన కవితలన్నింటిలోనూ, 'వర్షాయామిని', 'అదే జ్యోతి', 'జయ దేవానాం ప్రియ', 'అనునయము' కవితలు ఈ కారణం వల్ల నన్ను మరీ ఆకట్టుకున్నాయి.

మహాకవుల కవిత్వాలకు మాత్రమే కాదు, వారు ఎంచుకుని చేసే అనువాదాలకు కూడా ఒక కార్టొగ్రఫి ఉంటుంది. తాము ఏ కాలాన్ని, లోకాన్ని దర్శిస్తున్నారో అది తమ కవిత్వంలో ఆవిష్కరించడానికి ప్రయత్నించినట్టే, తాము ఏ కాలాలకీ, ఏ దేశాలకీ సన్నిహితులుగా ఉన్నారో అది వారి అనువాదాల్లో ప్రతిఫలిస్తూ ఉంటుంది. దానిలో కూడా ఒక అన్వేషణ ఉంటుంది. ఒక ప్రయాణం ఉంటుంది.

ఉదాహరణకి శ్రీశ్రీనే తీసుకోండి. ఆయన 'మహాప్రస్థానం' దాకా ఆంగ్లో-అమెరికను కవుల వైపూ, ఫ్రెంచి సింబలిస్టుల వైపూ చూసాడు. 'ఖడ్గసృష్టి' కాలానికి వచ్చేటప్పటికి యూరపియను కవులవైపూ, ముఖ్యంగా ఫ్రెంచి సర్రియలిస్టులవైపూ చూసాడు. ఆ తర్వాత 'మరోప్రస్థానం' కాలానికి వచ్చేటప్పటికి మూడవప్రపంచ దేశాలకు చెందిన కవులవైపూ, సామ్రాజ్యవాద ధిక్కార గళాలవైపూ చూస్తున్నాడు. (ఈ విషయం మీద మరింత వివరంగా

చదవాలనుకుంటే, నా వ్యాసం 'శ్రీశ్రీ అనువాదం చేసిన కవితలు, సాహిత్యసంస్కారం, 2017, పే.73-88 చూడవచ్చు.)

తెలుగులో శ్రీశ్రీ తర్వాత విస్తృత ప్రపంచాన్ని తన అనువాదాల్లో పట్టుకొచ్చిన మరొక మహాకవి బైరాగినే. శ్రీశ్రీ అనువాదాల్లో ఒక రాజకీయ ప్రపంచపటం కనిపిస్తే, బైరాగి అనువాదాల్లో ఒక spiritual landscape కనిపిస్తుంది. 'ఆగమగీతి' (1981) సంపుటంలోని మొత్తం 129 కవితల్లో 31 కవితలు అనువాదాలు. అంటే దాదాపు నాలుగో వంతు. ఆయన అనువదించిన కవుల్లో ఇలియటు, రిల్క, గిలాం అపోలినారు, పాల్ యూలార్డ్, రాబర్ట్ డెస్నోస్, పియర్రి రివర్డీ, జాకె ప్రివర్ట్, ఇవాన్ బోనీఫ్, వంటి పాశ్చాత్య కవులతో పాటు, మర్డేకరు, రామేశ్వర్ శుక్ల, జీవనానంద దాసు, నియాజ్ హైదరు, దినకరు, విందా కరందీకరు వంటి భారతీయకవులు కూడా ఉన్నారు. వీరితో పాటు హాఫిజు కవితలు రెండు, ఒక అజ్ఞాత చిలీ కవి కవిత కూడా ఆయన అనువాదాల్లో ఉన్నాయి. బైరాగి ఈ కవుల్నే ఎందుకు ఎంచుకున్నాడు, వారి కవితల్లో ఆ కవితల్నే ఎందుకు ఎంచుకున్నాడు లాంటి అంశాలు లోతుగా పరిశీలించవలసినవి. (కాని బైరాగి కవిత్వానికే సరైన అనుశీలన ఇంకా రానప్పుడు ఆయన అనువాదాల పైన పరిశీలనను ఆశించడం అత్యాశే అవుతుందేమో.)

ఉదాహరణకి, ఆయన 'అనునయము' పేరిట అనువదించిన హాఫిజు కవితనే చూద్దాం. పారశీకంలో గజలుగా రాసిన కవితను బైరాగి తెలుగులో మూడు పద్యాలుగా అనువదించాడు. బైరాగికి గజలు ఛందస్సు పట్టుబడనిదేమీ కాదు. ఉదాహరణకి, ఆయన గేయంలాగా రాసినప్పటికీ, ఆగమగీతిలోని 'ఎవరు' అనే కవితది దాదాపుగా గజలు నిర్మాణమే. కాబట్టి ఆయన హాఫిజును గజలుగా అనువదించి ఉండవచ్చు. లేదా గేయంగానో, గీతంగానో అనువదించి ఉండవచ్చు. కాని మూడు పద్యాల్లో, రెండు శార్దూలాలు, ఒక ఉత్పలమాలలో ఎందుకు అనువదించాడు?

ఆ మూలకవిత, దివానులో 336వ గజలుని, అనువదించడానికి బైరాగి బహుశా గెర్ట్రూడ్ బెల్ Poems from the Diwan of Hafiz (1897) అనువాదాన్ని అనుసరించి ఉండవచ్చునని అనుకున్నాను.

కాని నా ఊహ తప్పని ఇప్పుడనిపిస్తోంది. ఎందుకంటే, బైరాగి ఆగమగీతిలో ఫ్రెంచి కవుల కవితల అనువాదాలు పొందుపరిచినప్పుడు, వాటిని ఇంగ్లిషునుంచి అనువదించినట్టుగా పేర్కొన్నాడు. హిందీ, ఇంగ్లిషు కాక, ఆయన అనువదించిన ఇతరభాషా కవుల్లో జీవనానందదాసుని ఇంగ్లిషు నుంచి కాక బెంగాలీ నుంచే అనువదించినట్టుగా

కనిపిస్తుందని ఆదిత్య అన్నాడు. ఇక మర్ధేకరు, కరందీకలను నేరుగా మరాఠీనుంచి, నియాజ్ హైదరును ఉర్దూనుంచే అనువదించాడని అనుకోవచ్చును. అలా చూసినప్పుడు ఆయన హాఫిజును ఇంగ్లిషు నుంచి అనువదించి ఉంటే, ఆ విషయం తప్పనిసరిగా పేర్కొని ఉండేవాడు. అదీకాక, ఉర్దూ పైన పట్టు ఉన్న కవికి పారశీకాన్ని ఏదో ఒక మేరకు అర్థం చేసుకోవడం కష్టం కాదనుకుంటాను. కాబట్టి ఆగమగీతిలో హాఫిజుకు చేసిన రెండు అనువాదాలూ కూడా పారశీకం నుంచే నేరుగా చేసి ఉంటాడని ఇప్పుడు భావిస్తున్నాను.

కాబట్టి ఆ గజలు పారశీకంలో ఏ విధంగా ఉండి ఉండవచ్చు? నాకు పారశీకం రాదుగాని, రూమీకి నికల్సనులాగా, హాఫిజు దివానును యతాతథంగా అనువదించిన విల్బరుఫోర్సు క్లార్కు మూడు సంపుటాలూ నా దగ్గర ఉన్నాయి కాబట్టి, ఈ గజలు కోసం వెతికాను. వాటిలో మూడవ సంపుటంలో 439 (435) అనువాదం ఇలా ఉంది:

Where, the glad tidings of union with Thee,
so that, from desire of life, I may rise?
The holy bird (of paradise) am I, from the world's snare, I rise.

By Thy love (I swear) that if me, Thy slave, Thou call,
Out from desire of lordship of existence and dwelling (both worlds) I rise.

O Lord, from the cloud of guidance, the rain (of mercy) cause to arrive
Before that, from the midst, like a (handful of) dust, I rise

(O holy traveller!) at the head of my tomb, without wine and the minstrel, sit not;
So that by thy perfume, dancing- I may rise.

Though I am old, one night me, close in Thy embrace take
So that, in the morning, from Thy embrace, young- I may rise

(O true Beloved!) think not that, from the dust of the head of Thy street,
By the sky's tyranny or by time's violence, (to choose employment)- I rise.

O Idol, sweet of motion, arise, and Thy (lofty cypress-like) stature display:
That, like Hafiz, from desire of life and the world, I may rise.

షిరాజ్ నగరంలో హాఫిజు సమాధిఫలకం మీద ఈ ఏడు షేర్లలో మొదటి అయిదూ చెక్కబడ్డాయట! బహుశా బైరాగి ఈ గజలు ఎంచుకోడానికి అది కూడా ఒక కారణమై ఉండవచ్చు. ఇప్పుడు దీన్ని యథాతథంగా తెలుగుచేసి చూద్దాం.

నీ సంతోషసమాగమంలో కోరికలు విదిలించుకుని లేచివస్తాను.
స్వర్గ విహంగాన్ని, ప్రపంచపుటుచ్చులనుంచి లేచి వస్తాను.

నీ ప్రేమమీద ఆన, నీ బానిసని, నీ పిలుపు వినగానే
రెండులోకాల ప్రభుతనుంచీ నిశ్చయంగా లేచి వస్తాను.

నీ అనుగ్రహం వల్ల నీ కృపావర్షం తప్పక కురుస్తుంది
దానికన్నా ముందే పిడికెడుదుమ్ములాగా నేను లేచివస్తాను.

యాత్రికుడా, మధువు, మానిని వినా నా సమాధి దర్శించకు
అప్పుడు మీ పరిమళభరిత నృత్యానికి నేను తప్పక లేచివస్తాను.

వృద్ధుణ్ణి, అయినా ఒక రాత్రి, నీ బిగికౌగిట్లోకి తీసుకొమ్మంటాను
తెల్లవారేటప్పటికి తప్పక నేనొక నవయువకుడిగా లేచివస్తాను

ప్రియతమా, నీ వీథిలో పరుచుకున్న దుమ్ము గురించి చింతించకు
ఆకాశమూ, కాలమూ ఏకమైనా కూడా నేను లేచి వస్తాను.

ఓ ప్రతిమావిలాసమా, మేలుకో, నీ స్వరూపసందర్శనం అనుగ్రహించు
అప్పుడు హాఫిజులాగా ఈ భవసాగరం నుంచి లేచి వస్తాను.

హాఫిజుకు క్లార్కు అనువాదం పందొమ్మిదో శతాబ్ది మర్యాదకు తగ్గట్టే ఎటువంటి స్వతంత్రం తీసుకోకుండా యథాతథంగా చేసిన అనువాదం. బైరాగి ఈ అనువాదాన్ని అనుసరించలేదని మనకు తెలుస్తూనే ఉంది. ఈ గజలుకి బైరాగి చేసిన అనువాదం ఇలా ఉంది:

నీ సంయోగపు వార్త విన్న తరి, నేనీ మృణ్మయావాస పుం
గాసిన్ వీడుచు లేచి వచ్చెద, విహంగమ్మాత్మ వీడే క్షణో

ల్లాస ప్రోద్ధతి రెక్కలార్చినటులే, లావొంది నా యాత్మ కై
లాసౌన్నత్యము నందబోవు, మమతా లౌల్యంపుటుచ్చుల్ విడన్

నీ ప్రణయమ్ము బిల్వ విని నేనమృత స్రవదంతరుండనై
అప్రతిమాన వేగమున నంబరవీథిని తేలివత్తు, నా
కప్రతిమ, త్వదంఘ్రితల కామిని, దుర్లభ జన్మమృత్యు యు
గ్మప్రభుతన్ త్యజించెదను, కాలము, దేశము కాలదన్నెదన్

దేవా! ఎక్కడ తావకీన కరుణాదివ్యాంబుదాసార సం
స్రావమ్మక్కట! నాదుబూది నవసంస్కారార్థ మెన్నాళ్ళుగా
త్రోవల్ గాచె తృషార్త ధూళి పటలిన్, రూక్షాబ్దముల్ పోయె, ఝం
ఝా వాత్యల్ గొనిపోకమున్నె రసముల్, జాలొంద వర్షింపుమా!

(నీ సంయోగవార్త విన్నవెంటనే, నేను నన్ను అలసట పెట్టే ఈ మట్టిగూడువదిలి లేచి వస్తాను. విహంగం ఆత్మని అందుకునే క్షణాల ఉల్లాసమూ, ఉధృతీ రెక్కలార్చినట్టుగా, పట్టలేని సంతోషంతో నా ఆత్మ కైలాస ఔన్నత్యాన్ని అందబోతుంది. నన్నింతదాకా ఈ ప్రపంచంలో బంధించిన మమకారం, లౌల్యం అనే ఉచ్చులు విడిపోతాయి.

నీ ప్రణయపు పిలుపు విని నాలోపల అమృతపు ఊటలూరుతుండగా ఎవరూ ఆపలేనంత వేగంతో, ఆకాశవీథిలో తేలివస్తాను. నీ స్వర్గస్వరూప చరణయుగాన్ని కోరుకునే వాణ్ణి, ఎంతో దుర్లభమని చెప్పదగ్గ ఈ జీవితంపట్లా, మృత్యువుపట్లా వ్యామోహాన్ని వదిలి పెట్టేస్తాను. కాలాన్నీ, దేశాన్నీ పక్కకు నెట్టేస్తాను.

దేవా! నీ కరుణాంబువుల దివ్యవర్షమెక్కడ? ఆగని ఆ జడివాన ఎక్కడ? ఎన్నో ఏళ్ళుగా నా భస్మం సద్గతికోసం దప్పిపడి ఉంది. ఇప్పటికే ఎంతో కాలం కఠినంగా గడిచి పోయింది. ఇప్పుడేనా పెనుసుడిగాలులు ఈ భస్మధూళిని ఎగరేసిపోకముందే, దయతో నా మీద వర్షించిపో!)

విల్బరు ఫోర్సు క్లార్కు అనువాదాన్ని దగ్గర పెట్టుకుని చూస్తే బైరాగి తన అనువాదంలో ఈ ముఖ్యమైన మార్పులు చేసాడని తెలుస్తున్నది.

గజలుని గజలుగా కాకుండా వృత్తపద్యాలుగా అనువదించడం. మొత్తం ఏడు షేర్లనీ యథాతథంగా అనువదించకుండా, హాఫిజు సమాధిఫలకం మీద లిఖించిపెట్టిన మొదటి

అయిదు షేర్లలో మొదటి మూడు షేర్ల భావాన్ని మాత్రమే మూడు పద్యాలుగా పునః–సృజించడం.

మూలానికి శీర్షిక లేదు. కాని బైరాగి తన పద్యాలకు 'అనునయము' అని పేరుపెట్టాడు. అనునయం అంటే వేడికోలు, బతిమిలాడటం. మూలకవితలో విన్నపంకన్నా కూడా భగవంతుడి కరుణావర్షం తన పైన తప్పక కురుస్తుందనే assertion ప్రధానంగా ఉంది.

ఇవి కాక, మూలంలో స్పష్టంగా పేర్కొని స్వర్గాన్ని తన అనువాదంలో కైలాసంగా పేర్కోడం. మూడవపద్యంలో మూలభావంకన్నా తన ఆర్తిని మరింత విస్తరించి చెప్పడం.

ఈ మార్పుల వల్ల బైరాగి మూలకవితను మరింత ప్రభావశీలంగా, మరింత ఫలప్రదంగా తీర్చిదిద్దాడని చెప్పవచ్చు. వృత్తపద్యాల వల్ల, ఆ అపురూపమైన శయ్యవల్ల, తన వేడికోలులో ఒక అవిచ్ఛిన్నతను, తెంపులేనితనాన్ని, ఏకోన్ముఖతను ఆయన అనితర–సాధ్యంగా తీసుకురాగలిగాడు. ఇక స్వర్గాన్ని కైలాసంగా అభివర్ణించడం బైరాగి అన్వేషణకు తగ్గట్టుగానే ఉంది. ఎందుకంటే ఆయన ఎదురుచూసే మానవుడు, 'జగతీవిషసార పాయి', 'సంతత శూలాగ్రశాయి' కాబట్టి, అటువంటి త్యాగధనుడి లోకం కైలాసం కాక మరేమవుతుంది?

16-9-2025

కడలీ, పుడమీ

నేనింతకుముందు మీతో ఒక సంగీతపత్రిక గురించి ముచ్చటించాను. Interlude.HK. ఆ పత్రిక 22-8-2025 నాటి సంచికలో పర్వతాల మీద కూర్చిన పదిహేను శాస్త్రీయ సంగీత కృతుల గురించి వివరంగా రాసింది. పాశ్చాత్య సంగీతంలో, పర్వతారోహణల్నీ, పర్వతగాంభీర్యాన్నీ, పర్వతసౌందర్యాన్నీ సంగీతంలోకి అనువదించిన పదిహేను కృతులు. వాటిల్లో Franz Liszt కృతి కూడా ఒకటి ఉంది. ఆధునిక ఫ్రెంచిసాహిత్యవేత్తల్లో అగ్రగణ్యుడైన విక్టర్ హ్యూగో 1831 లో రాసిన Ce qu'on entend sur la montagne (What One Hears on the Mountain) అనే గీతానికి స్వరకల్పన అది.

విక్టర్ హ్యూగో రొమాంటిక్ యుగానికి ఫ్రెంచి ప్రతినిధి. జర్మనీలో గొథేలాగా, ఇంగ్లిషులో బైరనులాగా అతడు తన కాలం నాటి భావోద్వేగాలకి ఒక గంభీరవాక్కుని సంతరించగలిగాడు. (అవును, విక్టర్ హ్యూగో అంటే, The Hunchback of Notre Dame (1831), Les Misérables (1861) నవలలు రాసినాయనే. కానీ, హ్యూగో అన్నిటికన్నా ముందు మహాకవి, స్వేచ్ఛాగీతకారుడు, ధిక్కారకవి, మూడవ నెపోలియను కాలంలో తన స్వాతంత్ర్యకాంక్షవల్ల దేశబహిష్కార శిక్ష పొందినవాడు కూడా!) అటువంటి రొమాంటిక్ కవీశ్వరుడి భావోద్వేగానికి Franz Liszt లాంటి మరొక రొమాంటిక్ సంగీతకారుడు మాత్రమే స్వరకల్పన చేయగలడు. హ్యూగో గీతానికి స్వరకల్పన చేస్తూ, ఆ గీత సారాంశాన్ని లిస్ట్ ఇలా వివరించాడని ఇంటర్ లూడు పత్రిక రాస్తున్నది:

> ఇక్కడ కవి రెండు స్వరాలు వింటున్నాడు. ఒకటి ఎల్లల్లేనిది, వైభవోపేతం, సువ్యవస్థితం. భగవంతుడి ఎదట ఒక సంతోషగానాన్ని వినిపిస్తున్నది. మరొకటి బోలుగొంతు. దుఃఖపూరితం, ఏడ్పులూ, పెడబొబ్బలూ, నిందలూ, శాపాలతో

కూడుకున్నది. ఒకటి ప్రకృతిని వర్ణిస్తున్నది. మరొకటి మానవాళిని చిత్రిస్తున్నది. అవి రెండూ పక్కపక్కనే పెనగులాడుతూ, ఒకదాన్నొకటి దాటుకుంటూ, ఒకదానితో ఒకటి కలగలిసిపోతూ ఉన్నవి. చివరకూ ఆ రెండూ కూడా ఒక పవిత్రస్థితిలో అంతర్ధానమవుతున్నవి.

ఈ వివరణ చూసిన తరువాత ఈ గీతం వెంటనే చదివాను. అన్నిటికన్నా ముందు, ఆ గీతంలోని ఆ గంభీరవాక్కు, ఆ sustained emotion నన్ను విభ్రాంతపరిచాయి. విక్టర్ హ్యూగోని చదవవలసినంతగా చదవలేదని అర్థమయింది. వెంటనే Selected Poems (పెంగ్విను, 2002) తెప్పించాను. అందులో ఈ కవితలేదు. కాని ఆర్కైవులో ఇంతకన్నా మంచి సంపుటి ఒకటి దొరికింది. అందులో ఈ కవితకు ప్రశస్త అనువాదం కనిపించింది. ఈ కృతి విన్నప్పణ్ణుంచీ, ఈ గీతం చదివినప్పణ్ణుంచీ, గత రెండుమూడు నెలలుగా ఆ గీతాన్ని తెలుగు చేయాలనే అనుకుంటూ ఉన్నానుగాని, నాకు శక్తిచాలలేదు. అయినా ఇప్పటికి సాహసించి, ఇలా తెలుగులో మీతో పంచుకుంటున్నాను. (ఇటువంటి కవిత తెలుగులో ఎవరు రాయగలరా అనిపించింది. ఎంత ఆలోచించినా బైరాగి ఒక్కడే కనిపిస్తున్నాడు!)

ఈ గీతం చదివాక ఆ సంగీత కృతి కూడా వినండి. (మన తెలుగు సంగీతకర్తలు ఎప్పటికి ఇటువంటి స్వరకల్పనలు చేయగలుగుతారు!)

కొండమీద మనమేదో వింటున్నప్పుడు

ఓ శిఖరౌన్నత్యమా!

నువ్వెప్పుడేనా, ప్రశాంతగంభీరంగా ఉన్నప్పుడు
పర్వతశిఖరం పైన నిలబడి స్వర్గసన్నిధిని అనుభవంలోకి తెచ్చు-
కున్నావా?
అది శబ్దతీరంలోనా లేక బ్రిటనీ సముద్రతీరంలోనా?
పర్వతపాదాల చెంత సముద్రసన్నిధినా?
అక్కడ ఆ సాంద్రతరంగాల మ్రోల నిల్చుని
ప్రశాంతంగా, మౌనంగా నువ్వేదైనా వినగలిగావా
ఇదిగో, మనం వినేదిదే- రోజుకొక్కసారైనా కలల్లో
నా ఊహాలు సముద్రతీరంపైన ఆ విహంగయానం మీద నిలుస్తాయి

ఆ మహాపర్వత శిఖరం మీంచి ఆ తిక్తాఖాతంలోకి దూకుతాయి
ఒక పక్క పుడమి, మరొక పక్క కడలి
నేను విన్నాను, ఆలకించాను, కాని ఒకసారి విన్న గొంతు మరొకసారి
వినబడలేదు
అది ఏదో ఒక గళం నుంచి వెలువడి మన చెవుల్ని తాకేది కాదు.

మొదట్లో, అదొక విస్తార, సాంద్ర, కల్లోలధ్వని
చెట్లమధ్యనుంచి ఈళపెట్టే గాలికన్నా అస్పష్టం
తారస్థాయి స్వరాలాపన, తీపి గుసగుస
సాయంకాల రాగంలాగా మెత్తన, ఖడ్గసంచాలనంలాగా సుదృఢం
బధిరాంతక సమరక్షేత్రం పదాతిదళాల్ని కౌగిలించుకుని
మహోద్రేకంతో యుద్ధభేరీనినాదంగా మారుతుంది
అది మనం తుడిచిపెట్టలేని, విస్మరించలేని ప్రగాఢ సంగీతం
తెంపులేకుండా ప్రపంచమంతా పరుచుకునే ఒక ద్రవస్థితి
పునః పునః సంచలించే తన తరంగిత వలయాలతో
విసృత గగనాలపైన విస్తరిస్తూపోతున్నది
కింద అఖాతంలోని నీడల్లోకి
కాలం, దేశం, రూపం, గణనాలతోసహా
తనని తాను కోల్పోయేట్టుగా ప్రవహిస్తుంది.
మరొక విశీర్ణవాతావరణంలాగా
ఆ అనంతస్తోత్రం సమస్తభూమండలాన్నీ ముంచెత్తుతుంది.
సమరససుశ్రావ్యతలో తెరచాపలెత్తి గాల్లో పయనిస్తూ
ఆ సంగీత సమారోహం మొత్తం ప్రపంచాన్ని చుట్టేస్తుంది.

ఒకింత నిర్లిప్తుడనై నేనీ శూన్యవీణల్ని వింటూ
ఆ శబ్దార్ణవంలో తప్పిపోయాను.
మొత్తానికి తికమకపడుతూనే, అస్పష్టంగానే
ఒకదానితో ఒకటి కలగలిసిపోయిన రెండు ధ్వనుల్నీ పోల్చుకున్నాను.
అవి భూమ్మీంచీ, సముద్రమ్మీంచీ ఆకాశం వైపు ప్రవహిస్తున్నాయి
ఏకకాలంలో ఒక విశ్వపరివ్యాప్తగీతాన్ని గానం చేస్తున్నాయి
ఒకే కెరటం కింద రెండు సముద్రప్రవాహాల్ని కనుగొన్నట్టుగా

లోతైన ఒక మర్మరధ్వనిలో నేనా రెంటినీ వినగలిగాను.
ఒకటి సముద్రాల్లోంచి ప్రభవించింది, వైభవగానం. సంతోషస్తోత్రం.
అది కెరటాలు ఒకదానితో ఒకటి మాట్లాడుకుంటున్న చప్పుడు
మరొకటి, మనముంటున్న భూమ్మీంచి పైకి లేస్తున్నది.
మనుషుల సణుగుడు, విషాదవికీర్ణం
అహర్నిశలు నడుస్తున్న ఈ మహాసంగీత సమారోహంలో
ప్రతి ఒక్క కెరటానికీ తనదంటూ ఒక గొంతు ఉంది, ప్రతి ఒక్క
మనిషికీ తనదైన ఒక గోల ఉంది.

ఇప్పుడు, నేను చెప్పానుకదా, ఈ సుందరసాగరం
ఒక సంతోష, ప్రశాంతగళాన్ని పరచిపెట్టింది
దైవనగరంలో ప్రాచీనవీణల్లాగా ఆ స్వరం
సృష్టి సౌందర్యాన్ని సంస్తుతిస్తున్నది.
మందపవనాలూ, ఝంఝామారుతాలూ ఆ కోలాహలాన్ని
మరింత విస్మయోద్వేగంతో భగవంతుడివైపు కొనిపోతున్నవి
ఆ కెరటాలు ప్రతి ఒక్కటీ దేవుడుమాత్రమే లాలించదగ్గవి
ప్రవక్త దానియేలు సన్నిధిలో తలవంచిన సింహంలాగా
ఆ మహాసముద్రం ఒక్కొక్కప్పుడు తన స్వరతీవ్రత తగ్గిస్తుంది
సంధ్యావసానవేళ అగ్నికీలలు చిమ్ముతున్నప్పుడు
భగవంతుని హస్తం ఆ బంగారు జూలు నిమరడం
నేను చూసాననే అనుకుంటున్నాను.

అయితే ఆ మహనీయ కోలాహలం చెంతన
మరొక స్వరం, భీతిల్లిన వార్తాహరుడి హాహాకారంలాగా
తుప్పుపట్టిన నరకద్వారపు తలుపుగొళ్ళేలలాగా
ఇనపతంత్రీవాద్యంపైన నొక్కుపడ్డ కమానులాగా
కీచుమంటూ, తునిగిపోతూ, విలపిస్తున్నది,

అది పరాభూత అభిశప్తత, చరమపశ్చాత్తాప తిరస్కరణ, తాపసదీక్షా
తిరస్కరణ,
శాపం, దైవనింద, పొలికేక– సుళ్ళుతిరుగుతున్న
మానవ వ్యర్థాలాపప్రవాహంలో కొట్టుకుపోతున్నవి

దినాంతవేళ నిశీథి కమ్ముకుంటున్నప్పుడు లోయమీంచి గబ్బిలాల
గుంపులు ఎగిరిపోయినట్టు
ప్రకంపిస్తున్న సహస్రాధిక ప్రతిధ్వనుల్లో వినిపించే ఆ చప్పుడేమిటి?
అయ్యో! అది మన పుడమి, అక్కడ మనిషి ఏడుస్తున్నాడు.

సోదరా, మనం ఇంతదాకా విని ఉండని,
నిరంతరం పునరుజ్జీవిస్తూ, నిరంతరం తిరోహితమవుతూ
వినిపిస్తున్న ఈ రెండు శబ్దాలూ
ఒకటి: 'ప్రకృతి' అంటున్నది, మరొకటి, 'మానవాళి' అంటున్నది
బహుశా దేవుడొక్కడే కల్పాంతపర్యంతం ఈ ఘోష వింటూ ఉంటాడు.

నేను ఆలోచనలో పడ్డాను, నా ఆత్మకి
అయ్యో! ఇప్పటిదాకా రెక్కలు దొరకలేదు
నా నీడలో ఇంతదాకా ఇంత వెలుతురు చూసింది లేదు
నేనట్లా చిరకాలం స్వప్నిస్తూ ఉన్నాను, మార్చిమార్చి పరికిస్తూ ఉన్నాను
నా నుంచి దాచిపెట్టిన ఆ అంధకారపూరిత పాతాళాన్ని
నా ఆత్మలో తెరుచుకున్న అంతులేని అఖాతాన్ని
అసలు మనమిక్కడెందుకున్నామని ఆలోచించాను
ఇదంతా దేనికోసం, మన ఆత్మకి కర్తవ్యమేమిటి, కేవలం ఉండటమేనా,
లేక జీవించడం కూడానా
ఎందుకని భగవంతుడు, ఈ ప్రకృతిగీతాన్నీ, మానవవిలాపాన్నీ
ఒక్కచోట చేర్చే
ఒక నిష్ఠుర పాణిగ్రహణగీతాన్ని తానొక్కడే పఠిస్తున్నాడు?

4-10-2025

ముందు మనం పాఠకులుగా మారాలి

ఒకప్పుడు శ్రీశ్రీ ప్రపంచకవిత్వం గురించి చెప్తూ ప్రాచీనకాలంలో సంస్కృతంలో, మధ్యయుగాల్లో పారశీకంలో, ఆధునికయుగంలో స్పానిషులో గొప్ప కవిత్వం వచ్చిందని రాసాడు. కానీ ఆయన కాలంకన్నా ప్రపంచం నేడు మరింత విస్తారమైంది. ఇప్పుడు మనకి దేశదేశాల కవిత్వమూ లభ్యమవుతున్నది. దాదాపుగా అన్నియుగాల కవిత్వమూ ఏదో ఒక రూపంలో, ఆయా కాలాల్లో గొప్ప కవుల కవిత్వంగాగానీ, లేదా సంకలనాలుగా కానీ లభ్యమవుతూ ఉంది. అటువంటి ప్రపంచ కవిత్వాల్ని వీలైనంత విస్తారంగా చదవడమే నా ప్రాథమిక సాహిత్యవ్యాపకం. అలా ఒక కొత్తకవినో, లేదా కొత్తసంకలనాన్నో చదివినప్పుడు, ఆ కవుల గురించీ, ఆ కవిత్వాల గురించీ మీతో పంచుకుంటూనే ఉన్నాను. ఒక పదేళ్ళ పాటు అలా పంచుకున్న వ్యాసాల్ని 'ఎల్ల లోకము ఒక్క ఇల్లై' (2022) పేరిట ఒక బృహత్సంపుటంగా వెలువరించాను కూడా.

ఒక్కసారి సాకల్యంగా చూసినప్పుడు నన్ను ముగ్ధుణ్ణి చేసే ప్రాచీనకవిత్వాల్లో సంస్కృతం, ప్రాకృతం, తమిళం, చైనీసు, గ్రీకు, లాటిను ఉంటాయి. మధ్యయుగాల సాహిత్యాల్లో పారశీక, సూఫీ కవులూ, జపనీయ తంకా కవులూ, భారతీయ భక్తికవులూ ఉన్నారు. ఆధునికయుగంలో ఇంగ్లిషు, ఫ్రెంచి, ఇటాలియను, జర్మను, స్పానిషు, రష్యనులాంటి యూరపియను భాషాసాహిత్యాలు తక్కిన ప్రపంచాన్ని ఎలా ప్రభావితం చేసాయో నన్నూ అలానే ప్రభావితం చేసాయి.

అమెరికను, లాటిను అమెరికను, ఆఫ్రికను, ఆస్ట్రేలియను కవిత్వాల్లో నేనింకా తలమునకలుగా కాలం గడపవలసే ఉంది. సోదరభారతీయ భాషల్లో కవుల కవిత్వాలు కూడా ఇప్పుడిప్పుడే ఇంగ్లిషు అనువాదాల్లో మనకి లభ్యమవుతూ ఉన్నాయి. కానీ వీటన్నిటిమధ్యా నన్ను ఎప్పటికప్పుడు విభ్రాంతపరిచేవాటిల్లో ఐర్లాండు, స్వీడను, నార్వే,

ఫిన్లాండులతో పాటు పోలాండు, జపానుల కవిత్వాలు ముందువరసలో ఉంటాయి. వాటన్నిటిలోనూ పోలిషు, స్వీడిషు కవిత్వాలైతే మరీను.

నా మనసు స్వీడిషు కవిత్వంలోని చెప్పలేని మాధుర్యపు రుచిని మరిగినందువల్ల, ఇంగ్లిషులో లభ్యంగా ఉన్న స్వీడిషు కవిత్వసంపుటాలు ఒకటీ ఒకటీ గుర్తుపెట్టుకుని, జాబితా రాసుకుని మరీ చదువుతూనే ఉంటాను. తోమాస్ ట్రాన్స్‌ట్రోమర్, హేరీ మార్టిన్సన్, గున్నారు ఎకెలాఫ్, ఎడితు సోడెగ్రాన్ లాంటి కవుల కవిత్వాలు మరీ మరీ చదువుతుంటాను. ట్రాన్స్‌ట్రోమర్ కవిత్వం నావరకూ నాకొక పాఠ్యగ్రంథం లాంటిది. సంక్లిష్టమైన ఒక జీవితానుభవాన్నో లేదా జీవితానుభూతినో కవితగా మార్చడమెలా అనుకున్నప్పుడల్లా నేను సంప్రదించే కవుల్లో రిల్కే, చెస్లా మీవోషు, యెహుదా అమిహాయిలతో పాటు ట్రాన్స్ ట్రోమరు కూడా ఉంటాడు.

అలా స్వీడిషు, లేదా స్కాండినేవియను కవిత్వం గురించి వెతుక్కుంటూ ఉండగా, కొన్నాళ్ళ కిందట, నా చేతుల్లోకి అద్భుతమైన పుస్తకం ఒకటి వచ్చింది. Lars Gustafsson అనే ఆయన రాసిన Forays into Swedish Poetry (1978, 2012).

లార్స్ గుస్తఫ్‌సను స్వయంగా కవి, నవలాకారుడూ, విమర్శకుడూ కూడా. ఆయన ఆధునిక స్వీడిషు సాహిత్యంలోంచి పదిహేను మంది కవుల్ని తీసుకుని, వారివి ఒక్కొక్కరివీ ఒక్కొక్క కవిత చొప్పుకుని ఎంపికచేసుకుని, ఆ కవితను తాను ఎందుకు ఎంచుకున్నాడో వివరంగా ఒక వ్యాఖ్య కూడా పొందుపరిచాడు. అలా, పదిహేడో శతాబ్దానికి చెందిన Skogekar Bergbo అనే కవయిత్రి మొదలుకుని, Erik Blombergn (1894-1965) దాకా కవుల్ని ఎంపిక చేసుకున్నాడు.

ఇలా ఒక భాషాసాహిత్యానికి చెందిన కవిత్వసంకలనం ఒకటి తేవొచ్చన్న ఊహనే నాకు చాలా కొత్తగా అనిపించింది. ఎందుకంటే, సాధారణంగా, కవిత్వసంకలనాలు తెచ్చినప్పుడు సంకలనకర్తలు సుదీర్ఘంగానూ, సవివరంగానూ ఉపోద్ఘాతాలు రాస్తారు. అందులో ఆ కవిత్వచరిత్రనీ, ఆ కవిత్వం దేనిగురించి అన్వేషించిందో ఆ సౌందర్యశాస్త్రాన్నీ పరిచయం చేస్తారు. కాని అటువంటి సుదీర్ఘ పరిచయాల కన్నా ఇలా ఎంతో కొంతమంది కవుల్ని తీసుకుని వారి కవితల్ని, ప్రతి ఒక్క కవితనీ, లోతుగా పరిచయం చెయ్యడం ద్వారా మనకి ఆ భాషాకవిత్వం గురించి మరింత బాగా పరిచయం చేయవచ్చునని నాకు ఈ పుస్తకం చూసాకే అర్థమయింది.

ఈ పరిచయాలన్నీ చదివినప్పుడు, స్వీడిషు కవిత్వ ప్రయాణంతో పాటు, ఆ జాతి poetics, aesthetics పరిచయం కావడంతో పాటు, ఒక భావుకుడు తన జాతి కవిత్వాన్ని

ఎలా స్వీకరిస్తున్నాడో ఆ అభిరుచి కూడా బోధపడింది. నిజానికి ప్రతి సంకలనమూ ఆ సంకలనకర్త వ్యక్తిగత అభిరుచికి దర్పణమే అయినప్పటికీ, అది చాలా సార్లు, విస్పష్టంగా ఉండదు. కొన్నిసార్లు అటువంటి సంకలనమేదీ మరొకటి చెప్పుకోదగ్గది రాకపోతే, ఆ సంకలనకర్త అభిరుచినే ఆ సాహిత్యయుగపు అభిరుచిగా స్థిరపడిపోతుంది కూడా.

ఉదాహరణకి 'వైతాళికులు' సంకలనమే చూడండి. అది ముద్దుకృష్ణ పేరిట వెలువడ్డ సంకలనమే అయినప్పటికీ, ఆ ఎంపిక దాదాపుగా కృష్ణశాస్త్రి ఎంపిక. ఆయన భావకవిత్వాన్ని ఒక ఉద్యమంగా ప్రచారం చేసినరోజుల్లో బరంపురం నుంచి బళ్ళారిదాకా ఆ పద్యాల్నే సభల్లో వినిపిస్తూ ఉండేవారట. తోటికవుల పద్యాలు చదివి వినిపించేక, అప్పుడు ఇంకా సమయం మిగిలితేనో లేదా సభికులు కోరుకుంటేనో తన పద్యాలు వినిపించేవారట. వైతాళికులు నిస్సందేహంగా గొప్ప సంకలనమేగాని, అందులో 1908-1925 దాకా వచ్చిన జాతీయోద్యమగీతాలకు స్థానం లేకపోయింది. జాషువాని విస్మరించిన అపరాధానికి వైతాళికులు ఎప్పటికీ తలవంచుకునే ఉండవలసి ఉంటుంది. అలాకాక, ఆ సంకలనకర్త, తాను ఎందుకు ఆ కవుల్ని ఎంపికచేసాడో, కవుల వారీగా, లేదా కవితల వారీగా వివరంగా రాసి ఉంటే, అతడి అభిరుచి గురించి మనకి మరింత విశదంగా బోధపడి ఉండేది. అప్పుడు ఆ సంకలనాన్నే మనం ఆ కాలానికి ప్రతినిధి సంకలనంగా నమ్ముతుండే పరిస్థితి ఉండేది కాదు.

నాకు ఈ పుస్తకం చూసాక, ఏ సంకలనకర్త అయినా, కవిత్వంగాని, కథలు గాని ఎంపికచేసినప్పుడు, తాను ఎంచుకున్న కవితల గురించో, కథల గురించో ఇలా రాసిపెడితే, ఆ సంకలనాలు ఆయా భాషాసాహిత్యాల గురించి మరింత విస్పష్టంగా మాట్లాడగలవని– పించింది.

ఈ పుస్తకం ఒకసారి చదివాను. రెండోసారి చదివాను. ఇంకా చదువుతూనే ఉన్నాను. ముఖ్యంగా స్వీడిష కవిత్వాన్ని, నేనెందుకు ఇష్టపడుతున్నానో, తెలుసుకోడం కోసం చదివాను. అందుకని కొన్ని వ్యాఖ్యలు నాకు మరీ మరీ మధురమనిపించాయి.

ఉదాహరణకి Bertil Milamberg అనే కవి రాసిన ఈ రెండు వాక్యాల కవిత చూడండి:

సాయంకాలం

ఆ నిశ్శబ్దపు నీలినీడన
పోప్లారు చెట్లు కుదురుకున్నాయి.

ఇటువంటి కవితని మనం ఏదైనా సంకలనంలో చదివితే, ఒక క్షణం పాటు ఆగి, ఆ దృశ్యాన్ని సంభావించుకుని, ముందుకు వెళ్ళిపోతాం. కాని గుస్టాఫ్‌సను రాసిన వ్యాఖ్య, చూడటానికి మరీ సరళంగా కనిపించే ఈ కవితలోని గాఢతనెట్లా పట్టుకోవాలో వివరిస్తున్నది. ఆయనిలా రాస్తున్నాడు:

> ఈ కవితలో ఒక పసిదనంలాంటిదేదో కనిపిస్తున్నది. అదేమిటో అర్థం కావడానికి కొంతసేపు పడుతుంది. ఆ నిశ్శబ్దపు నీలినీడలోకి ఒరుగుతున్న పోప్లారు వృక్షాలు, ఆ మొత్తం క్రమంలోని ఆశారాహిత్యం, 'అదలాగే కదా ఉంటుంది' అనేలాంటి అభిప్రాయం, నాకు నా చిన్నప్పటి వేసవికాలపు ఉరుముల్ని గుర్తుచేస్తున్నాయి. అప్పటిదాకా మనల్ని ఆవహించే ఒక వ్యాకులతనీ, తొలి చినుకులు పడగానే మనలో తలెత్తే ఒక తితిక్షనీ గుర్తుకు తెస్తున్నాయి. ఈ కవితలో కనిపిస్తున్న భీతి పసితనపు భీతి. అదలానే జరుగుతుందనే ఒక నమ్మకంలో ఉన్నది కూడా ఆ అమాయకత్వమే. తన ఈ కవిత గురించి ఒకచోట రాసుకుంటూ మాల్మ్‌బర్గ మాతృత్వం గురించి రాయడం యాదృచ్ఛికం కాదు.
>
> అయితే ఈ కవితలో కనిపించే చలనంలోని చురుకుదనం ఏపాటిది? అది చాలా చురుకైన సంచలనమే అనిపిస్తుంది మొదటిసారి చదివినప్పుడు. ఎక్స్ప్రెషనిజానికి చెందిన వర్ణచిత్రాల్లో సంచలిత ప్రకృతిసీమ సర్వసాధారణ ఇతివృత్తమే. బెర్టిల్ మాల్మ్‌బర్గ చిత్రకళా వికాసంలో ఈ ఇతివృత్తం కూడా ముఖ్యపాత్ర వహించింది. ఎడ్వర్డ మంచ్ గీసిన The Scream గురించి మనమింతకు ముందే చర్చించుకున్నాం. ఈ విషయంలో మనకి చప్పున స్ఫురించే చిత్రమదే. కాని దానికీ, మాల్మ్‌బర్గ కవితకీ మధ్య ముఖ్యమైన తేడా ఈ కవితలో కనవచ్చే అణకువ.
>
> కాని, మనం ఇందులో చూసే ఉల్లాసం లాంటిది బహుశా ఒక భ్రమ కావచ్చు. తుపాను రాబోతున్న ముందటి పరిస్థితినే మనమీ కవితలో చూస్తూండవచ్చు.
>
> మాల్మ్‌బర్గ ఎంతో ప్రజ్ఞతో నిర్మించిన ఈ చిన్ని కవితలో పడి కొట్టుకుపోవడ–మంటే, ఒక స్తబ్ధతలోకి జారుకోవడమే. కావాలంటే, దాన్ని, పసితనపు నిష్క్రియ అనవచ్చు. ఈ కవిత తగిలించుకున్న జర్మను ఎక్ ప్రెషనిస్టు ముసుగు (పోప్లార్లు, బిర్చి వృక్షాలు కాదు) వెనక పన్నెండేళ్ళ పసివాడి అంతులేని మనోవ్యథని స్ఫురింపచేస్తున్నదేదో ఉంది. ఇందులో జీవసంబంధమైన ఒక యథాతథవాదం

లాంటిది, ఆ మాటకొస్తే, రాజకీయ యథాతథవాదానికి దగ్గరగా ఉన్నదేదో కనిపిస్తున్నది. మనం ఏ విధంగానూ మార్చలేని ప్రపంచాన్ని, నిజానికి, మనం చేరనుకూడా చేరలేని ప్రపంచాన్ని ఈ కవిత ప్రతిబింబిస్తున్నది.

ఈ కవితదగ్గర కొంతసేపు గడపడం నా దృష్టిలో మూర్ఖత్వమూ కాదు, అవివేకమూ కాదు. ఈ మనఃస్థితులు మనందరిలోనూ ఉన్నవే. ఇటువంటి సన్నివేశాల్లో మనమిలానే స్పందిస్తాం. తీవ్రమైన అలసటలాగా, మనోవ్యాకులత లాగా, 'ఓహ్! సరే ఏది ఎలా కానున్నదో దాన్నలానే కానివ్వు' అనుకునేలాంటి ఒక మనఃస్థితి మనందరి జీవితాల్లోనూ కూడా ముఖ్యభాగమే.

ఈ వ్యాఖ్యని ఇంత సుదీర్ఘంగా మీతో పంచుకోడానికి కారణం, ఒక రెండు వాక్యాల కవితలో, చూడగలిగే వాడుండాలేగానీ, ఒక యుగం మొత్తం కనిపిస్తుందని చెప్పడానికే.

ఇలా ప్రతి ఒక్క కవిత గురించీ అతడు రాసిన వ్యాఖ్యల్ని మీతో పంచుకోవాలని ఉంది. నిజానికి ఇలా అనువదించి పంచుకోవడం కాదు, ముందు ఈ కవితలు చదివి, అప్పుడు అతడి వ్యాఖ్యలు చదివి, ఆమీదట వాటి గురించి మనం పరస్పరం మాట్లాడుకోవాలి. ఉదాహరణకి, ఆగస్టు స్ట్రిండుబెర్గు రాసిన ఈ కవిత చూడండి:

వీథి దృశ్యాలు-3

కొండమీద చీకటి, ఇంట్లో చీకటి-
కిందమాళిగనిండా మరింత చీకటి-
భూగర్భంలాగా, కిటికీలు లేకుండా-
ఆ మెట్లే దానికి తలుపులూ, కిటికీలూను-
అక్కడ ఆ అగాధమైన చీకట్లో
గీపెట్టే ఒక డైనమో,
తన చక్రాలచుట్టూ నెరుసులు చిందిస్తూ
నల్లగా, భయపెట్టేదిగా, దాచినట్టుగా
కాని మొత్తం ఇరుగుపొరుగంతటికీ వెలుతురునాడిస్తూ.

'మిస్ జూలీ' లాంటి సుప్రసిద్ధ నాచురలిస్టు నాటకం రాసిన సిద్ధహస్తుడైన నాటక-రచయితగానే నాకు తెలిసిన స్ట్రిండుబెర్గు ఈ కవితతో నన్ను నిశ్చేష్టితుణ్ణి చేసాడు. ఈ కవితని మన ఆలంకారికులు ఆనందవర్ధనుడో, అభినవగుప్తుడో చదివి ఉంటే, ధ్వని

కవిత్వానికి మేలిమి ఉదాహరణగా పైకెత్తి ఉండేవారు. ఈ కవితకి ఈ వ్యాఖ్యాత రాసిన ఎంతో సునిశితమైన వ్యాఖ్య చదివినతరువాత కూడా నాకు ఈ కవితను ఏదో ఒక అర్థానికి కట్టిపడేయలేమనిపించింది. యూరపియను చైతన్యంలో ఫ్రాయిడు (1910) కన్నా ముందే వికసించిన కవితగా (1902) దీన్ని సంకలనకర్త ప్రస్తుతించాడు. ఇందులో డైనమో అంతశ్చేతనకు ప్రతీక అని అతడు చెప్తున్నాడు. లేదా అసలు కవిత్వానికే ప్రతీకగా మనం భావించవచ్చు.

అలా అనుకున్నా కూడా, అలా అనుకున్న తరువాత కూడా, పై కవితలోని ప్రతి ఒక్క వాక్యమూ ఆ ప్రతీకని నిలబెట్టేదిగానే మనకి కనిపించినా కూడా, ఈ కవిత మనలో రేకెత్తించగల విస్మయం exhaust కాదు. ఒక allegory కీ , ధ్వనికీ మధ్య తేడా ఇక్కడే ఉంది. ఒకసారి మనకి ఆ అంతరార్థం స్ఫురించాక, అలిగరి మనల్ని ఆకర్షించడం మానేస్తుంది. కాని ధ్వని అలా కాదు. ఎన్ని సార్లు చదివినా, ఎప్పటికప్పుడు ఏవో నూతన-స్పందనలు స్ఫురిస్తూనే ఉంటాయి. చాలా సార్లు వాటిని మనం పోల్చుకోలేం కూడా.

ఇందులో ప్రతి ఒక్క పదం సార్ధకమే. ఉదాహరణకి, 'ఆడిస్తూ' అని నేను అనువదించింది ఇంగ్లిషులో to grind అనే క్రియాపదం. దీని గురించి కూడా వ్యాఖ్యాత ఇలా రాస్తున్నాడు:

> మిల్లులు ఆడతాయి, విసురుతాయి, రుబ్బుతాయి. మగ్గాలు నేస్తాయి. పాత, ప్రాచీన క్రియాపదాలు ఇప్పుడు కొత్త పాత్రల్లో కనిపిస్తున్నాయి. ప్రపంచం మారిపోతూ ఉంది. మన భావనాప్రపంచం విస్తరిస్తూ ఉంది. పాత పదాలు ఇప్పుడు కొత్త ప్రయోగాలకు దారితీస్తున్నాయి. ఒక ఎలక్ట్రిక్ దీపాన్ని వెలిగించ వలసి వచ్చినప్పుడు నా తల్లిదండ్రులు ఇప్పటికీ light it అనే అంటారు. కాని నా పిల్లలు మాత్రం turn it on అని అంటారు. పాత పదాలకీ, ఇప్పటికీ మనం స్పష్టంగా పేరుపెట్టలేని అనుభవాలకీ మధ్య ఉన్న పగుళ్ళల్లో ఉన్నదేమిటి? భాషాసంబంధమైన ఇటువంటి పగుళ్ళను అనుభవంలోకి తెచ్చుకోడంలోంచే సాహిత్యంలోని ఆధునికత తన శక్తిని పుంజుకుంటూ ఉన్నది..

ఇదంతా చదివిన తరువాత మీకేమనిపిస్తున్నది? మనం కవిత్వాన్ని చదవవలసినట్టుగా చదవడం లేదనే కదా. కవిత్వం చదవడానికి మనకి కావలసింది అన్నిటికన్నా ముఖ్యం కాలం. ప్రతి ఒక్క పదప్రయోగం దగ్గరా ఆగిపోగలిగే, జీవితాన్ని అంకితం చేయగలిగే

మనఃస్థితి. ఇప్పుడు మనకి కావలసింది, మరింత మంది కవులు కాదు, మహాకవులు అసలే కాదు, మనకి కావలసింది పాఠకులు. ముందు మనమే ఆ పాఠకులుగా మారాలి. కవిత్వం చదువుకోవడంలో తమ జీవితాన్ని నిస్సంకోచంగా ఆహుతి చెయ్యగల సాహసులం కావాలి. 'మాఘే మేఘే గతం వయః' అని చెప్పుకోగల రసజ్ఞులం కావాలి.

13-10-2025

వాడ్రేవు చినవీరభద్రుడు

ఎవరో ఒకరు
ఏదో ఒక కాలంలో
ప్రపంచకవిత్వం వారికోసమే

ఎవరో ఒకరు ఏదో ఒక కాలంలో మనల్ని తలుచుకుంటూ మన కవిత్వం చదువుతారని ప్రాచీన గ్రీకు కవయిత్రి శాఫో అన్నమాటలు సుప్రసిద్ధాలు. సంస్కృత మహాకవి భవభూతి కూడా ఇటువంటి మాటలే అన్నాడు: ఈ రోజు ఇక్కడ మమ్మల్ని పట్టించుకోనివాళ్ళ కోసం కాదు మేము రాస్తున్నది. మాతో సమానధర్మం కలవారెవరో రేపు తప్పకుండా పుడతారు, కాలం అనంతం, పృథ్వి విశాలం అని. ప్రపంచవ్యాప్తంగా, యుగాలుగా కవులు అటువంటి సహృదయపాఠకుడి కోసమే ఎదురుచూస్తూ ఉన్నారు. మనమే అటువంటి పాఠకులుగా మారాలని నమ్ముతూ వాడ్రేవు చినవీరభద్రుడు రాసిన 37 వ్యాసాలివి. ఆయన వెలువరిస్తున్న 72 వ పుస్తకం ఇది. తెలుగుపాఠకులు దీన్ని ఆదరిస్తారని నమ్ముతున్నాం.